www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
పేజీలు: 14
గురువారం | 10-7-2025
శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, ఆషాడమాసం, శుక్లపక్షం; తిథి: పౌర్ణమి రా.2.07 తదుపరి పాడ్యమి; నక్షత్రం: పూర్వాషాడ పూర్తి; వర్జ్యం: మ.2.52-4.32; దుర్ముహూర్తం: ఉ.10.10-11.02, మ.3.22-4.14; అమృతఘడియలు: రా.12.54-2.35; రాహుకాలం: మ.1.30-3.00; సూర్యోదయం: 5.51; సూర్యాస్తమయం: 6.50
Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru
సంపుటి (Volume) : 66
సంచిక (Issue) : 85
హైదరాబాద్ సిటీ



నమీబియాలో కళాకారులతో కలిసి డోలు వాయిస్తున్న మోదీ

కాలపరీక్షను తట్టుకుని నిలిచిన
స్నేహబంధం
నమీబియా పార్లమెంటులో ప్రధాని ప్రసంగం
మోదీకి ఆ దేశ అత్యున్నత పౌర పురస్కారం
2
ఇంధనం, ఆరోగ్యం తదితర రంగాల్లో
ఇరు దేశాల మధ్య నాలుగు ఒప్పందాలు

కల్లు కాదది.. గరళమే
3
క్లోరల్ హైడ్రేట్, అల్ప్రాజోలం, డైజీపాం కలిపిన కల్లుతో తీవ్ర హాని
నాడీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం, కంటి చూపు పోయే ప్రమాదం
ఊపిరితిత్తులు, కిడ్నీ, గుండె వంటి కీలక అవయవాలకు చేటు
వెంటనే చికిత్స అందించకపోతే చనిపోయే ముప్పు: వైద్యులు

కల్తీ కల్లుకు ఆరుగురు బలి

మరో ముగ్గురి పరిస్థితి విషమం
హైదరాబాద్‌లో విషాదం



కల్లు దుకాణంలో పోలీసుల తనిఖీలు

నిమ్స్‌లో 31 మందికి చికిత్స.. అక్కడ పడకలు లేక కొందరికి గాంధీలో వైద్యం
హైదర్‌నగర్, శంషీగూడ, ఇందిరానగర్ కల్లు కాంపౌండ్లలో కొద్దిరోజుల క్రితం
కల్లు తాగిన పలువురికి అస్వస్థత.. విషయం పొక్కకుండా నిర్వాహకుల యత్నాలు
మృతులు, బాధితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుండడంతో గుట్టు రట్టు
కల్లుకాంపౌండ్ నిర్వాహకులు ఐదుగురిపై కేసులు నమోదు..
కల్తీ కల్లు విక్రయదారులపై కఠిన చర్యలు: మంత్రి జూపల్లి హెచ్చరిక
పలు ప్రాంతాల్లో కల్లు కాంపౌండ్లపై ఎస్‌వోటీ, ఎక్సైజ్ దాడులు

హైదరాబాద్ సిటీ/హైదర్‌నగర్/ నిమ్స్, అల్వాల్, జూలై 9(ఆంధ్రజ్యోతి): రాజధాని హైదరాబాద్‌లో కల్తీ కల్లుకు ఆరుగురు బలయ్యారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మరో ముగ్గురి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. కల్తీ కల్లు తాగి అస్వస్థతకు గురై ఆస్పత్రుల్లో చేరుతున్నవారి సంఖ్య నానాటికీ పెరుగుతోంది. మంగళవారంనాటికి 16 మంది అస్వస్థతకు గురై ఆస్పత్రుల్లో చేరగా.. బుధవారం ఆ సంఖ్య 40 దాటినట్టు సమాచారం. నిమ్స్‌లో ప్రస్తుతం 31 మంది చికిత్స పొందుతుండగా.. అక్కడ పడకలు లేవని కొందరిని గాంధీ ఆస్పత్రికి, కొన్ని ప్రైవేటు ఆస్పత్రులకు పంపించారు. అస్వస్థతకు గురైన వారిలో కొందరిని ఐసీయు, మరికొందరిని ఏసీసీయు విభాగంలో ఉంచి చికిత్స అందిస్తున్నారు. అపస్మారక స్థితిలో ఉన్న మోన్నప్ప (65) అనే వృద్ధుడికి వెంటిలేటర్ చికిత్స అందిస్తున్నారు. దేవదాస్ అనే వ్యక్తికి డయాలసిస్

మిగతా 3వ పేజీలో...



'కృష్ణా జలాలు, కాళేశ్వరం వైఫల్యం'పై ప్రజాభవన్‌లో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, మహేశ్‌గౌడ్, మంత్రులు ఉత్తమ్, పొంగులేటి

ఫాంహౌస్‌కైనా వస్తా

అసెంబ్లీకి రాలేకపోతే అక్కడే చర్చిద్దాం.. తేదీ చెబితే వస్తాం.. మాక్ అసెంబ్లీ నిర్వహిస్తాం

క్లబ్బుల్లో పబ్బుల్లో చర్చలంటే మాకు ఇబ్బంది
తెలంగాణ హక్కుల కోసం దేవుడినైనా ఎదిరిస్తాం
తలా తోక లేకుండా మాట్లాడితే.. తోక కత్తిరిస్తాం
సీమాంధ్ర పాలకుల కంటే ఎక్కువగా..
తెలంగాణకు ద్రోహం చేసింది కేసీఆరే
రైతుల ప్రయోజనాలకు మరణశాసనం రాశారు
సరిదిద్దేందుకు ప్రయత్నిస్తుంటే ఎదురుదాడి
కేసీఆర్, కేటీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి ధ్వజం

హైదరాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కృష్ణా, గోదావరి జలాల విషయంలో చర్చించేందుకు ప్రతిపక్ష నేత కేసీఆర్‌ను అసెంబ్లీకి రమ్మంటే రావడంలేదని, ఆయన ఆరోగ్యం బాగా లేనందున తమనే ఎర్రవల్లి ఫాంహౌస్‌కు రమ్మంటే వస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తేదీ చెబితే అక్కడికే వచ్చి మాక్ అసెంబ్లీ నిర్వహిస్తామని చెప్పారు. అంతే తప్ప.. క్లబ్బులు, పబ్బులు అంటే తమకు ఇబ్బంది అని, వాటికి తాము దూరంగా ఉంటామన్నారు. తెలంగాణ హక్కులను ఎవరికీ తాకట్టు పెట్టబోమని, ఎంతటి వారు వచ్చినా నిటారుగా నిలబడి కొట్లాడుతామని పేర్కొన్నారు. దేవుడే ఎదురుగా వచ్చినా ఎదిరిస్తామని చెప్పారు. అసూయ, అక్కసు, అహంకారంతో మాట్లాడే

మిగతా 13వ పేజీలో...

ఊళ్లు కొట్టుకుపోతే బాధ్యులెవరు?
13
'కాళేశ్వరం' బ్యారేజీలు ప్రమాదకరంగా ఉన్నాయని ఎన్డీఎస్ఏ తేల్చింది
నీళ్లు నింపవద్దని హెచ్చరించింది
కన్నెపల్లి నుంచి నీళ్లు ఎత్తిపోయడం లేదేమని బీఆర్ఎస్ నేతలడుగుతున్నారు
నీళ్లు నింపితే 44 గ్రామాలు, సమ్మక్క బ్యారేజీ కొట్టుకుపోతాయి
పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌లో నీటి పారుదల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

ఉద్యోగుల సంఖ్యపై.. సమీక్షకు
ఐఏఎస్‌ల కమిటీ

ప్రభుత్వ శాఖలు, విభాగాలు, స్థానిక సంస్థలు, కార్పొరేషన్లు, వర్సిటీల వారీగా పరిశీలన
ఇప్పుడున్న ఉద్యోగులెందరు?.. వారి విధుల్లో మార్పులు, చేర్పులు..
కొత్త పోస్టుల ఆవశ్యకతపై సమీక్ష.. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ వివరాల సేకరణ




60 రోజుల్లో ప్రభుత్వానికి నివేదిక

హైదరాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఉద్యోగుల సంఖ్యపై ప్రభుత్వం దృష్టి సారించింది. శాఖలు, విభాగాలు, స్థానిక సంస్థలు, కార్పొరేషన్లు, విశ్వవిద్యాలయాలవారీగా సమీక్షించాలని నిర్ణయించింది. రాష్ట్రంలో మంజూరైన రెగ్యులర్ పోస్టులు, ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగుల సంఖ్య, ఇంకా మంజూరు చేయాల్సిన పోస్టులు, ప్రభుత్వ అవసరాల మేరకు ఉద్యోగుల విధుల్లో మార్పులు.. వంటి అన్ని అంశాలను సమీక్షించనుంది. ఇందు కోసం ప్రభుత్వం ఐఏఎస్‌ల కమిటీని ఏర్పాటు చేసింది. ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి(సీఎస్), ప్రస్తుతం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం వైస్ చైర్మన్ అండ్ డైరెక్టర్ జనరల్‌గా ఉన్న ఎ.శాంతికుమారి, విశ్రాంత ఐఏఎస్, వేతన సవరణ సంఘం కమిషనర్ ఎన్.శివశంకర్, రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, సాధారణ పరిపాలనా శాఖ(జీఏడీ) కార్యదర్శి ఎం.రఘునందన్‌రావులతో ఈ కమిటీని నియమించింది. ఇప్పటికే రాష్ట్రంలో ఉద్యోగుల సంఖ్య తక్కువగా ఉందంటూ వివిధ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. కొత్త జిల్లాలు, కొత్త జోన్లు, మల్టీ జోన్ల ఏర్పాటు తర్వాత ఉద్యోగులపై పని భారం పెరిగిందని ఆరోపిస్తున్నాయి. ఆయా జిల్లాల

మిగతా 13వ పేజీలో...

స్థానిక ఎన్నికలు.. బీసీ రిజర్వేషన్లు!
3
- నేడు క్యాబినెట్ భేటీలో చర్చ ప్రధానంగా వీటిపైనే
- గవర్నర్ ద్వారా ఆర్డినెన్స్, జీవో జారీకి అవకాశం!
- బనకచర్ల, రాజీవ్ యువ వికాసంపైనా చర్చ



వంతెన కూలి.. నదిలో పడ్డ వాహనాలు
13 మంది దుర్మరణం.. గుజరాత్‌లో ఘటన
వంతెన 40 ఏళ్ల నాటిది
2
దృఢత్వంపై గతంలోనే స్థానికుల ఫిర్యాదులు
పట్టించుకోని అధికారులు

హెచ్‌సీఏ అధ్యక్షుడి అరెస్టు
13
ముగ్గురు ఆఫీసు బేరర్లు కూడా..
క్రికెట్ అసోసియేషన్‌లో అవకతవకలు
సన్ రైజర్స్ వివాదంపై సీఐడీ చర్యలు

ఉప్పల్ స్టేడియానికి 'దారి' వచ్చింది!
ఆంధ్రజ్యోతి కథనంతో స్పందన
12
అక్రమ ప్రహరీని కూల్చివేసిన అధికారులు

హైదరాబాద్ పరిధిలో
35 ఆర్థిక మండళ్లు
ఉపాధికి నిలయంగా మహానగరం
ప్రస్తుతం 10 ఆర్థిక మండళ్లు.. కొత్తగా మరో 25
ఈడీపీ-2050లో ప్రతిపాదనలు
విద్య, రవాణా, ఐటీ, పర్యాటక రంగాలకు ప్రాధాన్యం
హెచ్ఎండీఏ మాస్టర్‌ప్లాన్‌లో ఈ ప్రణాళికే అత్యంత కీలకం!



హైదరాబాద్ సిటీ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రాన్ని 2036 కల్లా లక్ష కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకున్న రేవంత్ సర్కారు.. హైదరాబాద్ మెట్రోపాలిటన్ ప్రాంతం అభివృద్ధిపై దృష్టి సారించింది. ఆ మేరకు కీలక ప్రతిపాదనలను సిద్ధంచేసింది. అంచెలంచెలుగా.. 2050 వరకు ఆర్థికాభివృద్ధితోపాటు ఉపాధి కల్పనకు ఎకనమిక్ డెవల్‌పమెంట్ ప్లాన్(ఈడీపీ)-2050ని రూపొందించింది. రీజినల్ రింగ్ రోడ్డు(ఆర్ఆర్ఆర్) వరకు విస్తరించిన హెచ్ఎండీఏ పరిధికి రాబోతున్న సరికొత్త మాస్టర్‌ప్లాన్-2050లో ఈడీపీ-2050 అత్యంత కీలకం కానుంది. హెచ్ఎండీఏ పరిధిలో ప్రస్తుతం పది ఆర్థిక మండళ్లు(ఎకనమిక్ నోడ్స్) ఉన్నాయి. హెచ్ఎండీఏ పరిధిని విస్తరించిన నేపథ్యంలో.. కొత్తగా మరో 25 ఆర్థిక మండళ్లను ప్రభుత్వం ప్రతిపాదించింది. వీటి వల్ల ఆర్థికాభివృద్ధితోపాటు ఉపాధి గణనీయంగా పెరుగుతుంది. ఓ కన్సల్టెన్సీ ద్వారా రెండేళ్లకు పైగా కసరత్తు చేసి, హెచ్ఎండీఏ పరిధిలో ఆర్థిక మండళ్ల సంఖ్యను 35కు పెంచింది. ఈడీపీ-2050లో ఈ వివరాలను

మిగతా 9వ పేజీలో...




కరీంనగర్‌లో విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న కేంద్రమంత్రి బండి

ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులకు
త్వరలోనే మోదీ కిట్లు
విద్యా రంగానికి మోదీ సర్కారు ఎనలేని ప్రాధాన్యం
కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్
కరీంనగర్‌లో విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేసిన మంత్రి

కరీంనగర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులందరికీ అతి త్వరలో మోదీ కిట్లు అందించనున్నామని, వీటిలో ఎల్‌కేజీ నుంచి ఆరో తరగతి విద్యార్థులకు అవసరమయ్యే వస్తువులు ఉంటాయని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియంలో పదో తరగతి విద్యార్థులకు సైకిళ్ల పంపిణీని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ

మిగతా 12వ పేజీలో...

సీసీఐ, ఎస్ఐఐఎల్ పునరుద్ధరణకు చర్యలు



కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి కుమారస్వామికి జ్ఞాపికను అందిస్తున్న మంత్రి శ్రీధర్ బాబు

మూతబడ్డ ఈ సంస్థలపై కేంద్ర మంత్రి కుమారస్వామి సమీక్ష
పునరుద్ధరణపై నివేదిక అందించాలని అధికారులకు ఆదేశాలు
సమీక్షలో పాల్గొన్న ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
పునరుత్పాదక బ్యాటరీల తయారీలో రాష్ట్రానికి ఎక్సలెన్స్ అవార్డు

హైదరాబాద్/న్యూఢిల్లీ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లాలో మూతపడ్డ కేంద్రప్రభుత్వ ఆధ్వర్యంలోని సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ), భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని స్పాంజ్ ఐరన్ ఇండియా లిమిటెడ్ (ఎస్ఐఐఎల్) పునరుద్ధరణపై సమగ్ర నివేదిక అందించాలని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ

మిగతా 12వ పేజీలో...

తెలంగాణకు తగినంత యూరియా అందిస్తాం
సీఎం రేవంత్ విజ్ఞప్తికి కేంద్రమంత్రి నడ్డా స్పందన
12

వచ్చే ఏడాది నుంచి అమెరికా
వీసా చార్జీల పెంపు
2
విద్యార్థి, పర్యాటక, వ్యాపార, ఎక్స్ఛేంజ్ వీసాలపై..
ఇంటిగ్రిటీ రుసుము 250 డాలర్లు
ఐ-94 ఫీ-24; ఈఎస్‌టీఏ-13; ఈవీయూఎస్-30 డాలర్లు!

జస్టిస్ యశ్వంత్ వర్మపై
అభిశంసన తీర్మానం
పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టే యోచనలో కేంద్రం
ప్రధాన పార్టీలతో సంప్రదింపులు
ఇప్పటికే మొదలైన ఎంపీల సంతకాల సేకరణ ప్రక్రియ
2

కదం తొక్కిన కార్మిక లోకం
12
రాష్ట్రవ్యాప్తంగా కార్మిక సంఘాల ఆందోళనలు
కేంద్రం ప్రవేశపెట్టిన 4 లేబర్ కోడ్‌ల రద్దుకు డిమాండ్
సమ్మెతో బోసిపోయిన సింగరేణి బొగ్గు బావులు




కూలిన జాగ్వార్ ఫైటర్ జెట్
ఇద్దరు వాయుసేన పైలట్ల మృతి
రాజస్థాన్‌లోని చురు జిల్లాలో ప్రమాదం
గత ఐదు నెలల్లో ఇది మూడో ఘటన
2

వంతెన కూలి నదిలో పడ్డ వాహనాలు



గుజరాత్‌లో ఘటన.. 13మంది దుర్మరణం

వడోదర, జూలై 9: గుజరాత్‌లోని వడోదర జిల్లాలో నాలుగు దశాబ్దాల క్రితం నాటి భారీ వంతెన కూలిపోయింది. పాద్రా పట్టణం సమీపంలోని మహిసాగర్ నదిపై వడోదర-ఆనంద్ జిల్లాలను కలుపుతూ నిర్మించిన గంభీర బ్రిడ్జ్‌లో రెండు పియర్ల మధ్య 10-15 మీటర్ల మేర స్లాబు పూర్తిగా కూలిపోయింది. బుధవారం ఉదయం 7:30కు ఈ ఘటన జరిగింది. ఆ సమయంలో వంతెనపై నుంచి వెళుతున్న వాహనాల్లో రెండు ట్రక్కులు, రెండు వ్యాన్లు, ఆటో రిక్షా, కారు, బైక్ సహా కనీసం 12 వాహనాలు వంతెనపై నుంచి నదిలోకి పడిపోయాయి. ఈ ఘటనలో 13మంది మృత్యువాతపడ్డారు. మృతుల్లో నాలుగేళ్ల, రెండేళ్ల వయసున్న తోబుట్టువులు ఉండటం మరింత విషాదం! నాలుగేళ్ల బాలిక మినహా మృతులంతా పురుషులే! మరో తొమ్మిది మందిని సహాయక సిబ్బంది సురక్షితంగా బయటకు తీశారు. వీరిలో ఓ మహిళ సహా ఐదుగురికి గాయాలవ్వడంతో వడోదర ఆస్పత్రికి తరలించారు. ఓ బైక్ నదిలో పడటంతో దాని మీద ప్రయాణించిన ముగ్గురు ఈదుకుంటూ సురక్షితంగా ఒడ్డుకు చేరారు. వంతెన కూలిన సమయంలో మరో రెండు వాహనాలకు తృటిలో ప్రమాదం తప్పింది. జాతీయ విపత్తు నిర్వహణ బృందం (ఎన్డీఆర్ఎఫ్) ఆధ్వర్యంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఘటన పట్ల ప్రధాని నరేంద్ర మోదీ, గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్ విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు మోదీ రూ.2 లక్షల చొప్పున, భూపేంద్ర పటేల్ రూ.4 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. క్షతగాత్రులకు కేంద్రం నుంచి రూ.50 వేలు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.50 వేల చొప్పున ఇవ్వనున్నారు. వంతెన కూలిపోవడానికి గల కారణాలపై ప్రాథమిక విచారణ కోసం రోడ్లు, భవనాల విభాగానికి చెందిన అధికారులు ఘటనాస్థలికి వెంటనే వెళ్లాలని, విచారణ అనంతరం నివేదిక అందజేయాలని గుజరాత్ సీఎం ఆదేశించారు. 900 మీటర్ల పొడవు, 23 పియర్లతో కూడిన గంభీర బ్రిడ్జ్ గుజరాత్-సౌరాష్ట్ర ప్రాంతాలను కలుపుతుంది. 1985లో దీన్ని నిర్మించారు. వంతెన నిర్వహణకు సంబంధించి అవసరమైనప్పుడల్లా మరమ్మతులు నిర్వహిస్తున్నామని గుజరాత్ మంత్రి రుషికేశ్ పటేల్ చెప్పారు. అయితే, వంతెన పరిస్థితిపై స్థానికులు గతంలోనే ఆందోళన వ్యక్తం చేశారని స్థానిక మీడియా పేర్కొంది. దీనిపై కథనాలు ప్రసారమైనట్లు తెలిపింది. అధికారులు పైపైన మరమ్మతులు చేసి చేతులు దులుపుకొన్నారని విమర్శించింది. వంతెన కూలిపోవడంతో వడోదర-ఆనంద్ జిల్లాల మధ్య రాకపోకలు స్తంభించిపోయాయి.




చాంద్ పాషా, ఫాతిమా, నాగరాజ్

బెంగళూరు సెంట్రల్ జైల్లో లష్కరే తాయిబా ఉగ్ర నెట్‌వర్క్

జైల్లోనే ఉగ్రవాద భావజాలం వ్యాప్తి.. కొత్త దాడులకు ప్లాన్

ఉగ్రవాది నజీర్ నేతృత్వంలో బెంగళూరులో పేలుళ్లకు కుట్ర

బెంగళూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఉగ్రవాద సంస్థ అయిన లష్కరే తాయిబా కర్ణాటకలోని కారాగారాలను కేంద్రంగా చేసుకుని తన కార్యకలాపాలను యథేచ్ఛగా కొనసాగిస్తున్నట్టు ఎన్ఐఏ కనుగొంది. బెంగళూరు సెంట్రల్ జైలులో ఏకంగా నెట్‌వర్క్‌నే నిర్వహిస్తూ, కొత్త దాడులకు ఈ సంస్థ వ్యూహరచన చేస్తుండటం దర్యాప్తు అధికారులనే నివ్వెరపరిచింది. ఈ జైలులో తాజాగా జరిపిన తనిఖీల్లో భారీ కుట్ర బయటపడింది. దీంతో దేశవ్యాప్తంగా అన్ని జైళ్లను ఎన్ఐఏ అప్రమత్తం చేసింది. ముఖ్యంగా బిహారీలను ఉంచిన జైళ్లపై ప్రత్యేక నిఘా ఉంచాలని హెచ్చరించింది. సిబ్బందిలోకి ఉగ్రవాద భావజాలాన్ని చొప్పిస్తున్నారని తెలిపింది. ఎన్ఐఏ ఉన్నతాధికార వర్గాల సమాచారం ప్రకారం, యావజ్జీవ కారాగార శిక్ష పడిన నజీర్ అనే ఉగ్రవాదిని బెంగళూరు సెంట్రల్ జైలులో ఉంచారు. అతడు అక్కడ మొబైల్ ఫోన్‌ను సమకూర్చుకొని బయట ఉగ్రవాద కార్యకలాపాలను పర్యవేక్షిస్తున్నాడు. నిధుల సేకరణ మొదలు, క్యాడర్‌కు ఆదేశాలు జారీచేయడం, కొత్త దాడులకు వ్యూహరచన దాకా.. ప్రతిదీ ఫోన్‌పై నడిపిస్తూ సొంత నెట్‌వర్క్‌ను ఏర్పాటుచేసుకున్నాడు. ఇందులో జైలు సిబ్బంది నజీర్‌కు సహకరించినట్టు ఎన్ఐఏ విచారణలో తెలిసింది. నజీర్ బెంగళూరులో భారీ విధ్వంసం సృష్టించేందుకు కుట్ర పన్నినట్టు వెల్లడైంది.

రూ.10వేల ఫోన్.. రూ.50వేలకు

జైలు మానసిక వైద్యుడు నాగరాజ్ నజీర్‌కు ఫోన్ సమకూర్చినట్లు ఎన్ఐఏ విచారణలో తేలింది. రూ.10వేల ఫోన్‌ను రూ.50వేలకు అమ్మినట్లు వెల్లడైంది. నజీర్‌కే కాకుండా జైల్లో ఉన్న చాలా మంది ఖైదీలకు నాగరాజు ఫోన్లను సమకూర్చాడు. జైలు ఏఎస్ఐ చాంద్ పాషా.. ఉగ్రవాది నజీర్‌కు 2022 నుంచి సహకరిస్తున్నట్టు ఎన్ఐఏ గుర్తించింది. నజీర్‌ను కోర్టుకు ఎప్పుడు తీసుకువెళ్తారు అనే విషయాలపై ఎప్పటికప్పుడు ఆయన ఆప్తులకు సమాచారం ఇచ్చేవాడని అధికారులు గుర్తించారు. పరారీలో ఉన్న నిందితుడు జునాయిద్ అహ్మద్ అనే ఉగ్రవాది తల్లి అనీస్ ఫాతిమా.. తన కుమారుడికి, నజీర్‌కు మధ్యవర్తిగా వ్యవహరించింది. నజీర్ ఇచ్చిన సూచనలను అహ్మద్‌కు ఆమె చేరవేసింది. అహ్మద్ గల్ఫ్‌లో ఉంటూ దక్షిణాదిలో ఉగ్రవాద దుశ్చర్యలకు నాయకత్వం వహిస్తున్నాడని భావిస్తున్నారు. ఈ ముగ్గురినీ బెంగళూరు, కోలారుల్లో ఎన్ఐఏ అరెస్టు చేసింది.

మోదీకి నమీబియా అత్యున్నత పౌర పురస్కారం

» **ఇంధనం, ఆరోగ్య రంగాలతో సహా 4 కీలక ఒప్పందాలు**



విండ్‌హోక్, జూలై 9: ప్రధాని మోదీకి నమీబియా అత్యున్నత పౌర పురస్కారం అందజేసింది. విండ్‌హోక్‌లో జరిగిన కార్యక్రమంలో ది మోస్ట్ ఏన్షియంట్ వెల్‌విట్షియా మిరాబిలిస్ అవార్డును నమీబియా అధ్యక్షురాలు నెటుంబో ప్రధాని మోదీకి బహూకరించారు. అనంతరం నెటుంబోతో మోదీ ద్వైపాక్షిక చర్చలు జరిపారు. రెండు దేశాల మధ్య ఇంధనం, ఆరోగ్య రంగాలతో సహా నాలుగు కీలక ఒప్పందాలు కుదిరాయి. ఈ సందర్భంగా ప్రధాని నమీబియా పార్లమెంట్‌ను ఉద్దేశించి ప్రసంగించారు. రెండు దేశాల మధ్య స్నేహబంధం కాలపరీక్షను తట్టుకొని నిలబడిందన్నారు. భారత్‌కు చీతాలు ఇచ్చినందుకు నమీబియాకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మోదీ ప్రసంగిస్తున్నంత సేపు నమీబియా పార్లమెంట్ సభ్యులు బల్లలు చరుస్తూ హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ప్రధాని మోదీకి నమీబియా పార్లమెంట్ సభ్యులంతా లేచి నిల్చుని అభివాదం(స్టాండింగ్ ఒవేషన్) చేశారు. అంతకు ముందు నమీబియా చేరుకున్న ప్రధాని మోదీకి ఆ దేశ అధ్యక్షురాలు నెటుంబో.. విండ్‌హోక్ విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికారు. కళాకారులు డప్పులు కొడుతూ, నృత్యం చేశారు. ఈ సందర్భంగా మోదీ కళాకారుల దగ్గరకు వెళ్లి వారి డప్పును కొడుతూ అక్కడి వారందరినీ ఉత్సాహపరిచారు. కాగా ఐదు దేశాల పర్యటనలో భాగంగా మోదీకి అర్జెంటీనా తప్ప బ్రెజిల్, ఘనా, ట్రినిడాడ్ అండ్ టొబాగో, నమీబియా తమ దేశ అత్యున్నత పౌరపురస్కారాలను అందజేశాయి. మోదీ ఇప్పటివరకు 17 దేశాల పార్లమెంట్‌లను ఉద్దేశించి ప్రసంగించి రికార్డు సృష్టించారు. కాంగ్రెస్ ప్రధానులంతా కలిపి 17 దేశాల పార్లమెంట్‌లను ఉద్దేశించి ప్రసంగించారు.

వర్షాకాల సమావేశాల్లో జస్టిస్ వర్మపై అభిశంసన తీర్మానం!

న్యూఢిల్లీ, జూలై 9: ఇంట్లో పెద్ద మొత్తంలో కరెన్సీ నోట్ల కట్టలు బయటపడడంతో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న సీనియర్ న్యాయమూర్తి, జస్టిస్ యశ్వంత్ వర్మపై పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తుంది. ఈ తీర్మానానికి ప్రతిపక్షాల మద్దతు లభిస్తుందని ఆశిస్తోంది. లోక్‌సభలో ఓ తీర్మానం ప్రవేశపెట్టాలంటే దానికి మద్దతుగా కనీసం 100 మంది ఎంపీలు సంతకాలు చేయాలి. ఈ సంతకాల సేకరణ ప్రక్రియ ఇప్పటికే మొదలైనట్టు సమాచారం. ఈ ప్రక్రియ పూర్తయితే జస్టిస్ యశ్వంత్ వర్మ వ్యవహారంలో విచారణకు ఓ కమిటీని ఏర్పాటు చేస్తారు. జస్టిస్ యశ్వంత్ వర్మను పదవి నుంచి తప్పించేందుకు అవసరమైన తీర్మానానికి మద్దతు కోరుతూ ఉభయ సభల్లోని ప్రధాన పార్టీలతో కేంద్రం సంప్రదింపులు జరిపినట్టు తెలిసింది.

రాజకీయాలను ఆస్వాదించలేకపోతున్నా: కంగన

న్యూఢిల్లీ, జూలై 9: తాను రాజకీయాలను ఇప్పుడిప్పుడే అర్థం చేసుకుంటున్నానని, పాలిటిక్స్‌ను ఆస్వాదించలేకపోతున్నానని ఎంపీ, బాలీవుడ్ నటి కంగనా రనౌత్ అన్నారు. రాజకీయ రంగం విభిన్న పనితనంతో కూడుకున్నదని.. ఎక్కువగా సామాజిక సేవను తలపిస్తోందని చెప్పారు. ఓ యూట్యూబ్ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కంగన ఈ వ్యాఖ్యలు చేశారు. మోరీలు బాగుచేయించాలంటూ తన వద్దకు ప్రజలు వస్తున్నారని.. అయితే తానో ఎంపీని అనే విషయాన్ని మరిచిపోయి, పంచాయతీ స్థాయి సమస్యలను పట్టుకొని తన వద్దకు రావడం ఏమిటి? అని ఆమె ప్రశ్నించారు. ఇంకొందరేమో గుంతలు పడ్డ రోడ్లను బాగు చేయించాలంటూ ఎమ్మెల్యేల స్థాయిలో సమస్యలు చెప్పుకొంటారని, అవన్నీ రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని సమస్యలని తాను చెప్పినా పట్టించుకోరని.. పైగా "మీ దగ్గర డబ్బుంది చేయవచ్చు కదా" అని అడుగుతున్నారని వాపోయారు.

వచ్చే ఏడాది నుంచి..

అమెరికా వీసా చార్జీల పెంపు

» **విద్యార్థి, పర్యాటక, వ్యాపార, ఎక్స్ఛేంజ్ వీసాలపై ఇంటిగ్రిటీ రుసుము కింద 250 డాలర్ల భారం**

» **ఐ-94 ఫీ కింద 24 డాలర్ల వసూలు**

» **ఈఎస్‌టీఏ రుసుము 13 డాలర్లు.. ఈవీయూఎస్ రుసుము 30 డాలర్లు!**



న్యూఢిల్లీ, జూలై 9: ఉద్యోగ (హెచ్-1బీ), విద్యార్థి (ఎఫ్/ఎం), పర్యాటక/వ్యాపార (బీ-1, బీ2), ఎక్స్ఛేంజ్ (జే) వీసాలపై అమెరికా వెళ్లేవారిపై వచ్చే ఏడాది నుంచి మరింత భారం పడనుంది! ఈ వీసాలతో తమ గడ్డపై అడుగుపెట్టాలనుకునేవారి నుంచి 'ఇంటిగ్రిటీ ఫీ' కింద అదనంగా 250 డాలర్ల రుసుము (మన కరెన్సీలో దాదాపుగా రూ.21,500) వసూలు చేయాలని అమెరికా సర్కారు నిర్ణయించింది. నాన్-ఇమ్మిగ్రెంట్ వీసాలపై అమెరికాకు వచ్చేవారు అక్రమంగా ఉండిపోకుండా, వీసా కాలానికి మించి ఉండకుండా చూసేందుకే ఈ నిర్ణయం తీసుకుంది. ఇటీవలే ఆమోదించిన 'వన్ బిగ్ బ్యూటిఫుల్ యాక్ట్' కింద.. ఈ పెంపు వచ్చే ఏడాది నుంచి అమలు కానుంది. ద్రవ్యోల్బణానికి అనుగుణంగా ఈ రుసుములో మార్పుచేర్పులు ఉంటాయి. అంటే.. ద్రవ్యోల్బణం పెరిగితే ఎక్కువ రుసుము వసూలు చేస్తారు. ఈ వీసాలపై అమెరికాలో అడుగుపెట్టేవారు నిర్దేశిత షరతులను పాటిస్తే ఇంటిగ్రిటీ ఫీ కింద వసూలు చేసిన సొమ్మును తిరిగి ఇచ్చేస్తారు. దౌత్య (ఏ, జీ) వీసాలపై వచ్చేవారికి మాత్రం ఈ రుసుము నుంచి మినహాయింపు ఉంటుంది. వీసా జారీ చేసేటప్పుడే అమెరికా 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ' ఈ రుసుమును సర్‌చార్జ్ రూపంలో వసూలు చేస్తుంది. దీంతోపాటు.. ఐ-94 సర్‌చార్జ్ (24 డాలర్లు), ఎలక్ట్రానిక్ సిస్టమ్ ఫర్ ట్రావెల్ ఆథరైజేషన్ (ఈఎస్‌టీఏ- 13 డాలర్లు)/ఎలక్ట్రానిక్ వీసా అప్‌డేట్ సిస్టమ్ (ఈవీయూఎస్-30 డాలర్లు) కింద అదనపు రుసుములను ఈ బిల్లులో పొందుపరిచారు. అవి కూడా కలుపుకొంటే వీసా రుసుములు భారంగా మారనున్నాయి. ఉదాహరణకు.. ప్రస్తుతం అమెరికాకు పర్యాటక/వ్యాపార వీసాపై వెళ్లాలంటే అందుకు వీసా చార్జీల కింద 185 డాలర్లు వసూలు చేస్తున్నారు. అంటే దాదాపుగా రూ.15,855. బిగ్ బ్యూటిఫుల్ యాక్ట్‌లో ప్రతిపాదించిన ఇతర చార్జీలను, ఇంటిగ్రిటీ రుసుమును కూడా కలుపుకొంటే అది ఏకంగా 472 డాలర్లకు (రూ.40,456) చేరుతుంది. ద్రవ్యోల్బణాన్ని కూడా లెక్కించి 'వినియోదారుల ధరల సూచీ (కన్స్యూమర్ ప్రైస్ ఇండెక్స్) ఆధారంగా భవిష్యత్తులో 'ఇంటిగ్రిటీ ఫీ'ని పెంచితే.. చెల్లించాల్సిన మొత్తం ఇంకా పెరిగిపోయే ప్రమాదం ఉంది.

ఆ 250 డాలర్లు తిరిగి పొందాలంటే..

అమెరికా సర్కారు విధించిన కొన్ని షరతులను పాటిస్తే.. ఇంటిగ్రిటీ రుసుము కింద కట్టిన 250 డాలర్లను తిరిగిచ్చేస్తారు. అవేంటంటే..

- వీసా గడువును పొడిగించాలనో లేక ఒక వీసాపై వచ్చి దాన్ని వేరే వీసాగా మార్చాలనో కోరకుండా.. వీసా గడువు ముగిసిన ఐదు రోజుల్లోపే అమెరికా నుంచి తమ దేశానికి వెళ్లిపోయే వారికి ఇంటిగ్రిటీ రుసుమును తిరిగిచ్చేస్తారు.
- ఐ-94 (అమెరికాలోకి మనం ప్రవేశించే, తిరిగి వెళ్లే తేదీలను నమోదు చేసే రికార్డు) గడువు ముగిసేలోపే విజయవంతంగా శాశ్వత నివాస హోదా పొందినవారికి ఆ సొమ్ము రీఫండ్ చేస్తారు.

..అయితే, రీఫండ్ ప్రక్రియ ఆటోమేటిగ్గా జరగదు. అన్ని ఆధారాలతో దరఖాస్తు చేసుకుంటే.. అధికారులు పరిశీలించి సొమ్ము తిరిగిస్తారు. ఈ షరతులను పాటించనివారు కట్టిన రుసుము నేరుగా అమెరికా కోశాగారంలోని జనరల్ ఫండ్‌కు చేరుతుంది.

'గోల్డెన్ వీసా'పై కథనాలను ఖండించిన యూఏఈ

న్యూఢిల్లీ, జూలై 9: కేవలం రూ.23 లక్షలు చెల్లిస్తే యూఏఈ గోల్డెన్ వీసాను పొందవచ్చన్న మీడియా కథనాలను ఆ దేశం ఖండించింది. గోల్డెన్ వీసాకు సంబంధించిన రూల్స్‌ను స్పష్టంగా నిర్వచించామని, ఆసక్తి ఉన్న వారు అథారిటీ వెబ్‌సైట్ లేదా స్మార్ట్ అప్లికేషన్‌ద్వారా అధికారిక సమాచారాన్ని పొందవచ్చని తెలిపింది. అన్ని గోల్డెన్ వీసా దరఖాస్తుల ప్రక్రియను యూఏఈలోని అధికారిక ప్రభుత్వ మార్గాల ద్వారా చేపట్టనున్నట్టు స్పష్టం చేసింది. ఈ ప్రక్రియలో ఏ కన్సల్టెన్సీ సంస్థను ఆథరైజ్డ్ పార్టీగా గుర్తించలేదని పేర్కొంది. యూఏఈలో నివసించాలనుకునే వ్యక్తుల నుంచి అక్రమంగా సొమ్ములు వసూలు చేయడానికి ఇలాంటి తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసే సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించింది. కాగా, యూఏఈ గోల్డెన్ వీసా ప్రోగ్రామ్ ద్వారా నైపుణ్యం కలిగిన అధిక నికర విలువ కలిగిన భారతీయులు, ఇతర దేశస్థులు గల్ఫ్ దేశంలో దీర్ఘకాలిక నివాస సదుపాయాన్ని కల్పిస్తున్నట్టు అధికారులు పేర్కొన్నారు.

రోదసిలో రైతుగా శుక్లా

ఐఎస్ఎస్‌లో మెంతి, పెసర విత్తనాలపై ప్రయోగం



న్యూఢిల్లీ, జూలై 9: అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో ఉన్న భారతీయ వ్యోమగామి శుభాన్షు శుక్లా రైతుగా మారారు. మెంతి, పెసర విత్తనాలను మొలకెత్తించే ప్రయోగాల్లో భాగస్వామి అయ్యారు. ఆ విత్తనాలను ప్రత్యేకమైన గాజు పాత్రలో పెట్టి, వాటి ఫొటోలు తీశారు. తర్వాత ఆ పాత్రలను ఐఎస్ఎస్‌లో ఉన్న స్టోరేజీ ఫ్రీజర్‌లో భద్రపరిచారు. అంతరిక్షంలో విత్తనాలు మొలకెత్తడంపై సూక్ష్మగురుత్వాకర్షణ ప్రభావం, ప్రాథమిక స్థాయిలో వాటి ఎదుగుదల ఎలా ఉంటుందనే దానిని పరిశీలించడానికి ఈ ప్రయోగం చేపట్టారు. ఈ ప్రయోగాన్ని ఇద్దరు శాస్త్రవేత్తలు.. యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చర్ సైన్సెస్, ధార్వాడ్‌కు చెందిన రవికుమార్ హోసమణి, ఐఐటీ ధార్వాడ్‌కు చెందిన సుధీర్ సిద్ధపురెడ్డి నేతృత్వంలో శుక్లా చేపట్టారు. భూమికి వచ్చాక ఆ విత్తనాల్లో వచ్చిన జన్యుపరమైన మార్పులను పరిశీలిస్తారని యాక్సియం స్పేస్ ఓ ప్రకటనలో తెలిపింది. మరో ప్రయోగంలో ఆయన సూక్ష్మ ఆల్గేలు అంతరిక్షంలో ఆహారం తయారు చేసుకోవడం, ఆక్సిజన్, జీవ ఇంధనాల ఉత్పత్తి సామర్థ్యంపై అధ్యయనం చేశారు. కాగా, శుక్లాతో పాటు ఐఎస్ఎస్‌కు వెళ్లిన వ్యోమగాములు గురువారం తర్వాత ఎప్పుడైనా భూమికి తిరిగివచ్చే అవకాశం ఉంది. అమెరికాలోని ఫ్లోరిడా తీరంలో వాతావరణ పరిస్థితిని బట్టి యాక్సియం-4 మిషన్ అన్‌డాకింగ్ ప్రక్రియ ఉంటుంది. ఈ మిషన్‌లో భాగంగా 14 రోజులు వారు అంతరిక్షంలో ఉండే అవకాశం ఉండగా.. బుధవారంతో 12 రోజులు పూర్తయ్యాయి.



ఆసియాలోనే అత్యంత వృద్ధ ఏనుగు కన్నుమూత

భోపాల్, జూలై 9: ఆసియాలోనే అత్యంత వృద్ధ ఏనుగుగా పేరొందిన వత్సల మరణించింది. వందేళ్లకు పైబడిన ఈ ఏనుగు వృద్ధాప్యం కారణంగా మధ్యప్రదేశ్‌లోని పన్నా టైగర్ రిజర్వ్‌లో మంగళవారం చనిపోయింది. టైగర్ రిజర్వ్ అధికారులు, సిబ్బంది దాని అంత్యక్రియలు ఘనంగా నిర్వహించారు. వత్సలను కేరళలోని నిలంబూర్ అడవుల నుంచి తీసుకొచ్చారు. మొదట దానిని నర్మదాపురానికి, ఆపై పన్నా టైగర్ రిజర్వ్‌కు తరలించారు. అప్పటి నుంచి వత్సల ఈ రిజర్వ్‌లోనే ఉంటూ.. ప్రధాన ఆకర్షణగా నిలిచింది. వత్సల రిజర్వ్‌లోని ఏనుగుల సమూహానికి నాయకత్వం వహించేదని అధికారులు తెలిపారు.

ఉద్యమకారులను కాల్చి చంపండి

భద్రతాసిబ్బందికి నాడు షేక్ హసీనా ఆదేశం!

ఢాకా, జూలై 9: బంగ్లాదేశ్‌లో విద్యార్థుల నాయకత్వంలో జరిగిన రిజర్వేషన్ వ్యతిరేక ఉద్యమం అక్కడ ప్రభుత్వాన్నే మార్చేసింది. అయితే, ఈ ఉద్యమాన్ని అణచివేయడానికి ఆనాటి ప్రధాని షేక్ హసీనా 'కాల్చివేత' ఉత్తర్వులు ఇచ్చినట్టు తాజాగా బయటపడిన ఫోన్ రికార్డుల ద్వారా వెలుగులోకి వచ్చింది. గత ఏడాది జూలై 18న ఆమె ఈ ఆదేశాలు ఇచ్చారని బీబీసీ కథనం ప్రచురించింది. ఈ ఫోన్ రికార్డును ఆ వార్తా సంస్థ ధ్రువీకరించింది. హసీనాను పదవీచ్యుతురాలిని చేసిన అప్పటి ఉద్యమంలో 1400 మంది చనిపోయినట్టు ఐరాస తెలిపింది.

యాపిల్ సీవోవోగా సబీ ఖాన్

» **1966లో యూపీలో జననం**

» **1995లో యాపిల్‌లో చేరిక**



న్యూఢిల్లీ, జూలై 9: భారత సంతతికి చెందిన సబీ ఖాన్ యాపిల్ కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్(సీవోవో)గా నియమితులయ్యారు. జెఫ్ విలియమ్స్ స్థానంలో ఆయన ఈ నెలాఖరులోగా బాధ్యతలు స్వీకరించనున్నారు. సబీ ఖాన్ యాపిల్ కంపెనీలో 30ఏళ్లుగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం ఆయన కంపెనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. సబీ ఖాన్ 1966లో ఉత్తరప్రదేశ్‌లోని మొరాదాబాద్‌లో జన్మించారు. ఆయనకు పదేళ్ల వయస్సున్నప్పుడు కుటుంబంతో పాటు సింగపూర్‌కు వెళ్లిపోయారు. అక్కడే డిగ్రీ పూర్తి చేశారు. 1995లో యాపిల్ కంపెనీలో చేరారు. కాగా, సబీ ఖాన్ అత్యంత తెలివైన వ్యూహకర్త అని, యాపిల్ ఉత్పత్తులకు అంతర్జాతీయంగా మార్కెట్‌ను సృష్టించడంలో ఆయన కీలక పాత్ర పోషించారని యాపిల్ సీఈవో టిమ్ కుక్ కొనియాడారు.

కూలిన జాగ్వార్ ఫైటర్ జెట్

ఇద్దరు పైలట్ల దుర్మరణం.. రాజస్థాన్‌లోని చురు జిల్లాలో దుర్ఘటన


జాగ్వార్ ఫైటర్ జెట్ శకలాలు

జైపూర్/న్యూఢిల్లీ, జూలై 9: భారత వైమానిక దళాని(ఐఏఎఫ్) కి చెందిన జాగ్వార్ ఫైటర్ జెట్ విమానం కుప్పకూలింది. ఈ ఘటనలో ఇద్దరు పైలట్లు దుర్మరణం పాలయ్యారు. బుధవారం రాజస్థాన్‌లోని చురు జిల్లా భానుడా గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది. మధ్యాహ్నం 1.25 గంటల సమయంలో భారీ శబ్దంతో వ్యవసాయ క్షేత్రంలో విమానం కుప్పకూలిందని రాజల్‌దేసర్ పోలీసు అధికారి కమలేశ్ తెలిపారు. 'సాధారణ శిక్షణా కార్యక్రమంలో భాగంగా సూరత్‌గఢ్ నుంచి బయలుదేరిన ఫైటర్ జెట్ విమానం ప్రమాదవశాత్తు కుప్పకూలింది. ఘటనపై విచారణకు ఆదేశించాం. ఇద్దరు పైలట్ల దుర్మరణం పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నాం' అని ఐఏఎఫ్ ప్రకటించింది. ఈ ఘటనపై రాజస్థాన్ గవర్నర్ హరిబావు బగాడే, సీఎం భజన్‌లాల్ శర్మ విచారం వ్యక్తం చేశారు.

5 నెలల్లో కూలిన మూడో విమానం..

ఈ ఏడాది మార్చి తర్వాత కూలిన మూడో జాగ్వార్ ఫైటర్ జెట్ విమానమిది.. మార్చి 7న హరియాణాలోని అంబాలాలో ఓ జాగ్వార్ జెట్ కూలిన ఘటనలో పైలట్ సురక్షితంగా బయటపడ్డాడు. ఏప్రిల్ 3న గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో మరో జెట్ కూలింది. సాంకేతిక లోపం కారణంగా చోటుచేసుకున్న ఈ ఘటనలో ఓ పైలట్ మరణించగా.. మరో పైలట్ ప్రాణాలతో బయటపడ్డాడు. 1979లో భారత వైమానిక దళంలో చేరిన ఈ యుద్ధ విమానాలు పాతవై పోవడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయన్న వాదనలున్నాయి. గతంలో ఈ విమానాలను వినియోగించిన బ్రిటన్, ఫ్రాన్స్, ఈక్వెడార్, నైజీరియా, ఒమన్ వంటి దేశాలు చాలా కాలం క్రితమే వాటిని ఉపసంహరించుకున్నాయి. కొన్ని విమానాలను మ్యూజియంలలో ప్రదర్శనకు ఉంచాయి. 2027-28 నుంచి ఈ ఫైటర్ జెట్ విమానాలను దశల వారీగా ఐఏఎఫ్ తొలగించాలనుకుంటోంది. అయితే తేజాస్ ఎంకే 2, రాఫెల్ వంటి అధునాతన ఫైటర్ జెట్ల కొనుగోలులో జాప్యంతో జాగ్వార్ జెట్ విమానాలను మరికొంత కాలం కొనసాగించక తప్పేలా లేదు.

ఇండిగో విమానాన్ని ఢీకొట్టిన పక్షి

బిహార్ రాజధాని పట్నా నుంచి ఢిల్లీ బయలుదేరిన ఇండిగో విమానాన్ని టేకాఫ్ అయిన కాసేపటికే ఓ పక్షి ఢీకొట్టింది. దాంతో విమానాన్ని పట్నా విమానాశ్రయంలో దింపేయాల్సి వచ్చింది. 175 మంది ప్రయాణికులతో బుధవారం ఉదయం 8.42 గంటలకు బయలుదేరిన ఇండిగో విమానం (6ఈ 5009).. సుమారు 22 నిమిషాల్లోనే తిరిగొచ్చి పట్నాలో సురక్షితంగా ల్యాండ్ అయింది. పక్షి ఢీకొట్టడంతో ఒక ఇంజన్‌లో ప్రకంపనలు వస్తున్నట్టు గమనించిన పైలట్.. అప్రోచ్ కంట్రోల్ యూనిట్‌ను అప్రమత్తం చేసి, పట్నాలో ల్యాండ్ అయ్యేందుకు అనుమతి కోరారని విమానాశ్రయ అధికారులు తెలిపారు.

ఈసీ అధికారాలు అపరిమితమా?

బిహార్‌లో 'ఓటర్ల జాబితా ప్రక్షాళన' పై తీవ్ర అభ్యంతరాలు

న్యూఢిల్లీ, జూలై 9: అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ మొదలవడానికి కేవలం 2నెలల ముందు బిహార్ ఓటర్ల జాబితా ప్రక్షాళన కోసమని ఎన్నికల సంఘం(ఈసీ) చేపట్టిన 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)'పై వివాదం ముదురుతోంది. వలస వచ్చిన, పేద ఓటర్లను జాబితా నుంచి తొలగించే కుట్రతోనే ఈ కార్యక్రమం చేపట్టిందని, ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 326కు విరుద్ధమని కాంగ్రెస్, ఆర్జేడీ ఇతర ప్రతిపక్షాలు ఆరోపిస్తుండగా.. తప్పుల సవరణ కోసం, పౌరులుకానివారిని ఓటర్ల జాబితా నుంచి తొలగించేందుకు రాజ్యాంగబద్ధంగానే ఎస్ఐఆర్ ప్రక్రియ చేపట్టామని ఎన్నికల సంఘం స్పష్టం చేస్తోంది. అయితే ఓటర్ల జాబితా విషయంలో ఎన్నికల సంఘానికి అపరిమిత అధికారాలేమీ లేవని.. ముఖ్యంగా బిహార్‌లో చేపట్టిన 'ఎస్ఐఆర్' ప్రక్రియ ప్రజాప్రాతినిధ్య చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా లేదని నిపుణులు చెబుతున్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 326 ప్రకారం.. దేశంలో వయోజనులైన (18 ఏళ్లు నిండిన) పౌరులందరికీ ఎలాంటి కుల, మత, ప్రాంత, ఇతర భేదాలు, వివక్ష లేకుండా ఓటు హక్కు కల్పించాలి. ఇక ప్రజాప్రాతినిధ్య చట్టం సెక్షన్ 19, 20 ప్రకారం.. ఏదైనా నియోజకవర్గంలో నివాసం ఉంటున్నవారికి అక్కడ ఓటు హక్కు ఉంటుంది. అయితే వారు కచ్చితంగా ఎప్పటికీ అదే చోట శాశ్వత నివాసం ఉండాల్సిన పరిస్థితి ఉండదు. బిహార్‌లో ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియ దీనిని ఉల్లంఘించేలా ఉందని నిపుణులు చెబుతున్నారు. మోహిందర్ సింగ్ గిల్ వర్సెస్ ప్రధాన ఎన్నికల కమిషనర్ కేసు (1978)లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం.. ఎన్నికల సంఘానికి ఎన్ని విచక్షణాధికారాలు ఉన్నా సంబంధిత ఎన్నికలు, ప్రక్రియకు సంబంధించి రాష్ట్రంలో లేదా జాతీయ స్థాయిలో చట్టాలకు అనుగుణంగా వ్యవహరించాల్సిందే. ఎలాంటి చట్టాలు లేనప్పుడు మాత్రమే ఆర్టికల్ 324 ప్రకారం ఎన్నికల సంఘం తన అధికారాలను వినియోగించుకోవచ్చు. ప్రజాప్రాతినిధ్య చట్టంలోని 21వ సెక్షన్ ప్రకారం.. ఎన్నికల సంఘం 4విధాలుగా ఓటర్ల జాబితా సవరణ చేపట్టవచ్చు. ఒకటి లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల ముందు, రెండోది ఏదైనా ఉప ఎన్నికల ముందు, మూడోది ఏదైనా సంవత్సరంలో ఈసీ ఆదేశాల మేరకు, నాలుగోది ఏదైనా నియోజకవర్గం, లేదా అందులోని ఒక భాగంలో ప్రత్యేక సవరణ (స్పెషల్ రివిజన్) చేపట్టవచ్చు. ఈ చట్టం సెక్షన్ 14 ప్రకారం.. ఇందులో తొలి మూడు విధాల్లో ఓటర్ల జాబితా సవరణకు సంబంధిత ఏడాది జనవరి 1వ తేదీ కటాఫ్‌గా ఉంటుంది. నాలుగో విధమైన ప్రత్యేక సవరణకు నిర్దేశిత కటాఫ్ లేదు. అయితే చట్టంలో 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' అనే ప్రక్రియ లేదని, ప్రత్యేక సవరణ మాత్రమే ఉందని నిపుణులు అంటున్నారు. ఇక 2025 జనవరి 1వ తేదీని కటాఫ్‌గా పెట్టకుండా.. 2025 జూలై 1వ తేదీని పేర్కొనడమూ ఉల్లంఘనే అని స్పష్టం చేస్తున్నారు.

ఆధార్ ప్రాథమిక ఆధారమేమీ కాదు: యూఐడీఏఐ

దేశంలో ఆధార్ ఎప్పుడూ కూడా ప్రాథమిక గుర్తింపునకు ఆధారం కాదని యూఐడీఏఐ సీఈవో భువనేశ్ కుమార్ పేర్కొన్నారు. దేశంలో భారీ సంఖ్యలో నకిలీ ఆధార్‌కార్డులు ఉన్నాయని, వాటిని నియంత్రించేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. బిహార్‌లో 'ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ'లో ఆధార్ కార్డులను గుర్తింపుకోసం పరిగణనలోకి తీసుకోకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ఆయన ఈ మేరకు స్పందించారు.

‘ఆంధ్రజ్యోతి’ ఎండీ రాధాకృష్ణ అంటే మాకూ గౌరవమే

- మంత్రి సీతక్క వ్యాఖ్యల అర్థమేమిటి?
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత సత్యవతి రాథోడ్
- దాడి చేస్తే బీఆర్ఎస్‌ను భూస్థాపితం చేస్తాం
- ఎండీ రాధాకృష్ణ ‘కొత్త పలుకు’ అక్షర సత్యం
- టీపీఆర్పీ వ్యవస్థాపక అధ్యక్షుడు రవికుమార్

మహబూబాబాద్, బర్కత్‌పుర, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ‘ఆంధ్రజ్యోతి’ ఎండీ రాధాకృష్ణ అంటే మీకే కాదు.. మాకు కూడా ఎంతో గౌరవం’ అని మంత్రి సీతక్కను ఉద్దేశించి మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. మహబూబాబాద్‌లో బుధవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. మంత్రి సీతక్క చేసిన వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించారు. ‘ఆంధ్రజ్యోతి’ని టచ్ చేసి చూడు అంటూ మంత్రి సీతక్క వ్యాఖ్యలు చేయడంలో అర్థమేమిటని ప్రశ్నించారు. ‘ఆంధ్రజ్యోతి’ పత్రిక అన్నా.. ఎండీ రాధాకృష్ణ అన్నా మాకు ఎనలేని గౌరవమని చెప్పారు. ‘ఆంధ్రజ్యోతి’పై దాడి చేస్తే బీఆర్ఎస్ పార్టీని భూస్థాపితం చేస్తామని తెలంగాణ ప్రజారాజ్యం



మీడియాతో మాట్లాడుతున్న సత్యవతి రాథోడ్

పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జిలుకర రవికుమార్ హెచ్చరించారు. హైదరాబాద్‌లో ఆయన బుధవారం మాట్లాడుతూ ఎండీ రాధాకృష్ణ ‘కొత్త పలుకు’లో రాసిన ‘తెలంగాణ బీఆర్ఎస్ జాగీరా?’ కథనం అక్షర సత్యమని, దీన్ని జీర్ణించుకోలేని బీఆర్ఎస్ పార్టీ తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ఏబీఎన్-ఆంధ్రజ్యోతిపై దాడులకు కుట్ర చేయడం అత్యంత దుర్మార్గమని అన్నారు. దాడులకు పాల్పడితే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. అధికారం కోల్పోయిన తర్వాత దుర్మార్గంగా వ్యవహరించడం బీఆర్ఎస్ అగ్రనాయకత్వానికి వెన్నతో పెట్టిన విద్య అని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ‘ఆంధ్రజ్యోతి’ ప్రధాన భూమిక పోషించిందని, దీనిని బీఆర్ఎస్ విస్మరించడం శోచనీయమన్నారు. ఏబీఎన్-ఆంధ్రజ్యోతి కార్యాలయాలకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

కల్తీ కల్లుకు ఆరుగురు బలి

(మొదటి పేజీ తరువాయి)

మొదలు పెట్టారు. కృష్ణయ్య అనే వ్యక్తికి కూడా డయాలసిస్ అవసరమవుతుందని వైద్యులు తెలిపారు. ఇదిలా ఉండగా కల్తీ కల్లు బారిన పడిన వారందరి రక్తంలో క్రియాటినైన్ స్థాయులు ఎక్కువగా ఉన్నట్టు వైద్యులు చెబుతున్నారు. బాధితులంతా.. నగరంలోని హైదర్‌నగర్, ఇందిరానగర్, శంషీగూడలోని కల్లు కాంపౌండ్లలో కిందటి శనివారం కల్లు తాగారు. అనంతరం తీవ్ర అస్వస్థతకు గురవడంతో కుటుంబసభ్యులు వారిని ఆస్పత్రులకు తరలించారు. హైదర్‌నగర్‌లో కల్తీ కల్లు తాగిన చాకలి బొజ్జయ్య (55- ఆల్విన్‌కాలనీ డివిజన్ సాయిచరణ్ కాలనీ) వాంతులు విరేచనాలతో బాధపడుతుండడంతో సోమవారం ఉదయం కుటుంబసభ్యులు ఆయన్ను ఆస్పత్రికి తీసుకెళ్తుండగా దారిలో మృతి చెందారు. అదే ప్రాంతానికి చెందిన నారాయణమ్మ(65).. గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం మరణించారు. తమ వద్ద కల్లు తాగినవారంతా అస్వస్థతకు గురవుతుండడం.. కొందరు ప్రాణాలు కోల్పోవడంతో అప్రమత్తమైన కల్లు కాంపౌండ్ల నిర్వాహకులు.. ఈ విషయం బయటకు పొక్కకుండా ఉండేందుకు ప్రయత్నాలు చేశారు. ఈ క్రమంలోనే.. హైదర్‌నగర్ కాంపౌండ్‌లోనే కల్లు తాగిన స్వరూప (61) అనే వృద్ధురాలు మంగళవారం రాత్రి హోలిస్టిక్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందడంతో.. ఆమె కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయకుండా అంత్యక్రియలు జరిపించేందుకు వారు ప్రయత్నించారు. కానీ, సమాచారం అందుకున్న కేపీహెచ్‌బీ పోలీసులు ఆమె మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఇక.. ఆల్విన్ కాలనీ డివిజన్ శ్రీరామ్‌నగర్ కాలనీకి చెందిన సీతారామ్ (47) బుధవారం ఉదయం గాంధీ ఆస్పత్రిలో, నారాయణ (54) అనే వ్యక్తిని కూకట్‌పల్లిలోని రామ్‌దేవ్‌రావ్ ఆస్పత్రికి తరలిస్తుండగా మరణించారు. రాందేవ్‌రావ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మౌనిక (25) అనే మహిళ బుధవారం రాత్రి మృతి చెందారు. ఇలా నానాటికీ మృతుల సంఖ్య, ఆస్పత్రుల్లో చేరుతున్నవారి సంఖ్య పెరుగుతుండడంతో విషయం బహిర్గతమైంది.

బాధితుల గుర్తింపు.. కేసు నమోదు..

కల్తీ కల్లు కారణంగా ఆరుగురు చనిపోయిన నేపథ్యంలో.. బాధితులను గుర్తించేందుకు అధికారులు పలు ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి.. వాంతులు, విరేచనాలతో ఇబ్బంది పడుతున్న వారిని గుర్తించి... ‘వారు కల్లు తాగారా? లేక ఇతర కారణాలతో అస్వస్థతకు గురయ్యారా?’ అని ఆరా తీస్తున్నారు. అలా 16 మందిని ఆస్పత్రికి పంపించారు. మరోవైపు.. బాలానగర్ ఎక్సైజ్ పోలీసులు కల్లు కాంపౌండ్ల నిర్వాహకులు చింతకబడి



కల్తీ కల్లు తాగి అస్వస్థతకు గురై మృతిచెందిన చాకలి బొజ్జయ్య, నారాయణమ్మ, స్వరూప, నారాయణ, మౌనిక (ఫైల్), సీతారామ్

నగేశ్ గౌడ్, బట్టి శ్రీనివాస్ గౌడ్, టి.శ్రీనివాస్ గౌడ్, కుమార్ గౌడ్, తీగల రమేశ్‌పై కేసు నమోదు చేశారు. నాలుగు కల్లు దుకాణాల్లో 674 లీటర్ల కల్లు స్వాధీనం చేసుకున్నారు. సీతారామ్ భార్య అరుణ, స్వరూప కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మంత్రి పరామర్శ.. హెచ్చరిక

నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుల కుటుంబాలను ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ బుధవారం పరామర్శించారు. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్న మంత్రి జూపల్లి.. వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. కల్తీ కల్లు విక్రయించిన వారు ఎంతటి వారైనా వదిలి పెట్టేది లేదని, చట్టపరంగా శిక్షిస్తామని హెచ్చరించారు. ఇక.. కల్తీ కల్లుకు బలైనవారి కుటుంబాలకు ప్రభుత్వం రూ.కోటి చొప్పున పరిహారం చెల్లించాలని ఈటల డిమాండ్ చేశారు. కాగా.. కల్తీ కల్లు అమ్మకాలు జరిగినట్టు సమాచారం ఉన్న చోట్ల ఎక్సైజ్ అధికారులు నమూనాలను సేకరించి పరీక్షకు పంపినట్టు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసిం తెలిపారు కల్తీ కల్లు సమస్యను అరికట్టడానికి రాష్ట్ర, జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్‌లు, ఎన్‌ఫోర్స్‌మెంట్ టీములు రంగంలోకి దిగినట్లు అధికారులు తెలిపారు. మరోవైపు.. అల్వాల్ స్టేషన్ హౌజ్ ఆఫీసర్ ఏ.ప్రశాంత్, మేడ్చల్ ఎస్‌వోటీ సీఐ శ్యామ్‌సుందర్‌రెడ్డి, మల్కాజిగిరి ఎక్సైజ్ సీఐ చంద్రశేఖర్, డీఐ తిమ్మప్ప ఆధ్వర్యంలో.. అల్వాల్ మండలంలోని 10 కల్లు దుకాణాల్లో బుధవారం తనిఖీలు నిర్వహించారు. కల్లు నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపించారు.

హెచ్‌ఆర్‌సీలో పిటిషన్

కల్తీ కల్లు కారణంగా ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాల తరఫున.. ప్రముఖ న్యాయవాది రామారావు మానవ హక్కుల కమిషన్‌లో పిటిషన్ వేశారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున.. తీవ్ర అనారోగ్యానికి గురైనవారికి రూ.5 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని పిటిషన్‌లో కోరారు. ఎక్సైజ్ శాఖ కమిషనర్ ఆధ్వర్యంలో నిరంతరం కల్లు కాంపౌండ్‌లలో తనిఖీలు చేయాలని, హెచ్‌ఎంటీ కాలనీ కల్లు కాంపౌండ్‌ను సీజ్ చేసి, వ్యాపార అనుమతులను వెంటనే రద్దు చేయాలని అభ్యర్థించారు.

చెట్లు లేకుండా కల్లు... పరీక్షించకుండానే విక్రయాలు

- హైదరాబాద్ చుట్టపక్కల నాలుగు ఉమ్మడి జిల్లాల్లో తాడి చెట్లేలేవు
- ఇతర జిల్లాల నుంచి లైసెన్స్‌లు
- పట్టించుకోని ఆబ్కారీ శాఖ

హైదరాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఒక్క తాటి చెట్టు లేదు.. నగరానికి చుట్టుపక్కల నాలుగు ఉమ్మడి జిల్లాల్లోనూ అదే పరిస్థితి అని ఎక్సైజ్‌శాఖ లెక్కలు చెబుతున్నాయి. అయినా.. రోజూ లక్షల లీటర్ల కల్లు విక్రయాలు జరుగుతున్నాయి. ఆ కల్లు ఎక్కడిది అంటే.. ఇతర జిల్లాల నుంచి తెస్తామంటూ లైసెన్స్‌లు పొంది విక్రయిస్తున్నది. కానీ.. ఆ జిల్లాల్లోనూ స్థానికంగానే ఎక్కువగా అమ్ముడుపోతుండటంతో.. మత్తు కోసం మోతాదుకు మించి హానికరమైన రసాయనాలు కలిపి ఇక్కడ కల్తీ కల్లు తయారు చేస్తున్నారు. మామూలుగా అయితే ఎక్సైజ్ శాఖ అధికారులు పరీక్షించిన తర్వాతే కల్లు విక్రయించాలని నిబంధనలు చెబుతున్నా.. అదంతా తూతూమంత్రంగానే సాగుతోంది. దీంతో తెలంగాణలో కల్తీ కల్లు ఏటా వందల కోట్ల రూపాయల వ్యాపారంగా మారి అనేక మంది ప్రాణాలను బలి తీసుకుంటోంది. నాయకులు, ప్రజాప్రతినిధుల సిండికేట్‌గా మారి కల్తీ కల్లు వ్యాపారం చేస్తున్నారనే విమర్శలున్నాయి.

ఇదీ లెక్క...

రాష్ట్రంలో 4,064 తాటి సహకార సంఘాలు (టీసీఎస్) ఉండగా.. వాటి పరిధిలో 4697 కల్లు తయారీ కేంద్రాలున్నాయి. 1,95,391 మంది సభ్యులున్నారు. ఇక తాటిచెట్టుపైన కల్లు తీసి.. ఆ చెట్టుకిందనే విక్రయించుకోవడానికి ప్రభుత్వం ట్రీ ఫర్ ట్రేడ్ (టీఎఫ్‌టీ) లైసెన్స్ ఇస్తుంది. ఆ లెసెన్సును ఆధారంగా చేసుకుని.. నిబంధనలకు విరుద్ధంగా కల్లు తయారీ కేంద్రాల నుంచి తీసుకెళ్లి ఇతర ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. రాష్ట్రంలో ఇలాంటి లైసెన్స్‌లు పొందిన వారు 29,272 మంది ఉండగా.. వారు 3,541 దుకాణాలు నడుపుతున్నారు. కల్లు విక్రయానికి డిమాండ్ అధికంగా ఉండటంతో ఉమ్మడి ఆదిలాబాద్, హైదరాబాద్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, మెదక్, నల్గొండ, ఖమ్మం జిల్లాల్లో కల్తీ కల్లు తయారీ కేంద్రాలు అధికంగా విస్తరించాయి. ఒక్క తాటి, ఈత చెట్టు కూడా కనిపించని రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో 100కు పైగా కల్లు విక్రయ కేంద్రాలు ఉన్నాయి. ఇలా లెక్కకు మిక్కిలిగా కల్లు దుకాణాలకు లైసెన్స్‌లు మంజూరు చేస్తున్న ఎక్సైజ్‌శాఖ ఆ తర్వాత ఎంత మాత్రం తనిఖీలు చేయట్లేదు. గత పదేళ్లుగా కల్లు దుకాణాలపై ఎక్సైజ్ శాఖ చేసిన దాడుల సంఖ్యను పరిశీలిస్తే.. ఆ సంఖ్య కూడా భారీగా తగ్గింది. అదే సమయంలో.. కల్తీ కల్లు విక్రయాలకు రోజురోజుకూ డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో.. హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో డైజీపాం తయారు చేసే పరిశ్రమలు పుట్టగొడుగుల్లా పెరిగాయి. వాటి నుంచి వచ్చే ఉత్పత్తులు ఎక్కడికి వెళుతున్నాయనేదానిపై కూడా అధికారుల నిఘా లేకుండా పోయింది.

కల్లు కాదది.. గరళమే

- క్లోరల్ హైడ్రేట్, అల్ప్రాజోలం, డైజీఫాం కలిపిన కల్లుతో తీవ్ర హాని
- నాడీ వ్యవస్థపైన, శరీరంలోని కీలక అవయవాలపైన ప్రభావం
- వెంటనే చికిత్స అందించకపోతే చనిపోయే ముప్పు: వైద్యులు



హైదరాబాద్ సిటీ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): చెట్టు నుంచి తీసిన కల్లు యథాతథంగా తాగితే కొంతమందికి కిక్కు రాదు. దీంతో.. బాగా మత్తు రావడానికి కల్లు కాంపౌండ్ల నిర్వాహకులు క్లోరల్ హైడ్రేట్, అల్ప్రాజోలం, డైజీపాం వంటి రసాయనాలను కలుపుతున్నారు. వాటిని కలిపిన కల్లు విషంతో సమానమేనని.. దాన్ని తాగిన వెంటనే.. ఆయా రసాయనాలు తాగినవారి ఆరోగ్యంపై క్షణాల్లో ప్రభావం చూపించడం మొదలవుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. నరాలు, మెదడు, కిడ్నీ, ఊపిరితిత్తులు, కాలేయం, గుండె వంటి కీలక అవయవాల పనితీరును అవి దెబ్బతీస్తాయని.. కల్తీ కల్లు మోతాదు ఎక్కువైతే బాధితులు కోమాలోకి వెళ్లే ప్రమాదం కూడా ఉంటుందని.. వెంటనే చికిత్స అందించకపోతే వారి ప్రాణాలకే ముప్పు వాటిల్లుతుందని చెబుతున్నారు.

కంటి చూపు మసకతో మొదలై కోమా వరకు ..

ప్రమాదకరమైన రసాయనాలు కలిపిన కల్తీ కల్లు తొలుత కంటి చూపుపై ప్రభావం చూపుతుంది. చూపు మసకగా మారుతుంది. కల్తీ కల్లు తాగినవారిలో ఇది మొదటి లక్షణంగా గమనించాలి. ఎక్కువ మోతాదులో మిథైల్ ఆల్కహాల్ రక్తంలో కలవడంతో.. వారి మెదడుపై ప్రభావం పడుతుంది. ఈ దశలో ఫిట్స్ రావడం, మానసిక స్థితి కోల్పోవడం, పిచ్చిగా వ్యవహరించడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. సమయం గడిచే కొద్దీ సమస్య తీవ్రత పెరిగి కోమాలోకి జారుకుంటారు. కల్తీ కల్లులో ఉన్న రసాయనాలు కిడ్నీలను దెబ్బతీస్తాయి. దీంతో డయాలసిస్ చేయాల్సి ఉంటుంది. ఒక్కసారి కోమాలోకి వెళితే వారిని సాధారణ స్థితికి తీసుకురావడం క్లిష్టంగా మారుతుంది. మిథైల్ ఆల్కహాల్ వల్ల అయోమయ స్థితికి చేరుకుంటారు. కడుపులో యాసిడ్ నిల్వలు పెరగడం వల్ల శ్వాస వేగం పెరిగి గుండె కొట్టుకోవడంలో మార్పులు వస్తాయి. లక్షణాలను గుర్తించి బాధితులను ఎంత త్వరగా ఆస్పత్రికి తరలిస్తే అంత మంచిది.

- డాక్టర్ దుష్యంత్ జాస్తి, సీనియర్ న్యూరాలజిస్ట్, స్టార్ ఆసుపత్రి

ఊపిరితిత్తులపై ప్రభావం

క్లోరల్ హైడ్రేట్, అల్ప్రాజోలం, డైజీపాం వంటి సైకోయాక్టివ్ మందులతో ఆరోగ్యంపై చెడు ప్రభావం ఉంటుంది. వీటిని వినియోగించడానికి అనుమతులు లేవు. ఎక్కువ మోతాదులో కల్తీ కల్లు తగ్గిన వారు వెంటనే అపస్మారక స్థితికి చేరుకుంటారు. కడుపులో ఆమ్లస్థాయిలు పెరిగి జీర్ణ వ్యవస్థలో మార్పులు చోటు చేసుకుంటాయి. కడుపులో గ్యాస్ పెరిగి వాంతులు అవుతాయి. వాంతులు అయ్యే సమయంలో బాధితులు స్పృహలో లేకపోవడంతో వాంతి ఊపిరితిత్తుల్లోకి వెళ్లే అవకాశముంది. కల్తీ కల్లు తాగి కోమాలోకి వెళితే వెంటనే వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స అందించాలి.

- డాక్టర్ రోహన్ రెడ్డి, గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ , కిమ్స్ సన్‌షైన్ ఆసుపత్రి

నేడు మళ్లీ సిట్ ముందుకు ప్రభాకర్‌రావు?

- ఫోరెన్సిక్ ల్యాబ్‌కు ల్యాప్‌టాప్, మొబైల్ ఫోన్
- ఎంపీ రఘునందన్‌రావుకు మరోసారి పిలుపు

హైదరాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో బాధితుల నుంచి వాంగ్మూలాల సేకరణ చాలా వరకు పూర్తి కావడంతో ట్యాపింగ్ సూత్రధారి ప్రభాకర్‌రావును గురువారం మరోసారి విచారణ చేయడానికి సిట్ అధికారులు సన్నద్ధమైనట్లు తెలుస్తోంది. గత విచారణలో ప్రభాకర్‌రావు నుంచి స్వాధీనం చేసుకున్న ఒక లాప్‌ట్యాప్, ఒక ఫోన్‌ను ఫొరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీకి సిట్ అధికారులు పంపారు. ప్రభాకర్‌రావు రెండు ఫోన్లను ఉపయోగిస్తుండగా ఒక ఫోన్‌ను మాత్రమే అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మరో ఫోన్ ప్రస్తుతం తన వద్ద లేదని, దానిని అమెరికాలో మర్చిపోయానని ప్రభాకర్‌రావు చెబుతున్నట్లు సమాచారం. ఆఫీసుకు సంబంధించిన ఫోన్ అధికారులకు అందగా.. వ్యక్తిగత ఫోన్ ఇంకా అందలేదని తెలుస్తోంది. స్వాధీనం చేసుకున్న ఫోన్లో డేటా డిలీట్ అయి ఉండటంతో ల్యాబ్‌లో నిపుణుల ద్వారా డేటా రిట్రీవ్ చేయడానికి అధికారులు ప్రయత్నిస్తున్నారు. మరోవైపు బీజేపీ ఎంపీ రఘునందన్‌రావుకు సిట్ అధికారులు ఫోన్ చేసి మరోసారి విచారణకు రావాలని కోరారు. అయితే, తన కాలికి శస్త్ర చికిత్స జరిగినందున ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నట్లు సిట్ అధికారులకు ఆయన తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో సిట్ బృందం, ఇటీవలే రఘునందన్ స్టేట్‌మెంట్‌ను తీసుకున్న సంగతి తెలిసిందే. యశోదా ఆస్పత్రికి వచ్చిన ప్రత్యేక బృందం, సుమారు రెండు గంటల పాటు రఘునందన్‌రావు ఇచ్చిన వివరాలను తీసుకుందని పార్టీ వర్గాలు తెలిపాయి.

రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం

దరఖాస్తు గడువు 12 వరకు పొడిగింపు

హైదరాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా సింగరేణి సంస్థ ప్రారంభించిన రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయ హస్తం పథకానికి దరఖాస్తుల స్వీకరణ గడువును ఈనెల 12 వరకు పొడిగించినట్లు సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం ద్వారా తెలంగాణ నుంచి సివిల్స్ ప్రిలిమ్స్ పరీక్షలో ఉత్తీర్ణులై... మెయిన్స్‌కు సన్నద్ధమవుతోన్న అభ్యర్థులకు ఒక్కొక్కరికి లక్ష రూపాయల ఆర్థిక ప్రోత్సాహకాన్ని అందిచనున్నట్లు తెలిపారు. దరఖాస్తుల స్వీకరణకు గతంలో ఇచ్చిన గడువు ఈనెల 7వ తేదీతో ముగిసింది. అయితే అభ్యర్థుల నుంచి వస్తోన్న విజ్ఞప్తుల మేరకు గడువును పెంచడానికి నిర్ణయించినట్లు సంస్థ సీఎండీ తెలిపారు.

స్థానిక ఎన్నికలు... బీసీ రిజర్వేషన్లు!

- నేడు క్యాబినెట్ భేటీలో ప్రధానంగా వీటిపైనే చర్చ
- గవర్నర్ ద్వారా ఆర్డినెన్స్, జీవో జారీకి అవకాశం!
- బనకచర్ల, యువవికాసంపైనా చర్చ

హైదరాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రివర్గం గురువారం భేటీకానుంది. సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశంలో పలు అంశాలను క్యాబినెట్ చర్చించనుంది. ప్రధానంగా స్థానిక సంస్థల ఎన్నికలు, బీసీ రిజర్వేషన్ల అంశంపై చర్చించనున్నారు. హైకోర్టు ఇచ్చిన గడువు మేరకు వారం రోజుల్లో స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను ప్రభుత్వం ఖరారు చేయాల్సి ఉంది. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం అన్ని వర్గాల రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదు. అయితే బీసీలకు విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం ఇటీవలే అసెంబ్లీలో బిల్లును ఆమోదించి, కేంద్ర ప్రభుత్వానికి పంపించింది. ఇది కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో బీసీ రిజర్వేషన్లను ఎలా అమలు చేయాలన్న అంశంపై సర్కారు మల్లగుల్లాలు పడుతోంది. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో గవర్నర్ ద్వారా ఆర్డినెన్స్‌ను జారీ చేయించి, జీవోను తీసుకురావాలని యోచిస్తోంది. దీనిపై క్యాబినెట్‌లో చర్చించి, ఒక నిర్ణయానికి రానున్నారు. వివాదాస్పదమైన బనకచర్ల ప్రాజెక్టుపైనా క్యాబినెట్‌లో చర్చించనున్నారు. నికరజలాలు కాకుండా సముద్రంలో వృథాగా కలిసే వరద నీటిని తెలుగురాష్ట్రాలు వినియోగించుకుందామంటూ ఏపీ సీఎం చంద్రబాబు సూచిస్తున్నారు. అయితే గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు వల్ల తెలంగాణ ప్రయోజనాలు దెబ్బతింటాయని రాష్ట్ర ప్రభుత్వం వాదిస్తోంది. ఈ నేపథ్యంలో బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకోవడంపై క్యాబినెట్‌లో చర్చించనున్నారు. రాజీవ్‌యువ వికాసం పథకంపైనా చర్చ జరిగే అవకాశముంది. దీని కింద నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు స్వీకరించినా లబ్ధిదారులను ఖరారు చేయలేదు. వైద్య కళాశాలలకు మౌలిక సదుపాయాల కల్పన అంశం కూడా చర్చకు రానుంది.

300 తీర్మానాల్లో ఎన్ని అమలయ్యాయి?

గత క్యాబినెట్ సమావేశాల్లో చర్చకు వచ్చిన అంశాలను కూడా గురువారం జరగనున్న సమావేశంలో చర్చించనున్నారు. తీసుకున్న నిర్ణయాలు, వాటి అమలు తీరును సమీక్షించనున్నారు. ఈ మేరకు క్యాబినెట్ సమావేశాల్లో తీసుకుంటున్న నిర్ణయాలను ఎప్పటికప్పుడు సమీక్ష చేసి వాటి అమలును పర్యవేక్షించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగానే ఇప్పటి వరకు మంత్రి మండలి తీసుకున్న సుమారు 300లకుపైగా నిర్ణయాలను ఆయా శాఖల వారీగా ఎంత మేర అమలు చేశారనే దానిపై బుధవారం ప్రభుత్వం నివేదిక తెప్పించుకున్నట్లు తెలిసింది. సచివాలయం, మంత్రివర్గస్థాయిలో నిర్ణయాలు, ఆదేశాలు 90శాతంపైగా అమలైనా.. జిల్లా స్థాయిలో అమలు ఆశించిన పురోగతి కనిపించడం లేదని ఉన్నతాధికారులు గుర్తించారు. ఈ వివరాలపై నేటి క్యాబినెట్ సమావేశంలో ప్రత్యేకంగా చర్చించే అవకాశమున్నట్లు సమాచారం.

తెలంగాణ రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ లిమిటెడ్
ఇ.నం:3-6-184, వీధి నం:17, ఉర్దూగల్లి, హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029
టెండరు ప్రకటన
నం.01/TGRSCL/Compound wall/GJLRM/2025 తేది08.07.2025
తెలంగాణ రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ లిమిటెడ్‌లో దిగువ పనుల కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫామ్ ద్వారా టెండర్లు కోరుచున్నారు.
పని వివరణ: తెలంగాణలోని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా, కుత్బుల్లాపూర్ (మం), సాహిరా టౌన్‌షిప్, గాజులరామారం (గ్రా) వద్ద ఉన్న సర్వే నం. 79/1లో విస్తీర్ణం ఎ.29.16 ప్రీ-ఫ్యాబ్రికేటెడ్ ప్రహరీ గోడ ఏర్పాటు.
ECV: రూ.27,01,531/-. ఇతర వివరాలు వెబ్‌సైట్ https://tender.telangana.gov.in లో చూడవచ్చును.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, TGRSCL, హైదరాబాద్
DIPR RO No.4769-PP/CL/ADVT/1/2025-26, Dt.09.07.2025

దక్షిణ మధ్య రైల్వే
మమ్మల్ని X @ SCRailwayindia అనుసరించండి. ద.మ.రైల్వేలోని టెండరు ప్రకటన వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in పై చూడగలరు.
బహిరంగ వేలం
భారత రాష్ట్రపతి తరపున, రామగుండం రైల్వే స్టేషన్ వద్ద పేర్చబడినట్టి సుమారు 700 టన్నుల బరువుగల అన్‌క్లెయిమ్డ్ అన్‌లోడెడ్ బొగ్గు 17 జూలై 2025న 11.30 గం.లకు బహిరంగ వేలం ద్వారా విక్రయించబడును. సవివరమైన వేలం ప్రకటన కొరకు మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in లో "Tenders" ను చూడగలరు.
A1030 సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, సికింద్రాబాద్

పురపాలక సంఘం కార్యాలయము,తెల్లాపూర్, సంగారెడ్డి జిల్లా
నోటీసు నెం.ఇ1/13/2025-26, **కొటేషన్ నోటీస్** తేది:09.07.2025
1) తెల్లాపూర్ మున్సిపాలిటీ, సంగారెడ్డి జిల్లా కొటేషన్ నోటీస్ నం.ఇ1/14/2025-26, తేది: 09.07.2025, ద్వారా తెల్లాపూర్ పురపాలక సంఘంకు (1) ఓపెన్ జిమ్ ఎక్విప్‌మెంట్ 2) ఏవెన్యూ ప్లాంట్స్ మరియు 3) నర్సరీ ప్లాంట్స్ 4) వివిధ రకాల ఫర్నీచర్ 5) నేమ్ బోర్డ్స్/ సైన్ బోర్డ్స్ 6) రబ్బర్ స్పీడ్ బ్రేకర్స్ కొరకు కొటేషన్ కోరబడుచున్నవి. కొటేషన్ స్వీకరణకు చివరి తేది: 11.07.2025, మ.3.30గం.వరకు. అదే విధముగా పూర్తి వివరములకు కమిషనర్ తెల్లాపూర్ 8712693461ను సంప్రదించగలరు. సం/-మునిసిపల్ కమిషనర్ తెల్లాపూర్ మున్సిపాలిటీ
DIPR RO No.4791-PP/CL/ADVT/1/2025-26,Dt.09.07.2025

తెలంగాణ ప్రభుత్వం
ప్రిన్సిపల్ కార్యాలయం, గాంధీ వైద్య కళాశాల, సికింద్రాబాద్
RC.No.5446/E1 & E4/GMC/SEC/2025 **కాంట్రాక్టు నియామకం కోసం నోటిఫికేషన్** తేది: 09.07.2025
G.O.Rt.No.1085 Finance (HRM.VII) శాఖ తేది 29.06.2025 ప్రకారం 31.03.2026 వరకు లేదా వాస్తవిక అవసరం మేరకు పూర్తిగా తాత్కాలిక ప్రాతిపదికన కాంట్రాక్టు/ గౌరవ వేతనం ప్రాతిపదికన ప్రొఫెసర్లు (02), అసిస్టెంట్ ప్రొఫెసర్లు (72), సీనియర్ రెసిడెంట్స్ (70), సివిల్ అసిస్టెంట్ సర్జన్స్ (10) మరియు ట్యూటర్లు (06) ఉద్యోగాల నియామకం కోసం అర్హతగల అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరబడుచున్నవి. దరఖాస్తును ప్రిన్సిపల్ కార్యాలయం, గాంధీ వైద్య కళాశాల, సికింద్రాబాద్ వద్ద 10.07.2025 నుండి 17.07.2025 ఉ.11 గం. నుండి సా.5 గం. వరకు దాఖలు చేయవలెను. దరఖాస్తు దాఖలుకు చివరి తేది 17.07.2025 సా. 5 గం. వరకు. మరింత సమాచారం మరియు దరఖాస్తు డౌన్‌లోడ్ కోసం దర్శించండి www.gmcsecunderabad.org
సం/- ప్రిన్సిపల్/ అడిషనల్ DME, గాంధీ వైద్య కళాశాల, సికింద్రాబాద్ సం/- చైర్‌పర్సన్, జిల్లా కలెక్టర్ & మెజిస్ట్రేట్, హైదరాబాద్ జిల్లా/ డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ
DIPR RO No.4785-PP/CL/ADVT/1/2025-26, తేది: 09.07.2025

hmda
హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ
స్వర్ణజయంతి కమర్షియల్ కాంప్లెక్స్, అమీర్‌పేట్, హైదరాబాద్-82
బహిరంగ ప్రకటన
ప్రణాళికా శాఖ - ఫైల్ నం.004258/BP/HMDA/1288/SMD/2025
ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా, మెస్సర్స్ శ్రీ గ్రీన్ సిటీ సమర్థ్ ఎస్టేట్స్ & ప్రాపర్టీస్ ఎల్ఎల్‌పి వారు రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం మండలం, ఫిరోజ్‌గూడ గ్రామంలోని సర్వే నం.49/పి & 50/పి లో 21140.55 చ.మీ.ల విస్తీర్ణంలో ఖాళీ ప్లాట్లతో తుది లేఅవుట్ ఆమోదం కోసం దరఖాస్తు చేసుకున్నారు మరియు ఫైల్ నం.015188/SMD/LT/U6/HMDA/12092018, తేది:04.05.2019 మరియు లేఅవుట్ పర్మిట్ నం. 000106/LO/Plg/HMDA/2019 తేది: 04.05.2019 ప్రకారం గతంలో జారీ చేయబడిన ముసాయిదా లేఅవుట్‌కు కొన్ని మార్పులు చేయబడినవి అనగా ప్లాట్ నం.1, 3, 4, 5, 6 లో విస్తీర్ణం సవరించబడినది, ప్లాట్ నం.6 కు ఆనుకొని ఉన్న ఖాళీ ప్రదేశం/యుటిలిటీ ఏరియాలను పెంచి తుది లేఅవుట్‌లో ప్లాట్ ఏరియాను 3 నుండి 6 కు తగ్గించి, ప్లాట్ నం.36, 37, 60 లకు ఆనుకొని ఉన్న ఖాళీ ప్రదేశ ఏరియాను తగ్గించి మరియు ప్లాట్ నం.6 ఆనుకొని ఉన్న ఖాళీ ప్రదేశం/యుటిలిటీలో OHT కు బదులుగా సంప్‌ను నిర్మించడం వంటి మార్పులు.
అందువలన, రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం మండలం, ఫిరోజ్‌గూడ గ్రామంలోని సర్వే నం.49/పి & 50/పి లో లేఅవుట్ అనుమతి పొందిన ప్లాట్ యజమానులు / కొనుగోలుదారులు / ఒప్పందదారులు ఈ ప్రకటన ప్రచురించబడిన తేది నుండి 15 రోజులలోపు ఈ కార్యాలయానికి తమ అభ్యంతరాలు/సూచనలను లిఖితపూర్వకంగా దాఖలు చేయవచ్చును. పైన పేర్కొన్న వ్యవధిలో ఎటువంటి అభ్యంతరాలు/సూచనలు అందనిచో, సవరించబడిన డ్రాఫ్టు లేఅవుట్ అనుమతి కోసం దరఖాస్తుదారుడి అభ్యర్థనను ఈ కార్యాలయంలో అందుబాటులో ఉన్న ప్రామాణిక పత్రాల ఆధారంగా పరిశీలించబడును.
సం/- డైరెక్టర్ (ప్లానింగ్)-II, HMDA
DIPR RO No.4794-PP/CL/ADVT/1/2025-26, Dt.09.07.2025

भा. कृ. अनु. प. - राष्ट्रीय कृषि अनुसंधान प्रबंध अकादमी
राजेन्द्रनगर, हैदराबाद-500030, तेलंगाना, भारत
ICAR - నేషనల్ అకాడమి ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్
(ISO 9001: 2015 ధ్రువీకరించబడినది)
రాజేంద్రనగర్, హైదరాబాద్ - 500030, తెలంగాణ, ఇండియా.
https://naarm.org.in, ఫోన్ నం.040-24581382/406
F.No.2-523/25-A.I 09 జూలై 2025
ఉద్యోగ ప్రకటన
కాంట్రాక్చువల్ మరియు స్వల్పకాల ప్రాతిపదికన పూర్తిగా తాత్కాలికంగా యంగ్ ప్రొఫెషనల్స్ (04 ఉద్యోగాలు) నియామకం / అద్దెకు తీసుకొనుటకు వాక్-ఇన్-ఇంటర్వ్యూలు ఈ అకాడమి వద్ద నిర్వహించబడును. అర్హతా ప్రమాణాలు, నియమ నిబంధనలు మరియు ఇంటర్వ్యూ తేది & సమయం మొ.వాటికి సంబంధించిన తదుపరి వివరాలు కొరకు ఆసక్తిగల అభ్యర్థులు ICAR-NAARM వెబ్‌సైట్ https://naarm.org.inను 11.07.2025న లేదా ఆలోగా దర్శించగలరు.
డైరెక్టర్

मौलाना आज़ाद नेशनल उर्दू युनिवर्सिटी مولانا آزاد نیشنل اردو یونیورسٹی
MAULANA AZAD NATIONAL URDU UNIVERSITY
A Central University under Ministry of Education
Government of India
అడ్మిషన్ నోటిఫికేషన్ 2025-26
ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ద్వారా నిధులు మంజూరు చేయబడిన విశ్వేశ్వరయ్య Ph.D పథకం క్రింద Ph.D. మరియు పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్
విద్యాసంవత్సరం 2025-26 కొరకు హైదరాబాద్ క్యాంపస్ వద్ద CS & IT శాఖ, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ క్రింద కృత్రిమ మేధస్సు మరియు మెషీన్ లెర్నింగ్, మరియు పోస్ట్ డాక్టోరల్ ప్రోగ్రామ్‌లో Ph.D ప్రోగ్రామ్ (ఫుల్ టైమ్ మరియు పార్ట్ టైమ్) స్పెషలైజింగ్‌లో అడ్మిషన్ కొరకు ఆన్‌లైన్ దరఖాస్తులు కోరబడుతున్నవి.
పూర్తి చేసిన దరఖాస్తు ఫారాల దాఖలుకు ఆఖరి తేది 31.07.2025.
దరఖాస్తులు https://manuucoe.in/regularAdmission/.లో ఆన్‌లైన్‌లో మాత్రమే స్వీకరించబడతాయి. అభ్యర్థులకు సాధారణ సూచనలు మరియు ఆన్‌లైన్ దరఖాస్తు ఫారాలు ఆఖరి దాఖలు తేదీ వరకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో లభిస్తాయి. తదుపరి వివరాలు లేదా ఏవేని స్పష్టీకరణల కొరకు vphd@manuu.edu.in కు ఇమెయిల్ చేయగలరు. అర్హత కొరకు వెబ్‌సైట్ manuu.edu@inను చూడగలరు.
09 జూలై 2025 manuu.edu.in నోడల్ ఆఫీసర్ విశ్వేశ్వరయ్య పథకం, MANNU

Government of Andhra Pradesh
Swachha Bharat Mission (Urban)
MA & UD Department
Swachha Andhra Corporation
e-Procurement Tender Notice

Sl. No.	NIT No.	Name of Work
1.	NIT No.12,13, 14 & 15/SAC/ SBM(U)/CE/UWM/ 2025-26	Investigation Survey Design and Construction of Sewage Treatment Plant in the State of Andhra Pradesh with Open Technology including 02 two years Defect Liability Period Excluding Cost of O&M (4 Works) in various ULBs
2.	NIT No.6,7,8,9,10 & 11/SAC/SBM(U) /CE/SWM/E-Autos /2025-26	Selection of Service providers towards Deployment & Operations of E-Autos Tippers for Door-to-Door Waste Collection in ULBs in the State of Andhra Pradesh - 06 Packages in various ULBs.

The above bid Sl.No.01 can be downloaded from 09.07.2025 11:00 AM to and due date submission of Bid is on 23.07.2025 upto 5.00 PM. And the above Sl.No.2 downloaded from 07.07.2025 and due date submission of bid is on 21.07.2025. Please refer to www.ap.eprocurement.com in for details.
Sd/- Managing Director, SAC, Vijayawada
DIPR R.O.No.4251PP/CL/ADVT/1/1/2021-22, Dt.09.07.2025

MSME-TOOL ROOM, HYDERABAD
CENTRAL INSTITUTE OF TOOL DESIGN
(A Government of India Society, Ministry of MSME)
Balanagar, Hyderabad, PIN-500 037.
Admission to Master of Engineering (M.E.) Courses-2025
Central Institute of Tool Design (CITD) an ISO 9001:2015, 14001:2004 & 50001:2011 certified premier technical training institution under Ministry of MSME, Govt. of India, established in1968; provides specialised training courses in Tool Design & Manufacturing, CAD, CAM, CAE, VLSI, Embedded Systems, Electronics, Mechatronics, Robotics and Industry 4.0 at various levels such as Certificate, Diploma, Post Diploma, Postgraduate Diploma and M.E. invites applications for admission to the following courses for the academic year 2025-26.
In Collaboration with
The University College of Engineering (Autonomous), a premier Institution of the Osmania University, Hyderabad (NAAC A+ Grade).

S. No.	Course Details	Eligibility for Admission	Age Limit	Duration of Study
1	M.E. Tool Design (METD)	B.E./B. Tech. in Mechanical/Production/Mechatronics or equivalent from AICTE approved institution. Minimum of 55% marks in the qualifying examination.	45 years	2 Years (4 Semester)
2	M. E. Mechatronics	B.E./B.Tech in Mechanical/ECE/EEE/EIE/ Mechatronics / Automobile/Aeronautical Engineering or equivalent from AICTE approved institution. Minimum of 55% of marks in the qualifying examination.		

How to Apply Candidates may apply online at CITD website under the link ‘M.E. Admissions- 2025’ or Scan the QR code for online application.
Application Fee ₹1500/- for General Category and ₹750/- for SC/ST Category.
Mode of Payment Through link provided in online application format (Detailed steps for online payment can be found from prospectus).
URL : https://tinyurl.com/citdme2025
Important Dates :
* Commencement of Online Application : 07-07-2025 (Monday) from 11:00 AM
* Closing of Online Application : 25-08-2025 (Monday) till 05:00 PM
* Date of Entrance Exam (Tentative) : 29-08-2025 (Friday)
* Centre for Entrance Examination : Hyderabad
Further details can be obtained from prospectus available on Institute website ‘www.citdindia.org’ under the link "M.E. Admissions - 2025"
Contact Details : Admission Desk at Diploma Block Ph : 9502405170, 040-29561795 E-Mail : training@citdindia.org

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

యుద్ధోన్మాదుల 'శాంతి'!

అనేక యుద్ధముల నారియు తేరిన అమెరికా అధ్యక్షుడే నోబెల్ శాంతిని ఆశిస్తుంటే, తామూ అర్హులమేననీ, తమకూ ఓ నోబెల్ దక్కితే బాగుండునని మిగతావారికీ అనిపించడం సహజం. తాను అధికారంలోకి వచ్చిన మరుక్షణంనుంచే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, అది నియమించిన లెఫ్టినెంట్ గవర్నర్ తనను రాచిరంపానపెట్టడం ఆరంభించారని, అన్ని ఒత్తిళ్ళనూ ఎదుర్కొని ఢిల్లీని అద్భుతంగా తీర్చిదిద్దినందుకు తనకు పరిపాలనలో నోబెల్ దక్కాల్సిందేనంటున్నారు ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్. 'మీకంటే ఈ అవార్డుకు అర్హులెవరు?' అంటూ ఇజ్రాయెల్ ప్రధాని బెంజమీన్ నెతన్యాహూ సోమవారం అమెరికా అధ్యక్షుడిని కీర్తించిన దృశ్యం కేజ్రీవాల్ మీద బాగా ప్రభావం చూపినట్టుంది. తన ఎదురీతలూ అర్హతల గురించి కేజ్రీవాల్ చెప్పుకున్న విషయాలను అటుంచితే, శ్వేతసౌధంలో భోజనవేళ బల్లకు ఆవల ఉన్న అమెరికా అధ్యక్షుడికి నోబెల్ శాంతి నామినేషన్ పత్రాన్ని అందిస్తూ నెతన్యాహూ గద్గదస్వరంతో ఇచ్చిన ఆ సందేశం, ఆశ్చర్యం, ప్రేమ ఒలుకుతున్న మొఖంతో ట్రంప్ ఆ పత్రాన్ని స్వీకరించడం ప్రపంచం అంతసులభంగా మరిచిపోలేని ఓ అద్భుత దృశ్యం.

తన ఎదురుగా కూర్చున్న ఆ శాంతిదూత ఈ ప్రపంచానికీ, మానవాళికీ చేసినదేమిటో చక్కగా వివరించారు నెతన్యాహూ. ఈయన ఒక దేశం తరువాత ఒకదేశం, మరోదేశం, ఇంకో దేశంలో వరుసపెట్టి శాంతిస్థాపనలు చేసుకుంటూపోతున్నారు... అధ్యక్షా, ఇదిగో నేను మీ పేరు ప్రతిపాదిస్తూ నోబెల్ ప్రైజ్ కమిటీకి పంపిన లేఖ. మీరు ఇందుకు సంపూర్ణంగా అర్హులు, అది మీకే చెందాలి అంటూ నెతన్యాహూ ఆ లేఖను ట్రంప్‌కు అందించారు. కొద్దివారాల కిందటే ఇరాన్‌మీదకు బీటూ స్టెల్త్ బాంబర్లతో సహా వందలాది యుద్ధవిమానాలను పంపిన అమెరికా అధ్యక్షుడు ఈ ప్రేమకు కరిగిపోయారు. మదర్ తెరీసా, నెల్సన్ మండేలా వంటివారు అందుకున్న అవార్డుకు తనను ఇజ్రాయెల్ పాలకుడు ప్రతిపాదించినందుకు కదిలిపోయారు. 'నీనుంచి ఈ ప్రతిపాదన రావడం ఎంతో అర్థవంతంగా ఉంది' అని నెతన్యాహూను ఉద్దేశించి ఆయన ఏ అర్థంలో అన్నారో తెలియదు కానీ, విశ్లేషకులు మాత్రం నానార్థాలూ తీస్తున్నారు. గాజాలో పాలస్తీనియన్లను ఊచకోతకోస్తున్న ఓ పాలకుడు, ఆ మారణకాండకు ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ సమస్తవిధాలా సాయపడుతున్న మరో యుద్ధపిపాసిని శాంతిదూతగా ప్రతిపాదించడం అందరికీ వింతగానే ఉంది మరి. కానీ, ఇజ్రాయెల్ తన లక్ష్యాన్ని పరిపూర్తి చేయడం కోసం తన వద్ద ఉన్న సమస్త ఆయుధాలనూ అందిస్తానని మార్చిలోనే ప్రకటించి, అమెరికా పక్షాన ఇరాన్‌లోకి ఇజ్రాయెల్ చొరబడేట్టు చేసి, ఇజ్రాయెల్ పూర్తిచేయలేని ఆ ఆఖరుపనిని సైతం తానే స్వయంగా పూనుకొని చేసిన ట్రంప్ కంటే శాంతికి అర్హులెవ్వరని నెతన్యాహూకు అనిపించింది. ఆయుధాలనే కాదు, ఆకలిని కూడా అస్త్రంగా ప్రయోగించి, గాజానుంచి ఆఖరు మనిషిని కూడా తరిమికొట్టి, పూర్తిగా ఖాళీచేయించి, దానిని మధ్య ఆసియాలో మహాద్భుతమైన రిసార్టుగా మార్చాలన్న తన కలని నెరవేర్చబోతున్న నెతన్యాహూ కంటే అర్హులెవరుంటారని ట్రంప్‌కూ అనిపించింది.

ఇరాన్‌తో బరాక్‌ఒబామా కుదర్చుకున్న ఒక అంతర్జాతీయస్థాయి ఒప్పందం చక్కగా అమలవుతూ యావత్ ప్రపంచం ప్రశాంతంగా ఉన్న తరుణంలో, దానినుంచి తనదేశాన్ని తప్పించినవాడు ట్రంప్. మలివిడత రాకడలో మళ్ళీ తానే ఒప్పందం కోసం ఇరాన్‌మీద ఒత్తిడితెచ్చి, అనేక హెచ్చరికలూ బెదిరింపుల మధ్య చర్చలకు రప్పించి, అవి సజావుగా సాగుతున్న తరుణంలో వాటిని భగ్నం చేసిందీ ఆయనే. ఇరాన్ దగ్గర అణ్వాయుధాలు లేవని అమెరికా నిఘాసంస్థలే చెప్పినా ఇరాన్‌లోకి ఇజ్రాయెల్‌ను చొరబడేట్టు చేసి, అనంతరం తానే స్వయంగా బాంబులు కురిపించి ఇజ్రాయెల్ ప్రధాని దీర్ఘకాలిక ఆశయాన్నీ, ఉమ్మడి లక్ష్యాన్నీ ఎట్టకేలకు నెరవేర్చాడు. అమెరికా మాజీ అధ్యక్షుడు జో బైడెన్ ఇవ్వనంత మద్దతు నెతన్యాహూకు ట్రంప్ ఇచ్చాడు. ఇరాన్ అణుస్థావరాలు ముట్టుకోవద్దన్న గతకాలపు హద్దుల్ని కూడా ట్రంప్ చెరిపివేసి, కొన్ని ఆయుధాల సరఫరాల మీద ఉన్న ఆంక్షలను కూడా ఎత్తివేశాడాయన. తద్వారా పలు ఏకకాల యుద్ధాలతో తన రాజకీయమనుగడ కొనసాగించాలన్న నెతన్యాహూ రాజకీయ ఎజెండాకు కూడా ట్రంప్ సహకరించారు. హద్దుల్లేని ఈ అభిమానానికి నెతన్యాహూ ఆనందం అవధులు దాటివుంటుంది. అంతర్జాతీయ న్యాయస్థానం అరెస్టువారెంట్ జారీచేసిన ఒక వ్యక్తి చేతులమీదుగా అమెరికా అధ్యక్షుడు నోబెల్‌శాంతి ప్రతిపాదనను అందుకోవడం చూడముచ్చటగా ఉంది.

భారత పౌరుల ఓటుహక్కుపై దాడి

భారత గణతంత్ర రాజ్యంలో పుట్టిన, పుట్టబోయే ప్రతి భారత పౌరుడికి ఒక విలువైన ఆస్తి ఉన్నది. ఓటు హక్కే ఆ అమూల్య ఆస్తి. భారత పౌరుల సామూహిక ఓటు హక్కుల తొలగింపునకు మన పాలకులు ఇప్పుడొక సాహసోపేతమైన ప్రయత్నం చేస్తున్నారు. దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ – 'సర్')ను చేపట్టనున్నట్టు భారత ఎన్నికల సంఘం ప్రకటించింది. ఈ బృహత్ కార్యానికి తొలుత బిహార్‌లో శ్రీకారం చుట్టారు. ఆ తరువాత త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న రాష్ట్రాలలోను, ఆపై విశాల భారతదేశమంతటా ఆ ప్రత్యేక సమగ్ర సవరణను చేపట్టి పూర్తి చేస్తారు. ఈ ప్రత్యేక సమగ్ర సవరణ కచ్చితంగా భారత పౌరుల సామూహిక ఓటుహక్కుల తొలగింపే, సందేహం లేదు.

నోట్ బంది (పెద్ద నోట్ల రద్దు– డీమోనిటైజేషన్), దేశ్ బంది (కోవిడ్ ఆపత్కాలంలో లాక్‌డౌన్) గుర్తున్నాయా? ఇప్పుడు ఓటుబంది (సామూహిక ఓటు హక్కుల తొలగింపు)కే ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు పూనుకున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ ఉద్దేశం ఏమో గానీ ఈ ప్రక్రియ ప్రాథమికంగా లోపభూయిష్ఠమైనది, చాలా హానికరమైనది, నైతికంగా ఎంత మాత్రం సమర్థించలేనిది. 'సర్' పర్యవసానాలు భయానకంగా కనిపిస్తున్నాయా? ఆ ప్రతిపాదన వాస్తవికంగా లేదు. భయాందోళనలకు దారి తీసేదిగా ఉన్నది. దానిని నిశితంగా పరిశీలిద్దాం.

ప్రస్తుతమున్న ఓటర్ల జాబితాను పునఃపరిశీలించడం ద్వారా ప్రత్యేక సమగ్ర సవరణ ఎనాడో జరిగి ఉండవలసిన ప్రక్రియ అనే భావన చాలా మందిలో ఉన్నది. దీనిని పక్కన పెడదాం. బిహార్‌లో అటువంటి ప్రక్రియ ఆరు నెలల క్రితమే జరిగింది. లక్షలాది కొత్త ఓటర్ల పేర్లను చేర్చారు. దాదాపుగా అంతే సంఖ్యలో పాత ఓటర్ల పేర్లను తొలగించారు. చెప్పుకోదగ్గ ఫిర్యాదులు ఏవీ రాలేదు. అయితే ఎన్నికల సంఘం ఇప్పుడు ఆదేశించిన ప్రత్యేక సమగ్ర సవరణ పూర్తిగా కొత్త ప్రక్రియ. సరికొత్తగా ఆరంభించి పూర్తి చేసేది. ఓటర్ల జాబితాను కొత్తగా రూపొందిస్తారు. గతంలో ఎన్నడూ జరగనిది. సమగ్ర సవరణ పేరిట గతంలో ఓటర్ల జాబితా సవరణ జరిగేది. ఓటర్ల జాబితా కంప్యూటరీకరణతో 2003 తరువాత అటువంటి సవరణ ప్రక్రియను కొనసాగించలేదు. ఇప్పుడు ఎన్నికల సంఘం పూర్తిగా ఒక కొత్త ప్రక్రియను ప్రారంభించింది. ఈ కొత్త ప్రక్రియతో ఓటర్ల జాబితాలో తన పేరు ఉండేలా చూసుకునే బాధ్యత పూర్తిగా పౌరుడిదే. రాజ్యవ్యవస్థకు ఎంత మాత్రం సంబంధముండదు. జూలై 25లోగా పూర్తి చేసిన ఎన్యూమరేషన్ ఫామ్‌ను సమర్పించని వారి పేరు ముసాయిదా ఓటర్ల జాబితాలో ఉండదు. అలా ఉండేలా చూసుకోవలసిన బాధ్యత పూర్తిగా పౌరుడిదే. మరింత ఘోరమైన విషయమేమిటంటే ఓటర్ల జాబితాలో ఉండేందుకు అర్హత పొందాలంటే ప్రతి వ్యక్తీ తన భారత పౌరసత్వాన్ని ధ్రువీకరించే ప్రామాణిక పత్రాలు విధిగా సమకూర్చాలి. ఇది నిజానికి అనధికారిక జాతీయ పౌర పట్టికే (నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజెన్స్) అవుతుంది.



ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పూర్తిగా కొత్త ప్రక్రియ. సమగ్ర సవరణ పేరిట గతంలో ఓటర్ల జాబితా సవరణ జరిగేది. ఓటర్ల జాబితా కంప్యూటరీకరణతో 2003 తరువాత ఆ ప్రక్రియను కొనసాగించలేదు. కొత్త ప్రక్రియతో ఓటర్ల జాబితాలో తన పేరు ఉండేలా చూసుకునే బాధ్యత పూర్తిగా పౌరుడిదే. రాజ్యవ్యవస్థకు ఎంత మాత్రం సంబంధముండదు. మరింత ఘోరమైన విషయమేమిటంటే ఓటర్ల జాబితాలో ఉండేందుకు అర్హత పొందాలంటే ప్రతి వ్యక్తీ తన భారత పౌరసత్వాన్ని ధ్రువీకరించే ప్రామాణిక పత్రాలు విధిగా సమకూర్చాలి.

ప్రత్యేక సమగ్ర సవరణ అసలు ఉద్దేశాలను ఎన్నికల సంఘం చాలా తెలివిగా కప్పిపుచ్చుతోంది. అవేమిటో శోధిద్దాం. ఓటర్ల జాబితాలో ఉండే అర్హత పొందేందుకు అవసరమైన డాక్యుమెంటరీ రుజువులు చాలా తక్కువ సంఖ్యలో ఉన్నాయి. ఎన్నికల సంఘం ఉత్తర్వు స్పష్టంగా ఉన్నది: ప్రతి ఓటర్ ఎన్యూమరేషన్ ఫామ్‌ను ప్రస్తుత ఫోటో, సంతకాలు, కొన్ని మౌలిక వివరాలతో నింపి, పౌరసత్వ రుజువుతో సమర్పించాలి. 2003 నాటి ఓటర్ల జాబితాలో పేరు ఉన్నవారి (పేరు, నివాసం మారకుండా ఉంటే) కొత్త జాబితాలో స్థానం సంపాదించుకోవడం సులువవుతోంది. 2003 ఓటర్ల జాబితాలో తమ పేరు ఉన్న పేజీ కాపీని తమ ఎన్యూమరేషన్ ఫామ్‌తో జత చేసి ఇవ్వాలి. ఇది వారి పౌరసత్వానికి రుజువుగా పరిగణితమవుతుంది. 4.96 కోట్ల మందికి (ప్రస్తుతం ఓటర్ల జాబితాలో ఉన్న 63 శాతం మంది) ఈ దగ్గరి దోవను ఉపయోగించుకునేందుకు అర్హులు అని ఎన్నికల సంఘం పేర్కొంది. కాగా ఓటర్ల జాబితాలో ఉండేందుకు తమ అర్హతలను నిరూపించుకోవల్సినవారు 3 కోట్ల మంది కంటే తక్కువగా ఉంటారని పేర్కొంది. ఇదొక విచిత్ర వాదన అని, ఇందులో నిజం లేదని రాహుల్ శాస్త్రి నిర్ధారించారు (జూలై 1, 'డేటా పాయింట్', ది హిందూ). 2003 నుంచి మరణాల సంఖ్యను, వలసపోయిన వారి సంఖ్యను, నివాసం మారిన వారి సంఖ్యను ఎన్నికల సంఘం పరిగణనలోకి తీసుకోలేదని, తత్కారణంగా కొత్త ఓటర్ల జాబితాలో ఉండేందుకు తమ అర్హతలను నిరూపించుకోవల్సిన వారి సంఖ్య యథార్థంగా 3.16 కోట్లు అని రాహుల్ శాస్త్రి నిరూపించారు.


■ యోగేంద్ర యాదవ్

ప్రస్తుత ఓటర్ల జాబితాలోని 7.9 కోట్ల మందిలో 4.74 మంది పుట్టిన తేదీ, ఊరుకు సంబంధించిన రుజువులతో తమ పౌరసత్వాన్ని రుజువు చేసుకోవలసి ఉంటుంది. ఇటువంటి బాధ్యత ఉన్న వారిని మూడు తరగతులుగా వర్గీకరించవచ్చు. మొదటి తరగతివారు 38 సంవత్సరాలకు మించిన వయసు ఉన్నవారు (జూలై 1, 1987కు ముందు పుట్టిన వారు). వివిధ కారణాల వల్ల 2003 నాటి ఓటర్ల జాబితాలో పేరు లేని వీరు తమ పుట్టిన తేదీ, ఊరుకు సంబంధించి ధ్రువీకరణ పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. 20 నుంచి 38 సంవత్సరాల మధ్య వయసు ఉన్నవారు (జూలై 1, 1987, డిసెంబర్ 2, 2004 మధ్య పుట్టినవారు) రెండు రుజువులు చూపవలసి ఉన్నది. తాము పుట్టిన తేదీతో పాటు తల్లి లేదా తండ్రి పుట్టిన తేదీకి కూడా ధ్రువీకరణపత్రాలు ఇవ్వవలసి ఉంటుంది. ఇక 18 నుంచి 20 సంవత్సరాల మధ్య వయసు ఉన్నవారు (డిసెంబర్ 2, 2004 తరువాత పుట్టినవారు) మూడు రుజువులు సమర్పించవలసి ఉంటుంది. తమ సొంత పుట్టిన తేదీతో పాటు తల్లి, తండ్రి పుట్టిన తేదీల ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలి. 2003 ఓటర్ల జాబితాలో తల్లిదండ్రుల పేర్లు వారి పుట్టిన తేదీలకు రుజువులుగా పరిగణన అవుతాయి. అయితే దరఖాస్తుదారు విధిగా తాను పుట్టిన తేదీ, ఊరుకు సంబంధించి ధ్రువీకరణపత్రాలు సమర్పించాలి.

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర జాబితా సామూహిక ఓటు హక్కుల తొలగింపు ఎలా కాదో ఇప్పుడు మీరే నిర్ధయించాలి. పరోక్షంగానే అయినప్పటికీ, ఓటు హక్కుకు సంపద, విద్యార్హతల పరమైన వివక్షాపూరిత అవరోధాలు సృష్టించడమనేది అమెరికా దక్షిణాది రాష్ట్రాలలో ఆఫ్రికన్ అమెరికన్ల ఓటుహక్కును తొలగించడానికి అనుసరిస్తున్న పద్ధతి కాదూ? బిహార్‌లోను, విశాల భారతదేశంలోనూ విద్యార్హతల ఆధారంగా ఓటర్ల జాబితా నుంచి మినహాయించడమనే చర్యకు మహిళా ఓటర్లు, పేద, దళిత్–ఆదివాసీ, బహుజన్ సామాజిక వర్గాలకు చెందిన ఓటర్లు ఎక్కువగా నష్టపోతారు. అంతే కాదు ఈ సామాజిక సమూహాలలో కూడా కొన్ని వర్గాలు మరింతగా ఎక్కువగా నష్టపోవడం సంభవిస్తుంది. ఇది భారత రాజ్యాంగ స్ఫూర్తికి పూర్తిగా వ్యతిరేకమని మరి చెప్పనవసరం లేదు.

మరో ప్రశ్న కూడా తప్పక అడగవలసి ఉంది: బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు ఎన్నికల సంఘం ఈ హాస్యాస్పద కాలక్రమాన్ని హఠాత్తుగా ఎందుకు ప్రకటించింది? జూన్ 25– జూలై 25 మధ్య 30 రోజుల వ్యవధిలో బిహార్ ప్రభుత్వం లక్ష మంది పోలింగ్ బూత్ స్థాయి అధికారులను (వీరిలో ఇరవై వేల మందిని ఇంకా నియమించవలసి ఉన్నది) సంప్రదించవలసి వున్నది; ప్రత్యేక సమగ్ర సవరణ పద్ధతులలో వారికి శిక్షణ ఇవ్వవలసి ఉన్నది; సకల రాజకీయ పార్టీలకు చెందిన పోలింగ్ బూత్ స్థాయి ఏజెంట్లతో వీరు సంబంధాలు పెట్టుకుని, 'సవరణ'పై ఆ రాజకీయ కార్యకర్తలకు సమగ్ర అవగాహన కల్పించవలసి ఉన్నది; ప్రతి కుటుంబానికి ఎన్యూమరేషన్ ఫామ్స్ పంపిణీ చేసి, 2003 ఓటర్ల జాబితాను వారికి అందుబాటులో ఉంచి తోడ్పడవలసి ఉన్నది. అంతేనా? సంబంధిత వివరాలతో పూర్తి చేసిన ఎన్యూమరేషన్ ఫామ్స్‌ను ప్రతి కుటుంబం నుంచి (అవసరమైతే మూడుసార్లు సందర్శించి అయినా) సేకరించి, వాటిని ఇంటర్నెట్‌లో అప్‌లోడ్ చేయవలసి ఉన్నది. వివిధ ధ్రువీకరణ పత్రాలు సరిగా ఉన్నయో లేదో నిర్ధారించి తమ సిఫారసులు చేయాలి. ఇవన్నీ ఒక నెల రోజుల్లోనే జరగాలి సుమా! (మరి ఆ నెలలో ఇప్పటికే ఒక వారం గడిచిపోయింది) ఇవన్నీ జరగాల్సిన రోజులు ఎటువంటివి? బిహార్‌లో ఇది వర్షాకాలం. వరదలు వెల్లువెత్తడం కద్దు. మరి ఇటువంటి సహజ ప్రతికూల పరిస్థితుల్లో ఇవన్నీ జరగడం సాధ్యమేనా? ఎన్నికల సంఘం వద్ద మంత్రదండం ఏదైనా ఉంటే మినహా ఈ 'సమగ్ర సవరణ' మహాకార్యం అసంభవం. కనుక ఈ 'సవరణ' ఆదేశాన్ని ఉపసంహరించుకునే అవకాశముందని మనం భావించవచ్చు లేదా జూన్ 30న ప్రకటించిన ఆవశ్యక డాక్యుమెంట్ల జాబితాలో పెద్ద మార్పులు చేసేందుకు ఆస్కారమున్నది. లేదూ? అసలు బిహార్ అసెంబ్లీ ఎన్నికలను వాయిదా వేయవచ్చు.

అటువంటి పెనుమార్పులు అవసరమవుతాయా? అవుతాయని అనుకుందాం. మరయితే కొత్త ప్రధాన ఎన్నికల కమిషనర్ గత నెలలో పేర్కొన్న 21 కొత్త చర్యల జాబితాలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ఎందుకు లేదు? అలాగే గత నెలలోనే వివిధ జాతీయ రాజకీయ పక్షాల అధినేతలతో నిర్వహించిన సమావేశంలో 'ప్రత్యేక సమగ్ర సవరణ' ప్రతిపాదనను ఎన్నికల సంఘం ఎందుకు చేయలేదు? ఆ సమావేశానికి ముందు దేశ వ్యాప్తంగా జరిపిన 4000కు పైగా సంప్రదింపులలో కూడా దాని గురించి ఎందుకు ప్రస్తావించలేదు? కేవలం 25 రోజుల క్రితమే ఎన్నికల సంఘం ఆలోచనలు ఎందుకు మారిపోయాయి? అనుకోకుండా వచ్చిన ఫోన్‌కాల్ అందుకు కారణమా? లేక చాయ్ పే చర్చా? సర్ (ప్రత్యేక సమగ్ర సవరణ) వెనుక ఉన్న 'సర్' ఎవరు?

(వ్యాసకర్త 'స్వరాజ్ ఇండియా' అధ్యక్షుడు)

యుద్ధాలయుగం వైపు..!

ఇప్పుడు ప్రపంచయుద్ధం స్థాయి పెరిగిపోయినట్లున్నది. యూరోపియన్ దేశాలు, అమెరికా కలిసి.. ఉక్రెయిన్ వెనకుండి రష్యాతో యుద్ధం చేస్తున్నా దాన్ని ప్రపంచ యుద్ధంగా ఎవరూ గుర్తించడం లేదు. ఈ లెక్కన ప్రపంచంలోని ముఖ్యమైన దేశాలన్నీ గ్రూపులుగా ఏర్పడి యుద్ధం చేస్తేనే అది ప్రపంచయుద్ధం అయ్యేలా ఉంది! స్వీడన్‌కు చెందిన 'స్టాక్ హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సిప్రి) గత జూన్ 16న తన వార్షిక నివేదికలో అణ్వాయుధాలు, యుద్ధాలకు సంబంధించి పలు ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది. 1990 దశాబ్దంలో కోల్డ్‌వార్ ముగిసిన తరువాత కనీసం 21వ శతాబ్దంలోనైనా ప్రపంచమంతటా శాంతి నెలకొంటుందని అందరూ సంతోషపడ్డారు. కానీ ఇటీవలి పరిణామాలు చూస్తే అలా అనిపించడం లేదు. గత కొన్నేళ్లుగా ప్రపంచంలోని ప్రముఖ దేశాలన్నీ తమ శక్తిమంతమైన అణ్వాయుధ సంపత్తిని పెంచుకుంటూ వస్తుండడాన్ని కూడా మనం గమనించాలి.

రష్యా, అమెరికా, చైనా, ఫ్రాన్స్, బ్రిటన్, భారత్, పాకిస్థాన్, ఇజ్రాయిల్, ఉత్తర కొరియా వంటి దేశాలు 2024 నుంచి తమ అణ్వాయుధాలను పెంచుకుంటూ, ఆధునీకరించుకుంటూ వస్తున్నాయి. ప్రపంచంలోని అభద్రతా భావ పరిస్థితులు 2022లో ఉక్రెయిన్, రష్యా యుద్ధంతో బహిరంగమయ్యాయి. ఈ అభద్రతా పరిస్థితి కారణంగానే అన్ని దేశాలు తమ అణ్వాయుధాలను పెంచుకోవడం, ఆధునీకరించుకోవడం చేస్తున్నాయి. గతంలో అమెరికా, రష్యాల మధ్య జరిగిన అనేక అణ్వాయుధాల ఒప్పందాలు అటకెక్కాయి. ఇదంతా సిప్రి తన నివేదికలో పేర్కొంది.



'అణ్వాయుధాల నిర్మాణం కోసం మొదలైన ఈ కొత్త పోటీ, కోల్డ్‌వార్ కాలం నాటి పరిస్థితి కంటే చాలా ప్రమాదకరంగా ఉంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో అణ్వాయుధాలు అనుసంధానిస్తే మరింత ప్రమాదకరంగా మారుతుంది' అని సిప్రి డైరెక్టర్ స్మిత్ తమ ఇయర్ బుక్ ముందుమాటలో గట్టి హెచ్చరిక చేశాడు.

సిప్రి నివేదిక ప్రకారం చైనా వద్ద 600 అణ్వాయుధాలున్నాయి. ఆ దేశపు అణ్వాయుధాల సంఖ్య ప్రపంచంలోని మిగతా దేశాల కంటే వేగంగా పెరుగుతున్నది. భారతదేశం కూడా తన అణ్వాయుధాల సంఖ్యను ఒక మేరకు పెంచుకున్నది. ఇజ్రాయెల్ తన అణ్వాయుధ శక్తిపై మౌనం పాటిస్తోంది. కానీ ఆ దేశం కూడా తన అణ్వాయుధాలను ఆధునీకరిస్తున్న విషయం తెలియనిది కాదు. ఎగేవ్ ఎడారిలో ఉన్న ప్లుటోనియం ఉత్పత్తి కేంద్రాన్ని ఇజ్రాయెల్ మరింత అభివృద్ధి చేస్తోంది. అయితే మొత్తం అణ్వాయుధాల్లో 90 శాతం అమెరికా, రష్యా వద్దే ఉన్నాయి.

ప్రస్తుతమున్న 12,241 అణ్వాయుధాల్లో 9,600 అణ్వాయుధాలు సైనిక అవసరాల కోసం సిద్ధంగా ఉన్నాయి. వీటిలో 3,900 అణ్వాయుధాలు మిస్సైల్స్, యుద్ధ విమానాలతో సిద్ధంగా ఉన్నాయి. ఇందులోనే 2001 అణ్వాయుధాలు హై అలర్ట్ స్థితిలో ఉన్నాయి. అంటే ప్రపంచం ఎంత అభద్రతలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

సిప్రి డైరెక్టర్ స్మిత్ తమ ఇయర్ బుక్ ముందుమాటలో ఒక హెచ్చరిక చేశాడు. 'అణ్వాయుధాల నిర్మాణం కోసం మొదలైన ఈ కొత్త పోటీ, కోల్డ్‌వార్ కాలం నాటి పరిస్థితి కంటే చాలా ప్రమాదకరంగా ఉంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో అణ్వాయుధాలు అనుసంధానిస్తే పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతుంది' అని తెలిపాడు.

ప్రపంచ మార్కెట్ లాభాలను కొత్తగా అభివృద్ధి చెందుతున్న దేశాలు సొంతం చేసుకుంటున్నాయి. దీంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థను ఇప్పటి వరకు క్రమబద్ధంగా నడుపుతున్న సంస్థలను, ఒప్పందాలను, చట్టాలను పక్కకు నెట్టి.. సైనికబలం ద్వారా తమకు అనుకూలమైన ప్రపంచ ఆర్థిక వ్యవస్థ క్రమాన్ని నెలకొల్పాలని పాత ధనిక దేశాలు అనుకుంటున్నాయి. ఇందులో భాగంగానే ఆధునిక ఆయుధాలు, అణ్వాయుధాల పోటీ పెరుగుతున్నది. జూన్ 24, 25 తేదీల్లో నెదర్లాండ్‌లోని 'ది హేగ్'లో జరిగిన నాటో దేశాల మంత్రులు, అధినేతల సమావేశం కూడా సిప్రి నివేదికను బలపరుస్తున్నది.

2035 వరకు నాటో దేశాలన్నీ, తమ దేశాల జీడీపీలో 5 శాతం వరకు ధనాన్ని నాటో బడ్జెట్‌కు కేటాయించాలని 'ది హేగ్' సమావేశంలో నిర్ణయించాయి. దీనికి స్పెయిన్, బెల్జియం, స్లోవేకియాలు అభ్యంతరం తెలిపాయి. అయితే 32 సభ్య దేశాలు ఉన్న నాటోలో ఒకటి రెండు దేశాలు ఈ ప్రతిపాదనను అంగీకరించనంత మాత్రాన నాటో బడ్జెట్ పెరుగుదలలో పెద్ద తేడా ఏమీ రాదు. నాటో బడ్జెట్ పెరగడం అంటే ఆయుధాల పోటీ, ఉద్రిక్తతలు, యుద్ధ అవకాశాలు పెరగడమే.

యూరప్‌కు రష్యానే పెద్ద ప్రమాదమనీ, భవిష్యత్తులో యూరప్‌లోని దేశాలపై రష్యా దాడి చేసే అవకాశం ఉందని, అందుకే నాటో బడ్జెట్ పెంచుతున్నట్లు ఈ సమావేశంలో నేతలు వెల్లడించారు. యూరప్, అమెరికా దేశాలు రష్యాతో యుద్ధం చేసినా చేయకపోయినా తమ ఆధునిక ఆయుధ బలంతో ప్రపంచంపై పెత్తనం చేస్తూ, సరుకులుగా పాత ఆయుధాలు అమ్ముకోవచ్చు.

కారణాలు ఏవైనా అన్ని దేశాలు తమ ఆధునిక ఆయుధాలు, అణ్వాయుధాలను పెంచుకుంటున్నాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ డిజిటల్ రంగాలు, అంతరిక్షం అన్ని యుద్ధానికి వేదికలుగా సిద్ధమవుతున్నాయి. ఫలితాలు ఎలా ఉంటాయో ఇప్పుడే చెప్పడం కష్టం. కానీ ప్రపంచ నాటక రంగంలో శాంతి అధ్యాయానికి తెరపడబోతున్నట్లే కనిపిస్తోంది. ప్రపంచం యుద్ధాల యుగంలోకి, కల్లోల కాలంలోకి అడుగు పెడుతున్నది.

• లంకా పాపిరెడ్డి

'కాళేశ్వరం' ఓ పెద్ద గుదిబండ!

తెలంగాణ రాష్ట్రానికి గుదిబండైన కాళేశ్వరం ప్రాజెక్టును సమర్థించుకోవడానికి పాపం బీఆర్ఎస్ నాయకులు అబద్ధాల మీద అబద్ధాలు ఆడుతూ వాళ్ళ అధినాయకుడు కేసీఆర్‌ను కాపాడడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. నేను 2019లోనే, ఇంకా ఐఎఎస్ సర్వీసులో ఉన్నప్పుడే, బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఒక మీటింగ్‌లో ఇది చాలా దండుగ ప్రాజెక్టు అని ఒక సివిల్ ఇంజనీరుగా వివరించి చెప్పాను. బీఆర్ఎస్ పార్టీలోని ఆ నలుగురి వాగ్ధాటికి, అబద్ధాల టాలెంటుకు ఎక్కడ తెలంగాణ ప్రజలు ఆగం అయితరో అని ఇప్పుడు ఈ వ్యాసం రాస్తున్నాను.

గొప్ప వ్యవసాయ ఆర్థిక శాస్త్రవేత్త, అంతర్జాతీయంగా ఎన్నో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించిన, బీసీ సామాజిక వర్గానికి చెందిన, వ్యవసాయ విశ్వవిద్యాలయానికి ప్రస్తుత వైస్ ఛాన్సలర్‌గా ఉన్న ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య ఆంధ్రజ్యోతిలో జూలై 2న కాళేశ్వరం మీద సాంకేతిక అంశాలతో వ్యాసం రాశారు. దానికి సమాధానంగా జూలై 3న కల్వకుంట్ల కవిత 'తెలంగాణకు కాళేశ్వరమే శ్రీరామరక్ష' అంటూ, వ్యవసాయ విశ్వవిద్యాలయం పునరావాస కేంద్రం అయ్యిందని జానయ్యను విమర్శించడం వారి అహంకారానికి నిదర్శనం.

రాష్ట్రంలో సంవత్సరానికి 36 లక్షల ఎకరాలకు నీరు అందిస్తామన్న ఈ ప్రాజెక్టు ఏ ఒక్క సంవత్సరంలోనూ లక్ష ఎకరాలకు కూడా నీళ్ళు ఇవ్వలేదు. ఆ ప్రాజెక్టు కట్టడంలో ముఖ్యపాత్ర వహించిన ఇంజనీర్–ఇన్–చీఫ్ (జనరల్) మురళీధర్, మేడిగడ్డ దగ్గర ఇచ్చిన ప్రెజెంటేషన్‌లో గరిష్ఠంగా ఒక సంవత్సరంలో 98వేల ఎకరాలకు మాత్రమే నీళ్ళు ఇచ్చినట్టు చెప్పారు. ఈయన కేసీఆర్‌కు బంధువు.

ఒకవేళ ప్రాజెక్టు బాగా పని చేసినట్లైతే కరెంటు, మరమ్మత్తులు, సిబ్బంది ఖర్చులు కలిపి ఎకరానికి సుమారు లక్ష రూపాయలు అవుతుంది. పంట మీద వచ్చే నికర ఆదాయం సగటున రూ.25వేలు మించి ఉండదు. ఇంకా ఖర్చు పెట్టిన లక్ష కోట్లు, వాటి మీద కట్టే రూ.6500 కోట్ల మిత్తి లెక్కలోకి తీసుకోవడం లేదు. ఎకరానికి లక్ష ఖర్చు పెట్టే బదులు, రైతులకు రూ.25వేలు డైరెక్టుగా ఇస్తే, ఇంకా ఎకరానికి రూ.75వేలు రాష్ట్రానికి మిగులుతాయి.

కాళేశ్వరం ప్రాజెక్టును 56 పనులుగా విభజించగా, లక్ష కోట్లు ఖర్చు చేసినా అందులో 12 పనులు మాత్రమే పూర్తయ్యాయని, మిగిలిన 40 పనులు మూడు నుంచి 90 శాతం వరకు వివిధ దశలలో ఉన్నాయని, ఇంకా నాలుగు పనులు అసలు ప్రారంభం కాలేదని 'కాగ్' వెల్లడించింది. పాత కాంగ్రెస్ ప్రభుత్వంలో రూపొందించిన తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మించి, పాత డిజైన్ లోనే ప్రాజెక్టు కడితే 63,352 కోట్లతోనే పూర్తయ్యేదని, రీ–డిజైన్ కారణంగా నిర్మాణ వ్యయం రూ.1,02,268 కోట్లకు చేరిందని, మొత్తం ప్రాజెక్టు పూర్తి చేయాలంటే రూ.1,51,168 కోట్లకు నిర్మాణ వ్యయం చేరుతుందని కూడా కాగ్ వెల్లడించింది. కాళేశ్వరం ప్రాజెక్టు కింద బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.97,449 కోట్లు ఋణాలు తీసుకుంది. వీటిని తీర్చడానికి రూ.71,575 కోట్లు వడ్డీలు ప్రజలు చెల్లించాల్సి ఉంటుంది. 2039–40 వరకు మనకు ఈ అప్పుల బాధ ఉంటుంది. ఎన్ని వేల కోట్లు? ఈ డబ్బుతో మనకు సరిపడ ప్రపంచస్థాయి ప్రభుత్వ బడులు, కాలేజీలు, విశ్వవిద్యాలయాలు, సూపర్ స్పెషాలిటీ ప్రభుత్వ ఆసుపత్రులు, రైతులకు సరిపడ గోడౌన్లు, అన్ని పంటలను కొనడానికి కావలసిన మూలధనం, తెలంగాణ యువతకు ప్రైవేటు రంగంలో మంచి ఉద్యోగాలు పొందడానికి కావలసిన 119 స్కిల్ సెంటర్లు కట్టుకునే వాళ్ళం కదా!

ప్రాజెక్టు డీపీఆర్‌లో కూడా అన్నీ అబద్ధాలే! మామూలుగా అన్ని నీటి పారుదల ప్రాజెక్టులలో ఒక్క టీఎంసీ నీటితో 10,000 ఎకరాలు పారించవచ్చు అని అంచనా కడతారు. కానీ ఈ కాళేశ్వరం ప్రాజెక్టులో ఒక టీఎంసీ నీటితో 17,668 ఎకరాల ఆయకట్టుకు నీరు అందుతుందని రాసారు. చేపల పెంపకం ద్వారా, పరిశ్రమలకు నీటి సరఫరా ద్వారా కొన్ని వందల కోట్ల రూపాయలు ఆదాయం వస్తుందని అబద్ధాలు రాశారు. కరెంటు ఖర్చు యూనిట్‌కు మూడు రూపాయలు అవుతుందని లెక్క కట్టారు. కానీ అప్పటికే ఖర్చు రూ.6.40గా ఉంది.

ఇంత పెద్ద ప్రాజెక్టును పిచ్చిపిచ్చిగా డిజైన్ చేసి, తొందరగా కట్టించి, నాణ్యత విషయంలో రాజీపడి, చివరగా మేడిగడ్డ డ్యాం నెర్రెలు (పెద్ద క్రాకులు) పడేటట్లు చేసింది కేసీఆర్ కాదంటే తెలంగాణ సమాజం నమ్ముతుందా? ఈ నెర్రెలు అన్ని బ్లాకులకు, అన్ని కట్టడాలకు, అన్నారం, సుందిళ్ళ డ్యాంలకు కూడా పడవని గ్యారెంటీ లేదు. 2022లో ఒక మోస్తరు వరదలకే కన్నెపల్లి పంపు హౌజ్ కూలిపోయి 18 మోటార్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. అప్పుడు ఆ పంపుహౌజ్ చూద్దామని వెడితే నన్ను మహదేవ్‌పూర్ పోలీసులు అరెస్టు చేశారు కూడా. నాణ్యత విషయంలో ఇంతగా ఎందుకు కాంట్రాక్టర్లు, ఇంజనీర్లు రాజీపడ్డారు?

కాళేశ్వరం ప్రాజెక్టు బీఆర్ఎస్ వాళ్ళు అంటున్నట్టు ఒక ఇంజనీరింగ్ అద్భుతం కాదు, పెద్ద వైఫల్యం. ప్రపంచ నీటిపారుదల ఇంజనీర్లకు, మౌలిక సదుపాయ (ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) నిపుణులకు, బ్యాంకర్లకు ఒక పెద్ద కేస్‌స్టడీ. గత 50 సంవత్సరాల లిఫ్ట్ ఇరిగేషన్ ఇంజనీరింగ్ చరిత్ర చూసినట్లైతే... 90 శాతం ఎత్తిపోతల పథకాలు విజయవంతమైనట్టు ఎక్కడా కనపడలేదు.



ఈ ప్రాజెక్టును పూర్తిగా అమలు చేస్తే (అన్నీ సక్రమంగా ఉంటే) డిజైన్ ప్రకారం నీళ్ళను ఎత్తిపోయడానికి మన రాష్ట్రంలో ఉత్పత్తి చేస్తున్న విద్యుత్ ఉత్పత్తిలో 46శాతం ఈ ప్రాజెక్టుకే కేటాయించాల్సి వస్తుంది. అప్పుడు మన పరిశ్రమలు మూతపడతాయి. జనాలకు రోజుకు 10 గంటలు, వ్యవసాయ బోర్లకు కరెంటు కట్లు చూడాల్సి వచ్చేది. మన మొత్తం విద్యుదుత్పత్తిలో దాదాపు సగం ఈ ప్రాజెక్టుకు కేటాయించడం సాధ్యమయ్యే పనేనా? కాళేశ్వరం నీళ్ల వల్లే వరి అత్యధికంగా పండిందని ఇంకో పెద్ద అబద్ధం ప్రచారం చేశారు. కానీ, 2023 అక్టోబరులో పిల్లర్లు కుంగిపోయాక మొత్తం ప్రాజెక్టు పూర్తిగా ఆపేసిన తరువాత కూడా 2023–24లో ఇంకా అధికంగా వరి ఉత్పత్తి పెరిగి, కొత్త రికార్డు 280 లక్షల మెట్రిక్ టన్నులకు చేరింది. దీనివల్ల స్పష్టంగా తెలిసే విషయం ఏమిటంటే కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల మన ఉత్పత్తి పెరగలేదు.

కేసీఆర్ ఏమో కాళేశ్వరం ప్రాజెక్టు అప్పు ఎప్పుడో తీరిపోయిందని అబద్ధం ఆడుతున్నారు. ఒక ఎకరానికి నీళ్ళు ఇవ్వలేకపోతున్నా కూడా కవిత ఏమో "తెలంగాణకు కాళేశ్వరమే శ్రీరామరక్ష" అంటుంది. కేటీఆర్ ఏమో "కాంగ్రెస్ వాళ్లే బాంబులు పెట్టి మేడిగడ్డ ప్రాజెక్టుకు నెర్రెలు తెప్పించిండ్రు" అంటాడు. హరీష్‌రావేమో "రెండు పిల్లర్లు కుంగినాయి, ఇది చాలా చిన్న సమస్య" అంటాడు.

కాళేశ్వరం ప్రాజెక్టుకు 3 బ్యారేజీలు, 15 రిజర్వాయర్లు, 21 పంపు హౌజులు, 1531 కిలోమీటర్ల కెనాల్స్, 141 టీఎంసీల స్టోరేజ్ కెపాసిటీ ఉన్నాయి. కానీ నీళ్ళ లభ్యత, నీళ్ళు దొరికే మొట్టమొదటి బ్యారేజి మేడిగడ్డ. ఇక్కడ నుంచి నీళ్ళు మొదట అన్నారం బ్యారేజికి, తరువాత సుందిళ్ళ బ్యారేజికి, అక్కడ నుంచి మళ్ళీ ఎల్లంపల్లి బ్యారేజికి పంప్ అవుతాయి. అంటే మేడిగడ్డ బ్యారేజి మొత్తం కాళేశ్వరం ప్రాజెక్టుకు గుండెకాయ లాంటిది. ఇది పనిచేయకపోతే మొత్తం ప్రాజెక్టు పనిచేయనట్టే. కానీ బీఆర్ఎస్ వాళ్లకు మాత్రం రాష్ట్రంలో కనిపించే అన్ని నీళ్ళు కాళేశ్వరం నీళ్ళే అనడం పరిపాటి అయ్యింది. ఇంజనీర్–ఇన్–చీఫ్ ఏమో కాళేశ్వరం కింద 98 వేల ఎకరాలు మాత్రమే పారిందంటే, హరీష్‌రావు 20 లక్షల ఎకరాలకు నీళ్ళు అందించాం అని, పాత ప్రభుత్వాలు కట్టిన ఎస్ఆర్ఎస్‌పీ, ఎల్లంపల్లి, మిడ్‌మానేరు ఆయకట్టునంతా కలిపి చెప్తున్నారు. కేసీఆర్ కుటుంబంలోని ఆ నలుగురు తిమ్మిని బమ్మిని చేయగల సమర్థులు.

మేడిగడ్డ బ్యారేజిని అర్జెంటుగా రిపేరు చేయాలి, ఇంకా మిగతా పనులు పూర్తి చేయడానికి 50వేల కోట్లు ఖర్చు పెట్టాలి. ఒక ఎకరాకు నీళ్ళు ఇవ్వడానికి ఏటా లక్ష రూపాయలు ఖర్చు పెట్టాలి. మూడు బ్యారేజీలకు వాడిన సీకెంట్ పైల్స్ పద్ధతి గురించి కూడా ఆలోచించాలి. ఇవన్నిటి దృష్ట్యా అసలు ఈ ప్రాజెక్టు నడిపిస్తే ఉపయోగమేనా అనేది కూడా ప్రభుత్వం ఒక గట్టి స్వతంత్ర కమిటీ వేసి నిర్ణయిస్తే బాగుంటుంది. ఆ కమిటీలో ఒక ఐఐటీ ఇరిగేషన్ ప్రొఫెసర్, ఒక రిటైర్డ్ ఐఏఎస్ ఆఫీసర్, ఒక ప్రముఖ ఆర్థిక శాస్త్రవేత్త, ఒక ప్రముఖ సామాజికవేత్త ఉండాలి. అందరూ వేరే రాష్ట్రం వాళ్ళు అయితే బాగుంటుంది. కామన్ సెన్స్‌తో ఆలోచిస్తే ఈ ప్రాజెక్టు పూర్తిగా మూసేస్తేనే బాగుంటుంది. దానికి ప్రత్యామ్నాయంగా తుమ్మిడిహెట్టి కడితే బాగుంటుందా అనేది కూడా ప్రస్తుత ప్రభుత్వం జాగ్రత్తగా ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి.

ఈ ప్రాజెక్టు బీఆర్ఎస్ వాళ్ళు అంటున్నట్టు ఒక ఇంజనీరింగ్ అద్భుతం కాదు. ప్రపంచ నీటి పారుదల ఇంజనీర్లకు, మౌలిక సదుపాయ(ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) నిపుణులకు, బ్యాంకర్లకు ఒక పెద్ద కేస్‌స్టడీ. గత 50 సంవత్సరాల లిఫ్ట్ ఇరిగేషన్ ఇంజనీరింగ్ చరిత్ర చూసినట్లైతే... 90 శాతం ఎత్తిపోతల పథకాలు విజయవంతమైనట్టు ఎక్కడా కనపడలేదు. ఇంజనీర్లు, ఐఏఎస్ అధికారులు, మంత్రులు కొంచెం జాగ్రత్తగా ప్రాజెక్టులు రూపొందించి, ప్రజాధనం వృథాను అరికట్టాలి.



■ ఆకునూరి మురళి
ఎంటెక్ (సివిల్), ఎన్ఐటీ, వరంగల్
మాజీ ఐఏఎస్ అధికారి

బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.8 కనిష్ఠం 23.4

నేటితో ముగియనున్న ఎప్‌సెట్ ఆప్షన్ల ఎంపిక

హైదరాబాద్, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఇంజినీరింగ్ కాలేజీల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన ఎప్‌సెట్ మొదటి విడత కౌన్సెలింగ్ కొనసాగుతోంది. బుధవారం వరకు 74,542 మంది విద్యార్థులు ఆప్షన్లు ఎంచుకున్నారని, ఇది గురువారంతో ముగియనుందని ఎప్‌సెట్ కన్వీనర్ శ్రీదేవసేన తెలిపారు. ఆప్షన్ల ఎంపికకు ముందు ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు 95,216 మంది హాజరయ్యారు. మొదటి విడత సీట్ల కేటాయింపు ఈనెల 18లోపు ప్రకటిస్తామని కన్వీనర్ తెలిపారు.



ఉసురు తీసిన కల్తీ

నగరంలో విజృంభిస్తున్న కల్లు మాఫియా



కల్తీ కల్లుకు ఆరుగురు బలి.. హానికర రసాయనాలతో తయారీ

మామూళ్ల 'మత్తు'లో అధికారులు.. చిత్తవుతున్న పేదల జీవితాలు..

విచ్చలవిడిగా కల్లు కాంపౌండులు.. బినామీ గీతకార్మికుల పేరుతో లైసెన్స్‌లు

హైదరాబాద్ సిటీ, జూలై 9(ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతాల్లో కల్తీ కల్లు ఏరులై పారుతోంది. ప్రమాదకరమైన కెమికల్స్‌తో కల్లును తయారు చేస్తున్న మాఫియా అమాయకుల ప్రాణాలతో ఆటలాడుతోంది. ఇతర రాష్ట్రాల నుంచి నిషేధిత కెమికల్స్‌ను దిగుమతి చేసుకొని కల్తీకల్లును తయారు చేసి రూ.కోట్లు కొల్లగొడుతున్నారు. మామూళ్ల మత్తులో జోగుతున్న అధికారులు, కల్లు కాంపౌండ్‌లను కట్టడి చేయడంలో పూర్తిగా విఫలమయ్యారనే ఆరోపణలు వస్తున్నాయి. కల్తీ కేటుగాళ్లు పేదల ప్రాణాలతో చెలగాట మాడుతున్నా, అబ్కారీ అధికారులు కిమ్మనడం లేదు. కల్తీకల్లు కాటుకు దాదాపు 28 మంది అస్వస్థతకు గురి కావడంతో మరోసారి తీవ్ర కలకలం రేపింది.

కట్టడేదీ?

కల్తీ మద్యం, నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్‌ను అరికట్టడంలో అధికారులు తీసుకుంటున్న శ్రద్ధ కల్తీకల్లును కట్టడి చేయడంలో తీసుకోవడంలేదనే విమర్శలు ఉన్నాయి. ఆల్ప్రాజోలం అనే ప్రమాదకరమైన కెమికల్ కలిపిన కల్లు తాగిన అమాయక ప్రజలు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. ఎక్సైజ్ పోలీసుల దాడుల్లో ఆల్ప్రాజోలం పట్టుబడుతున్నా, నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవడం లేదు. మామూళ్ల మత్తులో జోగుతున్న అధికారులు కేసు విచారణలో లోతుగా వెళ్లడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

బినామీ పేర్లతో లైసెన్స్‌లు

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో గీత కార్మికులు తక్కువగా ఉంటారు. కొందరు బడాబాబులు బినామీ పేర్లతో ఎక్సైజ్ శాఖ వద్ద టీఎఫ్‌టి (టీ ఫర్ ట్యాపర్స్) లైసెన్సు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. కల్లులో కలిపే భయంకరమైన కెమికల్స్‌ను మహారాష్ట్ర,

మిగతా 8వ పేజీలో..

ఒక్కో కుటుంబానిది ఒక్కో వ్యథ

- అందరూ రెక్కాడితే కానీ.. డొక్కాడని వారే

హైదర్‌నగర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబాలు వారివి. ఉపాధి కోసం పొట్ట చేత పట్టుకొని జిల్లాల నుంచి నగరానికి వచ్చిన వారిని కల్తీ కల్లు కాటేసింది. ఎవరైనా ఆర్థిక సాయం చేస్తే తప్ప మృతదేహాలను సొంతూరుకు తీసుకువెళ్లలేని దయనీయ స్థితి.

మృతదేహం తీసుకెళ్లే స్తోమత లేకపాయే..

శంషీగూడ శ్రీరాంనగర్‌లో ఉంటున్న సీతారాం (47) గాంధీ ఆసుపత్రిలో సీపీఆర్ చేస్తుండగా బుధవారం ప్రాణాలు విడిచాడు. భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. కూలి పనిచేస్తూ జీవనం సాగిస్తున్న ఆ కుటుంబానికి మృతదేహాన్ని సొంతూరుకు తీసుకెళ్లే ఆర్థిక స్థోమత లేదు. కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ చేసిన ఆర్థిక సాయంతో అంబులెన్స్‌లో వనపర్తి జిల్లాలోని మదిగట్ల గ్రామానికి సీతారాం మృతదేహాన్ని కుటుంబ సభ్యులు తీసుకెళ్లారు.

ఇస్త్రీ చేస్తూ జీవనోపాధి..

వనపర్తికి చెందిన బొజ్జయ్య ఉపాధి కోసం 15 ఏళ్ల క్రితం వచ్చి కూకట్‌పల్లిలోని సాయిచరణ్ కాలనీలో ఉంటూ ఇస్త్రీ పని చేస్తున్నాడు. భార్యతో పాటు ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. పడుతున్న కష్టాన్ని మర్చిపోయేందుకు అలవాటుగా సేవిస్తున్న కల్లు కల్తీది కావడంతో ఆయన తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. ఆదివారం భాగ్యనగర్ కాలనీలోని ప్రతిమ హాస్పిటల్‌లో చికిత్స కోసం చేరాడు. ఆర్థిక స్థోమత అంతంత మాత్రమే కావడంతో డిశ్చార్జి చేయించుకొని

మిగతా 8వ పేజీలో..

90 శాతం మందు కల్లే విక్రయం

ఔషధంగా భావించి సేవిస్తున్న కొందరు

8

రూ.5కే ఇడ్లీ, పూరి, ఉప్మా!

ఇందిరమ్మ క్యాంటీన్లలో అల్పాహారం

ఏటా రూ. 15.33 కోట్లు ఖర్చవుతుందని అంచనా



హైదరాబాద్ సిటీ, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ క్యాంటీన్లలో అల్పాహారం అందించాలని జీహెచ్ఎంసీ నిర్ణయించింది. హరే కృష్ణ మూవ్‌మెంట్ భాగస్వామ్యంతో గ్రేటర్‌లోని 150 కేంద్రాల్లో త్వరలో అల్పాహారం(టిఫిన్) అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. భోజనంలానే రూ.5కే పౌరులకు అల్పాహారం అందించనున్నారు. ఒక్కో అల్పాహారానికి రూ.19 ఖర్చు కానుండగా.. అందులో రూ.14 జీహెచ్ఎంసీ భరించనుంది. లబ్ధిదారుల నుంచి రూ.5 వసూలు చేస్తారు. ఇడ్లీ, ఉప్మా, పొంగల్, పూరి, వడ వంటివి క్యాంటీన్లలో ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు అందించనున్నారు. ఇందుకు ఇప్పటికే ఉన్న అన్నపూర్ణ క్యాంటీన్లను ఆధునీకరిస్తున్నారు. 10/40 పరిమాణంలో 60 కేంద్రాలు, 10/20 పరిమాణంలో 79 కేంద్రాలు సిద్ధమవుతున్నాయి. వీటికి రూ.11.29 కోట్లు ఖర్చు కానుంది. మరో 11 కేంద్రాలను ఇందిరమ్మ క్యాంటీన్లుగా మార్చేందుకు రూ.13.75 లక్షలు వెచ్చిస్తున్నారు. మొత్తంగా క్యాంటీన్ల ఏర్పాటుకు రూ.11.43 కోట్లు ఖర్చు కానుండగా.. జూలై మూడో వారంలో రూ.3 కోట్లు, ఆగస్టు మొదటి వారంలో రూ.4 కోట్లు, ఆగస్టు చివరి వారంలో రూ.4.43 కోట్లు విడుదల చేయాలని భావిస్తున్నారు. గురువారం జరిగే స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఈ ప్రతిపాదనపై చర్చించనున్నారు. అల్పాహారానికి యేటా రూ.15.33 కోట్లు అవసరమని జీహెచ్ఎంసీ అంచనా వేసింది. ప్రస్తుతం గ్రేటర్‌లోని 150 కేంద్రాల్లో మధ్యాహ్నం భోజనం రూ.5కే అందిస్తున్నారు. ఒక్కో భోజనానికి రూ.27.50 ఖర్చవుతుండగా.. రూ.22.50 జీహెచ్ఎంసీ భరిస్తూ.. లబ్ధిదారుల నుంచి రూ.5 వసూలు చేస్తున్నారు. అన్నం, ఏదైనా కూర, పప్పు, పచ్చడి అందిస్తున్నారు. నిత్యం 30 వేల మందికిపైగా ఇందిరమ్మ క్యాంటీన్లలో భోజనం చేస్తున్నారు.



42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం ఉద్యమం

15న ఇందిరాపార్కు వద్ద బీసీల మహాధర్నా 6

గ్యాస్ కట్టర్‌తో కోసి ఏటీఎంలోని 34.60 లక్షలు చోరీ

పరికరాలతో రెండు బైకులపై వచ్చిన దుండగులు 6

అంతకు ముందే అక్కడ కార్డన్‌సెర్చ్

రెస్టారెంట్ మాటున డ్రగ్స్ దందా!

'మల్నాడు కిచెన్' నిర్వాహకుడు సూర్య అరెస్ట్ 6

అనుమతుల రద్దు అధికారం డీసీలకు

జోనల్ కమిషనర్లకూ బాధ్యతలు.. అధికారాల బదలాయింపునకు కమిషనర్ యోచన

ఉద్యోగుల పాలనా వ్యవహారాల బాధ్యతలు అదనపు కమిషనర్లకు

నేడు స్టాండింగ్ కమిటీ ముందుకు ప్రతిపాదన



హైదరాబాద్ సిటీ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పౌర సేవలు, ఉద్యోగులకు సంబంధించిన పాలనాపరమైన వ్యవహారాలు వేగవంతంగా జరిగేలా అధికారాలు బదలాయిస్తూ కమిషనర్ ఆర్వీ కర్ణన్ సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. పట్టణ ప్రణాళిక, పాలనా వ్యవహారాలు (అడ్మిన్), ఆర్థిక విభాగాలకు సంబంధించి పలు అధికారాలను వికేంద్రీకరించాలని భావిస్తున్నారు. ఈ ప్రతిపాదనలను నేడు జరిగే స్టాండింగ్ కమిటీలో చర్చించనున్నారు. టీజీ-బీపాస్‌లో భాగంగా 75 చదరపు గజాల్లోపు స్థలంలో భవన నిర్మాణాలకు అనుమతి అవసరం లేదు. జీహెచ్ఎంసీ వద్ద వివరాలు నమోదు (ఇన్‌స్టంట్ రిజిస్ట్రేషన్) చేసుకోవాలి. 500 చదరపు మీటర్లు, గ్రౌండ్ ప్లస్ రెండు/స్టిల్ట్ ప్లస్ మూడంతస్తుల (10మీటర్ల ఎత్తు) వరకు భవనాలకు తక్షణ అనుమతి పొందే అవకాశముంది. 500 చ.మీల కంటే ఎక్కువ స్థలంలో నిర్మించే భవనాలకు సింగిల్ విండో విధానంలో పర్మిషన్ ఇస్తున్నారు. 75 చ.గల కంటే ఎక్కువ స్థల విస్తీర్ణంలో నిర్మించే భవనాలకు సంబంధించి పౌరులు దరఖాస్తు సమర్పించిన అనంతరం క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిర్దేశిత రుసుము చెల్లించాక 15 రోజుల్లో పనులు ప్రారంభించుకునేందుకు (కమెన్స్‌మెంట్ లెటర్) గ్రీన్‌సిగ్నల్ ఇస్తారు. నిబంధనల ప్రకారం డాక్యుమెంట్లు లేకపోవడం, ఇతరత్రా కారణాలతో తక్షణ నమోదు, తక్షణ అనుమతి పొందుతున్న కొన్ని భవనాల అనుమతులను రద్దు చేయాల్సి వస్తోంది. ప్రస్తుతం ఈ అధికారాలు జీహెచ్ఎంసీ చట్టం 1955, సెక్షన్ 450 ప్రకారం కమిషనర్ వద్ద ఉన్నాయి. దీంతో ప్రతీ ఫైల్‌ను సర్కిల్, జోనల్ కార్యాలయాల నుంచి పట్టణ ప్రణాళికా విభాగం చీఫ్ సిటీ ప్లానర్ (సీసీపీ) ద్వారా కమిషనర్‌కు పంపుతున్నారు. ఈ తరహా ఫైళ్లు ఎక్కువగా వస్తుండడం.. పని ఒత్తిడితో వాటిని సకాలంలో పరిశీలించే అవకాశం కమిషనర్‌కు ఉండడం లేదు. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయి పరిశీలనలో నిర్ధారణ అయిన విషయాల ఆధారంగా

మిగతా 6వ పేజీలో..



సమావేశంలో మాట్లాడుతున్న ఆప్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్

మాకు న్యాయం చేయండి!

నాగర్‌కర్నూలుకు చెందిన ఫైనాన్స్ సంస్థపై చర్యలు తీసుకోండి

అధిక వడ్డీ ఆశచూపి రూ.200 కోట్ల మేర మోసం చేసిందని బాధితుల ఆవేదన

పంజాగుట్ట, జూలై9 (ఆంధ్రజ్యోతి): అధిక వడ్డీ ఇస్తామని ఆశ పెట్టి తమను మోసం చేసిన నాగర్‌కర్నూలుకు చెందిన ఓం సాయి శ్రీరామ్ ఫైనాన్స్ సంస్థపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని ప్రభుత్వానికి బాధితులు విజ్ఞప్తి చేశారు ఇప్పటికే అక్రమార్కుల ఆస్తులు అటాచ్ చేశారని, తమను మోసగించిన వారిని రప్పించి.. ఆ ఆస్తులను తమ పేర్లపై మార్పించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 20లోపు తమకు న్యాయం చేయకపోతే వారి ఇళ్ల ముందు టెంట్లు వేసుకుని కూర్చుంటామని హెచ్చరించారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బాధితులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఆప్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్, సీనియర్ పాత్రికేయుడు పాశం యాదగిరి, సినీ దర్శకుడు రవీ, బీసీ సమాజ్ అధ్యక్షుడు ఎస్.సూర్యారావు, పృథ్వీరాజ్ యాదవ్, పబ్బతి శ్రీకృష్ణ, పాలమూరు అధ్యయన వేదిక ప్రతినిధులు రాఘవా చారి, పరుశురాం బాధితులకు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా బాధితులు భాగ్యమ్మ, ఎల్లమ్మ, నాగమ్మ, పర్వతాలు మాట్లాడుతూ నాగర్ కర్నూలులోని ఓం సాయి శ్రీరామ్ ఫైనాన్స్ సంస్థ.. తమ వద్ద పెట్టుబడి పెడితే అధిక వడ్డీ చెల్లించడమే కాకుండా ఎప్పుడు అడిగితే అప్పుడు డబ్బులు ఇస్తామని చెబితే, వారి మాటలు నమ్మి రూ.లక్ష నుంచి రూ.కోటి దాకా పెట్టుబడిగా పెట్టి మోసపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే 150 మందికి పైగా ఆత్మహత్య చేసుకున్నారని. మరికొందరు అనారోగ్యంతో, బెంగతో చనిపోయారని చెప్పారు. 2014-2020 వరకు పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో భూములు కోల్పోయినవారికి పరిహారంగా కొంత మొత్తాన్ని ప్రభుత్వం చెల్లించింది. ఆ డబ్బు బ్యాంకులో జమ కాగానే ఓం సాయి ఫైనాన్స్ సిబ్బంది, నిర్వాహకులు సదరు రైతుల ముందు వాలారు. వారికి అధిక వడ్డీ ఆశ చూపి తమ సంస్థలో పెట్టుబడిగా పెట్టించుకున్నారు. డబ్బులు అవసరపడితే గనక ముందుగా చెబితే.. తిరిగి ఇస్తామని నమ్మబలికారు. కాగా ఫైనాన్స్ సంస్థ మోసంపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా 14 మందిపై కేసు నమోదు చేశారని, అందులో ప్రధాన నిందితుడు సాయిబాబు, మరి కొందరిని అరెస్టు చేశారని బాధితులు వివరించారు.

డ్రోన్ సహాయంతో కాలువ గుర్తింపు

హైడ్రా కమిషనర్ రంగనాథ్.. చెరువులో డబుల్ ఇళ్ల నిర్మాణంపై విస్మయం



డబుల్ బెడ్‌రూం ఇళ్ల సెల్లార్లలో ఉన్న నీటిని పరిశీలిస్తున్న రంగనాథ్, ఎమ్మెల్యే రంగారెడ్డి

హయత్‌నగర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మాసబ్‌చెరువు నుంచి పెద్ద అంబర్‌పేట్ వరకు ఉన్న 7.5 కిలోమీటర్ల కాలువను డ్రోన్ సహాయంతో గుర్తించామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. తుర్కయంజాల్ మాసబ్ చెరువు, ఇంజాపూర్ దిలావర్‌ఖాన్ చెరువు, బంజారాకాలనీ సమీపం నుంచి ఉన్న నాలాలను ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డితో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం అధికారులతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమావేశమయ్యారు. వరద నీరు నేరుగా బంజారాకాలనీ నాలా మీదుగా పెద్దఅంబర్‌పేట్ ఈదుల చెరువుకు, అక్కడి నుంచి చిన్న ఏరుకు చేరుకునేలా భారీ కాలువను నిర్మించాలని హైడ్రా కమిషనర్‌కు ఎమ్మెల్యే రంగారెడ్డి సూచించారు. హయత్‌నగర్ శ్మశానవాటిక వద్ద జరుగుతున్న బాక్సు నాలా నిర్మాణంపై ఎమ్మెల్యే ఆగ్రహం

మిగతా 6వ పేజీలో..

హైడ్రా నుంచి అద్దె వసూలు..!

- **బుద్ధభవన్ లీజుకు ఇవ్వాలని జీహెచ్ఎంసీ నిర్ణయం**

హైదరాబాద్ సిటీ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): బుద్ధభవన్‌లోని ఆరు, ఏడు అంతస్తులను హైడ్రాకు లీజుకు ఇవ్వాలని జీహెచ్ఎంసీ నిర్ణయించింది. హైడ్రా ప్రత్యేక సంస్థగా ఏర్పాటైన నేపథ్యంలో నిబంధనల ప్రకారం అద్దె వసూలు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు నేడు స్టాండింగ్ కమిటీలో ప్రతిపాదించనున్నారు. జీహెచ్ఎంసీ యాక్ట్ 1955, సెంక్షన్ 148 (2) ప్రకారం ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను బల్దియా ఎస్టేట్ విభాగంసిద్ధం చేసింది.



సీపీ ఆనంద్‌తో కలిసి నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

'కొత్వాల్ హౌస్'.. సరికొత్తగా

మూడు పోలీస్‌స్టేషన్‌లకు నూతన భవనాలు

ప్రారంభించిన మంత్రి పొన్నం, సీపీ ఆనంద్

హైదరాబాద్ సిటీ, జూలై 9(ఆంధ్రజ్యోతి): 'కొత్వాల్ హౌస్'గా పిలిచే పురానీ హవేలీ భవనంతో పాటు కాలపత్తార్, శాలిబండ పోలీస్‌స్టేషన్‌లు, ఛత్రినాక

మిగతా 6వ పేజీలో..

పాఠశాల విద్యాశాఖపై ఎస్సీ ఎస్టీ కమిషన్ సమీక్ష

హైదరాబాద్, జూలై 9(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖలో ఎస్సీ, ఎస్టీల ఉద్యోగులకు అమలవుతున్న రూల్ ఆఫ్ రిజర్వేషన్, రోస్టర్ పాయింట్లు, బ్యాక్‌లాగ్ ఖాళీలపై ఎస్సీ ఎస్టీ కమిషన్ సమీక్షించింది. బుధవారం పాఠశాల విద్య సంచాలకుల కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, సభ్యులు జిల్లా శంకర్, నేనావత్ రాంబాబు నాయక్, పాఠశాల విద్యా సంచాలకులు నవీన్ నికోలస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాల విద్యాశాఖాధికారులతో కమిషన్ వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడింది.



ర్యాలీలో పాల్గొన్న నేతలు, కార్మికులు

కార్మికుల భారీ ర్యాలీ

దేశవ్యాప్త సమ్మెకు మద్దతు

మోదీ బాటలోనే తెలంగాణ సర్కారు: కూనంనేని

కవాడిగూడ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా బుధవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం వరకు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఏఐటీయూసీ, సిఐటీయూ, ఐఎన్‌టీయూసీ, హెచ్ఎంఎస్, టీయూసీయూ, ఐఎఫ్‌టీయూ, బీఆర్‌టీయూ, టీఎన్టీటీయూసీ, రిటైర్డ్ ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై కార్మికులు కదం తొక్కారు. కార్మిక సంఘ నేతలు పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన సీపీఐ శాసనసభపక్ష నేత కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో 35 కోట్ల మంది భాగస్వాములై విజయవంతం చేశారని అన్నారు. త్వరలో గద్దెమీద ఎర్రజెండా పార్టీలు ఉంటాయని, బూర్జువా పార్టీలు ఇంటిబాట పడతాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సైతం ప్రధాన మంత్రి మోదీ బాటలోనే వెళ్తోందని విమర్శించారు. అనంతరం వివిధ కార్మిక సంఘాల నేతలు వెంకట్, పాలడుగు భాస్కర్, రాంబాబుయాదవ్, ఎస్ఎల్ పద్మ లు మాట్లాడారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు.

వర్కింగ్ జర్నలిస్టు చట్టాన్ని కొనసాగించాలి

కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలతో పాటు రెండు వర్కింగ్ జర్నలిస్టుల చట్టాలను తొలగించేందుకు తీసుకుంటున్న చర్యలను ఉపసంహరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య డిమాండ్ చేశారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సంఘీభావంగా బుధవారం టిడబ్ల్యూజేఎఫ్, హెచ్‌యూజే సంయుక్త ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద జర్నలిస్టుల ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవపున్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రధానమంత్రి పంపితే వచ్చా

- కేంద్ర పథకాలను వినియోగించుకుంటున్నారా?
- 'డబుల్' లబ్ధిదారులతో పీఎంవో డైరెక్టర్ మన్మీత్

ఖైరతాబాద్, జూలై 9(ఆంధ్రజ్యోతి): తాను ప్రధానమంత్రి పంపితే ఇక్కడకు వచ్చానని, కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తూ గృహ సముదాయాల్లో ప్రత్యేక మేళాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశిస్తామని పీఎంవో డైరెక్టర్ మన్మీత్ కౌర్ అన్నారు. బుధవారం ఆమె జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ గౌతం ఇతర అధికారులతో కలిసి ఖైరతాబాద్ ఇందిరానగర్, బన్సీలాల్‌పేట్

మిగతా 8వ పేజీలో..



అధికారులతో కలిసి డబుల్ బెడ్రూంలను పరిశీలిస్తున్న పీఎంవో డైరెక్టర్ మన్మీత్ కౌర్, కమిషనర్ కర్ణన్, అధికారులు

డ్రోన్ సహాయంతో కాలువ గుర్తింపు

(5వ పేజీ తరువాయి)

వ్యక్తం చేశారు. దాదాపు 33 ఫీట్ల కాలువ స్థలం ఉంటే కేవలం 10 ఫీట్లల్లో బాక్సు నాలా నిర్మిస్తే ఎలా అని డిప్యూటీ కమిషనర్ యాదయ్యను ప్రశ్నించారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పందిస్తూ ముందుగా కాలువ విస్తీర్ణ స్థలం ఎంత ఉందో తేల్చి హద్దులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

తేలియాడే డబుల్ బెడ్‌రూం ఇళ్లను చూసి..

ఇంజాపూర్‌లో చెరువు పరివాహక ప్రాంతంలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లను చూసిన రంగనాథ్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. చెరువును తలపించేలా భవనాల సెల్లార్లలో నీరు ఉండడం చూసి ఇదేంటని అధికారులను ప్రశ్నించారు. చెరువు స్థలంలో నిర్మాణాలు చేస్తే ఇదే పరిస్థితి ఉంటుందన్నారు. అంబర్‌పేట్ బతుకమ్మ కుంటలో ఇదే పరిస్థితి ఉండేదని గుర్తు చేశారు. మాసబ్ చెరువు నుంచి పెద్ద అంబర్‌పేట్ కాలువను ఒక రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతామన్నారు. కాగా, మాసబ్ చెరువును పూడ్చిన వారిని వదిలి పెట్టొద్దని, వాసవి బిల్డర్లపై కేసు పెట్టాలని ఎమ్మెల్యే రంగారెడ్డి అన్నారు. మాసబ్ చెరువు నుంచి పెద్దఅంబర్‌పేట్ వరకు భారీ కాలువ నిర్మాణానికి తాను నిధులు మంజూరు చేస్తానన్నారు. తహసీల్దార్లు సుదర్శన్‌రెడ్డి, జానకీ, తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమిషనర్ అమరేందర్‌రెడ్డి, ఇరిగేషన్ డీఈఈ చెన్నకేశవరెడ్డి, ఏఈ వంశీధర్, జీహెచ్ఎంసీ ఏసీపీ విజయలక్ష్మి, సెక్షన్ ఆఫీసర్ సోమేష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

గ్యాస్ కట్టర్‌తో కోసి ఏటీఎంలోని

రూ.34.60 లక్షలు చోరీ

- పరికరాలతో రెండు బైకులపై వచ్చిన దుండగులు
- అంతకు ముందే అక్కడ కార్డన్ సెర్చ్

జీడిమెట్ల, జూలై 9(ఆంధ్రజ్యోతి): గాజుల రామారం మార్కెండేయనగర్‌లో అంతరాష్ట్ర దొంగల ముఠా ఏటీఎంను కొల్లగొట్టింది. గ్యాస్ సిలిండర్, గ్యాస్ కట్టర్‌తో రెండు బైక్‌లపై వచ్చిన నలుగురు సభ్యులు సెంటర్‌లోకి దూరారు. ఏటీఎం మిషన్‌ను కోసి అందులో ఉన్న రూ.34.60 లక్షలను ఎత్తుకెళ్లారు. బాలానగర్ డీసీపీ సురేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గాజులరామారం ప్రధానరోడ్డులోని హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సిస్ బ్యాంక్‌ల ఏటీఎం సెంటర్లు పక్కపక్కనే ఉన్నాయి. హెచ్‌డీఎఫ్‌సీ షట్టర్‌లో రెండు ఏటీఎం మిషన్లు ఉన్నాయి. ఒకదానిలో రూ.24 లక్షలు, మరోదానిలో రూ.48 లక్షలు బ్యాంక్ సిబ్బంది ఉంచారు. బుధవారం తెల్లవారుజామున నలుగురు వ్యక్తులు మాస్కులు, టోపీలు, గ్లౌజ్‌లు ధరించి రెండు బైక్‌లపై సెంటర్ వద్దకు వచ్చారు. వారితో పాటు గ్యాస్ సిలిండర్, కట్టర్‌ను తీసుకు వచ్చారు. షట్టర్ మూసివేసి రెండు మిషన్లను కట్టర్‌తో తొలగించి దాదాపు రూ. 34.60 లక్షలు దోచుకుని పారిపోయారు. ముందు జాగ్రత్తగా ఏటీఎం అలారం కట్ చేశారు. చోరీ చేస్తున్న వ్యక్తుల కదలికలు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. బ్యాంకు అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు దొంగలను గుర్తించడానికి నాలుగు టీంలను ఏర్పాటు చేశారు. ఏటీఎం సెంటర్ వద్ద ఆధారాలను సేకరించారు. దొంగలు వినియోగించిన బైక్ నంబర్లను గుర్తించారు. డాగ్ స్క్వాడ్ సమీపంలోని ఓ బస్తీలో ఉంటున్న ఇంటివద్దకు వెళ్లి ఆగినట్టు సమాచారం. ఇద్దరు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. జీడిమెట్ల పోలీసులు మార్కెండే యనగర్‌లో కార్డన్‌సెర్చ్ చేసిన 4 గంటలలోనే ఏటీఎం చోరీ జరగడం గమనార్హం. జీడిమెట్ల సీఐ గడ్డం మల్లేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనుమతుల రద్దు

అధికారం డీసీలకు

(5వ పేజీ తరువాయి)

కమెన్స్‌మెంట్ లెటర్ ఇవ్వక ముందు అనుమతులు రద్దు చేసే అధికారం డిప్యూటీ మునిసిపల్ కమిషనర్‌కు బదలాయించారు.

ఉద్యోగులు,అధికారుల వ్యవహారాలపై..

నిర్ణీత స్థాయి ఉద్యోగులు, అధికారులకు సంబంధించిన ఆర్థిక, పాలనాపరమైన అంశాలకు సంబంధించిన అధికారాలను అదనపు కమిషనర్ (ఫైనాన్స్) గీతారాధిక, అదనపు కమిషనర్(అడ్మిన్) వేణుగోపాల్‌లకు బదలాయించాలని ప్రతిపాదించారు. ప్రొసీడింగ్స్ ఇచ్చిన అనంతరం ఆరు నెలల వరకు అధికారాల బదలాయింపు ఉంటుందని, ఏ క్షణమైనా సవరణ, ఉపసంహరించుకునే అధికారం కమిషనర్‌కు ఉంటుందని ప్రతిపాదనల్లో పేర్కొన్నారు. ఉద్యోగుల మెడికల్ రీయింబర్స్‌మెంట్, కేంద్ర కార్యాలయంలోని సూపరింటెండెంట్ స్థాయి అధికారుల వరకు వేతన నిర్ధారణ, ఎల్‌టీసీ మంజూరు, దివ్యాంగ ఉద్యోగులకు అలవెన్స్‌లు, ప్రొబెషన్ నిర్ధారణ, ఇంక్రిమెంట్లు, ఇంప్రెస్ట్ అమౌంట్ రెన్యూవల్, అసిస్టెంట్ మునిసిపల్ కమిషనర్ స్థాయి అధికారుల వరకు పాస్‌పోర్టు, వీసాల కోసం నిరభ్యంతర పత్రాల (ఎన్‌ఓసీ) జారీ, వివిధ అంశాలకు సంబంధించిన శిక్షణకు పంపడం తదితర అంశాలపై అదనపు కమిషనర్ అడ్మిన్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. యుడీసీ/సీనియర్ అసిస్టెంట్ స్థాయి ఉద్యోగుల వరకు పెన్షన్ బెనిఫిట్లు, జీపీఎఫ్ డ్రా వంటివి కేంద్ర కార్యాలయంలో అదనపు కమిషనర్ (ఫైనాన్స్), జోనల్ కార్యాలయాల్లో జోనల్ కమిషనర్లు ఆమోదించాల్సి ఉంటుంది.

'కొత్వాల్ హౌస్ '.. సరికొత్తగా


(5వ పేజీ తరువాయి)


ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ల నూతన భవనాలను హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్‌తో కలిసి ఇన్‌చార్జి మంత్రి ప్రభాకర్ బుధవారం ప్రారంభించారు. కొత్వాల్ హౌస్ భవనం పైకప్పు నాలుగేళ్ల క్రితం కూలిపోగా దాతలు ఏసీఈ అర్బన్ డెవలపర్స్ ప్రై. లిమిటెడ్, గ్రీన్‌కో సీఈవో, ఎండీ చలమలశెట్టి అనిల్ కుమార్ సహకారంతో పూర్తి చేసినట్లు మంత్రి పొన్నం తెలిపారు. డెక్కన్ ఆర్కైవ్ సంస్థకు చెందిన ఆర్కిటెక్చర్ మీర్ బర్కతు ల్లాఖాన్ అద్భుతమైన పనితీరును కనబరిచారని ప్రశంసించారు. ప్రతి శుక్రవారమూ పురానీ హవేలీ కొత్వాల్ భవన్‌లో, బషీర్‌బాగ్ కార్యాలయంలో ఒక రోజు, మిగతా రోజులు బంజారాహిల్స్‌లోని ప్రధాన కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటానని ఆనంద్ పేర్కొన్నారు. ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, అసదుద్దీన్, ఎమ్మెల్సీలు మీర్జా రియాజ్ ఉల్ హసన్ , మీర్జా రహమత్, ఎమ్మెల్యే మీర్ జుల్ఫెకార్ పాల్గొన్నారు.





















బోనాల పండుగ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి కొండా సురేఖ, ఆలయ కమిటీ ప్రతినిధులు

చాంద్రాయణగుట్ట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పాతబస్తీ గౌలిపురాలోని మహంకాళి మాతేశ్వరి భారతమాత దేవాలయం, కోట మైసమ్మ దేవాలయం వార్షిక బోనాల పండుగ పోస్టర్‌ను అధ్యక్షుడు కైలాష్ గంగపుత్ర, కార్యనిర్వాహక అధ్యక్షుడు కేఎస్ ఆనంద్‌రావులతో కలిసి దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ బుధవారం ఆవిష్కరించారు. ఈనెల 10న గోల్కొండ జగదాంబ అమ్మవారికి పట్టువస్త్రాలు, ఒడిబియ్యం సమర్పణ, ఈనెల 11న కలశ స్థాపనతో మొదలై 13న ఘట స్థాపన, 20న బోనాల సమర్పణ, 21న రంగం, అమ్మవారి ఘటం ఊరేగింపుతో ఉత్సవాలు ముగుస్తాయని కైలాష్ గంగపుత్ర అన్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆలయాల నిర్వాహకులకు చెక్కుల పంపిణీ



ఆలయాల నిర్వాహకులకు చెక్కులు అందజేస్తున్న మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కౌసర్, ఉస్మాన్‌బిన్‌హల్ హజ్రీ

కార్వాన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం ప్రభుత్వం ఆధ్వర్యంలో బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నామని తెలంగాణ శాసన మండలి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం కార్వాన్ నియోజకవర్గంలోని గుడిమల్కాపూర్ జామ్‌సింగ్ బాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో బోనాల నిర్వహణ చెక్కులను పంపిణీ చేశామన్నారు. తెలంగాణలోని 176 ఆలయాలకు ప్రభుత్వం రూ.78 లక్షల చెక్కులను పంపిణీ చేశామని మహేందర్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే మహ్మద్ కౌసర్ మొహియుద్దీన్, కార్పొరేటర్ స్వామి యాదవ్, కాంగ్రెస్ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఉస్మాన్‌బిన్ హల్‌హజ్రీ, నాయకులు నాగారం వేణుగౌడ్ పాల్గొన్నారు.

అక్కన్న మాదన్న మహంకాళి దేవాలయంలో..



చెక్కులను పంపిణీ చేస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్

చాంద్రాయణగుట్ట, జూలై 9(ఆంధ్రజ్యోతి): బోనాల పండుగను ఘనంగా నిర్వహించుకోవడానికి దేవాలయాలకు ప్రభుత్వం తరఫున అందించే 269 చెక్కులను బుధవారం టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్, చార్మినార్ ఎమ్మెల్యే జుల్ఫికర్ అలీ అందజేశారు. ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో అక్కన్న మాదన్న మహంకాళి దేవాలయం ప్రార్థనా మందిరంలో జరిగిన కార్యక్రమంలో చెక్కులు అందజేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని ప్రభుత్వం లాల్‌దర్వాజ సింహవాహిని మహంకాళి ఆలయాభివృద్ధికి రూ.20 కోట్లు కేటాయించిందని వారన్నారు. గౌలిపురా కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి, ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ప్రతినిధులు, వివిధ దేవాలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

లాల్‌దర్వాజ బోనాలకు రావాలని నగర సీపీకి ఆహ్వానం



పోలీస్ కమిషనర్ సీపీ ఆనంద్‌కు ఆహ్వానం అందజేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

చాంద్రాయణగుట్ట, జూలై 9(ఆంధ్రజ్యోతి): లాల్‌దర్వాజ బోనాల ఉత్సవాల ప్రారంభోత్సవానికి రావాలని నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్‌ను ఆలయ కమిటీ ఆహ్వానించారు. బుధవారం బంజారహిల్స్‌లో సీవీ ఆనంద్‌ను ఆలయ కమిటీ చైర్మన్ బి.మారుతీ యాదవ్, మాజీ చైర్మన్ కె.వెంకటేశ్, కన్వీనర్ జి.అరవింద్‌కుమార్ గౌడ్, కోశాధికారి ఎ.చంద్రకుమార్, బి.సాయిప్రసాద్, మర్ల తదితరులు సీపీని కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు. ఉత్సవాల ప్రారంభోత్సవానికి ఏటా నగర పోలీస్ కమిషనర్, జీహెచ్ఎంసీ కమిషనర్లు రావడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు.

బోనాలకు ఏర్పాట్లు చేయండి



డిప్యూటీ కమిషనర్ రవికుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

రాజేంద్రనగర్, జూల్ 9(ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ సర్కిల్‌లో ఈనెల 20, 21వ తేదీల్లో జరిగే బోనాల ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని బీజేపీ నాయకులు కోరారు. ఇదే విషయాన్ని బుధవారం రాజేంద్రనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు పి.సందీప్ ముదిరాజ్ నేతృత్వంలో జీహెచ్ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రవి కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. డిప్యూటీ కమిషనర్‌ను కలిసిన వారిలో నాయకులు వై.శ్రీధర్, కోరని సదానంద్, సత్యనారాయణ ముదిరాజ్, బండారి బాల క్రిష్ణ, హరికిషన్‌జీ, మల్లేశ్ చారి, విజయ్ యాదవ్, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు అమల్లోకొస్తే కార్మికులకు అన్యాయం



ఆరాంఘర్ చౌరస్తాలో నిరసన చేపట్టిన ఏఐటీయూసీ నాయకులు, కార్మికులు

- విజయవంతంగా దేశవ్యాప్త సమ్మె

రాజేంద్రనగర్, జూలై 9(ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కులను కాలరాస్తున్న ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. దేశ వ్యాప్త కార్మిక సమ్మెలో భాగంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం ఆరాంఘర్ చౌరస్తాలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, నరేంద్రమోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక విధానాల కారణంగా పేదరికం, అసమానతలు, ఆకలి, నిరుద్యోగం పెరిగాయన్నారు. మరొక వైపు కార్పొరేట్ కుటుంబాల ఆస్తులు, సంపద ఇబ్బడి ముబ్బడిగా పెరిగాయన్నారు. ఈ సంవత్సరం ఏప్రిల్ 1 నుంచి నాలుగులేబర్ కోడ్‌లను అమలు చేయాలని ప్రభుతం ప్రయత్నించిందన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను ప్రధాని నరేంద్రమోదీ కాలరాద్దామని చూస్తున్నారన్నారు. లేబర్ కోడ్‌లు అమలులోకి వస్తే కార్మికులకు తీరని అన్యాయం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌టీయూ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు చెన్నయ్య, రాజేంద్రనగర్ మండల అధ్యక్షులు జి.సాయిలు, రాజు, శ్రీకాంత్, ఎల్లప్ప, వెంకటేశ్, శోభ, సునీత, లక్ష్మి పాల్గొన్నారు.

- **మంగళ్‌హాట్:** ఉద్యోగ, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా కేంద్ర ఉద్యోగ, కార్మిక సంఘాల పిలుపు మేరకు తెలంగాణ వ్యాప్తంగా ఎస్ఎఫ్‌పీఈ యూనియన్ అనుబంధ సంఘాల ఉద్యోగులు చీఫ్ పీఎంజీ కార్యాలయం దాకసదన్‌లో తలపెట్టిన ఒకరోజు సమ్మెలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ, ఏపీ కేంద్ర ఉద్యోగ సమాఖ్య ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ అజీజ్ మాట్లాడుతూ, 8వ వేతన సంఘాన్ని తక్షణమే ఏర్పాటు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, ఎస్ఎఫ్‌సీఈ సంఘానికి కోర్టు ఇచ్చిన తీర్పును అలుపరిచి గుర్తింపును పునరుద్ధరించాలన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి పాత కార్మిక చట్టాలను కొనసాగించాలన్నారు. ఎస్ఎఫ్‌సీఈ రాష్ట్ర కన్వీనర్ కామ్రేడ్ శ్రవణ్‌కుమార్, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



దాకసదన్‌లో చేపట్టిన సమ్మెలో పాల్గొన్న ఉద్యోగులు, కార్మికులు

'సమస్యలు పరిష్కరించాలి'

మంగళ్‌హాట్, జూలై 9(ఆంధ్రజ్యోతి): గోషామహల్ నియోజవర్గంలోని సమస్యలను పరిష్కరించాలని గోషామహల్ నియోజకవర్గం డెవలప్‌మెంట్ ఫోరం కన్వీనర్ బద్దం సతీష్‌గౌడ్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన తెలంగాణ ఫిషరీస్ కార్పొరేషన్ మెట్టు సాయికుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఇఫ్తెఖార్, ఆరిఫ్, గౌసుద్దీన్, ఇస్మాయిల్, నవీన్‌గౌడ్, అఫ్రోజ్, చేతన్ పాల్గొన్నారు.

విఠలేశ్వర రుక్మాబాయిల బ్రహ్మోత్సవాలు

అఫ్జల్‌గంజ్, జూలై 9(ఆంధ్రజ్యోతి): గౌలిగూడ విఠల్‌నగర్‌లోని చారిత్రక జంగల్ విఠోబా ఆలయంలో విఠలేశ్వర రుక్మాబాయిల బ్రహ్మోత్సవాలు నాలుగు రోజులుగా కనులపండువగా కొనసాగుతున్నాయి. బుధవారం ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో ఏఐసీసీ ఓబీసీ సెల్ కోఆర్డినేటర్ నిర్మల్‌కుమార్ యాదవ్, జాంబాగ్ కార్పొరేటర్ రాకేశ్ జైస్వాల్, నాయకులు అంజయ్య, సుదర్శన్ పాల్గొనగా, ఆలయ నిర్వాహకులు వారిని సన్మానించారు.

'సకాలంలో నీటి ట్యాంకర్ బిల్లులు చెల్లించాలి'

రాజేంద్రనగర్, జూలై 9(ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ జలమండలి ఫిల్టర్ బెడ్స్ వద్ద బుధవారం నీటి ట్యాంకర్ల నిర్వాహకులు, డ్రైవర్లు నిరసనకు దిగారు. నీటి ట్యాంకర్ బిల్లులను సకాలంలో చెల్లించాలన్నారు. ట్యాంకర్ల ఫిల్లింగ్ స్టేషన్‌ల వద్ద పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో ట్రాఫిక్ పోలీసులు తరచు చలాన్లు వేస్తున్నారన్నారు. ఉదయం 5 నుంచి రాత్రి 8 వరకు నీటి ట్యాంకర్లను నింపాలంటున్నారని, అలా కాకుండా సాయంత్రం 5 వరకే నీటి ట్యాంకర్లను నింపాలన్నారు.

ట్రేడ్ లైసెన్స్ లేని టిఫిన్ సెంటర్ మూసివేత

రాజేంద్రనగర్, జూలై 9(ఆంధ్రజ్యోతి): అత్తాపూర్ చౌరస్తాలో ఎలాంటి ట్రేడ్ లైసెన్స్ లేకుండా అను టిఫిన్స్ పేరుతో టిఫిన్ సెంటర్‌ను నిర్వహిస్తుండగా బుధవారం రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కె.రవికుమార్ ఆధ్వర్యంలో మూసివేయించారు. ఈ టిఫిన్ సెంటర్‌కు ఎలాంటి ట్రేడ్ లైసెన్స్ లేదని, పైగా చౌరస్తాలోని ఫుట్‌పాత్‌ను ఆక్రమించి ఏర్పాటు చేయడంతో ప్రజలకు ఇబ్బందిగా మారిన టిఫిన్ సెంటర్‌ను మూసి వేసినట్టు తెలిపారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం

రాజేంద్రనగర్, జూల్ 9(ఆంధ్రజ్యోతి): అత్తాపూర్ డివిజన్ పరిధిలో పలు అభివృద్ధి పనులుకు బుధవారం కార్పొరేటర్ మోండ్ర సంగీత గౌరీశంకర్ శంకుస్థాపనలు చేశారు. హైదర్‌గూడ లక్ష్మీనగర్‌లో సీసీ రోడ్డు, రాంబాగ్‌నల్ల పోచమ్మ దేవాలయం వద్ద సీసీ రోడ్డు, శివానగర్‌లో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి మోండ్ర కొమురయ్య, నాయకులు వనం శ్రీరాంరెడ్డి, వనం నర్సింహ, ఎస్‌బీ హరినాథ్, వెంకటేశ్ పాల్గొన్నారు.



- తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన ఎన్.రామచందర్‌రావును ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేస్తున్న బీజేపీ రాష్ట్ర ప్రవాసి సెల్ కోకన్వీనర్ బాబుసింగ్, రాజ్ పురోహిత్, భగవత్‌సింగ్, భళావత్, శంకర్ సింగ్, మహేందర్ సింగ్, బాబుసింగ్ తదితరులు

\- రవీంద్రభారతి, జూలై 9(ఆంధ్రజ్యోతి)

రేషన్ కార్డుల కోసం దళారులను ఆశ్రయించొద్దు

- ఏఎస్ఓ పుష్పలత



గన్‌పార్క్, జులై 9(ఆంధ్రజ్యోతి): నాంపల్లి సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన అర్హుల ఇళ్లకు వెళ్లి విచారణ చేసి సకాలంలో రేషన్ కార్డులను జారీ చేస్తామని నాంపల్లి సర్కిల్-4 పౌరసరఫరాల శాఖ ఏఎస్ఓ పుష్పలత, సూపరింటెండెంట్ నరేశ్ తెలిపారు. మంగళవారం నాంపల్లిలోని ఏఎస్ఓ కార్యాలయంలో వారు మాట్లాడారు. ఎవరైనా రేషన్‌కార్డులు ఇప్పిస్తామని చెప్పే దళారులను నమ్మొద్దన్నారు. రేషన్ కార్డుల జారీకి దళారుల ప్రమేయం లేకుండా నేరుగా తమ కార్యాలయంలోనే సంప్రదించాలన్నారు. ఇప్పటికే రేషన్ కార్డులకోసం మీ సేవ, ప్రజా పాలనలో దరఖాస్తులు చేసుకున్న వారి ఇంటింటా తమ శాఖా ఇన్‌స్పెక్టర్లు విచారణ చేసి అర్హులను ఎంపిక చేసి వారికి త్వరగా రేషన్ కార్డులు అందజేస్తామన్నారు. రేషన్‌కార్డుకోసం ఎవరికి డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే నాంపల్లిలోని తమ సర్కిల్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.



- టీపీసీసీ అధ్యక్ష హోదాలో మొదటిసారిగా చాంద్రాయణగుట్ట నియోజకవర్గానికి వచ్చిన మహేశ్‌కుమార్ గౌడ్‌కు నియోజకర్గం ఇన్‌చార్జి బోయ నగేశ్ ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికి భారీ గజమాలతో సత్కరించారు. అనంతరం లాల్‌దర్వాజ మహంకాళి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

\- చాంద్రాయణగుట్ట, జూలై 9(ఆంధ్రజ్యోతి)

రోడ్లకు ప్యాచ్‌వర్క్

గోషామహల్, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఆషాడ మాసం బోనాల ఉత్సవాల సందర్భంగా గోషామహల్‌లోని పలు ప్రాంతాల్లో పాడైన రోడ్లకు ప్యాచ్‌వర్క్ చేస్తున్నామని గోషామహల్ నియోజకవర్గ బీసీ సెల్‌వర్కింగ్ ప్రెసిడెంట్ కోటి శైలేష్ కురుమ పేర్కొన్నారు. బుధవారం చందన్‌వాడి, మాల్ మైసమ్మ, గోషామహల్ తదితర బస్తీల్లో రోడ్లకు ప్యాచ్ వర్క్‌లు చేయించడం జరిగిందన్నారు. ఆలయాల వద్ద కూడా రోడ్లకు మరమ్మతులు చేస్తున్నామని ఆయన తెలిపారు.

వ్యక్తికి ఆర్థిక సహాయం

రాజేంద్రనగర్, జూలై 9(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న మార్కండేయనగర్‌కు చెందిన పవన్ కుటుంబానికి సత్య సాయి పొదుపు సంఘం వ్యవస్థాపకుడు గద్దె యాదగిరి బుధవారం వైద్య ఖర్చుల కోసం రూ. 30 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. నిరుపేదలను ఆదుకోవడానికి ఎల్లప్పుడు ముందుంటానని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పి.సూర్యనారాయణ, గద్దె క్రిష్ణ, వీడం రమేశ్, కోట శ్యామ్, కంది అశోక్, తీరందాస్ నరేందర్, గంజి ధనుంజయ్, బి.విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/h1yCzA7లో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు. నోట్: htpps://epaper.andhra-jyothy .comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

కనకదుర్గ నృత్య విభావరి వార్షికోత్సవం



కళాకారులను సత్కరిస్తున్న అతిథులు

రవీంద్రభారతి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): సాంస్కృతిక సేవలో 43 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం అభినందనీయమని శాసనమండలి ప్రతిపక్షనేత, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. బుధవారం రవీంద్రభారతిలో కనకదుర్గ నృత్య విభావరి సంస్థ 43వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అకాడమీలో శిక్షణ పొందిన విద్యార్థులు భరతనాట్యం ప్రదర్శించారు. సంస్థ డైరెక్టర్ లయన్ నిర్మాలా ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మధుసూదనాచారి కళాకారులను సత్కరించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, శాస్త్రీయ కళల్ని ప్రోత్సహించేందుకు సంస్థలు స్థాపించి దశాబ్దాలుగా కొనసాగించడం గొప్ప విషయమని అన్నారు. నృత్య విభావరి సంస్థ 42 ఏళ్ల పూర్తి చేసుకొని 43వ వార్షికోత్సవం జరుపుకోవడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో సారిపల్లి కొండలరావు, భాగవతుల సేతూరామ్, అంజుబాబు, లంక లక్ష్మీనారాయణ, వనజా ఉదయ్, కుసుమ భోగరాజు, రామరాజు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

సిద్ధప్ప వరకవి రాజయోగి జయంత్యుత్సవం

రవీంద్రభారతి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ తత్వ కవితాలోకంలో తొలి కవిగా, సహజకవిగా, తెలంగాణ వేమనగా పేరుగాంచిన మహాకవి సిద్ధప్ప అని తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డా.ఎన్.బాలాచారి అన్నారు. బుధవారం రవీంద్రభారతి ప్రాంగణంలోని తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యాలయంలో అఖిల భారతీయ కుమ్మర శాలివాహన ప్రజాపతి కుంభ్‌కార్ మహాసంఘ్, తెలుగు భాషా చైతన్య సమితి సంయుక్త ఆధ్వర్యంలో సిద్ధప్ప వరకవి రాజయోగి జయంత్యుత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా కవి సమ్మేళనం కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ ఎన్.బాలాచారి. కవులను సత్కరించి అభినందించారు. స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొనడమే కాకుండా నిజాం వ్యవస్థను తన కవితలతో నిరసించి, జనం నాలుకల మీద సజీవంగా ఉన్న గొప్ప కవి సిద్ధప్ప అని సిద్ధప్ప వరకవి రాజయోగి జయంతోత్సవం అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్య ప్రధాన కార్యదర్శి, జయంతి కన్వీనర్ సిలివేరు శంకర్, నిర్వాహకులు బడేసాబ్, కటకం నర్సింగ్‌రావు, కొడిచెర్ల మమేదర్, రాజగోల్‌నాయుడు, డా.రాధాకుసుమ తదిరులు పాల్గొన్నారు.

ఎండబెట్టిన పూలతో చిత్రపటాల తయారీ బేష్



ఉద్యాన విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ రాజిరెడ్డితో విద్యార్థులు

రాజేంద్రనగర్, జూల్ 9(ఆంధ్రజ్యోతి): శ్రీకొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయంలో ఎమ్మెస్సీ ఫ్లోరికల్చర్ చదువుతున్న విద్యార్థులు తమ చేతులతో ఎండబెట్టిన పూలతో తయారు చేసిన చిత్రపటాలను బుధవారం వైస్ చాన్స్‌లర్ డాక్టర్ దండ రాజిరెడ్డి ముందు ప్రదర్శించారు. పుష్ప శాస్త్రంపై తమ నైపుణ్యంతో రూపొందించిన చిత్రపటాలను చూసిన డాక్టర్ రాజిరెడ్డి విద్యార్థులను అభినందించారు. శాస్త్రీయ విజ్ఞానంతో పాటు కళాత్మకతను ప్రోత్సహించాలన్నారు. విలువ ఆదారిత ఉత్పత్తులు, వృత్తి అవకాశాలపై నూతన విధానాలను కనుగొనాలన్నారు. మార్కెట్ ఉన్న రంగాల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచి ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో వర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ భగవాన్, డాక్టర్ విజయ, కోర్సు ఇన్‌చార్జీ డాక్టర్ సింధూజ, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

భర్తను చంపిన భార్య



హత్యకు గురైన షేక్ మహ్మద్

రాజేంద్రనగర్, జూల్ 9(ఆంధ్రజ్యోతి): తాగొచ్చి రోజూ గొడవ పడుతున్న భర్తను ఆయన పడుకున్న సమయంలో భార్య బండరాయితో తలపైకొట్టి హత్య చేసింది. ఈ సంఘటన బుధవారం ఉదయం మైలార్‌దేవుపల్లి డివిజన్ వట్టేపల్లి సైఫీ కాలనీలో జరిగింది. మైలార్‌దేవుపల్లి ఇన్‌స్పెక్టర్ నరేందర్ తెలిపిన వివరాలు ప్రకారం... షేక్ మహ్మద్, షేక్ ఫరీదాలు భార్యాభర్తలు. వీరికి 13 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. ఇద్దరు పిల్లలు ఉన్నారు. షేక్ మహ్మద్ పనిచేయకుండా భార్య దగ్గర డబ్బులు అడుక్కుని మద్యానికి అలవాటు పడ్డాడు. ప్రతి రోజూ తాగొచ్చి భార్యతో గొడవ పడుతున్నాడు. షేక్ ఫరీదా ఇళ్లల్లో పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. రెండు రోజులుగా షేక్ మహ్మద్ భార్యతో గొడ వ పడుతుండడంతో కోపం వచ్చిన ఆమె బుధవారం తాగొచ్చి పడుకున్న భర్త ను తలపై బండరాయితో మోది హత్య చేసింది. సమాచారం తెలుసుకున్న మైలార్‌దేవుపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. షేక్ ఫరీదాను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్టు ఇన్‌స్పెక్టర్ నరేందర్ తెలిపారు.

20న సాహితీ పురస్కారాలు

అఫ్జల్‌గంజ్: శాంతా బయోటెక్ వ్యవస్థాపకులు, పద్మభూషణ్ డాక్టర్ కె.ఐ వరప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో కొనసాగుతున్న శాంతా వసంత ట్రస్ట్-2025 రెండో విడత సాహితీ పురస్కారాలను ప్రకటించింది. ప్రముఖ వయోలిన్ విద్వాంసులు, పద్మశ్రీ డాక్టర్ అన్నవరపు రామస్వామికి వసంత వరప్రసాద్‌రెడ్డి సంగీతరత్న పురస్కారం, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఓలేటి పార్వతీశంకు డాక్టర్ వరప్రసాద్ రెడ్డి ఉత్తమ సాహితీవేత్త పురస్కారం, ఎమ్మెస్కో ప్రచురణల అధినేత విజయ్ కుమార్‌కు కోడూరు వెంకటరమణారెడ్డి సాహితీ సేవారత్న పురస్కారం ప్రదానం చేయనున్నారు. ఈనెల 20న అబిడ్స్ బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రాంగణంలో వీరికి పురస్కారంతో పాటు ఒక్కొక్కరికి రూ.లక్ష నగదు, ప్రశంసా పత్రంఅందజేస్తారు.



ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | గోవిందరావు : 9703618721, రాజ్ కుమార్: 9985921389 | కె. అనిల్ కుమార్: 99854 03628

నగరంలో 90శాతం కల్తీ కల్లే విక్రయం

ఈతచెట్లు లేనిచోట దుకాణాలు



హైదరాబాద్ సిటీ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఒకప్పుడు ఈత, తాటి చెట్లు విపరీతంగా ఉండేవి. 50 ఏళ్ల నుంచి వ్యవసాయం, రహదారుల విస్తరణ, పట్టణాల పెరుగుదలతో చాలాచోట్ల చెట్లను కొట్టేశారు. గతంలో హైదరాబాద్ నగర పరిసరాలలో విరివిగా కనిపించే ఈత, తాటి చెట్లు ఉండగా, ప్రస్తుతం నగరానికి 50 కిలోమీటర్ల లోపు అవి కనిపించడకుండా పోయాయి. పట్టణాలకు 50 కి.మీ. లోపు తగినన్ని ఈత, తాటి చెట్లు లేకపోతే కల్లు దుకాణాలను మూసివేయాలి. మొదటి నుంచీ కల్లుకు గిరాకీ ఉండడంతో సహజ సిద్ధంగా చెట్ల నుంచి తీసే కల్లు స్థానంలో మత్తు రావడానికి ప్రమాదకరమైన క్లోరల్ హైడ్రేట్, డైజోపామ్, అల్ప్రాజోలమ్ వంటివి కలిపి కల్లును విక్రయిస్తుండడంతో ప్రజల ఆరోగ్యంపై ప్రభావం పడింది. అం దుకు తాజా సంఘటనే నిదర్శం. కూకట్‌పల్లి చుట్టుపక్కల ఉన్న కల్లు దుకాణాల్లో రెండు మూడు రోజుల క్రితం కల్లు తాగిన వారిలో నలుగురు మృతి చెందగా.. 31 మందికి పైగా అస్వస్థతతో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. కల్తీ కల్లు విక్రయంలో ఎక్సైజ్ శాఖ తీసుకున్న చర్యలు శూన్యమని పలువురు సామాజికవేత్తలు ఆరోపిస్తున్నారు. మందు కల్లుతో అనారోగ్య సమస్యలు రావడంతో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం నగరంలో ఆ కల్లును తయారుచేసి విక్రయించే దుకాణాలను మూసివేసింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత గీత కార్మికులకు ఉపాధి పేరుతో నగరంలో ఆయా దుకాణాలను ప్రభుత్వం తెరిపించడంతో విక్రయాలు చేపట్టారు. ఎలాంటి కల్లును విక్రయించాలన్న దానిపై ఎక్సైజ్‌శాఖ ప్రత్యేక దృష్టి పెట్టకపోవడంతో 90 శాతం మందులతో తయారు చేసిన కల్లునే విక్రయిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

నిబంధనలు బేఖాతరు

నగరంలో నిర్వహిస్తున్న కల్లు దుకాణాల సొసైటీలు ఈత చెట్ల నుంచి తీసిన కల్లునే విక్రయించాలన్న నిబంధన ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. మందులతో తయారు చేసిన కల్లును కాంపౌండ్‌లలో విక్రయిస్తుండడంతో ఆ కల్లు తాగిన వారు అస్వస్థతకు గురవుతున్నారు. ఈ విషయం ఎక్సైజ్ శాఖకు తెలిసినా పట్టించుకోవడం లేదు. ఈత చెట్లు లేని చోట వందలాది సంఖ్యలో కల్లు దుకాణాలకు ప్రభుత్వం ఎలా అనుమతిస్తుందని పలువురు ప్రశ్నిస్తున్నారు.

నగరానికి దూరంగా ఈత వనాలు

స్వచ్ఛమైన కల్లు కోసం నగర వాసులు వారాంతంలో నగరానికి 50-100 కి.మీ దూరంలో ఉన్న ఈత, తాటి వనాలకు వెళ్లి కల్లు తాగి వస్తున్న పరిస్థితి ఉంది. చెట్ల నుంచి తీసిన కల్లు ఆరోగ్యానికి మంచిదని విద్యావంతులు కూడా అప్పుడప్పుడు దూర ప్రాంతాలకు వెళ్లి కల్లు తాగుతున్నారు. మేడ్చల్ నుంచి నిజామాబాద్ వెళ్లే మార్గంలో కొన్ని ఎకరాలల్లో ఈత వనాలను పెంచి స్వచ్ఛమైన కల్లు, నీరాను విక్రయిస్తుండడంతో నగర వాసులు కొందరు కార్లల్లో వెళ్లి కల్లు తాగుతున్నారు.

నిషా కోసమే..

నగరానికి ఉపాధి నిమిత్తం వలస వచ్చిన వారిలో మెజారిటీ ప్రజలు నిషా కోసం కల్లు తాగుతున్నారు. గ్రామీణ ప్రాంతాలతో పోల్చితే నగరంలో విక్రయించే కల్లులో మత్తు తీవ్రత ఎక్కువగా ఉండడంతో కల్లు తాగే వారితో దుకాణాలు రద్దీగా ఉంటున్నాయి. కూకట్‌పల్లి, మూసాపేట లాంటి ప్రాంతంలో ఉన్న కల్లు దుకాణాలకు రోజూ 150-200 మంది కల్లు తాగేందుకు వస్తున్నట్లు అక్కడి దుకాణాల నిర్వహకులు పేర్కొంటున్నారు. నగరంలో ఉన్న కల్లు దుకాణాలన్నీ పేద, మధ్య తరగతి, కూలీలు ఎక్కువగా నివసిస్తున్న ప్రాంతాల్లోనే ఉన్నాయి.



కేర్ ఆస్పత్రిలో ఏఐ ఆధారిత రోబోటిక్ సర్జరీ సిస్టమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

'కేర్'లో ఏఐ ఆధారిత రోబోటిక్ సర్జరీ సిస్టమ్

గచ్చిబౌలి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): హైటెక్ సిటీలోని కేర్ ఆస్పత్రిలో ఏఐ ఆధారిత స్ట్రైకర్ మాకో రోబోటిక్ సర్జరీ సిస్టమ్‌ను ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, క్వాలిటీ కేర్ ఇండియా లిమిటెడ్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్‌ఖన్నా బుధవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రోగులకు మెరుగైన సేవలు అందించడంలో కేర్ ఆస్పత్రి చేస్తున్న కృషిని అభినందించారు. కేర్ హాస్పిటల్స్ గ్రూప్ చీఫ్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ నిఖిల్ మాథుర్ మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పనిచేసే స్ట్రైకర్ మాకో రోబోటిక్ సిస్టమ్ శస్త్రచికిత్సను కచ్చితంగా చేయడంలో సహాయపడుతుందన్నారు. ఇది మోకాలు, తుంటి మార్పిడి శస్త్రచికిత్సల్లో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. గ్రూప్ చీఫ్ సేల్స్ అండ్ మార్కెటింగ్ ఆఫీసర్ శలాబ్‌డాంగ్, ఆర్థోపెడిక్ సర్జన్లు పాల్గొన్నారు.

సైబరాబాద్‌లో 8 మంది ఇన్‌స్పెక్టర్ల బదిలీ

హైదరాబాద్ సిటీ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో 8 మంది ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ కమిషనర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ట్రాఫిక్ అడ్మిన్‌గా పనిచేస్తున్న జి.గురవయ్యను జీనోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా, మేడ్చల్ డీఐగా పనిచేస్తున్న ఎస్.సుధీర్ కృష్ణను సూరారం పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా, బాచుపల్లి ఎస్‌హెచ్‌ఓగా చేస్తున్న జె.ఉపేందర్ రావును ఈఓడబ్ల్యు విభాగానికి, రాయదుర్గం డీఐగా పనిచేస్తున్న సి.సతీష్ కుమార్‌ను బాచుపల్లి ఎస్‌హెచ్‌ఓగా, సీహెచ్.ధనుంజయకు పదోన్నతి కల్పిస్తూ డీఐ రాయదుర్గం పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. మేడ్చల్ డీఐగా పి.కిరణ్, సీసీఎస్ బాలానగర్ ఇన్‌స్పెక్టర్‌గా ఎ.రవికుమార్, సైబరాబాద్ ట్రాఫిక్ అడ్మిన్‌గా ఎస్.భరత్‌కుమార్ బదిలీ అయ్యారు. బదిలీ అయిన ఇన్‌స్పెక్టర్లు వెంటనే రిపోర్టు చేయాలని కమిషనర్ ఆదేశాల్లో పేర్కొన్నారు.

రెస్టారెంట్ మాటున డ్రగ్స్ దందా

● 'మల్నాడు కిచెన్' నిర్వాహకుడు సూర్య అరెస్ట్

హైదరాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో రెస్టారెంట్ మాటున డ్రగ్స్ దందా నడుపుతున్న ఓ నిర్వాహకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. అతడిని విచారించగా పలు కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. హైదరాబాద్ కొంపల్లి ప్రాంతంలో అన్నంనేని సూర్య(34) నాలుగేళ్లగా మల్నాడు కిచెన్ అనే రెస్టారెంట్‌ను నడుపుతున్నాడు. పబ్‌లకు వెళ్తూ మత్తుమందుల వాడకాన్ని ప్రారంభించిన అతడు.. తర్వాత తానే డ్రగ్ డీలర్ మారాడు. ఈ క్రమంలోనే అతడి గురించి ఈగల్ పోలీసులకు సమాచారం అందింది. దీంతో మల్నాడు కిచెన్ సమీపంలోనే సూర్య కారును ఆపి ఈగల్ బృందాలు సోదాలు నిర్వహించాయి. 10 గ్రాముల కొకైన్, 3.2 గ్రాముల ఓజీ కుష్ (గంజాయి), ఎక్స్‌టసీ మాత్రలను గుర్తించి సీజ్ చేశారు. 2021 నుంచి సూర్య ఇప్పటివరకు వివిధ ప్రాంతాల నుంచి 20 సార్లుకు పైగా డ్రగ్స్ తెప్పించినట్లు తమ విచారణలో తేలిందని ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్య తెలిపారు. 'సూర్యకు దేశంలోని డ్రగ్స్ స్మగ్లర్లే కాకుండా నైజీరియన్ల నుంచి మత్తుమందులు అందుతున్నాయి. కరీంనగర్‌కు చెందిన జువ్వాది సందీప్, హిమాయత్‌నగర్‌కు చెందిన హర్ష, ఖాజాగూడకు చెందిన పల్లెపాక మోహన్‌తో పాటు ఢిల్లీ, బెంగళూరు, గోవా నుంచి డ్రగ్స్ డీల్స్ చేస్తున్న నైజీరియన్ల నుంచి డ్రగ్స్ తెప్పించుకుంటున్నట్లు గుర్తించాం. హైదరాబాద్‌లోని కొన్ని పబ్‌ల్లో సూర్యతోపాటు అతడి స్నేహితులు డ్రగ్స్ తీసుకున్నారు. డ్రగ్స్ తీసుకునే వారి కోసం ఆయా పబ్‌ల్లో రహస్య గదులను ఏర్పాటు చేశారు. ప్రిజం పబ్, ఫార్మ్ పబ్, బ్లాక్ 22, బర్డ్ బాక్స్, కోరా, బ్రాడ్ వే, క్వాక్ ఎరీనాలో సూర్య డ్రగ్స్ తీసుకున్నట్లు తేలింది. ఈ పబ్‌లపై చర్యలు తీసుకుంటాం. సూర్య డ్రగ్స్‌ను వ్యాపారవేత్తలు, ఐటీ ఉద్యోగులు, జిమ్ పార్టనర్లు, డాక్టర్లు, పబ్ డైరెక్టర్లకు అమ్మేవాడు. అతడి నుంచి ఏపీకి చెందిన డాక్టర్ ప్రసన్న ఏడాదిలో 29 సార్లు డ్రగ్స్ కొన్నాడు' అని వివరించారు.

జాతీయ ఎస్టీ కమిషన్‌కు విజయ్ దేవరకొండ కేసు

న్యూఢిల్లీ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): గిరిజనులపై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణల కేసు జాతీయ ఎస్టీ కమిషన్‌కు చేరింది. బుధవారం ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్ ఎదుట విచారణ జరిగింది. ఫిర్యాదుదారుడు అశోక్‌కుమార్ రాథోడ్, పోలీసుల తరఫున మాదాపూర్ ఏసీపీ శ్రీధర్ విచారణకు హాజరయ్యారు. ఈ కేసులో విజయ్ దేవరకొండపై తీసుకున్న చర్యలేమిటి? అని కమిషన్ ప్రశ్నించింది. 15 రోజుల తర్వాత మరోసారి విచారిస్తామని, ఆ రోజు కేసు పురోగతిపై సమగ్ర వివరాలు అందించాలని ఆదేశించింది.

మీ టికెట్ యాప్ విస్తరణ

హైదరాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఎఎస్‌ఐ) పర్యవేక్షణలోని పలు వారసత్వ నిర్మాణాలతో పాటు మ్యూజియంలను సందర్శించేందుకు అనువుగా మీ టికెట్ యాప్‌ను విస్తరించనున్నట్టు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. సాలార్ జంగ్ మ్యూజియం, చార్మినార్, గోల్కొండ కోట, కొండాపూర్ (హైదరాబాద్) లోని ఆర్కియలాజికల్ సైట్ మ్యూజియం, వరంగల్ కోట తదితర చారిత్రక నిర్మాణాలు సందర్శించే అవకాశం ఉందన్నారు. విస్తరణతో అదనంగా కాళేశ్వరం, బాసర, యాదగిరిగుట్ట తదితర ఆధ్యాత్మిక కేంద్రాలను సందర్శించేందుకు తెలంగాణ టూరిజం ప్యాకేజీలను యాప్‌లో విలీనం చేయనున్నారు.

42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం ఉద్యమం

15న ఇందిరాపార్కు వద్ద బీసీల మహాధర్నా



బీసీల మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్ గౌడ్, చిరంజీవులు, కుమార్‌గౌడ్ తదితరులు

పంజాగుట్ట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం ఉద్యమం చేపట్టనున్నట్లు మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు, వెనుకబడిన తరగతుల ప్రజా ప్రతినిధుల వేదిక అధ్యక్షుడు అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఈ నెల 10న జరిగే కేబినెట్ సమావేశంలో రిజర్వేషన్ల అమలుపై నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో బీసీ మేధావుల సంఘం కన్వీనర్, ఐఏఎస్ మాజీ అధికారి టి. చిరంజీవులు, ఎంపీటీసీ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు గడిల కుమార్‌గౌడ్, రాష్ట్ర సర్పంచుల సంఘం జేఏసీ అధ్యక్షుడు ఎస్.యాదయ్య గౌడ్, సర్పంచుల సంఘం ప్రధాన కార్యదర్శి ప్రనీల్ చందర్‌తో కలిసి ఈ నెల 15న చలో హైదరాబాద్ పేరుతో ఇందిరాపార్కు వద్ద నిర్వహించనున్న బీసీల మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో బీసీ సంఘాల నాయకులు బాలగోని బాలరాజ్ గౌడ్, పొన్నం దేవరాజ్‌గౌడ్, ఐలి వెంకన్నగౌడ్, అంబాల నారాయణ, కొండల్ గౌడ్, బి.సిద్ధేశ్వర్ పాల్గొన్నారు.

జీవో జారీ చేసిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి

పంజాగుట్ట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థలు, విద్య, ఉద్యోగ రంగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తూ జీవో జారీ చేసిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని ఎంపీ ఆర్.కృష్ణయ్య, బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారామ్ యాదవ్ డిమాండ్ చేశారు. బీసీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కృష్ణయ్య మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయకపోతే మండల్-2 తరహాలో మరో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో నేషనల్ పొలిటికల్ జస్టిస్ ఫ్రంట్ చైర్మన్ వి.జి.ఆర్ నారగోని, బి.సిద్ధేశ్వర్, బీసీ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న ఆర్.కృష్ణయ్య, గుజ్జ కృష్ణ, దుర్గనరేష్ తదితరులు

23, 24 తేదీల్లో ఓబీసీల జాతీయ సదస్సు

● 42 శాతం రిజర్వేషన్లపై జీవో జారీ చేయకపోతే ప్రభుత్వంపై యుద్ధమే : ఆర్. కృష్ణయ్య

బర్కత్‌పుర, జూలై 9 (ఆంధ్రజ్యోతి): బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23, 24 తేదీల్లో చలో ఢిల్లీ ఓబీసీల జాతీయ సదస్సులు నిర్వహిస్తున్నట్లు రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య వెల్లడించారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, ఏపీ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బి.దుర్గనరేష్ ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లపై జీవో జారీ చేయకపోతే రాష్ట్ర ప్రభుత్వంపై యుద్ధం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నేతలు జిల్లపల్లి అంజి, పగిల్ల సతీష్, మోదీ రాందేవ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన దాసరి

విద్యార్థులు లక్ష్యాలను సాధించాలి

● కలెక్టర్ హరిచందన సూచన

హైదరాబాద్ సిటీ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఒడిదుడుకులను అధిగమించి లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి సూచించారు. బుధవారం షేక్‌పేట సాంఘికసంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను కలెక్టర్ సందర్శించారు. యోగ, ధ్యానం, వ్యాయామంతో మానసిక ఒత్తిడిని తగ్గించుకోవచ్చన్నారు. టీనేజ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, వ్యక్తిత్వ వికాస నిపుణులు డా.లలితా ఆనంద్ కౌమర దశలో ఉన్న విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి గెట్ ఆసమ్ పేరిట వర్క్ షాప్ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బాలస్వామి, అధ్యాపకులు, బాలరాజు, భీమయ్య పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో సత్తా చాటుదాం : హరీశ్‌రావు

హైదరాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో సత్తా చాటుదామని బీఆర్ఎస్ శ్రేణులకు ఎమ్మెల్యే హరీశ్‌రావు పిలుపునిచ్చారు. మాజీ మంత్రులు మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ హైదరాబాద్ మైనార్టీ విభాగం సమావేశాన్ని తెలంగాణ భవన్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ తమది సెక్యులర్ ప్రభుత్వమని చెప్పుకొనే కాంగ్రెస్.. 20 నెలలు గడుస్తున్నా ఒక్క మైనార్టీనేతను మంత్రిగా చేయలేదన్నారు. హైడ్రా, మూసీ పేర్లతో రేవంత్ సర్కార్ ముస్లింల ఇళ్లను కూల్చి వారికి గూడులేకుండా చేసిందన్నారు. మైనార్టీల కోసం ఎన్నికలప్పుడు హామీలు గుప్పించిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చాక వాటి అమలును పట్టించుకోవడం లేదని విమర్శించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్‌కు బుద్ధిచెప్పాలని మహమూద్‌అలీ, తలసాని, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ మైనార్టీలను కోరారు.

అమెజాన్‌పై వినియోగదారుడి విజయం

● పనిచేయని సౌండ్ బార్
● రూ. 10 వేలు పరిహారం చెల్లించాలని వినియోగదారుల ఫోరం తీర్పు

హైదరాబాద్ సిటీ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కంపెనీ డిఫెక్ట్ ఉన్న ఉత్పత్తులను విక్రయించిన సంస్థలతోపాటు, విక్రయించిన ఆన్‌లైన్ ఈ కామర్స్ సంస్థ అమెజాన్‌కు హైదరాబాద్ వినియోగదారుల ఫోరం-1 షాకిచ్చింది. ప్రొడక్ట్‌ను తిరిగి తీసుకోవడంతోపాటు రూ. 10 వేల నష్టపరిహారం చెల్లించాలని తీర్పు ఇచ్చింది. రహ్మత్‌నగర్‌కు చెందిన ప్రైవేటు ఉద్యోగి గజ్జెల శ్రీనివాస్ రూ.19,999 చెల్లించి అమెజాన్‌లో బోట్ 500 వాట్ బ్లూటూత్ సౌండ్ బార్‌ను గత ఏడాది జనవరిలో కొనుగోలు చేశాడు. దాన్ని ఇన్‌స్టాల్ చేయడానికి వచ్చిన టెక్నీషియన్ అందులో సమస్య ఉందని చెప్పడంతో రీప్లేస్ చేశాడు. వారం రోజుల్లో కొత్త సౌండ్ బార్ పంపించినా అందులో కూడా అదే సమస్య ఉత్పన్నమైంది. దాంతో వినియోగదారుడు శ్రీనివాస్ అమెజాన్ కస్టమర్ కేర్‌ను సంప్రదించగా, సర్వీస్ వారెంటీ కోసం విక్రేతలను సంప్రదించాలని సూచించారు. సంస్థ ప్రతినిధులు సౌండ్‌బార్‌ను రిపేర్ చేసేందుకు టెక్నీషియన్‌ను 10 రోజుల తర్వాత పంపారు. సౌండ్‌బార్‌ను పరిశీలించిన టెక్నీషియన్ ఫ్యాన్ చెడిపోయిందని, స్పేర్‌పార్ట్‌లు అందుబాటులో లేని కారణంగా ఆర్డర్ చేసి తెప్పించాలని చెప్పాడు. వినియోగదారుడు పలుమార్లు కస్టమర్ కేర్ ప్రతినిధులను సంప్రదించగా స్పేర్‌పార్ట్ రాలేదని చెబుతూ తర్వాత సమాధానం చెప్పకుండా ఫోన్ కట్ చేయడం ప్రారంభించారు. బాధితుడు సౌండ్‌బార్ విక్రయించిన రిటైల్, మార్కెటింగ్ సంస్థలతోపాటు అమెజాన్‌ను ప్రతివాదులుగా చేరుస్తూ వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేశాడు. ఇరు పక్షాల వాదనలు, సాక్ష్యాధారాలు పరిశీలించిన వినియోగదారుల ఫోరం-1 ప్రెసిడెంట్ బి. ఉమావెంకట సుబ్బలక్ష్మి, సభ్యులు సి. లక్ష్మీప్రసన్న బెంచ్ వినియోగదారుడికి సేవాలోపం జరిగినట్లు గుర్తించింది. అమెజాన్‌తోపాటు రిటైల్ సంస్థలు కలిసి బాధితుడు సౌండ్‌బార్ కొనుగోలుకు వెచ్చించిన రూ.19999, మానసిక వేదనకు గురిచేసినందుకు రూ.10 వేల పరిహారం, కోర్టు ఖర్చుల నిమిత్తం మరో రూ. 5 వేలు 45 రోజుల్లో చెల్లించాలని ఫోరం ఆదేశాలు జారీ చేసింది.

'స్వేచ్ఛ' దోషులను కఠినంగా శిక్షించాలి



స్వేచ్ఛ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శ్రీనివాస్‌గౌడ్, సీనియర్ పాత్రికేయులు కె.శ్రీనివాస్, అల్లం నారాయణ తదితరులు

పంజాగుట్ట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): స్వేచ్ఛ జీవితమంతా ప్రశ్నించే గొంతును అవుదామని అనుకుందని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆమె మృతిపై సమగ్ర విచారణ చేయాలని, దోషులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ఇటీవల మృతిచెందిన యాంకర్ స్వేచ్ఛ సంస్మరణ సభ బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగింది. సీనియర్ పాత్రికేయులు కె.శ్రీనివాస్, అల్లం నారాయణ టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతిసాగర్, రమణ, యోగానంద్ తదితరులు ఆమె చిత్రపటం వద్ద నివాళులర్పించారు. స్వేచ్ఛ కుమార్తె ఎవరిమీద ఆధారపడకుండా కొంతడబ్బు ఆమె పేరుమీద డిపాజిట్ చేయాలని శ్రీనివాస్‌గౌడ్ సూచించారు. స్వేచ్ఛ ఎపిసోడ్ చాలా విషాదకరమని కె.శ్రీనివాస్ అన్నారు. మీడియా బాధితుల పక్షాన ఉండాలని అల్లం నారాయణ అన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, జర్నలిస్టులు సూరజ్ భరద్వాజ్, నవీన్, వి.బాపురావు, కవిత, గోపరాజు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

General public here by informed that by my client **M/s RR ASSOCIATES & CO.** Address: ## No.-65/HMT Officers, Co-Operative Housing Society, Alwal, Medchal, represented by **MADHUSUDHAN REDDY N,** S/o. N. Hanma Reddy aged about 55 years, Residing at 1-5-1015/44, MANJEERA NAGAR COLONY, Alwal (M), Alwal, Medchal-Malkajigiri, Telangana, 010. have accepted the offer extended by the land lords and intended to enter in to the Agreement of Sale to purchase the following property for legal sale consideration i.e., **the** Non-Agriculture Dry Land covered in Sy No's. **247** extents of **Ac.05.00gts,** in Sy No. **248** extent of **Ac.02.22gts,** in Sy No. **249** extent of **Ac.01.00gts,** in Sy No. **250** extent of **Ac.03.32gts** and in Sy No. **251** extent of **Ac.00.10gts,** thus Total Admeasuring **A.c12.24gts** Situated at **KANDLAKOYA** Revenue Village Medchal Mandal and Medchal Malkajigiri District Telangana State, under Sub Registrar Medchal, total extent bounded by **NORTH:** Sy No's 247/Part & 248/Part **SOUTH:** Sy No's 247/Part, 240/Part & 250/Part, **EAST:** Sy No. 251/Part, **WEST:** Existing Road, from/with **1.** LALITA CONSTRUCTION Rep by M. ASHOK KUMAR JAIN S/o Mangl Chand Jain age 57 years, Occupation Business, R/o 7-1-40,41 Mangle-deep, Bandimet Opp. Lane to Palika Bazar, Monda Market Secunderabad, Hyderabad, **2.** MANTHENA RAVI VARMA RAJU S/o Venkata Rama Raju age 54 yrs. **3.** MANTHENA RAMYA SRI D/o Manthena Ravi Varma, age 24 years, R/o: Flat No. 702, Shreya Towers, Sri Vensal Projects, Kompalli, Medchal Malkajigiri Dist. **4.** PABBA MAHESH S/o Ramesh age 44 years, and **5.** PABBA SWATHI W/o Pabba Mahesh, age 38 years, R/o Flat No. G3, Usha Residency Venkateshwara Enclave, Suchitra X Road, Jedimetla, Medchal Malkajigiri Dist. Telangana, by paying substantial/ significant advance amount. VENDORS/Land Lords who are got ownership and legal rights through registered **Sale Deeds** Document No's 821/2023, 822/2023, 813/2023, 819/2023 and 820/2023 respectively dated 9th July 2023 registered at Tahsildar Joint Sub Registrar Medchal Mandal from its legal owners, the same was mutated in the Revenue Records and got issued Mutation Proceedings & Title Deeds in their favor, Vide No's T06100250271(60049), T06100250651(60387), T06100250648(60384), T06100250649(60385), & T06100250650(60386) respectively, and paid some substantial advance amount, pro looking to enter in to the Sale Deed as soon as possible and the balance sale consideration will be paid by my client at the time of registration of the schedule property on company or nominees name.

The VENDORS assure and covenant that there are no encumbrances, charges, mortgages, etc., gift or court proceedings (civil or criminal) whatsoever in respect of the schedule property and that, further assure that the schedule property is not covered under any statutory provision having any clog against alienation of the land.

If any person (s) or institution (s) asserting/ aver any claim right, title or interest over the above said schedule property having any objection of any manner to the above said transaction i.e. lease, mortgages, attachments, sale, prior sale, charges, Gift, court proceedings (Civil or Criminal) pending, license, trust, legal hereditary rights, gratification right, security and surety etc., whatsoever in nature and there is any prior agreements, counter orders, disputes, litigations or any tax or revenue attachments or notices from the authorities in respect of the said property or relating there etc., may put forth/submit his/ their objections before the undersigned along with (original) documentary proof within **15 (Fifteen)** days from the date of publication of this notice. If objections are not received within said period my client will proceed on the basis that there are no claims of whatsoever nature in respect of the above said property and any objections raised thereafter will not be entertained, and my client will not accountable and bind on future proceedings.

Sd/- A. VENKATA RAMANA REDDY, M.A., L.L.B. Advocate,
Flat No: 504, NMR-GSR Residency, Friends Colony,
Chanda Nagar. Hyd-50 Cell:9440401098

ఒక్కో కుటుంబానిది ఒక్కో వ్యథ

(5వ పేజీ తరువాయి)

ఇంటికి వచ్చారు. మరోసారి అస్వస్థతకు గురికావడంతో హాస్పిటల్‌కు ఆటోలో తీసుకెళ్తున్న క్రమంలో ప్రాణాలు కోల్పోయాడు.

రెండు నెలల క్రితమే భర్త మృతి

హైదర్‌నగర్‌లోని నామ్‌నరేష్‌నగర్ నివాసి స్వరూప (61) మంగళవారం నిజాంపేటరోడ్డులోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయింది. ఆమె కుమారుడు తల్లిని బతికించుకునేందుకు జాగ్రత్త తీసుకున్నా ప్రాణాలు దక్కలేదు. రెండు నెలల క్రితమే ఆమె భర్త అనారోగ్యంతో చనిపోయాడు. తల్లిదండ్రులు చనిపోవడంతో కుమారుడు తీవ్ర విషాదంలో ఉన్నాడు.

చికిత్సకు కాలయాపన చేయడంతో..

కల్తీకల్లు తాగిన నారాయణమ్మ గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. 20 ఏళ్లగా నారాయణమ్మ(65) సాయిచరణ్ కాలనీలోనే నివాసం ఉంటోంది. భర్త 15 ఏళ్ల క్రితమే చనిపోవడంతో ఇద్దరు ఆడపిల్లలను పెంచి పెద్దచేసింది. కొవిడ్ సమయంలో పెద్ద కుమార్తె చనిపోయింది. చిన్న కుమార్తెకు వివాహం చేసింది. పేరు రాయించుకున్నారా? మందులు తెచ్చుకోండి.. అంటూ ఆస్పత్రిలో కాలయాపన చేయడంతో అత్త చనిపోయిందని అల్లుడు వాపోతున్నాడు.

ఉసురు తీసిన 'కల్తీ'

(5వ పేజీ తరువాయి)

కర్ణాటక రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటున్నట్లు సమాచారం. అల్ప్రాజోలమ్, డైజోఫాం వంటి మత్తు కెమికల్స్‌ను కలిపి కల్తీ కల్లును తయారుచేసి విక్రయిస్తూ రూ.కోట్లకు పడగలెత్తుతున్నారు.

అడ్డాకూలీలు.. పేద కార్మికులే బలి..

కల్లు దుకాణాలకు వెళ్తున్న వారిలో పేద ప్రజలే ఉంటున్నారు. కూకట్‌పల్లి, మూసాపేట లాంటి ప్రాంతాల్లో ఒక్కో దుకాణానికి రోజూ 150-200 మంది వస్తున్నట్లు అక్కడి నిర్వాహకులు పేర్కొంటున్నారు. వారిలో అడ్డా కూలీలు, పారిశుధ్య కార్మికులు, బిచ్చగాళ్లు, కూలీనాలీ చేసుకునేవారే అధికంగా ఉంటున్నారు. కల్తీకల్లుకు అలవాటు పడినవారు వ్యసనపరులుగా మారుతుంటారని నిపుణులు చెప్తున్నారు. తాగడం ఆపితే ఫిట్స్ రావడం, నాలుక కరుచుకుని వెకిలి చేష్టలు, పిచ్చిపిచ్చిగా ప్రవర్తించడం వంటి చర్యలకు పాల్పడతారని పేర్కొంటున్నారు. అందులో కలిపే కెమికల్స్ వల్ల చిన్న వయసులోనే గుండెపోటు రావడం, రోడ్డుపై స్పృహలేకుండా పడిపోవడం వంటివి చోటు చేసుకుంటున్నాయి.

పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు

గతంలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తరచూ కల్లు కాంపౌండ్‌లపై వరుసగా దాడులు నిర్వహించి కల్తీకల్లు విక్రయిస్తున్న దుకాణాలను మూసివేసేవారు. అల్ప్రాజోలమ్ వంటి రసాయనాలను సీజ్ చేసేవారు. ప్రస్తుతం నగర శివారులోని అనేక ప్రాంతాల్లో కల్తీ కల్లు నిర్వాహకులు జోరుగా వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. కల్తీగాళ్లకు పరోక్షంగా ఎక్సైజ్ అధికారులు సహకరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

ప్రధానమంత్రి పంపితే వచ్చా

(5వ పేజీ తరువాయి)

జీవైరెడ్డి నగర్‌లోని డబుల్ బెడ్రూం ఇళ్లను పరిశీలించారు. కొన్ని ఇళ్లలోకి వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడారు. డబుల్ బెడ్ రూం ఇళ్ల మంజూరు కాక ముందు.. ఆ తర్వాత పరిస్థితులు ఎలా ఉన్నాయి? ఇప్పుడెలా ఉన్నాయి? అని ఆరా తీశారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను వినియోగించుకుంటున్నారా అని అడిగారు. ముందుగా ఖైరతాబాద్‌లో డబుల్ ఇళ్లపై ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనను తిలకించారు. మన్మీత్ కౌర్‌కు పుష్పగుచ్ఛం అందించి జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శి ఇలంబరిది స్వాగతం పలికారు.

దివ్యాంగ ఉపకరణాలకు 10,770 దరఖాస్తులు

ఓల్డ్‌మలక్‌పేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం దివ్యాంగులకు ఉచితంగా అందించే సహాయ ఉపకరణాల కోసం రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల నుంచి 10,770 దరఖాస్తులు వచ్చాయని దివ్యాంగ సంక్షేమ శాఖ సంయుక్త సంచాలకులు బి. శైలజ తెలిపారు. అర్హుల ఎంపిక జాబితా కొనసాగుతోందన్నారు. ఈనెలాఖరులోపు లబ్ధిదారులకు ఉపకరణాలు అందిస్తామన్నారు. బ్యాటరీ మినిట్రేడింగ్ ఆటో వెహికల్స్‌కు, రెట్రోఫిట్ మోటార్ వెహికిల్స్‌కు ఎక్కువ డిమాండ్ ఉందన్నారు.

ఆంధ్రజ్యోతి Daily CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, R. Amrita. D/o V. Ramesh R/o. Plot No:12-2-709/48, Navodaya colony, Gudimalkapur,Hyderabad-28.Have Changed my Name from R. AMRITA to RAMESH AMRITA AJH-003326

★ I, R. Akhila, D/o V. Ramesh R/o. Plot No: 12-2-709/48, Navodaya colony, Gudimalkapur, Hyderabad-28 Have Changed my Name from R. AKHILA to RAMESH AKHILA AJH-003327

★ I, ALUKA SUNEEL KUMAR REDDY S/o ALUKA MADHAVA REDDY,R/o:11-9-78/3, Laxminagar Colony,Kothapet, Saroornagar, R.R Dist.,TG-35.Have Changed my Name as ALUKA SUNIL KUMAR REDDY AJH-003328

★ I, Mohammad Maqbool, R/o 4-72/1, Savaran Veedi, Wanaparthy, declare that my name was mistakenly written as Mohammed Maqbool in my passport. I have now changed my name to Mohammad Maqbool AJH-2572

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ADVT

క్లాసిఫైడ్స్ ప్రకటనల కొరకు ఈ క్రింది నంబర్లను సంప్రదించగలరు.
99859 21380, 99859 21386
97036 18806

కౌన్సెలింగ్

గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ ప్రాణాంతకమా?

Q A

డాక్టర్ గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ గురించి ఎన్నో ఉదంతాలు వింటున్నాం. ఈ క్యాన్సర్‌ను ముందుగానే ఎలా పసిగట్టాలి? ఈ వ్యాధి సోకకుండా ఏదైనా వ్యాక్సీన్ ఉందా?

- ఓ సోదరి, హైదరాబాద్

క్యాన్సర్ అనగానే ఇక చావు దగ్గర పడిందనే నిర్ధారణకొస్తాం. కానీ నిజానికి మహిళల్లో ఎక్కువగా కనిపించే రొమ్ము క్యాన్సర్‌తో పోలిస్తే, సర్వైకల్ క్యాన్సర్‌ను కనిపెట్టడం, చికిత్స చేయడం తేలిక. రొమ్ము క్యాన్సర్ పక్కదారి పట్టిస్తుంది. ఆలస్యంగా, చివరి దశలో కనిపెట్టినప్పుడు చికిత్స క్లిష్టమై ప్రాణాంతకంగా మారుతూ ఉంటుంది. కానీ గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ పూర్తి భిన్నం.

లక్షణాలు

గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ తొలి దశలో లక్షణాలేవీ కనిపించకపోవచ్చు. తర్వాతి దశల్లో లక్షణాలు ఎలా ఉంటాయంటే...

- నెలసరి మధ్యలో, నెలసరి తర్వాత, శారీరక కలయిక సందర్భంలో యోని నుంచి రక్తస్రావం కనిపిస్తుంది.
- నీరు, రక్తంతో కూడిన స్రావాలు కనిపిస్తాయి. ఎక్కువగా విడుదలయ్యే ఆ స్రావాల నుంచి దుర్వాసన వెలువడుతుంది.



- నడుము నొప్పి, అసౌకర్యం ఉంటుంది.

కారణాలు

గతంతో పోలిస్తే గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ కేసులు ఈ మధ్య కాలంలో విపరీతంగా పెరుగుతున్నాయి. ఇందుకు పర్యావరణ మార్పులు, ఆహార, జీవనశైలి మార్పులు ప్రధాన కారణాలు. అయితే ఈ రకమైన క్యాన్సర్ సోకడానికి కచ్చితమైన కారణాన్ని కనిపెట్టలేకపోయినా, ఈ క్యాన్సర్ వృద్ధిలో హెచ్‌పివి (హ్యూమన్ పాపిలోమా వైరస్) పాత్ర ప్రధానంగా ఉంటున్నట్టు నిర్ధారణ అయింది. అయితే ఈ వైరస్ సోకిన ప్రతి ఒక్కరూ, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌కు గురి కాకపోయినా, కొందర్లో ఆ వైరల్ ఇన్‌ఫెక్షన్ సర్వైకల్ క్యాన్సర్‌గా వృద్ధి చెందుతోంది. ఇందుకు కారణం పర్యావరణ, జీవనశైలి, ఆహారశైలిల్లో చోటు చేసుకున్న మార్పులు అందుకు తోడవడమే! ఈ కారణాలతో పాటు సర్వైకల్ క్యాన్సర్‌కు మరికొన్ని కారణాలు దోహదపడతాయి. అవేంటంటే...

- **ఒకటికి మించి లైంగిక సంబంధాలు:** ఎన్ని ఎక్కువ లైంగిక సంబంధాలు కలిగి ఉంటే, హెచ్‌పివి ఇన్‌ఫెక్షన్ సోకే అవకాశాలు అంత ఎక్కువగా ఉంటాయి.
- **లైంగిక వ్యాధులు:** క్లమీడియా, గనేరియా, సిఫిలిస్, హెఐవి ఇన్‌ఫెక్షన్ హెచ్‌పివి ఇన్‌ఫెక్షన్ సోకే అవకాశాలను పెంచుతాయి.

పరీక్షలు కీలకం

- **పాప్‌స్మియర్ టెస్ట్:** ఈ పరీక్షతో సర్విక్స్‌లోని కణాలు, వాటిలో చోటు చేసుకుంటున్న మార్పులు, సర్వైకల్ క్యాన్సర్ దారితీసే అవకాశాలను కనిపెట్టవచ్చు. లైంగిక జీవితాన్ని కొనసాగిస్తున్న ప్రతి మహిళా ఈ పరీక్ష చేయించుకోవడం అవసరం. వరుసగా మూడేళ్ల పాటు పరీక్ష ఫలితం నెగటివ్ వస్తే, అప్పటి నుంచి ప్రతి మూడేళ్లకోసారి ఈ పరీక్ష చేయించుకుంటే సరిపోతుంది.
- **హెచ్‌పివి డిఎన్ఎ టెస్ట్:** లైంగిక జీవితాన్ని కొనసాగిస్తున్న ప్రతి మహిళా ఈ పరీక్ష చేయించుకోవడం అవసరం. ఫలితం నెగటివ్ వస్తే, అప్పటి నుంచి ఐదేళ్లకోసారి ఈ పరీక్ష చేయించుకుంటే సరిపోతుంది.

హెచ్‌పివి వ్యాక్సిన్

సర్వైకల్ క్యాన్సర్‌కు ప్రధాన కారణమైన హెచ్‌పివి వైరస్‌కు అడ్డుకట్ట వేసే వ్యాక్సీన్ ఇది. 9 ఏళ్ల మొదలు 45 ఏళ్ల లోపు మహిళలు ఈ వ్యాక్సీన్ వేయించుకోవచ్చు.

- డాక్టర్ సచిన్ మర్ద
ఆంకాలజిస్ట్, హైదరాబాద్

ఉక్కు మహిళ

క్రీడలంటే ఇష్టం. వ్యాపార రంగంపై ఆసక్తి. రెండిటిలోనూ రాణించాలనేది ఆమె ఆకాంక్ష. జాతీయ స్థాయి స్విమ్మర్‌గా క్రీడల్లో రాణిస్తూనే.. ఉన్నత విద్యాభ్యాసం కోసం లండన్ వెళ్లింది. అక్కడ చదువుకొంటూనే ఐరన్‌మ్యాన్ ట్రయథ్లాన్ కోసం సన్నద్ధమయింది. ఇప్పుడు మాస్టర్స్ పూర్తి చేయడంతో పాటు.. అక్టోబరులో జరిగే ప్రపంచ ఐరన్‌మ్యాన్ చాంపియన్‌షిప్‌కు అర్హత పొందింది. ఈ ఘనత సాధించిన తొలి భారత మహిళగా చరిత్ర సృష్టించిన బొమ్మినేని సంజనారెడ్డిని 'నవ్య' పలుకరించింది.



"ఐరన్‌మ్యాన్ వరల్డ్ చాంపియన్‌షిప్'నకు అర్హత సాధించిన తొలి భారత మహిళగా గుర్తింపు పొందడం సంతోషంగా అనిపిస్తోంది. నాకు క్రీడలంటే ఇష్టం. వ్యాపార రంగంపై ఆసక్తి. ఇప్పుడు ఈ రెండిటినీ బ్యాలెన్స్ చేస్తూ భవిష్యత్‌ను తీర్చిదిద్దుకునే పనిలో ఉన్నా. నేను పుట్టి.. పెరిగిందంతా హైదరాబాద్‌లోనే. నాన్న వెంకట్‌రెడ్డి ఇంజినీర్. ప్రస్తుతం ఒక ఇన్‌ఫ్రా కంపెనీ నడుపుతున్నారు. అమ్మ స్వప్న అందులో డైరెక్టర్. నేను ఇంటర్మీడియేట్ వరకు హైదరాబాద్‌లోనే చదువుకున్నా. 2020లో గ్రాడ్యుయేషన్ కోసం లండన్ వెళ్లా. 'యూనివర్సిటీ ఆఫ్ బర్మింగ్‌హామ్'లో బీఎస్సీ ఎకనామిక్స్, తాజాగా ఎమ్మెస్సీ అర్బన్ ఎకనామిక్ డెవలప్‌మెంట్‌లో మాస్టర్స్ పూర్తి చేశా. నా చదువు, విదేశాల్లో నేను గడించిన అనుభవం స్వదేశానికి ఉపయోగపడాలనే లక్ష్యంతో తిరిగి భారత్‌కు వచ్చేశా.

ప్రొఫెషనల్ స్విమ్మర్‌గా..

సైక్లింగ్, స్విమ్మింగ్, స్కేటింగ్, తైక్వాండో, భరతనాట్యం ఇలా నేను ఏది నేర్చుకుంటానని అడిగినా ఇంట్లో అడ్డు చెప్పేవారు కాదు. ప్రతి శిక్షణకూ అమ్మ నన్ను వెంటబెట్టుకుని తీసుకెళ్లేది. నా ఇష్టాన్ని తెలుసుకొని ప్రోత్సహించేది. ఇవన్నీ ప్రయత్నించాక నాకు స్విమ్మింగ్‌పై మక్కువ కలిగింది. గచ్చిబౌలి స్టేడియంలో ప్రొఫెషనల్ స్విమ్మింగ్ నేర్చుకోవడం ప్రారంభించా. ఫ్రీస్టయిల్ 800, 1500 మీటర్ల ఈవెంట్లలో 2018, 2019ల్లో రాష్ట్ర చాంపియన్‌గా నిలిచా. జాతీయ పోటీల్లో పాల్గొన్నాను కానీ పతకాలు గెలవలేకపోయా. ఆ దశలో క్రీడలు, చదువు రెండింట్లో ఏది ఎంచుకోవాలనే ప్రశ్న ఉదయించినప్పుడు నా ముందు ఉన్న రెండు దారుల గురించి ఒకసారి ఆలోచించా. క్రీడాకారుల కెరీర్ ఎనిమిది నుంచి పదేళ్లే. ఆసియా క్రీడలు, ఒలింపిక్స్ ఆ తర్వాత ఏంటి? అంత దూరం వెళ్లడానికి అప్పట్లో క్రీడా రంగానికి ప్రభుత్వాల సహకారం పెద్దగా ఉండేది కాదు. మన దగ్గర క్రీడా మౌలిక సదుపాయాలు అంతంతమాత్రమే. ఇక చదువు... వ్యాపార రంగంపై ఆసక్తి ఉండడంతో దానికి సంబంధించిన కోర్సులు చేస్తే భవిష్యత్తుకు భరోసా ఉంటుందని భావించాను. మన దేశం అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోంది. కొత్త ఆలోచనలతో స్టార్టప్స్ ప్రారంభిస్తే వ్యాపార రంగంలో రాణించవచ్చు అనిపించి ఉన్నత చదువులు కోసం యూకే వెళ్లా.

అలా మొదలైంది...

నేను పదో తరగతి చదువుతున్నప్పుడు యూట్యూబ్‌లో ఐరన్‌మ్యాన్ చాంపియన్‌షిప్ గురించి తొలిసారి తెలుసుకున్నా. తర్వాత దాని గురించి ఇంటర్నెట్‌లో శోధించా. కానీ ఐరన్‌మ్యాన్‌లో పాల్గొనేందుకు అవసరమైన శిక్షణ, సదుపాయాలు మన దగ్గర అందుబాటులో లేవని తెలిసి అప్పటికి ఆ ఆలోచనను పక్కన పెట్టా. అయితే లండన్ వెళ్లాక అక్కడున్న క్రీడా మౌలిక సదుపాయాలు చూశాక నాలోని క్రీడాకారిణి మేల్కొంది. ఐరన్‌మ్యాన్‌కు సన్నద్ధమైతే బాగుంటుందని అనిపించింది. అలా 2023లో సాధన మొదలుపెట్టా. చదువును నిర్లక్ష్యం చేయలేదు. తరగతులకూ హాజరవుతూనే ఉదయం మూడు గంటలు, రాత్రి మూడు గంటలు సాధన చేసేదాన్ని. అండర్ గ్రాడ్యుయేషన్, మాస్టర్స్ రెండూ డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణత సాధించా. మరోవైపు ఐరన్‌మ్యాన్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు బ్రిటన్ కోచ్ థామస్ హంట్ దగ్గర శిక్షణ ప్రారంభించా.

ఇష్టపడి చేస్తే...

ఒకరి బలవంతం లేకుండా మనకు నచ్చి చేస్తే ఏ పనీ కష్టంగా అనిపించదు. యూనివర్సిటీకి ఒక్క రోజు కూడా సెలవు పెట్టకుండానే సాధన చేసేదాన్ని. ఐరన్‌మ్యాన్ ట్రయథ్లాన్ చాంపియన్‌షిప్‌లో మూడు ఈవెంట్లు ఉంటాయి. స్విమ్మింగ్, సైక్లింగ్, మారథాన్. ఇవన్నీ ఒక్క రోజులోనే పూర్తి చేయాలి. నేను స్వతహాగా స్విమ్మర్‌ను కావడంతో చిన్నప్పటి నుంచీ రోజూ లేవగానే వ్యాయామాలు చేసే అలవాటు ఉండడంతో నాకు ఈ పోటీలో పాల్గొనడం కాస్త సులువు అయింది.

> **ఆడపిల్లలకు స్వేచ్ఛ ఇవ్వాలి...**
>
> మా స్కూల్‌లో నాలుగో తరగతి వరకు అబ్బాయిలతో అమ్మాయిలు అన్ని క్రీడల్లో పోటీపడేవారు. పై తరగతులకు వెళ్లేకొద్దీ నా స్నేహితులు చాలామందిని వాళ్ల తల్లిదండ్రులు 'ఆటలెందుకు. బాగా చదువుకో' అని కట్టడి చేసేవారు. కొందరినేమో ఆటలా.. చదువా? ఏదో ఒకటి తేల్చుకో' అనేవారు. దీనివల్ల చాలామంది అమ్మాయిలు తప్పనిసరి పరిస్థితుల్లో చదువునే కెరీర్‌గా ఎంచుకుంటున్నారు. ఈ ధోరణి మారాలి. ఆడపిల్లల ఆశయాలకు కుటుంబం అండగా ఉండాలి.

వెనక్కి తగ్గలేదు...

ఆస్ట్రేలియాలో గత నెల 15న జరిగిన 'ఐరన్‌మ్యాన్' అర్హత పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచాను. తద్వారా వచ్చే అక్టోబరులో హవాయిలో జరిగే వరల్డ్ చాంపియన్‌షిప్‌కు అర్హత సాధించా. ఆస్ట్రేలియాలో జరిగిన ఈ అర్హత పోటీల్లో సముద్రంలో ఈదాల్సి వచ్చింది. ఇండోర్ స్విమ్మింగ్ పూల్స్‌లో సాధన చేసి.. ఒక్కసారిగా సముద్రపు ఉప్పు నీటిలో ఈత కొట్టడం కష్టంగా అనిపించింది. దీనికి తోడు నాకు కంటి చూపు సమస్య ఉండడంతో 'ఐ లెన్స్' వాడతాను. కాంటాక్ట్ లెన్స్ నీళ్లలో పెట్టుకోకూడదు. అలాగని అవి లేకపోతే నాకు సరిగ్గా కనిపించదు. అందుకే లెన్స్ తడవకుండా స్విమ్మింగ్ గాగుల్స్ పెట్టుకున్నా. కొంచెం దూరం ఈదిన తర్వాత గాగుల్స్ నుంచి కళ్లలోకి ఉప్పు నీరు వెళ్లిపోయాయి. కానీ వెనక్కి తగ్గలేదు. గంట 47 నిమిషాల్లో 3.8 కిలోమీటర్లు ఈదాను.

చూడలేకపోయా...

నీళ్లల్లో నుంచి బయటికి వచ్చాక కుడి కన్నుతో అసలు చూడలేకపోయా. రెండు కళ్లల్లో నుంచి అదే పనిగా నీళ్లు కారుతూనే ఉన్నాయి. ఇక్కడితో ఆపేద్దామా? అని మధ్యలో అనుకున్నాను. కానీ మధ్యలో వదిలేస్తే రెండేళ్ల శిక్షణ వృథా అవుతుందని.. నాకు నేను ధైర్యం చెప్పుకొని ముందడుగు వేశా. మూడు ఈవెంట్ల మధ్య ఉండే స్వల్ప విరామంలో ఏదో ఒకటి తినకపోతే శరీరంలో శక్తి ఉండదు. అయితే, ఈదుతున్నప్పుడు నోట్లికి ఉప్పు నీళ్లు వెళ్లిపోవడంతో సైక్లింగ్ చేస్తున్నంత సేపూ వాంతులు అవుతూనే ఉన్నాయి. దీంతో ఏమీ తినకుండానే మిగిలిన రెండు ఈవెంట్లు పూర్తి చేశా. స్విమ్మింగ్ తర్వాత జరిగిన 180 కిలోమీటర్ల సైక్లింగ్ ఈవెంట్‌ను 7.42 గంటల్లో, చివరగా 42.2 కిలోమీటర్ల మారథాన్‌ను 5.52 గంటల్లో ముగించా. మూడు ఈవెంట్లను కలిపి 15 గంటల 45 నిమిషాల 49 సెకన్లలో విజయవంతంగా పూర్తి చేశాను.

అడుగులు అటువైపు...

ఇక ఐరన్‌మ్యాన్ వరల్డ్ చాంపియన్‌షిప్ అవ్వగానే వ్యాపార రంగంలోకి ప్రవేశించాలనేది నా లక్ష్యం. టోక్యో ఒలింపిక్స్ తర్వాత జపాన్‌లో, ఫిఫా సాకర్ వరల్డ్‌కప్ తర్వాత ఖతార్‌లో విదేశీ పెట్టుబడులు బాగా పెరిగాయి. మన దేశంలో ఒలింపిక్స్ జరిగితే క్రీడా వ్యాపార రంగానికి ప్రాముఖ్యత పెరుగుతుంది. కనుక ఆ దిశగా క్రీడా మౌలిక సదుపాయాల కల్పన, క్రీడా ఆర్థిక విధానాల రంగంలో పని చేసేందుకు ప్రయత్నిస్తున్నా."

● ఎస్.ఎస్.బి.సంజయ్

> **ఐరన్‌మ్యాన్ వరల్డ్ చాంపియన్‌షిప్...**
>
> ఐరన్‌మ్యాన్ ట్రయథ్లాన్ కాన్సెప్ట్ 1970వ దశకంలో పుట్టింది. 1974 నుంచి ఈ పోటీలను నిర్వహిస్తుండగా, 1978 నుంచి ఐరన్‌మ్యాన్ వరల్డ్ చాంపియన్‌షిప్‌ఎను అధికారికంగా ప్రారంభించారు. 3.8 కిలోమీటర్ల స్విమ్మింగ్, 180 కి.మి సైక్లింగ్, మరథాన్ (42.2 కి.మి)ను కలిపి ఒక్క రోజులో.. అంటే 24 గంటల్లో పూర్తి చేయాలి.

విభిన్నం

భూ సర్వే అధికారం ఎస్సైకి ఎక్కడిది?: హైకోర్టు

- సివిల్ వివాదంలో ఎస్సై వేధింపులు
- యాంకర్ శిల్పాచక్రవర్తి వ్యాజ్యం
- నల్లగొండ జిల్లా చింతపల్లి..

ఎస్సై రామ్మూర్తికి హైకోర్టు నోటీసులు

హైదరాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): భూసర్వే చేయించే అధికారం పోలీసు ఎస్సైకి ఎక్కడిదని హైకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. సివిల్ వివాదంలో జోక్యం చేసుకోవడంతోపాటు గంటల తరబడి పోలీస్‌స్టేషన్‌లో కూర్చోబెడుతున్నారన్న ఆరోపణలపై వివరణ ఇవ్వాలని పేర్కొంటూ నల్లగొండ జిల్లా చింతపల్లి ఎస్సై రామ్మూర్తికి హైకోర్టు నోటీసులు జారీచేసింది. నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం కుర్మేడ్ గ్రామంలో 32 ఎకరాల భూవివాదంలో ప్రైవేటు వ్యక్తి అయిన మహమ్మద్ అబ్దుల్ అజీజ్‌తో కలిసి చింతపల్లి ఎస్సై రామ్మూర్తి వేధింపులకు గురిచేస్తున్నారని.. తరచూ ఫోన్‌చేసి, పోలీస్‌స్టేషన్‌కు రావాలని ఆదేశిస్తున్నారని పేర్కొంటూ టీవీ యాంకర్ శిల్పా చక్రవర్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఠాణాలో గంటల తరబడి కూర్చోబెడుతున్నారని ఆరోపించారు. 2017లో అజీజ్ నుంచి 32 ఎకరాల వ్యవసాయ భూమి తాము కొనుగోలు చేశామని.. ఈ భూమికి సంబంధించి విక్రయదారు, స్థానిక పోలీసులతో కలిసి వేధింపులకు దిగుతున్నారని ఆరోపించారు. ఈ భూమికి సంబంధించి సివిల్ కోర్టు రెండుసార్లు శాశ్వత ఇంజంక్షన్, పోలీస్ ప్రొటెక్షన్ ఆదేశాలు జారీ చేసిందని.. అయినా స్థానిక పోలీసులు జోక్యం చేసుకోవడం ఆపడం లేదని ఆరోపించారు. ప్రత్యేకంగా ఎస్సై రామ్మూర్తి ఈ వ్యవహారంలో వ్యక్తిగతంగా జోక్యం చేసుకుంటూ.. సెటిల్‌మెంట్ చేసుకోవాలని పోలీస్‌స్టేషన్‌లో చర్చలు జరుపుతున్నారని.. చట్టవిరుద్ధంగా సర్వే చేయిస్తున్నారని పేర్కొన్నారు. కోర్టు ఆదేశాలను, చట్టాలను ధిక్కరించడంతోపాటు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై వాదనలను విన్న జస్టిస్ టి.వినోద్‌కుమార్ ధర్మాసనం.. వివరణ ఇవ్వాలని పేర్కొంటూ హోంశాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీ, నల్లగొండ ఎస్పీ, దేవరకొండ డీఎస్పీ తదితరులకు నోటీసులు జారీచేసింది. అలాగే ఎస్సై రామ్మూర్తిని వివరణ ఇవ్వాలని పేర్కొన్న హైకోర్టు.. ఆయనకు వ్యక్తిగత నోటీసులు ఇచ్చేందుకు పిటిషనర్ల న్యాయవాదికి అనుమతినిచ్చింది.



లాయర్ల బీమా10 లక్షలకు పెంపు

న్యాయవాదులకు అందించే ఆర్థిక ప్రయోజనాలను పెంచుతూ తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ బుధవారం కీలక ప్రకటన చేసింది. ఇప్పటివరకు ఉన్న డెత్ క్లెయిమ్‌ను రూ.6 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతున్నట్లు బార్ కౌన్సిల్ చైర్మన్ నర్సింహారెడ్డి, వైస్‌చైర్మన్ సునీల్‌గౌడ్, బీసీఐ సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి ప్రకటించారు. మరణించిన లాయర్ల అంత్యక్రియల ఖర్చులను రూ.15 వేల నుంచి 20 వేలకు పెంచినట్లు వెల్లడించారు. అనారోగ్యంతో బాధపడేవారికి వైద్యచికిత్స ఖర్చులను రూ.లక్షకు, లైబ్రరీ రుణాన్ని 10 వేల నుంచి 15 వేలకు పెంచామన్నారు.

హైదరాబాద్ పరిధిలో 35 ఆర్థిక మండళ్లు

(మొదటిపేజీ తరువాయి)

పొందుపరిచింది. అంతేకాదు.. రియల్‌ఎస్టేట్, నిర్మాణరంగం, పారిశ్రామిక రంగంపై ఈడీపీని పలు రంగాల ప్రముఖుల ముందు పెట్టగా.. వారు హర్షం వ్యక్తం చేసినట్లు తెలిసింది. హైదరాబాద్, కొత్తూరు, మేడ్చల్, ఘట్‌కేసర్, అంబర్‌పేట ప్రాంతాలు వాణిజ్య పరంగా.. సైబరాబాద్, జవహర్‌నగర్ ప్రాంతాలు ఐటీ/ఐటీ ఆధారితం కాగా, పటాన్‌చెరు, ఉప్పల్ ఏరియాలు పారిశ్రామిక వాడలుగా.. శంషాబాద్ రవాణా పరంగా ఆర్థిక మండళ్లుగా కొనసాగుతున్నాయి. ఈడీపీ-2050లో అదనంగా విద్య, మిశ్రమ వినియోగం, రవాణా, పర్యాటక రంగాలకు ప్రాధాన్యతనిచ్చారు. ఈక్రమంలో.. పారిశ్రామిక ఆర్థిక మండళ్లుగా పటాన్‌చెరు, రుద్రారం, తూప్రాన్, శామీర్‌పేట, దండుమల్కాపూర్, చౌటుప్పల్, ఇబ్రహీంపట్నం, చందన్‌వల్లి, తుర్కపల్లి, నారాయణపూర్, యాచారం, మంచాల్, ఆమన్‌గల్, మిశ్రమ ఆర్థిక మండళ్లుగా హైదరాబాద్, సైబరాబాద్, ఉప్పల్, శంషాబాద్, కొత్తూరు, మేడ్చల్, ఘట్‌కేసర్, ఆదిభట్ల, ఫ్యాబ్‌సిటీ, ముచ్చర్ల, షాద్‌నగర్ ఉంటాయి. మిశ్రమంలోనే ఐటీ, ఐటీఈఎస్, వాణిజ్య సేవలు, ఇతర రంగాలుంటాయి. విద్యాపరమైన ఆర్థిక మండలిగా జవహర్‌నగర్, పర్యాటకానికి సంబంధించి అంబర్‌పేట, నర్సాపూర్, మర్కూక్, భువనగిరి, మృగవని, లాజిస్టిక్ ఆర్థిక మండళ్లుగా కండ్లకోయ, నాగిరెడ్డిపల్లి, బాటసింగారం, ఈదులనాగులపల్లి, రావులపల్లి ఉంటాయి. ఇలా.. మొత్తం 35 ఆర్థిక మండళ్లను ప్రభుత్వం పరిచయం చేసింది. ఈ మండళ్లు ఉపాధి లక్ష్యం గా ఉంటాయి. మెరుగైన పట్టణాభివృద్ధి, ఉపాధితోపాటు.. వివిధ రంగాలకు సమప్రాధాన్యం ఉంటుంది.

మాస్టర్‌ప్లాన్-2050కి అనుగుణంగా

దక్షిణ భారతదేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక కేంద్రంగా హైదరాబాద్ మహానగరం నిలుస్తుండగా.. మాస్టర్‌ప్లాన్-2050లో కూడా అన్ని రంగాల్లో ప్రణాళికాబద్ధమైన అభివృద్ధిని సాధించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. న్యూయార్క్, సియోల్ వంటి నగరాలు సాధించిన విజయాలను అనుసరించడం ద్వారా హైదరాబాద్‌ను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. అందులో భాగంగానే హెచ్ఎండీఏ ప్రాంతంలో ఇప్పటికే ఫ్యూచర్ సిటీ, రీజినల్ రింగ్ రోడ్, మెట్రోరైలు విస్తరణ, యంగ్ ఇండియా స్కిల్స్ వర్సిటీ, మూసీ నదీ తీరం పునరాభివృద్ధి వంటి ప్రాజెక్టులు రాబోతున్నాయి. తెలంగాణ ఆర్థికాభివృద్ధిలో హెచ్ఎండీఏ ప్రాంతం కీలకపాత్ర పోషించడానికి ఈడీపీ-2050ని తీసుకొచ్చింది. రాష్ట్ర ఆర్థిక వృద్ధిలో హెచ్ఎండీఏ ఏరియా నుంచి 50% వాటాతోపాటు 2050 వరకు జీడీపీ 123లక్షల కోట్లకు చేరుతుందని, హెచ్ఎండీఏ ఏరియాలో ప్రస్తుతం 55 లక్షల మంది వరకు ఉపాధి కల్పిస్తుండగా.. 2050 వరకు 1.41కోట్లకు చేరుతుందని అంచనా వేశారు.

ఈడీపీ-2050లో ప్రతిపాదనలు

- హెచ్ఎండీఏ పరిధిలో ఆర్థిక అభివృద్ధి లక్ష్యాలను సాధనకు అన్ని రంగాలకు అనుకూలమైన విధానం, మౌలిక సదుపాయాల కల్పనతో సాంప్రదాయ, కొత్తగా వస్తున్న సెక్టార్లకు ప్రాధాన్యమివ్వాలి.
- హెచ్ఎండీఏ ప్రాంతానికి ఆర్థిక జియోగ్రఫీ ద్వారా వివిధ ఆర్థిక కేంద్రాలు లేదా 'మండళ్లకు మార్గనిర్దేశాలు చేయాలి.
- ప్రతి రంగానికి భౌగోళికంగా భూమి డిమాండ్‌ను లెక్కించడం, వివిధ రంగాల వారిగా భూ వినియోగ జోన్‌లో అభివృద్ధి నియంత్రణకు నిబంధనలను రూపొందించాలి.
- ప్రతి రంగానికి స్థల పంపిణీ తప్పనిసరి.
- ప్రస్తుతం ఐటీ, ఐటీ ఆధారిత సేవలు, లైఫ్ సైన్సెస్, ఏరోస్పేస్, రక్షణ వంటి రంగాలలో బలమైన పోటీతత్వాన్ని కలిగి ఉండగా.. మున్ముందు ఆహార శుద్ధి, ఎలక్ట్రానిక్స్, ఆస్పత్రులు వంటి రంగాలలో పోటీతత్వాన్ని అభివృద్ధి చేసుకోవాల్సి ఉంటుంది.
- కొత్త రంగాల పరంగా డ్రోన్‌లలో బలమైన పోటీతత్వాన్ని కలిగి ఉండగా.. మున్ముందు డాటా సెంటర్లు, ఎలక్ట్రిక్ వాహనాల ఉత్పత్తిలో సామర్థ్యాన్ని అభివృద్ధి చేసుకోవాలి.
- ప్రాధాన్య రంగాలలో విద్యాసేవలు, రియల్‌ఎస్టేట్, హోటళ్లు, లాజిస్టిక్స్ వంటి రంగాలు నైపుణ్యం కలిగిన కార్మికుల డిమాండ్‌ను తీరుస్తాయి. ఈ రంగాల్లో ఎగుమతులు పెరుగుతాయి.

హెచ్ఎండీఏ పరిధిలో భూమి డిమాండ్ ఇలా..!

భూ వినియోగం	2030 వరకు	2030 - 2050	2024 - 2050
తయారీ రంగం	156.10 కి.మీ	567.70 కి.మీ	723.80 కి.మీ
వాణిజ్య రంగం	9.48 కి.మీ	34.61 కి.మీ	44.09 కి.మీ

బంగారుపాళ్యంలో దండుపాళ్యం

- జగన్ చిత్తూరు పర్యటనలో 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ మూకల దాడి
- కెమెరా లాక్కుని.. తల, ఛాతీపై పిడిగుద్దులు
- రైతులకు పరామర్శ పేరిట జగన్ అరాచకం

బంగారుపాళ్యం, చిత్తూరు (అర్బన్), జూలై 9(ఆంధ్రజ్యోతి): అధికారం కోల్పోయినా వైసీపీ మార్క్ దాడుల సంస్కృతి ఆగలేదు. వైసీపీ అధినేత జగన్ చిత్తూరు జిల్లా పర్యటనలో ఆ పార్టీ మూకలు రెచ్చిపోయాయి. విధినిర్వహణలో ఉన్న 'ఆంధ్రజ్యోతి' చిత్తూరు స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శివకుమార్‌పై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. బుధవారం చిత్తూరు జిల్లా బంగారుపాళ్యంలో జగన్ పర్యటించారు. శివకుమార్ వెళ్లి ఫొటోలు తీస్తున్నారు. అక్కడే ఉన్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి సైగ చేయడంతో వైసీపీ గూండాలు రెచ్చిపోయారు. శివకుమార్‌ను చుట్టుముట్టి తల, ఛాతీపై పిడిగుద్దులు కురిపించారు. కెమెరా లాక్కుని, అందులోని మెమొరీ కార్డును తీసేసుకున్నారు. శివకుమార్ అతికష్టమ్మీద తప్పించుకున్నారు. ఇది గమనించిన కొందరు పాత్రికేయులు ఆయనకు మంచినీళ్లు తాగించి, బంగారుపాళ్యం ఆస్పత్రికి తరలించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దాడి ఘటనపై శివకుమార్ ఫిర్యాదు మేరకు బంగారుపాళ్యం పోలీసులు దర్యాప్తు చేపట్టారు. దాడి చేసినవారిలో మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ అనుచరుడు ప్రకాశ్ ఆచారి ఉన్నట్టు గుర్తించారు. మిగిలినవారిని గుర్తించాల్సి ఉంది.



ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి చేస్తున్న వైసీపీ మూకలు



ఫొటోగ్రాఫర్ శివకుమార్

జగన్ డ్రామా.. వైసీపీ మూక వీరంగం

తన పర్యటనలను నిండు ప్రాణాలను బలి తీసుకుంటున్నా, పోలీసులు ఎన్ని సూచనలు చేస్తున్నా.. ఏ మార్పూలేని నైజాన్ని వైసీపీ అధినేత జగన్ మరోసారి బయటపెట్టుకున్నారు. మామిడి రైతులకు పరామర్శ పేరిట బుధవారం చిత్తూరు జిల్లా బంగారుపాళ్యంపై దండయాత్ర సాగించారు. జగన్ పర్యటనలో హెలిప్యాడ్ వద్ద 30 మందికి, మార్కెట్‌యార్డులో 500 మందికి మాత్రమే పోలీసులు అనుమతి ఇచ్చారు. కానీ హెలిప్యాడ్‌ను 500మంది చుట్టుముట్టారు. బయట మూడు వేలమంది మోహరించారు. దీంతో తోపులాట, తొక్కిసలాట చోటుచేసుకున్నాయి. పోలీసులు స్వల్పంగా లాఠీచార్జి చేయాల్సి వచ్చింది. జగన్ కాన్వాయ్‌తో పాటు నడుస్తున్న చిత్తూరు వైసీపీ ఇన్‌చార్జి విజయానందరెడ్డి, చిత్తూరు డీసీసీబీ మాజీ చైర్‌పర్సన్ రెడ్డమ్మ, ఓ డీఎస్పీ సైతం తోపులాట కారణంగా కింద పడిపోయారు. జగన్ రాక ముందే మార్కెట్ యార్డులోకి వైసీపీ శ్రేణులు చొచ్చుకెళ్లి బీభత్సం సృష్టించాయి. అమ్ముకోడానికి ఈసినేరిపల్లెకు చెందిన రైతు దుర్వాసులు నాయుడు రెండు ట్రాక్టర్లలో తెచ్చుకున్న మామిడికాయలను రోడ్డుపై పారబోశాయి. జగన్ పర్యటనలో చోటుచేసుకున్న ఉల్లంఘనలపై బంగారుపాళ్యం పోలీస్‌స్టేషన్‌లో మూడు కేసులు నమోదయ్యాయి.

రాష్ట్ర న్యాయాధికారుల సంఘం అధ్యక్షుడిగా ఖమ్మం జిల్లా జడ్జి రాజగోపాల్ ఎన్నిక

ఖమ్మం లీగల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): న్యాయాధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఖమ్మం జిల్లా జడ్జి జీ రాజగోపాల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం ఉపసంహరణ గడువు ముగిసే సమయానికి రాజగోపాల్ ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవమైనట్టు ఎన్నికల అధికారి శశిధర్ రెడ్డి ప్రకటించారు. రాజగోపాల్ గతంలోనూ ఒకసారి అధ్యక్షుడిగా పనిచేశారు. సంఘం మహిళా ప్రతినిధిగా ఆర్థిక నేరాల ప్రత్యేక న్యాయస్థానం జడ్జిగా పనిచేస్తున్న జే మైత్రి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సుల్లో ప్రవేశాలు

- హెచ్‌సీయూ నోటిఫికేషన్ జారీ

హైదరాబాద్ సిటీ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ప్రవేశాలకు హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం బుధవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇటీవల విడుదలైన కామన్ యూనివర్సిటీస్ ఎంట్రన్స్ టెస్ట్(సీయూఈటీ) ఫలితాల్లో స్కోర్ కార్డు పొందిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. హెచ్‌సీయూలో మొత్తం 17 ఇంటిగ్రేటెడ్ (యూజీ+పీజీ)కోర్సులు ఉన్నాయి. సీయూఈటీలో వచ్చిన మెరిట్ ప్రాతిపదికన 465 మంది విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తారు. ఇంటిగ్రేటెడ్ ఎంఎస్సీలో మ్యాథమేటికల్ సైన్సెస్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, కెమిస్ట్రీ ఆనర్స్, బయాలజీ, అప్లయిడ్ జియాలజీ, మాస్టర్ ఆఫ్ ఆప్టోమెట్రీ, సైకాలజీ, ఇంటిగ్రేటెడ్ ఎంఏలో తెలుగు, హిందీ, ల్యాంగ్వేజ్ సైన్సెస్, ఉర్దూ, హిస్టరీ, ఎకనామిక్స్ పొలిటికల్ సైన్స్, సోషియాలజీ, ఆంత్రోపాలజీ కోర్సులు ఉన్నాయి.

సమాచారం ఇవ్వకపోవడం వల్లే స్పందించలేదు

పురుషోత్తపట్నం ఘటనపై కేసు నమోదు: చింతూరు ఏఎస్పీ

ఎటపాక, జూలై 9(ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం పురుషోత్తపట్నంలోని భద్రాద్రి దేవస్థానం భూముల్లో మంగళవారం దేవస్థానం అధికారులు, స్థానికులు, ఇంటి నిర్మాణదారుల మధ్య జరిగిన వివాదంపై ముందస్తు సమాచారం ఇవ్వనందుకే సకాలంలో పోలీసులు స్పందించలేకపోయారని చింతూరు ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా తెలిపారు. అంతర్రాష్ట్ర సమస్యతోపాటు దేవస్థానం భూముల అంశంపై గతంలో హైకోర్టు ఇచ్చిన తీర్పును పురుషోత్తపట్నం గ్రామస్థులు పాటించాలని సూచించారు. దాడి ఘటనపై దేవస్థానం అధికారుల ఫిర్యాదు మేరకు పురుషోత్తపట్నం స్థానికులపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. దాడి ఘటనపై భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ, భద్రాచలం ఏఎస్పీతో చర్చించినట్టు చెప్పారు. దేవస్థానం అధికారులు తమ ఇంటిని కూల్చేందుకు యత్నించి, దౌర్జన్యం చేశారని పురుషోత్తపట్నం రైతులు ఆరోపించారు. బుధవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కాలిపోయిన ఇంటి ప్రదేశంలో రేకులతో ఇల్లు నిర్మించుకుంటుంటే దేవస్థానం అధికారులు వచ్చి ఎందుకు నిర్మిస్తున్నావని, కూల్చివేస్తామని దౌర్జన్యానికి పాల్పడ్డారని పేర్కొన్నారు. దేవస్థానం ఈవోనే తమపై దాడిచేసి స్పృహ కోల్పోయారని, ఆమెపై ఎవరూ దాడి చేయలేదని తెలిపారు.

భద్రాద్రి భూమిని అంగుళం కూడా వదలం: వీహెచ్‌పీ

హైదరాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : భద్రాద్రి భూమిని అంగుళం కూడా వదిలేది లేదని, దీనికోసం ఎంతటి ఉద్యమానికైనా సిద్ధమని విశ్వహిందూ పరిషత్ హెచ్చరించింది. ఈమేరకు వీహెచ్‌పీ రాష్ట్ర ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి బుధవారం ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓ దాత భక్తితో 900 ఎకరాల భూమిని శ్రీరాముని ఆలయానికి దానం చేయగా నేడు అది కబ్జాకి గురికావడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే దేవాలయ భూములను సర్వే చేసి, ప్రహరీ గోడ నిర్మించాలని డిమాండ్ చేశారు. తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపి రాముడి భూములను కాపాడాలని ఆయన కోరారు. లేనిపక్షంలో ఆందోళన తప్పదని బాలస్వామి హెచ్చరించారు.

విశ్వాసం కోల్పోయిన బీఆర్ఎస్, కాంగ్రెస్

- రైతు భరోసా అందించడంలో రేవంత్ విఫలం
- భద్రాచలం ఈవోపై దాడిని ఖండిస్తున్నాం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు
- కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు చెందిన 200 మంది బీజేపీలో చేరిక



బీజేపీలో చేరుతున్న గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్

గజ్వేల్/హైదరాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ప్రజల విశ్వాసాన్ని కోల్పోయాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. రాష్ట్రంలో కొత్త రాజకీయ ప్రత్యామ్నాయంగా బీజేపీని ప్రజలు చూస్తున్నారని తెలిపారు. బీజేపీపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతోందని, అందుకే అధికార పార్టీనీ విడిచి, యువత, మహిళలు, ఇతర పార్టీల నాయకులు పెద్ద ఎత్తున బీజేపీలో చేరుతున్నారని చెప్పారు. గజ్వేల్- ప్రజ్ఞాపూర్ మునిసిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, ఆయన అనుచరులతోపాటు కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు చెందిన 200 మంది కార్యకర్తలు బుధవారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం ఉందో లేదో అర్థం కావడం లేదని, సీఎం ఢిల్లీ టూర్లు తిరగడం.. బీజేపీని తిట్టడం తప్ప చేసిందేమీ లేదన్నారు. పెన్షన్లు, రైతు భరోసా పంపిణీలో రేవంత్ విఫలమయ్యారని ధ్వజమెత్తారు. భద్రాచలంలో దేవస్థాన భూముల ఆక్రమణలను అడ్డుకోవడానికి వెళ్లిన ఈవోపై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇతర మతస్తులు ఈవోపై దాడి చేసి, ఇతర ప్రార్థనా మందిరాలను నిర్మించేందుకు ప్రయత్నిస్తుంటే ప్రభుత్వం ఏం చేస్తుందని ప్రశ్నించారు. ఇప్పటికైనా దేవాలయ భూములను కాపాడేందుకు ప్రభుత్వం ముందుకు రావాలని డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా తాను బాధ్యతలు చేపట్టిన అనంతరం గజ్వేల్ నుంచి చేరికలు జరగడం సంతోషంగా ఉందన్నారు. కాగా, బీఆర్ఎస్, కాంగ్రెస్ కుమ్మక్కు రాజకీయాలకు పాల్పడుతున్నాయని, స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు యత్నిస్తున్నాయని ఎంపీ రఘునందన్‌రావు ఆరోపించారు. బీఆర్ఎస్ కంచుకోటలో ఎంపీగా తనను గెలిపించిన ప్రజలకు ఎల్లప్పుడు అండగా ఉంటానని చెప్పారు. చిత్తశుద్ధి ఉంటే రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరుపై అసెంబ్లీలో చర్చ నిర్వహించాలని డిమాండ్ చేశారు. కాగా, దివ్యాంగుల సంక్షేమం, అభ్యున్నతి కోసం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు డిమాండ్ చేశారు. ఈమేరకు సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన లేఖ రాశారు. పింఛన్‌ను రూ.6వేలకు పెంచుతామని, 80శాతం వైకల్యం ఉన్న వారికి 15వేల ఆర్థిక సహాయం అందిస్తామని హామీ ఇచ్చి.. అమలు చేయలేదని గుర్తు చేశారు. ఇచ్చిన హామీలు అమలు చేయక పోవడంతో దివ్యాంగుల జీవితాల్లో ఆర్థిక భద్రత కరువైందని పేర్కొన్నారు. కొత్తగా దరఖాస్తు చేసుకునే దివ్యాంగులకు సైతం పింఛన్ల మంజూరులో జాప్యం చేస్తున్నారని, ఇది ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఇప్పటికైనా సానుకూలంగా స్పందించాలని డిమాండ్ చేశారు.


డీఎంఎఫ్‌ను మిషన్ మోడ్‌లో ముందుకు తీసుకెళ్లండి

- మైనింగ్ ప్రాంతాల్లోని ప్రజల జీవితాల్లో వెలుగులు నింపండి
- యాస్పిరేషనల్ జిల్లాల కలెక్టర్ల వద్ద రూ.32 వేల కోట్ల నిధులు
- డీఎంఎఫ్ వర్క్‌షాప్‌లో కిషన్ రెడ్డి



న్యూఢిల్లీ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్(డీఎంఎఫ్)ను ఆయా జిల్లాల కలెక్టర్లు మిషన్ మోడ్‌లో ముందుకు తీసుకెళ్లాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి సూచించారు. యాస్పిరేషనల్ జిల్లాల అభివృద్ధి కోసం కలెక్టర్ల వద్ద రూ.32 వేల కోట్లున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుని మైనింగ్ ప్రాంతాల్లోని ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలన్నారు. బుధవారం ఢిల్లీలో జరిగిన డీఎంఎఫ్ వర్క్‌షాప్‌లో కిషన్ రెడ్డి మాట్లాడారు. దేశవ్యాప్తంగా 646 డీఎంఎఫ్‌లుండగా.. వాటిలో సుమారు రూ.లక్ష కోట్లు జమ చేశామని, దాదాపు రూ.90 వేల కోట్లు అభివృద్ధి పనుల కోసం మంజూరు చేశామని తెలిపారు. యాస్పిరేషనల్ జిల్లాల కోసం ప్రత్యేకంగా ప్రారంభించిన 'యాస్పిరేషనల్ డీఎంఎఫ్ ప్రోగ్రాం'లో భాగంగా ఆరోగ్యం, పోషకాహారం, విద్య, వ్యవసాయం, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రథమ ప్రాధాన్యమిచ్చామన్నారు. ప్రస్తుతం దేశంలోని 112 యాస్పిరేషనల్ జిల్లాల్లో 106 డీఎంఎఫ్ యాస్పిరేషనల్ జిల్లాలున్నాయని తెలిపారు. ఆయా జిల్లాల కలెక్టర్ల వద్ద ఉన్న రూ.32 వేల కోట్ల నిధుల సద్వినియోగానికి ప్రణాళికలు రూపొందించాలని, ఇందులో స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజల సలహాలు, సూచనలు తీసుకోవాలని సూచించారు. డీఎంఎఫ్‌తోపాటు సీఎస్ఆర్, ప్రభుత్వ పథకాలు, మైన్ మూసివేతకు సంబంధించిన కార్యక్రమాలను ఒకే వేదికపైకి తీసుకురావాలని చెప్పారు. డీఎంఎఫ్ ఎగ్జిబిషన్లలో స్వయం సహాయక సంఘాలు, మహిళలు, యువతను భాగస్వామ్యం చేయాలన్నారు. దేశంలో 70శాతం విద్యుత్ బొగ్గు ద్వారానే ఉత్పత్తి అవుతోందని, తద్వారా రాయల్టీగా వచ్చే నిధులను డీఎంఎఫ్ ద్వారా స్థానిక ప్రజల సంక్షేమానికి వినియోగించాలని సూచించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా అన్ని రాష్ట్రాల్లో డీఎంఎఫ్ ద్వారా విస్తృతంగా కార్యక్రమాలు జరుగుతున్నాయని, ఇటీవలే తెలంగాణ సవరించిన డీఎంఎఫ్ సూచనలు అమలు చేస్తోందన్నారు. రాజకీయ జోక్యానికి తావులేకుండా మైనింగ్ ప్రభావిత ప్రాంతాలకు న్యాయం చేసేందుకు ప్రజాప్రతినిధులతో కలెక్టర్లు సమన్వయం చేసుకుని కార్యక్రమాలు చేపట్టాలని, అక్రమ మైనింగ్‌ను అరికట్టడంలో ఇదెంతో ఉపయోగకరమన్న అభిప్రాయం వ్యక్తంచేశారు. తర్వాత రాష్ట్రాల పనితీరును అభినందిస్తూ ప్రశంసపత్రాలు అందజేశారు. అంతకుముందు జన్‌పథ్‌లో ఏర్పాటు చేసిన డీఎంఎఫ్ ఎగ్జిబిషన్‌ను కేంద్రమంత్రి ప్రారంభించారు.








యోధుడు.. ధీరుడు



పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా జ్యోతి కృష్ణ తెరకెక్కించిన చిత్రం 'హరిహర వీరమల్లు'. ఏ.ఎం.రత్నం నిర్మించారు. నిధి అగర్వాల్ కథానాయిక. ఈ నెల 24న చిత్రం పాన్ ఇండియా స్థాయిలో విడుదలవుతోంది. బాబీ డియోల్ ప్రతినాయకుడి పాత్రను పోషించారు. పవన్ తొలిసారి చారిత్రక యోధుడి పాత్రను పోషించడంతో సినిమాపై అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్, పాటలు ఆకట్టుకున్నాయి. తాజాగా, ఈ సినిమా నుంచి 'ఎవరది ఎవరది.. అతగాడో పొడుపు కథ.. దొరకనే దొరకడే అతగాడో మెరుపుకథ.. సూర్యుడికే కన్నుగప్పి సంచరించే యోధుడు.. చంద్రుడ్నే సంచికెత్తి తస్కరించె ధీరుడు' అంటూ సాగే పాటను విడుదల చేసింది చిత్రబృందం. రామజోగయ్య శాస్త్రి రచించిన ఈ గీతాన్ని సాయిచరణ్, హైమత్, లోకేశ్వర్ ఆలపించారు. ఎమ్.ఎమ్.కీరవాణి సంగీతం అందించారు. ఈ చిత్రానికి ఎడిటింగ్: ప్రవీణ్.కె.ఎల్, సినిమాటోగ్రఫీ: మనోజ్ పరమహంస.

మీ ఊహలకు అందడు



సిద్ధు జొన్నలగడ్డ కథానాయకుడిగా రవికాంత్ పేరేపు ఓ చిత్రాన్ని తెరకెక్కించనున్నారు. ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్, సితార ఎంటర్టైన్‌మెంట్స్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. బుధవారం 'బ్యాడాస్' అనే టైటిల్‌తో ఈ చిత్రాన్ని ప్రకటించారు మేకర్స్. "మీరు ఇప్పటివరకూ హీరోలను, విలన్‌లను చూసి ఉంటారు. కానీ ఇందులో చూడబోయే కథానాయకుడు మీ ఊహలకు అందడు. ఈసారి కనికరం లేకుండా తెరపై నిప్పు రాజేస్తాడు" అని పేర్కొన్నారు. కాగా, సిద్ధు, రవికాంత్ కలయికలో ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'కృష్ణ అండ్ హిస్ లీల' (ఇట్స్ కాంప్లికేటెడ్) చిత్రం మంచి ఆదరణను దక్కించుకుంది.

నటి ముచ్చెర్ల అరుణ ఇంట్లో ఈడీ సోదాలు




ప్రముఖ నటి 'సీతాకోక చిలుక' ఫేమ్ ముచ్చెర్ల అరుణ ఇంట్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం (ఈడీ) అధికారులు బుధవారం సోదాలు చేపట్టారు. అరుణ భర్త మోహన్ గుప్తా పారిశ్రామికవేత్త. గృహసముదాయ అలంకరణల సేవలందించే (ఇంటీరియర్ డిజైనింగ్) సంస్థను నడుపుతున్నారు. మోహన్ గుప్తా నడుపుతున్న సంస్థలో ఇటీవల అక్రమ నగదు బట్వాడాలు అధికస్థాయిలో జరిగాయని ఫిర్యాదులు రావటంతో ఈడీ అధికారులు బుధవారం ఉదయం చెన్నై నీలాంగరైలోని వారి ఇంట్లో, కార్యాలయాల్లో ఒకేసారి సోదాలు చేపట్టారు. ఈ సందర్భంగా అధికారులు కీలకమైన పత్రాలు స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

ప్రతి పోలీస్ గర్వించేలా ఉంటుంది

- ఆర్‌కే సాగర్



'వాణిజ్య హంగులతో పాటు మంచి సందేశంతో రూపొందిన చిత్రం 'ది 100'. సమాజానికి ఏదైనా మంచి సందేశం ఇవ్వాలనే ఆలోచనతో పెట్టిన టైటిల్ ఇది. ఈ సినిమాకు సీక్వెల్ చేసే ఆలోచన కూడా ఉంది' అని ఆర్‌కే సాగర్ అన్నారు. ఆయన హీరోగా రాఘవ్ ఓంకార్ శశిధర్ దర్శకత్వం వహించిన చిత్రమిది. రమేశ్ కే, వెంకీ పీ నిర్మించారు. ఈ శుక్రవారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఆర్‌కే సాగర్ సినిమా విశేషాలను మీడియాతో పంచుకున్నారు. 'ఈ చిత్రంలో నాది పోలీస్ పాత్ర. ప్రతి పోలీస్ గర్వించేలా ఉంటుంది. మొగలి రేకులు సీరియల్‌లో చేసిన ఆర్‌కే నాయుడు పాత్ర బాగా గుర్తింపు తెచ్చింది. కానీ సినిమాల్లో మాత్రం దానికి భిన్నమైన పాత్రలు చేస్తూ వచ్చాను. మళ్లీ ఇన్నాళ్లకు బలమైన కథ కుదరడంతో 'ది 100' సినిమాలో పోలీస్ పాత్ర చేశాను. నిజజీవిత సంఘటనల ఆధారంగా రూపుదిద్దుకున్న కథ ఇది. కుటుంబం అంతా కలసి చూసేలా మా సినిమా ఉంటుంది' అని చెప్పారు.

నాలుగు భాషల్లో గేమ్ ఆఫ్ ఛేంజ్



నలంద విశ్వవిద్యాలయం నేపథ్యంలో భారతదేశంలో జరిగిన కొన్ని సంఘటనల సమాహారంగా తెరకెక్కిన చిత్రం 'గేమ్ ఆఫ్ ఛేంజ్'. మలయాళ దర్శకుడు సిధిన్ తెరకెక్కించారు. సిద్ధార్థ్ రాజశేఖర్ హీరోగా నటిస్తూ, మీనా చాబ్రియాతో కలసి నిర్మించారు. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. బుధవారం చిత్రబృందం హైదరాబాద్‌లో ప్రత్యేక ప్రదర్శన నిర్వహించింది. ఈ సందర్భంగా సిద్ధార్థ్ రాజశేఖర్ మాట్లాడుతూ 'కొందరు అసాధారణ వ్యక్తుల జీవితాల్లో జరిగిన కొన్ని సంఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. నాలుగు భాషల్లో విడుదల చేస్తున్నాం' అన్నారు. ఈ సినిమాకు సీక్వెల్ కూడా ఉంటుందని దర్శకుడు చెప్పారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

డెట్రాయెట్‌లో చెట్టాపట్టాల్



హీరోయిన్ సమంత, 'సిటాడెల్' వెబ్‌సిరీస్ దర్శకుడు రాజ్ నిడిమోరు రిలేషన్‌షిప్ స్టేటస్‌పై తరచూ వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా, వీరిద్దరూ డెట్రాయెట్‌లో కలసి తీసుకున్న ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు సమంత. ఈ పిక్ వారిపై వస్తున్న రూమర్స్‌కు మరింత బలం చేకూర్చేలా ఉంది. ఇదే సమయంలో రాజ్ నిడిమోరు సతీమణి శ్యామలీ పెట్టిన ఇన్‌స్టా స్టోరీ ఒకటి షేర్ చేశారు. వివిధ మతాలలోని కీలకమైన కొటేషన్స్‌ను ఆ స్టోరీలో పేర్కొన్నారు. మతమేదైనా మన చర్యలతో ఇతరులను బాధించడం తప్పనే చెబుతుందనీ.. అదే మనం జీవితంలో పాటించవలసిన సూత్రమనీ వాటి సారాంశం. సమంత, రాజ్ నిడిమోరు కలసి ఉన్న పిక్‌ను చూసి ఆమె బాధపడి ఇలా పోస్ట్ చేసి ఉంటారని పలువురు భావిస్తున్నారు.



భావోద్వేగాలను ప్రేక్షకులు అనుభూతి చెందుతారు

- సుహాస్

సుహాస్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'ఓ భామ అయ్యో రామ'. రామ్ గోధల దర్శకత్వంలో హరీశ్ నల్ల నిర్మించారు. ఈ శుక్రవారం విడుదలవుతోంది. చిత్రబృందం ఇటీవలే ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ముఖ్య అతిథిగా హాజరైన నటుడు మంచు మనోజ్ మాట్లాడుతూ 'ఎలాంటి సినీ వారసత్వం లేకుండా హీరోగా నిలదొక్కుకున్నాడు సుహాస్. తమిళంలో విజయ్ సేతుపతిలా సుహాస్ కూడా గొప్ప నటుడు. 'ఓ భామ...' చిత్రం ఘన విజయం అందుకోవాలి' అని ఆకాంక్షించాడు. సుహాస్ మాట్లాడుతూ 'ఈ సినిమా చూశాక అందరూ మాళవికతో ప్రేమలో పడిపోతారు. తన నటన, హావభావాలతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తుంది. నేను మరోసారి బలమైన పాత్రని చేశాను. కథలోని భావోద్వేగాలను ప్రేక్షకులు అనుభూతి చెందుతారు' అని చెప్పారు. హరీశ్ నల్లా మాట్లాడుతూ 'దర్శకుడు రామ్ మంచి టీమ్‌ను సెలెక్ట్ చేసుకున్నాడు. ఆయనకు మంచి భవిష్యత్ ఉంది. సుహాస్ అందరికీ గుర్తుండిపోయే పాత్రలో కనిపిస్తారు' అన్నారు. రామ్ గోధల మాట్లాడుతూ 'ఆద్యంతం ఆసక్తిని రేకెత్తించే ఓ విభిన్న కథా చిత్రం ఇది. మనుషుల విలువల్ని, వారి మధ్య ఉండే భావోద్వేగాల్ని తెరపై ఎంతో సహజంగా చూపించాం. సుహాస్ కెరీర్లో మరో వైవిధ్యమైన చిత్రంగా నిలుస్తుంది' అని చెప్పారు.

ఆగస్టులో రాజుగాని సవాల్



అన్నాచెల్లెళ్ల అనుబంధం నేపథ్యంలో మానవ సంబంధాలను చర్చిస్తూ సందేశాత్మకంగా సాగే చిత్రం 'రాజుగాని సవాల్'. లెలిజాల రవీందర్ స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. రితికా చక్రవర్తి కథానాయిక. ఇటీవలే చిత్రబృందం నిర్వహించిన కార్యక్రమంలో నటుడు జగపతి బాబు టీజర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా లెలిజాల రవీందర్ మాట్లాడుతూ 'ఆగస్టు 8న 'రాజుగాని సవాల్'ను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నాం. అన్నాచెల్లెళ్ల అనుబంధాన్ని మనసుకు హత్తుకునేలా ఆవిష్కరించే చిత్రం ఇది. తెలంగాణ సంస్కృతి నేపథ్యంలో సాగుతుంది. వినోదంతో పాటు పతాక సన్నివేశాల్లో భావోద్వేగాలు ఆకట్టుకుంటాయి' అని చెప్పారు.

ఆంధ్రజ్యోతి

బిజినెస్

హైదరాబాద్ ● గురువారం 10 జూలై 2025

4 లక్షల కోట్ల డాలర్లకు ఎన్‌విడియా మార్కెట్ క్యాప్

న్యూయార్క్: అమెరికా టెక్ దిగ్గజం ఎన్‌విడియా షేర్లు స్టాక్‌మార్కెట్‌లో రికార్డులు సృష్టిస్తున్నాయి. బుధవారం కంపెనీ షేర్లు 2.5 శాతం లాభంతో 164 డాలర్లకు చేరాయి. దీంతో కంపెనీ షేర్ల మార్కెట్ విలువ రికార్డు స్థాయిలో నాలుగు లక్షల కోట్ల డాలర్లకు (సుమారు రూ.342.6 లక్షల కోట్లు) చేరింది. ప్రపంచ స్టాక్ మార్కెట్ చరిత్రలో ఇప్పటి వరకు ఏ కంపెనీ షేర్ల మార్కెట్ క్యాప్ ఈ స్థాయికి చేరలేదు. 2023 ప్రారంభంలో 14 డాలర్ల వద్ద ట్రేడైన ఎన్‌విడియా షేర్లు ప్రస్తుతం కృత్రిమ మేధ (ఏఐ) బూమ్‌తో 164 డాలర్ల వద్ద ట్రేడవుతున్నాయి. రెండేళ్లలోనే ఎన్‌విడియా షేర్ల మార్కెట్ క్యాప్ 60,000 కోట్ల డాలర్ల నుంచి నాలుగు లక్షల కోట్ల డాలర్లకు చేరడం విశేషం.

హైదరాబాద్ స్టార్టప్‌లో ఇండిగో వెంచర్స్ పెట్టుబడి

ముంబై: హైదరాబాద్‌కు చెందిన స్టార్టప్ కంపెనీ జే ఏరోస్పేస్‌లో పెట్టుబడి పెట్టినట్టు ఇండిగో విమానయాన సంస్థ అనుబంధ వెంచర్ క్యాపిటల్ విభాగం ఇండిగో వెంచర్స్ ప్రకటించింది. అయితే ఎంత మొత్తం పెట్టుబడి పెట్టిందీ వెల్లడించలేదు. జే ఏరోస్పేస్ కంపెనీ ఈ నిధులను డిజిటల్ ఉత్పత్తి సామర్థ్యాల పెంపుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ఏఐ ఆధారిత ఉత్పత్తి విధానాలు, నిపుణులైన ఉద్యోగుల నియామకానికి ఉపయోగించుకుంటుందంటున్నారు. ప్రారంభ దశలో ఉన్న స్టార్టప్స్‌లో పెట్టుబడి పెట్టేందుకు తాము లక్ష్యంగా పెట్టుకున్న రూ.600 కోట్లలో ఇప్పటికే రూ.450 కోట్లు సమీకరించినట్టు ఇండిగో వెంచర్స్ తెలిపింది.

అదానీ ఎన్‌సీడీ సూపర్ హిట్

న్యూఢిల్లీ: అదానీ ఎంటర్‌ప్రైజెస్ రూ.1,000 కోట్ల సమీకరణ కోసం బుధవారం జారీ చేసిన నాన్ కన్వర్టబుల్ డిబెంచర్ (ఎన్‌సీడీ) ఇష్యూ సూపర్ డూపర్ హిట్టయింది. ఇష్యూ ప్రారంభమైన మూడు గంటల్లోనే ఇష్యూ మొత్తం సబ్‌స్క్రైబ్ అయింది. మధ్యాహ్నం 3.30 గంటల కల్లా రూ.1,400 కోట్లకు బిడ్స్ అందాయి. ఏటా 9.3 శాతం వడ్డీతో రెండేళ్లు, మూడేళ్లు, ఐదేళ్ల కాలపరిమితితో ఏఈఎల్ ఈ ఎన్‌సీడీలను జారీ చేసింది.

ఐపీఓ సమాచారం

- అంతెం బయోసైన్సెస్ సంస్థ ఈ నెల 14న జారీ చేస్తున్న ఐపీఓలో షేర్ల ధర శ్రేణిని రూ.540-570గా నిర్ణయించింది.
- గురువారం నుంచి ప్రారంభం కానున్న స్మార్ట్ వర్క్స్ కోవర్కింగ్ స్పేస్ ఐపీఓలో షేరు ధరను రూ.387-407గా నిర్ణయించారు.

అమెరికాలో ధరలు పెంచేస్తాం

టారిఫ్‌ల పెంపునకు ఫార్మా కంపెనీల ప్రతిస్పందన




న్యూఢిల్లీ: ట్రంప్ యంత్రాంగం ఔషధ దిగుమతులపై 200% సుంకాలు విధించినట్టయితే అమెరికన్ మార్కెట్లో తమ ఉత్పత్తుల ధరలు పెంచక తప్పదని ఫార్మా పరిశ్రమ హెచ్చరించింది. అయితే ప్రస్తుతానికి అది హెచ్చరిక మాత్రమేనని, టారిఫ్‌ల పెంపు ఆ స్థాయిలో ఉండకపోవచ్చునని పేర్కొంటూ అలాంటి నిర్ణయం గనుక తీసుకున్నట్టయితే తాము ధరలు పెంచుతామని, అది అమెరికన్ వినియోగదారులకు భారం కాక తప్పదని పరిశ్రమ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఒకరన్నారు. సుంకాలు పెంచితే అమెరికాలో హెల్త్‌కేర్ సంబంధిత ద్రవ్యోల్బణం గణనీయంగా పెరుగుతుందంటున్నారు.

మార్జిన్ల ఒత్తిడి తప్పదు: చిన్న ఫార్మా కంపెనీలు అతి తక్కువ మార్జిన్‌తో అమెరికాకు ఔషధాలు సరఫరా చేస్తున్నాయని, వాటిపై మార్జిన్ల ఒత్తిడి విపరీతంగా పెరుగుతుందని ఆయన చెప్పారు. ప్రస్తుతం అమెరికా నుంచి దిగుమతి అయ్యే ఔషధాలపై భారత్ 10% సుంకాలు వసూలు చేస్తుండగా అమెరికా ఎలాంటి సుంకాలు విధించడంలేదు. భారత ఫార్మా కంపెనీలకు అమెరికా కీలక మార్కెట్ అని, వాటి మొత్తం ఆదాయంలో 30-40% అమెరికన్ మార్కెట్ నుంచే వస్తుందని ఇక్రా వైస్ ప్రెసిడెంట్, ఫార్మా హెడ్ దీపక్ జోత్వానీ అన్నారు. భారత ఫార్మా కంపెనీలు ప్రధానంగా జెనరిక్ ఔషధాలు అమెరికన్ మార్కెట్‌కు సరఫరా చేస్తాయని, ఆ విభాగంలో తీవ్రమైన పోటీని ఎదుర్కొంటున్నాయని ఆయన చెప్పారు. అధిక టారిఫ్‌ల వల్ల ఫార్మా రంగంలో ఎగుమతుల వృద్ధి, లాభదాయకత రెండూ ప్రభావితం అవుతాయన్నారు. భారత కంపెనీలు సరఫరా చేసిన ఔషధాల వల్ల 2022 సంవత్సరంలో అమెరికన్ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థకు 21,900 కోట్ల డాలర్లు (రూ.18.83 లక్షల కోట్లు) ఆదా అయినట్టు గణాంకాలు తెలుపుతున్నాయి.

మాపై పెద్ద ప్రభావం ఉండదు

అమెరికా ప్రతిపాదించిన మేరకు రాగిపై 50% సుంకాలు విధించినా ఆ ప్రభావం తమపై పెద్దగా ఉండదని ఇంటర్నేషనల్ కాపర్ అసోసియేషన్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ మయూర్ కర్మార్కర్ అన్నారు. భారత్ రాగి కొరత దేశమని, అందువల్ల అమెరికాకు తమ ఎగుమతులు కేవలం 10 వేల టన్నులేనని ఆయన చెప్పారు. భారత్ పునరుత్పాదక ఇంధనం, ఈవీలపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరిస్తున్నందు వల్ల దేశీయంగానే డిమాండు అధికంగా ఉన్నదన్న విషయం ఆయన గుర్తు చేశారు.

సామ్‌సంగ్ నుంచి ఏడో తరం ఫోల్డబుల్ ఫోన్లు

ప్రారంభ ధర రూ.89,999



న్యూయార్క్: దక్షిణ కొరియాకు చెందిన ఎలక్ట్రానిక్ దిగ్గజం సామ్‌సంగ్ తన ఫోల్డబుల్ (మడత పెట్టగలిగే) గెలాక్సీ సిరీస్‌లో ఏడో తరం మోడళ్లను విడుదల చేసింది. గెలాక్సీ జెడ్ ఫోల్డ్7, గెలాక్సీ జెడ్ ఫ్లిప్7 తో పాటు గెలాక్సీ జెడ్ ఫ్లిప్7 ఎఫ్ఈ ఫోన్లను అమెరికాలోని బ్రూక్లిన్‌లో ఆవిష్కరించింది. సామ్‌సంగ్ ఇప్పటివరకు మార్కెట్లోకి ప్రవేశపెట్టిన ఫోల్డబుల్ ఫోన్లలో ఫోల్డ్7 అత్యంత సన్నదైన, తేలికపాటి మోడల్. స్నాప్‌డ్రాగన్ 8 ఎలైట్ ప్రాసెసర్, 8 అంగుళాల డిస్‌ప్లే, 200 మెగాపిక్సెల్ వైడ్ యాంగిల్ కెమెరాతో కూడిన ఈ ఫోన్ కేవలం 215 గ్రాముల బరువు, మడత పెట్టినప్పుడు 8.9 మిల్లీమీటర్ల మందం కలిగి ఉంటుందని కంపెనీ తెలిపింది. బుధవారం నుంచి ప్రీ-బుకింగ్‌ను ప్రారంభించిన కంపెనీ.. ఈనెల 25 నుంచి విక్రయాలు ప్రారంభించనున్నట్లు తెలిపింది. భారత మార్కెట్లో ఫోల్డ్7 ధర రూ.1,74,999 నుంచి ప్రారంభం కానుండగా.. ఫ్లిప్7 ప్రారంభ ధర రూ.1,09,999గా ఉంది. ఫ్లిప్7 ఎఫ్ఈ రేటు రూ.89,999 నుంచి ప్రారంభమవుతుంది.

వేదాంత ఓ పేక మేడ!

భరించలేని స్థాయికి అప్పుల భారం.. రుణదాతలకు గండమే..



- అమెరికన్ షార్ట్ సెల్లర్ వైస్రాయ్ రీసెర్చ్ నివేదిక
- ఒకదశలో 8% పతనమైన వేదాంత లిమిటెడ్ షేరు

న్యూఢిల్లీ: రెండున్నరేళ్ల క్రితం అమెరికన్ షార్ట్ సెల్లింగ్ కంపెనీ హిండెన్‌బర్గ్.. అదానీ గ్రూప్‌పై అకౌంటింగ్ అక్రమాల ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. తాజాగా మరో అమెరికన్ షార్ట్ సెల్లర్ వైస్రాయ్ రీసెర్చ్.. ప్రవాస భారతీయ పారిశ్రామికవేత్త అనిల్ అగర్వాల్‌కు చెందిన వేదాంత గ్రూప్‌ను లక్ష్యంగా చేసుకుని ఓ నివేదిక విడుదల చేసింది. వేదాంత గ్రూప్ భరించలేని అప్పులు, నిధుల దోపిడీ, అకౌంటింగ్ అవకతవకల పునాదులపై నిర్మించిన ఓ పేక మేడ అని, ఎప్పుడైనా కూలవచ్చని వైస్రాయ్ రీసెర్చ్ అంటోంది. ఆర్థికంగా నిలకడ తప్పిన, వ్యాపార కార్యకలాపాల్లోనూ రాజీపడిన ఈ గ్రూప్‌తో రుణదాతలకు గండమేనని పేర్కొంది. గ్రూప్ కార్యకలాపాలు పోంజీ స్కీమ్‌ను తలపిస్తున్నాయంది. బ్రిటన్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న గ్రూప్ హోల్డింగ్ కంపెనీ వేదాంత రిసోర్సెస్‌ను (వీఆర్ఎల్) సొంత కార్యకలాపాల్లేని ఓ పరాన్న జీవిగా అభివర్ణించింది. అప్పులు తిరిగి చెల్లించేందుకు ఈ కంపెనీ భారత అనుబంధ విభాగమైన వేదాంత లిమిటెడ్ నిధులను క్రమంగా పీల్చి పిప్పి చేస్తోందంటూ బుధవారం విడుదల చేసిన 85 పేజీల నివేదికలో వైస్రాయ్ రీసెర్చ్ ఆరోపించింది. ఈ నేపథ్యంలో వీఆర్ఎల్‌కు చెందిన బాండ్లు, ఇతర రుణ సాధనాలపై షార్ట్ పొజిషన్లు తీసుకున్నట్లు వెల్లడించింది.

ఆ ఆరోపణలు నిరాధారం: వేదాంత

వేదాంత గ్రూప్ ఈ ఆరోపణలను తోసిపుచ్చింది. వైస్రాయ్ రీసెర్చ్‌వి నిరాధార ఆరోపణలని, తమను సంప్రదించకుండానే ఎంపిక చేసిన తప్పుడు సమాచారంతో నివేదికను విడుదల చేసిందని అంటోంది. ఇది తమ గ్రూప్‌ను అప్రతిష్ఠపాలు చేసే ప్రయత్నమేనని పేర్కొంది.

వేదాంత షేరు ఢమాల్

వైస్రాయ్ రీసెర్చ్ ఆరోపణల నేపథ్యంలో వేదాంత లిమిటెడ్ షేరు బీఎస్ఈలో ఒకదశలో 7.71 శాతం పతనమై రూ.421 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. మళ్లీ కాస్త కుదురుకుని చివరికి 3.38 శాతం నష్టంతో రూ.440.80 వద్ద ముగిసింది. దాంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.6,022 కోట్ల మేర తగ్గి రూ.1.72 లక్షల కోట్లకు పడిపోయింది.


నివేదికలోని మరిన్ని ముఖ్యాంశాలు

- గత 4 ఆర్థిక సంవత్సరాల్లో వేదాంత లిమిటెడ్ రూ.75,800 కోట్ల డివిడెండ్ చెల్లించగా.. గ్రూప్‌నకు చెందిన మరో కంపెనీ హిందుస్థాన్ జింక్ లిమిటెడ్ (హెచ్‌జెడ్ఎల్) రూ.57,300 కోట్ల డివిడెండ్ చెల్లింపులు జరిపింది. కాగా, వేదాంత లిమిటెడ్ జరిపిన డివిడెండ్ చెల్లింపుల్లో ఈక్విటీ వాటాకు అనుగుణంగా 56.38 శాతం నిధులు మాతృసంస్థ వేదాంత రిసోర్సెస్ లిమిటెడ్‌కు (వీఆర్ఎల్) లభించాయి. హెచ్‌జెడ్ఎల్ డివిడెండ్ చెల్లింపుల్లోనూ 61.62 శాతం వీఆర్ఎల్‌కే దక్కాయి.
- గత మూడేళ్లలో డివిడెండ్ చెల్లింపుల కారణంగా వేదాంత లిమిటెడ్ నగదు ప్రవాహ లోటు 560 కోట్ల డాలర్లకు చేరింది. 2021-22 ఆర్థిక సంవత్సరం నుంచి వేదాంత లిమిటెడ్ నికర రుణ భారం దాదాపు 200 శాతం పెరిగి 670 కోట్ల డాలర్లకు చేరుకుంది. నగదు నిల్వలు క్షీణించడంతో కంపెనీ మరిన్ని రుణాలను సేకరించే సామర్థ్యాన్ని, నిర్వహణ మూలధన వస్తువులను నగదీకరించుకునే సామర్థ్యాన్ని కోల్పోయింది.
- అదే సమయంలో వీఆర్ఎల్ రుణ వడ్డీ వ్యయాలు ఏటా 20 కోట్ల డాలర్ల చొప్పున పెరిగాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 490 కోట్ల డాలర్ల స్థూల రుణంపై 15.8 శాతం వార్షిక వడ్డీ భారంతో మొత్తం వడ్డీ వ్యయాలు 83.5 కోట్లకు చేరాయని కంపెనీ వెల్లడించింది.
- వేదాంత కీలక అనుబంధ సంస్థల్లో ఆర్థికంగా లాభదాయకం కాని ఆస్తులు, వెల్లడించని అప్పులు, వ్యవస్థాగత మోసం, పాలన వైఫల్యాలున్నట్లు మా ఫోరెన్సిక్ దర్యాప్తులో తేలింది. వేదాంత గణాంకాలన్నీ అభూత కల్పనలే.

అమెరికా నుంచి గ్రాన్యూల్స్ ఔషధం రీకాల్

న్యూఢిల్లీ: గ్రాన్యూల్స్ ఇండియా రక్తపోటును తగ్గించే మెటోప్రోలాల్ సక్సనేట్ ఎక్స్‌టెండెడ్ రిలీజ్ టాబ్లెట్స్ 33,000 బాటిల్స్‌ను అమెరికన్ మార్కెట్ నుంచి రీకాల్ చేసింది. తయారీ లోపాలున్నట్టుగా గుర్తించినందు వల్ల ఈ చర్య తీసుకున్నట్టు అమెరికన్ డ్రగ్ రెగ్యులేటర్ యూఎస్ఎఫ్‌డీఏ ప్రకటించింది. భారత్‌లో తయారైన ఈ టాబ్లెట్లు పూర్తిగా నీటిలో కరగలేదని, ఇది వినియోగదారుల ఆరోగ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తుందని ఎఫ్‌డీఏ తెలిపింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



10వ తేదీ			
హైదరాబాద్	510	విజయవాడ	540
వరంగల్	512	గోదావరి	515
చిత్తూరు	613	విశాఖపట్నం	540
		దజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	100	విజయవాడ	102
వరంగల్	100	గుంటూరు	107
కరీంనగర్	100	ఒంగోలు	110
మహబూబ్‌నగర్	100	చిత్తూరు	105
కర్నూలు	100	నెల్లూరు	110
విశాఖపట్నం	86	అనంతపురం	110
గోదావరి	102		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	98,180 ▼	90,000 ▼	1,20,000 ▲
విజయవాడ	98,950 ▼	96,000 ▲	1,10,000 ▼
విశాఖపట్నం	99,150 ▼	90,000 ▼	1,20,000 ▼
రాజమండ్రి	98,180 ▼	90,000 ▼	1,11,000 ▲
ప్రొద్దుటూరు	96,700 ▼	88,960 ▼	1,08,500 ▼
ముంబై	96,090 ▼	88,010 ▼	1,07,280 ▼

నీరసించిన స్టాక్ మార్కెట్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ బుధవారం నీరసించింది. సెన్సెక్స్ 176.43 పాయింట్ల నష్టంతో 93,536.08 వద్ద ముగియగా నిఫ్టీ 46.40 పాయింట్ల నష్టంతో 25,476.10 వద్ద ముగిసింది. సెన్సెక్స్ ఒక దశలో 330.23 పాయింట్ల వరకు నష్టపోయి 83,382.28 పాయింట్ల ఇంట్రా డే కనిష్ఠ స్థాయిని తాకింది. ఐటీ, ఆయిల్ అండ్ గ్యాస్, మెటల్ కంపెనీల షేర్లలో అమ్మకాల ఒత్తిడి, అంతర్జాతీయ సంకేతాలు మిశ్రమంగా ఉండడం బుధవారం మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. క్యూ1 ఆర్థిక ఫలితాలు ఎలా ఉంటాయోననే భయాలూ మార్కెట్‌ను వెంటాడాయి.

స్కోడా గ్రూపుతో టాటా ఆటోకాంప్ జేవీ

న్యూఢిల్లీ : రైల్వేలకు అవసరమైన అధునాతన యంత్రపరికరాలు, విడి భాగాల తయారీ కోసం టాటా గ్రూప్ చెక్ రిపబ్లిక్‌కు చెదిన స్కోడా గ్రూప్‌తో చేతులు కలిపింది. ఇందుకోసం ఒక జాయింట్ వెంచర్ (జేవీ) కంపెనీని ఏర్పాటు చేసినట్టు టాటా ఆటోకాంప్ తెలిపింది. ఈ జేవీ ద్వారా రైలు ఇంజిన్లు, కోచ్‌లు, అవసరమైన ఇతర కీలక విడి భాగాలనూ భారత్‌లో తయారు చేయబోతున్నట్టు ప్రకటించింది. ఈ జేవీ కోసం పెద్ద మొత్తంలోనే పెట్టుబడులు పెట్టనున్నట్టు తెలిపింది. భారత్‌లో పెరుగుతున్న రైలు రవాణాను దృష్టిలో ఉంచుకుని స్కోడా గ్రూప్‌తో కలిసి ఈ జేవీ ఏర్పాటు చేసినట్టు టాటా ఆటోకాంప్ తెలిపింది.

స్పోర్ట్స్

ఎవరో 'లార్డ్స్' కింగ్?

నేటి నుంచి మూడో టెస్ట్
మ. 3.30 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో..



- ఫుల్‌జోష్‌లో భారత్
- బుమ్రా ఎంట్రీ ఖరారు
- పుంజుకోవాలని ఇంగ్లండ్
- తుదిజట్టులోకి ఆర్చర్

లండన్: తొలి టెస్ట్‌లో ఓటమితో తీవ్ర ఒత్తిడి.. మ్యాచ్‌ను మలుపుతిప్పగల బుమ్రాకు విశ్రాంతి.. ఈ పరిస్థితుల్లో భారత జట్టు పుంజుకోవడం కష్టమేనన్న విమర్శలు..! అయితే, శుభ్‌మన్ గిల్ సేన రెండో టెస్ట్‌లో ఇంగ్లండ్‌ను చిత్తు చేసి.. ఎడ్జ్‌బాస్టన్‌లో తొలి విజయాన్ని దక్కించుకొంది. గిల్ సూపర్ బ్యాటింగ్.. పేసర్ ఆకాశ్‌దీప్ అద్భుత బౌలింగ్‌తో ఐదు టెస్ట్‌ల సిరీస్‌ను 1-1తో సమం చేసి ప్రత్యర్థితో ఢీ అంటే ఢీ అనే స్థాయికి చేరింది. ఇదే జోష్‌లో గురువారం నుంచి ప్రతిష్ఠాత్మక లార్డ్స్ మైదానంలో జరిగే మూడో టెస్ట్‌లో గెలుపే లక్ష్యంగా టీమిండియా బరిలోకి దిగుతోంది. బుమ్రా రీఎంట్రీతో.. తడబడుతున్న ఇంగ్లండ్‌కు కఠిన పరీక్ష ఎదురయ్యే అవకాశం ఉంది. నయా కెప్టెన్ గిల్ సారథ్యంలోని యువ భారత్.. లీడ్స్‌లోనూ పైచేయి సాధించినా కీలక సమయంలో క్యాచ్‌లు చేజార్చడం జట్టుకు శాపంగా మారింది. కానీ, దీని నుంచి వేగంగా పాఠాలు నేర్చిన భారత్.. రెండో టెస్ట్‌లో ప్రతి సెషన్‌లోనూ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. బ్యాట్‌తో చెలరేగిన గిల్ అండ్ కో కొండంత స్కోర్లు చేయడంతో.. ప్రత్యర్థి కెప్టెన్ బెన్ స్టోక్స్ జీవమున్న పిచ్ కోసం డిమాండ్ చేయాల్సిన పరిస్థితి వచ్చింది. దీంతో లార్డ్స్‌లో సీమ్ బౌలర్లకు అనుకూలించే పిచ్‌ను రూపొందించే విధంగా ఒత్తిడి చేశారని సమాచారం. మరోవైపు బుమ్రా రాకతో ఇంగ్లండ్ బ్యాటర్ల పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారే అవకాశం ఉంది. కరుణ్ నాయర్ వైఫల్యం మినహా భారత బ్యాటింగ్‌లో చెప్పుకోదగ్గ ఆందోళనకర పరిస్థితులు లేవు. గిల్ సూపర్ ఫామ్ జట్టు ఆత్మవిశ్వాసాన్ని పెంచుతోంది. జైస్వాల్, రాహుల్, పంత్, జడేజా రాణిస్తుండడం శుభపరిణామం. గత మ్యాచ్‌లో పేసర్లు ఆకాశ్‌దీప్, సిరాజ్ రాణించగా.. ధారాళంగా పరుగులిచ్చిన ప్రసిద్ధ్ కృష్ణను బుమ్రా కోసం పక్కనపెట్టే అవకాశం ఉంది. ఆల్‌రౌండర్లుగా జడేజా, వాషింగ్టన్ సుందర్, నితీశ్ కుమార్‌ను కొనసాగించే చాన్సులున్నాయి.

నేటినుంచి సోనీ స్పోర్ట్స్ తెలుగు చానెల్ అందుబాటులోకి రానుంది. భారత్-ఇంగ్లండ్ టెస్ట్ సిరీస్ ఈ చానెల్‌లో ప్రత్యక్ష ప్రసారం కానుంది.



కోచ్ మెకల్లమ్‌తో ఆర్చర్

ఆర్చర్ రాక..: మరోవైపు రెండో టెస్టులో భారీ ఓటమితో ఇంగ్లండ్‌పై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఓపెనర్లు క్రాలే, డకెట్ వైఫల్యం జట్టుపై తీవ్ర ప్రభావం చూపుతోంది. రూట్ కూడా ఆశించిన స్థాయి ప్రదర్శన చేయలేక పోతున్నాడు. ఆల్‌రౌండర్ స్టోక్స్ బంతితో ఫర్వాలేదనిపిస్తున్నా.. బ్యాట్‌తో తేలిపోతున్నాడు. అయితే, బ్రూక్, జేమీ స్మిత్ టచ్‌తో ఉండడం కొంత ఊరటనిచ్చే అంశం. నాలుగేళ్ల తర్వాత జోఫ్రా ఆర్చర్ టీమ్‌లోకి రావడంతో బౌలింగ్ కొంత మెరుగుపడే అవకాశం ఉంది.

జట్లు

ఇంగ్లండ్ (తుది జట్టు): బెన్ స్టోక్స్ (కెప్టెన్), జాక్ క్రాలే, బెన్ డకెట్, ఓలీ పోప్, జో రూట్, హ్యారీ బ్రూక్, జేమీ స్మిత్ (వికెట్ కీపర్), క్రిస్ వోక్స్, కార్స్, ఆర్చర్, బషీర్.

భారత్ (అంచనా): యశస్వీ జైస్వాల్, రాహుల్, కరుణ్ నాయర్, శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రిషభ్ పంత్, జడేజా, నితీశ్, సుందర్, బుమ్రా, సిరాజ్, ఆకాశ్‌దీప్.

పిచ్/వాతావరణం

వికెట్‌పై పచ్చిక ఉండడంతో పేసర్లకు కొంత అనుకూలించనుంది. ఇటీవలే జరిగిన డబ్ల్యూటీసీ ఫైనల్లో బౌలర్ల ఆధిపత్యమే కనిపించింది. ఈ మ్యాచ్‌లో కూడా అలాగే జరిగే పరిస్థితులున్నాయి. మ్యాచ్ సాగే కొద్దీ పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా మారే చాన్సులున్నాయి. వాతావరణం సాధారణంగా పొడిగా ఉండనుంది. టాస్ గెలిచిన జట్టు బౌలింగ్ ఎంచుకొనే అవకాశం ఉంది.

3 లార్డ్స్‌లో ఇరు జట్లు 19 సార్లు తలపడితే.. భారత్ 3 మ్యాచ్‌లు మాత్రమే గెలిచింది. ఇంగ్లండ్ 12 టెస్ట్‌లు నెగ్గగా.. 4 మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి.

18 ఇంగ్లండ్‌పై ఓ సిరీస్‌లో అత్యధిక పరుగులు సాధించిన భారత బ్యాటర్ రాహుల్ ద్రవిడ్ (602) రికార్డును అధిగమించడానికి గిల్ (585)కు కావాల్సిన పరుగులు.

మా వ్యూహాలు మాకున్నాయి: స్టోక్స్

అద్భుతంగా ఆడుతున్న గిల్‌తోపాటు భారత బ్యాటర్లను కట్టడి చేయగల వ్యూహాలు మాకున్నాయి. ఆర్చర్ రాకతో బౌలింగ్ మెరుగుపడనుంది. ప్రత్యర్థులను అతడు ఇబ్బందులకు గురి చేయగలడు.

టాప్-10లో తొలిసారి..

గిల్‌కు ఆరో ర్యాంక్
ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్

దుబాయ్: ఎడ్జ్‌బాస్టన్ టెస్ట్‌లో చిరస్మరణీయ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్న టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ర్యాంకింగ్స్‌లోనూ దూసుకెళ్లాడు. బుధవారం ప్రకటించిన ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్ బ్యాటర్ల విభాగంలో గిల్ తొలిసారి టాప్-10లోకి దూసుకొచ్చాడు. తాజా ర్యాంకింగ్స్‌లో గిల్ ఏకంగా 15 స్థానాలు ఎగబాకాడు. ఫలితంగా 6వ ర్యాంక్‌లో నిలిచి కెరీర్ బెస్ట్ అందుకున్నాడు. అంతకుముందు టెస్టుల్లో గిల్ అత్యుత్తమ ర్యాంక్ 14 (2023 సెప్టెంబరులో) మాత్రమే. యశస్వీ జైస్వాల్ 4వ ర్యాంక్‌తో భారత్ నుంచి టాప్‌లో ఉన్నాడు. ఇంగ్లండ్ స్టార్ హ్యారీ బ్రూక్ నెంబర్‌వన్ బ్యాటర్‌గా కొనసాగుతుండగా.. జో రూట్ (ఇంగ్లండ్), కేన్ విలియమ్సన్ (న్యూజి లాండ్) వరుసగా 2, 3 స్థానాల్లో ఉన్నారు. బౌలర్లలో బుమ్రా టాప్ ర్యాంక్‌ను నిలబెట్టుకోగా, సిరాజ్ 22వ స్థానానికి ఎగబాకాడు. ఆల్‌రౌండర్లలో జడేజా అగ్రస్థానంలో మార్పు లేదు.

జ్యోతి సురేఖ జోడీ ప్రపంచ రికార్డు



మాడ్రిడ్: తెలుగమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ/రిషబ్ యాదవ్ ద్వయం కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో ప్రపంచ రికార్డు తిరగరాసింది. వరల్డ్ కప్ ఆర్చరీ నాలుగో దశలో భాగంగా బుధవారం జరిగిన మిక్స్‌డ్ టీమ్ విభాగం క్వాలిఫయింగ్ రౌండ్‌లో భారత జోడీ సంయుక్తంగా 1431 పాయింట్లు సాధించారు. వీటిలో జ్యోతి సురేఖ 715, రిషబ్ 716 పాయింట్లతో నిలిచారు. దాంతో డెన్మార్క్ ద్వయం గెలెంతియన్/ఫులెర్టన్ పేరిట 1429 పాయింట్లతో 2023 నుంచి ఉన్న గత వరల్డ్ రికార్డు తుడిచి పెట్టుకుపోయింది. ఇక..కాంపౌండ్ మహిళల జట్టు ఫైనల్‌కు దూసుకుపోవడంతో భారత్‌కు ఒక పతకం ఖరారైంది. మరోవైపు పురుషుల జట్టు క్వార్టర్‌ఫైనల్లో పరాజయం చవిచూసింది. జ్యోతి సురేఖ, ప్రణీత్ కౌర్, ప్రతీకతో కూడిన భారత త్రయం సెమీఫైనల్లో 230-226తో ఇండోనేసియాను ఓడించింది. స్వర్ణం కోసం శనివారం జరిగే పోరులో 10వ సీడ్ చైనీస్ తైపీ జట్టుతో జ్యోతి త్రయం తలపడనుంది.

స్వియటెక్ అదుర్స్

- తొలిసారి సెమీస్‌లో ప్రవేశం
- బెన్సిక్‌తో అమీతుమీ
- పురుషుల సెమీస్‌లో సినర్, జొకోవిచ్



బెన్సిక్



స్వియటెక్

లండన్: ప్రతిష్ఠాత్మక వింబుల్డన్‌లో ఎనిమిదో సీడ్ ఇగా స్వియటెక్ మొదటిసారి సెమీఫైనల్లోకి అడుగుపెట్టింది. ఫైనల్లో చోటు కోసం అన్‌సీడెడ్ బెలిండా బెన్సిక్‌తో ఈ పోలెండ్ భామ గురువారం అమీతుమీ తేల్చుకోనుంది. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో స్వియటెక్ 6-2, 7-5తో వరుస సెట్లలో 19వ సీడ్ లుడ్మిలా సంసనోవా (రష్యా)పై విజయం సాధించింది. హోరాహోరీగా సాగిన మరో క్వార్టర్‌ఫైనల్లో బెలిండా బెన్సిక్ (స్విట్జర్లాండ్) 7-6 (3), 7-6 (2)తో ఏడో సీడ్, టీనేజర్ ఆండ్రీవా (రష్యా)కు షాకిచ్చింది. మహిళల మరో సెమీఫైనల్లో టాప్ సీడ్ సబలెంక (బెలారస్)-13వ సీడ్ అమండా అనిసిమోవా (అమెరికా) తలపడనున్నారు. స్వియటెక్ ఐదు గ్రాండ్‌స్లామ్‌లు సొంతం చేసుకున్నా... అందులో నాలుగు టైటిళ్లు మట్టి కోర్టు అయిన ఫ్రెంచ్ ఓపెన్‌లో సాధించినవే. మరొకటి హార్డ్‌కోర్ట్ అయిన యూఎస్ ఓపెన్‌లో గెలిచింది. అలాగే హార్డ్ కోర్టులపై సాగే ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఆమె రెండుసార్లు సెమీస్‌కు చేరింది. కానీ పచ్చికపై ఆడే వింబుల్డన్‌లో స్వియటెక్ గతంలో ఐదుసార్లు తలపడినా..ఒక్కసారే క్వార్టర్‌ఫైనల్ వరకు రాగలిగింది.

సినర్‌తో జొకో ఢీ

పురుషుల టాప్ సీడ్ యానిక్ సినర్, ఆరో సీడ్ నొవాక్ జొకోవిచ్ సెమీఫైనల్లో అడుగుపెట్టారు. క్వార్టర్‌ఫైనల్లో సినర్ (ఇటలీ) 7-6 (2), 6-4 6-4తో 10వ సీడ్ బెన్ షెల్టన్ (అమెరికా)ను చిత్తు చేశాడు. గాయంతో బాధపడుతూ కూడా మ్యాచ్‌ను సినర్ వరుస సెట్లలో ముగించడం విశేషం. మరో క్వార్టర్‌ఫైనల్లో జొకోవిచ్ 6-7(8), 6-2, 7-5, 6-4తో 22వ సీడ్ ఫ్లావియో కొబొల్లి (ఇటలీ)పై గెలిచి వరుసగా ఏడోసారి సెమీఫైనల్‌కు దూసుకెళ్లాడు. శుక్రవారం జరిగే సెమీఫైనల్లో సినర్‌తో జొకోవిచ్ అమీతుమీ తేల్చుకోనున్నాడు. మరో సెమీస్‌లో డిఫెండింగ్ చాంప్ అల్కారజ్, ఐదో సీడ్ టేలర్ ఫ్రిట్జ్ పోటీపడనున్నారు.

హంపి, హారిక గెలుపు

మహిళల చెస్ ప్రపంచ కప్



బతుమి (జార్జియా): భారత గ్రాండ్‌మాస్టర్లు కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక మహిళల వరల్డ్ కప్ రెండో రౌండ్ తొలి గేమ్‌లో విజయం సాధించారు. బుధవారం జరిగిన మొదటి గేమ్‌లో అఫ్రూజ (ఉజ్బెకిస్థాన్)పై హంపి గెలుపొందింది. ఇక, భారత్‌కే చెందిన నంధిదాను హారిక ఓడించింది. మరో గ్రాండ్ మాస్టర్ వంతిక అగర్వాల్-అనా ఉషీనినా (ఉక్రెయిన్)పై నెగ్గగా, క్విలెట్ మెయిలీ (కెనడా)పై వైశాలి, కేసరియా (జార్జియా)పై దివ్యా దేశ్‌ముఖ్ గెలిచారు.

గడ్డం నెరిసింది.. అందుకే రిటైర్మెంట్!



లండన్: వయస్సు మీరడంతోనే టెస్ట్‌ల నుంచి తాను రిటైర్మెంట్ తీసుకున్నానని విరాట్ కోహ్లీ వెల్లడించాడు. టీమిండియా మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ స్వచ్ఛంద సంస్థ 'యు వికన్' నిధుల సేకరణకోసం ఇక్కడ నిర్వహించిన కార్యక్రమంలో విరాట్ పాల్గొన్నాడు. ఈ సందర్భంగా సుదీర్ఘ ఫార్మాట్‌కు వీడ్కోలు పలికిన నిర్ణయం గురించి సరదాగా చెప్పుకొచ్చాడు. 'రెండు రోజుల కిందటే నా గడ్డానికి రంగు వేసుకున్నా. ప్రతి నాలుగు రోజులకోసారి రంగు వేసుకోవాల్సిన సమయమొచ్చేసిందని కూడా నాకు తెలుసు' అని వయస్సు పెరిగిందన్న విషయాన్ని పరోక్షంగా వెల్లడించాడు.

షాట్‌పుటర్ జాస్మిన్‌పై సస్పెన్షన్

న్యూఢిల్లీ: భారత షాట్‌పుటర్ జాస్మిన్ కౌర్ డోప్ పరీక్షలో విఫలమైంది. పంజాబ్‌కు చెందిన 22 ఏళ్ల జాస్మిన్ నిషేధిత ఉత్ప్రేరకం టెర్బుటలైన్ తీసుకున్నట్టు రుజువైంది. దీంతో ఆమెపై జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) తాత్కాలిక సస్పెన్షన్ విధించింది. ఇక, ఇప్పటికే డోపీగా తేలిన రెజ్లర్ నితికపై నాలుగేళ్ల నిషేధం విధిస్తున్నట్టు నాడా బుధవారం ప్రకటించింది.

ఆగస్టు 29 నుంచి ప్రొ కబడ్డీ

ముంబై: కబడ్డీ అభిమానులను ఉర్రూతలూగించేందుకు ప్రొ కబడ్డీ సీజన్-12 సిద్ధమవుతోంది. ఆగస్టు 29వ తేదీ నుంచి ఈ లీగ్‌ను నిర్వహించనున్నారు. ఎప్పటిలానే 12 జట్లు లీగ్‌లో తలపడబోతున్నాయి. వేదికలు, పోటీలు జరిగే తేదీలను త్వరలో ప్రకటించనున్నారు.

ఐరోపా పర్యటనలో
యువ భారత్ బోణీ

ఈన్‌థోవెన్ (నెదర్లాండ్స్): భారత-ఏ హాకీ జట్టు ఐరోపా పర్యటనను విజయంతో ప్రారంభించింది. మంగళవారం రాత్రి ఇక్కడ జరిగిన తమ తొలి మ్యాచ్‌లో భారత్ 6-1తో ఐర్లాండ్‌ను చిత్తు చేసింది.

హ్యామ్ రోడ్లతో 50% రోడ్లకు మోక్షం!

» సీఎం ఆమోదంతో టెండర్ల ప్రక్రియ: మంత్రి కోమటిరెడ్డి



హైదరాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రాలకు అనుసంధానం పెరగడంలో హ్యామ్ రోడ్లు కీలక పాత్రను పోషిస్తాయని, వాటితో రాష్ట్రంలో 50 శాతం రహదారులకు మోక్షం కలుగుతుందని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. అర్బన్, సెమీ అర్బన్, రూరల్ క్లస్టర్లుగా రాష్ట్రాన్ని విభజించి రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆమోదంతో టెండర్ల ప్రక్రియ వెంటనే ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. రాష్ట్ర రోడ్లు, భవనాలు, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులతో బుధవారం సెక్రటేరియట్‌లో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి మాట్లాడుతూ.. జాతీయ రహదారుల నిర్మాణంలో పాటిస్తున్న నాణ్యత ప్రమాణాల ప్రకారమే రాష్ట్రంలో హ్యామ్ రోడ్లు నిర్మిస్తామని చెప్పారు. పదేళ్లపాటు చెక్కు చెదరకుండా ఉండేలా వీటి నిర్మాణం చేపడతామని స్పష్టం చేశారు. జాతీయ రహదారి-65 పనుల పురోగతిని కోమటిరెడ్డి సమీక్షించారు. పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. రీజినల్ రింగురోడ్డు(ఆర్‌ఆర్‌ఆర్) దక్షిణ భాగం ఆమోదం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కలిసి ఢిల్లీ వెళ్లి ప్రధానమంత్రి నరేంద్రమోదీని, కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కలిసి విజ్ఞప్తి చేస్తామని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు.

విత్తనోత్పత్తికి తెలంగాణ అనువైన ప్రాంతం

» రాష్ట్రంలో త్వరలో ఆదర్శ రైతుల వ్యవస్థ: కోదండరెడ్డి

విత్తనోత్పత్తికి తెలంగాణ అనువైన ప్రాంతమని, దేశంలో 60 శాతం విత్తనాలు ఇక్కడే ఉత్పత్తి అవుతున్నాయని రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ ఎం.కోదండరెడ్డి అన్నారు. తెలంగాణ రైతులు ఉత్పత్తి చేసే విత్తనాలు ప్రపంచ దేశాలకూ ఎగుమతి అవుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం వరి, పత్తి, మొక్కజొన్న విత్తనోత్పత్తి ప్రక్రియ పురోగతిలో ఉండగా.. కేసీఆర్ పాలనలో మాత్రం అది దెబ్బతిన్నదని విమర్శించారు. రాష్ట్రంలో నకిలీ విత్తనాలను సరఫరాచేసే కంపెనీలు, దళారులపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో త్వరలో ఆదర్శ రైతుల వ్యవస్థను తీసుకు రాబోతునట్లు తెలిపారు.

కక్ష రాజకీయాలకు లొంగం: ఎంపీ కె.లక్ష్మణ్

"మేము నమ్మిన సిద్ధాంతాల కోసం, దేశం కోసం పనిచేస్తున్న నిబద్ధత గల కార్యకర్తలం. న్యాయస్థానాల పట్ల, ధర్మ పట్ల మాకు సంపూర్ణ నమ్మకం ఉంది. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల కక్ష సాధింపు చర్యలకు లొంగకుండా దేశం కోసం పనిచేస్తూనే ఉంటాం" అని రాజ్యసభ ఎంపీ, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో ఆయనపై నమోదైన కేసులో భాగంగా బుధవారం నాంపల్లి కోర్టులో హాజరయ్యారు. బీజేపీని నేరుగా ఎదుర్కోలేక అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం తప్పుడు కేసులు పెట్టి రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే మార్గాన్ని అనుసరిస్తోందని లక్ష్మణ్ దుయ్యబట్టారు.

రిజర్వేషన్లపై క్యాబినెట్‌లో స్పష్టత ఇవ్వాలి: జాజుల

బీసీ రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వం నాన్చివేత ధోరణి అవలంబించకుండా గురువారం జరిగే క్యాబినెట్ సమావేశంలో స్పష్టతనివ్వాలని, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికి సీఎం నేతృత్వంలో అఖిలపక్షం ఢిల్లీకి వెళ్లే తేదీని ఖరారు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. స్థానిక ఎన్నికలపై హైకోర్టు ఇచ్చినతీర్పు మేరకు గడువు సమీపిస్తున్నందున ప్రభుత్వం సాధ్యమైనంత త్వరగా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచడానికి ఈనెల 11న హైదరాబాదులో బిసి కుల సంఘాలతో విస్తృతస్థాయి సమావేశం ఏర్పాటు చేసి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని జాజుల తెలిపారు.

వైద్యపరీక్షల కోసం నేడు యశోద ఆస్పత్రికి కేసీఆర్

వైద్య పరీక్షల కోసం గత వారం యశోద ఆసుపత్రిలో చేరి.. అనంతరం డిశ్చార్జి అయిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ గురువారం మరోసారి వైద్య పరీక్షల కోసం ఆ ఆస్పత్రికి రానున్నారు. వైద్యుల సూచన మేరకు 5 రోజులుగా ఆయన నందినగర్‌లోని నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు.



వికారాబాద్ జిల్లా పరిగిలోని విజేత ఆస్పత్రి ఎదుట ఆందోళన

6 నెలల గర్భిణికి అబార్షన్.. ఆందోళన

» తల్లిదండ్రులే అబార్షన్ చేయించారని అత్తింటివారి ఆరోపణ

» పరిగిలోని విజేత ఆస్పత్రి యాజమాన్యం, వైద్యులపై కేసు

పరిగి, జూలై 9(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా పరిగిలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో ఆరు నెలల గర్భిణికి అబార్షన్ చేసిన ఉదంతం ఉద్రిక్తతకు దారితీసింది. తమకు తెలియకుండా అబార్షన్ చేశారని ఆమె అత్తమామలు, వారి తరపు బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. వారి ఫిర్యాదుతో ఆస్పత్రిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పరిగి మండలానికి చెందిన యువకుడికి, చౌడాపూర్ మండలం కొత్తపల్లితండాకు చెందిన యువతికి 14 నెలల క్రితం వివాహం జరిగింది. అతను వారం క్రితం ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలి మృతిచెందాడు. అతని భార్య ఆరు నెలల గర్భిణి. మొదటి నుంచి ఆమె విజేత ఆస్పత్రిలోనే పరీక్షలు చేయించుకుంటోంది. ఒక్కసారిగా ఆమెకు నొప్పులు రావడంతో తల్లిదండ్రులు మంగళవారం ఆస్పత్రికి తీసుకొచ్చారు. పరీక్షలు చేసిన డాక్టర్.. గర్భంలో కవలలు ఉన్నారని, వారి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని, అబార్షన్ చేయాలని సూచించినట్లు ఆమె తల్లిదండ్రులు చెబుతున్నారు. మంగళవారం రాత్రి అబార్షన్ చేశారు. అయితే ఉద్దేశపూర్వకంగానే అబార్షన్ చేయించారని ఆమె అత్తమామలు, వారి తరపు బంధువులు బుధవారం ఆందోళనకు దిగారు. వారికి ప్రజా సంఘాల నాయకులు మద్దతు తెలిపి, ఆస్పత్రి ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఆస్పత్రిని సీజ్ చేసి, వైద్యులు, సిబ్బందిపై క్రిమినల్ కేసు పెట్టాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి గోవింద్‌నాయక్ డిమాండ్ చేశారు. పరిస్థితులు ఉద్రిక్తతకు దారి తీయడంతో పోలీసులు డాక్టర్‌ను, సిబ్బందిని స్టేషన్‌కు తరలించారు. అప్పటికే ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యులు, సిబ్బంది అక్కడికి చేరుకొని విజేత ఆస్పత్రి యాజమాన్యానికి మద్దతుగా నిలిచారు. అబార్షన్ ఉదంతంపై ఇన్‌చార్జి డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.ప్రవీణ్‌కుమార్, జిల్లా ఉప ఆరోగ్య అధికారి డాక్టర్ రవీంద్రయాదవ్ విజేత ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఆస్పత్రి నిర్వహణకు అనుమతులు ఉన్నాయా, అర్హత గల డాక్టర్లు ఉన్నారా అనే విషయాలపై విచారణ జరిపారు. గురువారం డీఎంహెచ్‌వో, ఇతర అధికారులు మరోసారి విచారణకు రానున్నట్లు సమాచారం. ఈ ఆస్పత్రిపై నిబంధనలకు విరుద్ధంగా అబార్షన్లు చేస్తుంటారనే ఆరోపణలు ఉన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా అబార్షన్ చేశారంటూ గర్భిణి అత్త ఫిర్యాదుతో విజేత ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది, యాజమాన్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీశైలం తెలిపారు.

నేడు పీసీ ఘోష్ కమిషన్ ముందుకు హరీశ్

హైదరాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : కాళేశ్వరం ప్రాజెక్టు విచారణకు సంబంధించి అదనపు సమాచారాన్ని అందించేందుకు మాజీమంత్రి హరీశ్‌రావు గురువారం పీసీ ఘోష్ కమిషన్ ముందు హాజరుకానున్నారు. అదనపు వివరాలను అందించేందుకు కమిషన్‌ను సమయం కోరడంతో ఈమేరకు గురువారం ఉదయం 11 గంటలకు బీఆర్కే భవన్‌లో హాజరు కావాలని కమిషన్ తెలిపింది. దీంతో ఆయన మరోసారి విచారణ కమిషన్‌ను కలుస్తున్నారు.

తెలంగాణకు యూరియా కొరత లేకుండా సహకరిస్తాం

» సీఎం రేవంత్ విజ్ఞప్తికి కేంద్ర మంత్రి నడ్డా స్పందన

» యూరియా వినియోగాన్ని తగ్గించాలని సూచన

న్యూఢిల్లీ, జూలై 9(ఆంధ్రజ్యోతి): తెలంగాణకు ఎరువుల కొరత లేకుండా సహకరిస్తామని కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ మంత్రి జేపీ నడ్డా తెలిపారు. మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో నడ్డాను కలిసి తెలంగాణకు కేటాయించిన ఎరువులను సకాలంలో సరఫరా చేయాలని కోరిన సంగతి తెలిసిందే. ఏప్రిల్-జూన్ మధ్య 5 లక్షల టన్నుల సరఫరా చేయాల్సి ఉండగా 3.07 లక్షల టన్నులు మాత్రమే సరఫరా చేశారని సీఎం తెలిపారు. ఈ నేపథ్యంలో బుధవారం నడ్డా స్పందిస్తూ రాష్ట్ర రైతుల నిజమైన డిమాండ్‌ను తీర్చడానికి తెలంగాణకు మద్దతుగా నిలుస్తామని ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణలో మోతాదుకు మించి యూరియాను వినియోగిస్తున్నారని, తగ్గించుకోవాలని సూచించారు. అధిక యూరియా వినియోగంతో భూముల సారం దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. 2023-24 రబీతో పోలిస్తే 2024-25లో రబీకి దాదాపు 21 శాతం అదనంగా యూరియా అమ్మకాలు జరిగాయని తెలిపారు. 2024-25 ఖరీఫ్‌తో పోలిస్తే 2025-26 ఖరీఫ్‌లో ఇప్పటి వరకు 12.4 శాతం అదనపు వినియోగం జరిగిందని పేర్కొన్నారు. సేంద్రియ-సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన 'పీఎం ప్రణామ్' పథకం గురించి తమ శాఖ కార్యదర్శి రజత్‌కుమార్.. ముఖ్యమంత్రి బృందానికి వివరించారని తెలిపారు. వ్యవసాయేతర అవసరాలకు యూరియాను మళ్లించకుండా చర్యలు తీసుకోవాలని కూడా కోరారని పేర్కొన్నారు.

ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులకు త్వరలోనే మోదీ కిట్లు

(మొదటిపేజీ తరువాయి)

తమలో ఎప్పటికప్పుడు సమాజానికి సేవ చేయాలన్న స్ఫూర్తి నింపిన నాయకుడు మోదీ అని పేర్కొన్నారు. బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా బాలికలకు సైకిళ్లు ఇస్తే బాగుంటుందని కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి ప్రతిపాదించారని, ఆ ఆలోచనతోనే ఈ రోజు పదో తరగతి విద్యార్థులందరికీ సైకిళ్లు పంపిణీ చేస్తున్నామన్నారు. ఇవి ప్రభుత్వ నిధులు కావని, అలా అని తాను కోట్లు ఖర్చు పెట్టేంత సంపన్నుడిని కాదని తెలిపారు. కొందరు కార్పొరేట్ కంపెనీల యజమానులు ఇచ్చిన సీఎస్సార్ ఫండ్‌తో సైకిళ్లను కొని పంపిణీ చేస్తున్నామన్నారు. విద్యారంగానికి మోదీ ప్రభుత్వం ఎనలేని ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. కేంద్ర, రాష్ట్రాల సమన్వయంతో విద్యా రంగం ముందుకు సాగుతుందనే నమ్మకంతోనే జాతీయ విద్యా విధానాన్ని మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. పాఠశాలలను నడిపే బాధ్యతను, స్థానిక భాషలో పాఠ్యాంశాల బోధనను పర్యవేక్షించాల్సింది రాష్ట్ర ప్రభుత్వమేనని అన్నారు. తాను ఎంపీగా ఉన్నంత కాలం ఏటా పదో తరగతి విద్యార్థులకు సైకిళ్లను అందజేయనున్నట్లు చెప్పారు.

ప్రజాభవన్ సాక్షిగా రేవంత్ తప్పుడు ప్రచారం

ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుపై అభ్యంతరాలున్నది వాస్తవం కాదా?

» బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాణహిత ప్రాజెక్టును పక్కనపెట్టిందనడం అబద్ధం

» తెలంగాణ ద్రోహులంతా ప్రజా భవన్‌లో చేరి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు

» అసెంబ్లీలో ప్రివిలేజ్ మోషన్ ఇస్తాం:హరీశ్



హైదరాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ప్రజాభవన్ సాక్షిగా సీఎం రేవంత్‌రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు. ప్రతిపక్ష పార్టీపై నిందారోపణలు చేసేందుకు నీచమైన స్థాయికి దిగజారడాన్ని చూసి తెలంగాణ సమాజం అసహ్యించుకొంటోందని పేర్కొన్నారు. తెలంగాణవాదులు బయట ఉంటే, తెలంగాణ ద్రోహులంతా ప్రజా భవన్‌లో చేరి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఓ ప్రకటనలో ఆరోపించారు. పంపులు ఆన్ చేసి రైతాంగానికి నీళ్ల సరఫరా చేయాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తే.. అది పక్కనబెట్టి సీఎం రేవంత్, నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పనికిరాని పీపీటీలతో అబద్ధాలు చెప్పే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును పక్కనపెట్టి రంగారెడ్డి, నల్గొండ ప్రాంతాలను విస్మరించామని ప్రజలను సీఎం తప్పుదోవ పట్టించకుండా వాస్తవమేంటో తెలుసుకోవాలన్నారు. ఏ సమస్య లేకున్నా బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును పక్కనపెట్టిందనడం పచ్చి అబద్ధమని పేర్కొన్నారు. తుమ్మిడిహెట్టి దగ్గర 152 మీటర్ల ఎత్తులో ప్రాజెక్టు చేపట్టేందుకు మహారాష్ట్ర ఒప్పుకోకున్నా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కాలువలు తవ్వి, మొబిలైజేషన్ అడ్వాన్సులను కాంట్రాక్టర్లకు కట్టబెట్టిందని, ప్రాణహిత డిజైన్‌తో 3 వేల ఎకరాలకు పైగా ముంపు ఉంటుందని మహారాష్ట్ర ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసింది నిజం కాదా? అని ప్రశ్నించారు. కేంద్ర జలసంఘం నీటి లభ్యత లేదని చెప్పిందని, చాప్రాల్ వన్యప్రాణి అభయారణ్యంతో తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుకు సమస్య ఉండటం వాస్తవం కాదా? అని నిలదీశారు. '2007లో మొదలుపెట్టిన ప్రాజెక్టును 2014 వరకు ఎందుకు పూర్తిచేయలేదు. కనీసం అనుమతులు ఎందుకు సాధించలేదు. కేంద్రంలో, మహారాష్ట్ర, ఏపీలో కాంగ్రెస్ అధికారంలో ఉండి చేతులు ముడుచుకొని ఎందుకు కూర్చున్నారో సమాధానం ఇవ్వాలి' అని అన్నారు. కమీషన్ల కోసం అంచనాలు పెంచామంటున్న ఉత్తమ్.. ఏ కమీషన్లు దండుకునేందుకు ఈ ప్రాజెక్టు వ్యయం 17 వేల కోట్ల నుంచి రూ.40 వేల కోట్లకు అంచనాలు పెంచారు? ఎవరి జేబుల్లోకి అవి వెళ్లాయో వివరించాలన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, నారాయణపేట్, నల్గొండ, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లోని 70 మండలాలు, 1,226 గ్రామాల్లోని 12.30 లక్షల ఆయకట్టుకు నీళ్లిచ్చే విషయాన్ని దాచిపెట్టే కుట్ర జరుగుతోందన్నారు. బీఆర్ఎస్ తొమ్మిదిన్నరేండ్లలో 48.74 లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చిందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 50 లక్షల ఎకరాలకు కాంగ్రెస్ ప్రభుత్వం నీళ్లిచ్చిందని పచ్చి అబద్ధాలు చెబుతున్న రేవంత్‌రెడ్డి దమ్ముంటే ఆధారాలు బయటపెట్టాలని డిమాండ్ చేశారు. 50 ఏళ్ల తెలంగాణ నీటి హక్కులను కాలరాసిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, కృష్ణా నీళ్లను పోతిరెడ్డి ద్వారా రాయలసీమకు తరలిస్తుంటే హారతులు పట్టిన నాటి కాంగ్రెస్‌మంత్రులను కొరడా దెబ్బలు కొట్టాలన్నారు. ఇప్పుడు బనకచర్ల ద్వారా ఏపీకి గోదావరి, కృష్ణానీళ్లను ధారాదత్తం చేసేందుకు కుట్రచేస్తున్న నిన్ను కూడా కొరడా దెబ్బలు కొట్టాలని రేవంత్‌ని ఉద్దేశించి అన్నారు. 'అసెంబ్లీకి నిపుణులను పిలవడం కాదు, నీ జూబ్లీహిల్స్ ప్యాలెస్‌కు పిలుచుకొని మాట్లాడి తర్వాత సుద్దులు చెప్పాలి' అని రేవంత్‌కి సూచించారు. రైతు ప్రయోజనాలకంటే రేవంత్‌కు రాజకీయ ప్రయోజనాలే ఎక్కువయ్యాయని, తెలంగాణ ప్రయోజనాల కంటే ఆంధ్రాకు నీళ్లు తరలించడంపైనే దృష్టి ఎక్కువని విమర్శించారు. కృష్ణా జలాల్లో 299:512 వాటాకు రాష్ట్రం ఏర్పడకముందే ఒప్పుకొని మరణశాసనం రాసిందే కాంగ్రెస్ అని, మీ పార్టీ ఆనాడు చేసిన తప్పువల్లే తెలంగాణ ఇప్పటికీ శిక్ష అనుభవిస్తోందన్నారు.

శాసనసభ, మండలిలో ప్రివిలేజ్ మోషన్ ఇస్తాం..

'ఇరిగేషన్‌పై చర్చకు రా అంటూ రంకెలు వేసే రేవంత్‌రెడ్డి.. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను ఎందుకు పిలువలేదు. నీ సవాల్‌లో నిజాయితీ ఉంటే ప్రజా భవన్‌కు ఎందుకు ఆహ్వానించలేదు' అని హరీశ్ ప్రశ్నించారు. ప్రభుత్వం అధికారికంగా ప్రజాభవన్‌లో నిర్వహించిన సమావేశానికి కాంగ్రెస్ ప్రజాప్రతినిధులను, పార్టీ ఫిరాయించిన ప్రజా ప్రతినిధులను మాత్రమే ఆహ్వానించడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనన్నారు. ఈ చర్యతో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ప్రివిలేజ్‌కు భంగం కల్పించినందుకుగాను శాసనసభ స్పీకర్‌కు, శాసనమండలి ఛైర్మన్‌కు బీఆర్ఎస్ తరపున ప్రివిలేజ్ మోషన్ ఇస్తామని హరీశ్‌రావు పేర్కొన్నారు.

మేడిగడ్డకు భారీ వరద

» 2.41 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, గేట్లన్నీ ఓపెన్

» త్రివేణి సంగమం వద్ద పెరిగిన వరద

» ఒక్కరోజులో 5 అడుగులు పెరిగిన సాగర్ నీటిమట్టం

మహదేవపూర్ రూరల్/ నాగార్జున సాగర్/ మహబూబ్‌నగర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఎగువన మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలతో గోదావరి, కృష్ణా బేసిన్ల పరిధిలోని ప్రాజెక్టులకు వరద ప్రవాహం పెరిగింది. మహరాష్ట్రలోని వెయిన్‌గంగా ప్రాజెక్టు నుంచి దిగువకు 3.37 లక్షల క్యూసెక్కుల నీటిని వదిలారు. బుధవారం మేడిగడ్డకు వస్తున్న 2.41 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వరదను బ్యారేజీ 85 గేట్లెత్తి దిగువకు పంపిస్తున్నారు. ప్రస్తుతం బ్యారేజీ వద్ద 3.90 మీటర్ల ఎత్తున ప్రవహిస్తున్న గోదావరి.. వెయిన్‌గంగా వరద నీరు జత కలిసి ఇన్‌ఫ్లో మూడింతలు పెరుగొచ్చని అధికారులు తెలిపారు. కాళేశ్వర త్రివేణి సంగమం వద్ద బుధవారం గోదావరి వరద 7.20 మీటర్లు పెరగడంతో ఘాట్ మెట్ల వద్ద జాగ్రత్తలు పాటించాలని భక్తులకు అధికారులు సూచించారు.

181.9292 టీఎంసీలకు సాగర్ నిల్వ

ఎగువన శ్రీశైలం ప్రాజెక్టు నుంచి 1,17,868 క్యూసెక్కుల నీటి విడుదలతో నాగార్జున సాగర్ నీటిమట్టం బుధవారం 531.30 అడుగుల నుంచి 536.90 అడుగులకు చేరుకుంది. ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 312.0450 టీఎంసీలు కాగా, బుధవారం సాయంత్రానికి 536.90 అడుగులతో 181.9292 టీఎంసీలకు చేరుకుంది. కాగా, శ్రీశైలం ప్రాజెక్టు నుంచి 3 గేట్లు 10 అడుగుల మేరకు ఎత్తడంతో 1.68 లక్షల క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ప్రస్తుతం శ్రీశైలంలో 201.12 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఆలమట్టికి ప్రస్తుతం 1.09 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రికార్డవుతుండగా, 1.15 లక్షల క్యూసెక్కుల ఔట్ ఫ్లో, నారాయణపూర్‌కు లక్ష క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతుండగా, దిగువకు 95,760 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. దిగువన జూరాల వద్ద 1.22 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 1.26 లక్షల క్యూసెక్కుల ఔట్ ఫ్లో రికార్డవుతోంది.

దివ్యాంగులకు స్వయం సహాయక సంఘాలు

వారి ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా ఏర్పాటు: వీరయ్య

హైదరాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని దివ్యాంగుల ఆర్థికాభివృద్ధికి తోడ్పడేలా స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ)ను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు రాష్ట్ర దివ్యాంగుల కో-ఆపరేటివ్ కార్పొరేషన్ ఛైర్మన్ ముత్తినేని వీరయ్య పేర్కొన్నారు. మహిళా ఎస్‌హెచ్‌జీల తరహాలో ఈ ఎస్‌హెచ్‌జీలు ఉంటాయని తెలిపారు. ఆయన బుధవారం ఈ అంశంపై తన కార్యాలయంలో సెర్ప్ సీఈఓ దివ్యా దేవరాజన్‌తో భేటీ అయి చర్చించారు. అనంతరం మాట్లాడారు. దివ్యాంగులను ఆర్థికంగా బలోపేతం చేసే లక్ష్యంతో ఎస్‌హెచ్‌జీల ఏర్పాటు విధి విధానాలపై చర్చించామన్నారు. రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో ఒక దివ్యాంగుల ఎస్‌హెచ్‌జీ ఏర్పాటు చేస్తామని, వాటిలో ఐదుగురి నుంచి 20 మంది వరకు సభ్యులు ఉంటారని తెలిపారు. ప్రతి గ్రామంలో స్థానిక మహిళా ఎస్‌హెచ్‌జీల ప్రతినిధులు, గ్రామ సంఘం ప్రతినిధులు, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు.. దివ్యాంగులను గుర్తించి సంఘాలుగా ఏర్పాటు చేస్తారని వివరించారు. ఈ సంఘాల్లో మహిళలే కాకుండా పురుషులు కూడా సభ్యులయ్యే అవకాశం కల్పిస్తున్నట్టు చెప్పారు.

సీసీఐ, ఎస్ఐఐఎల్ పునరుద్ధరణకు చర్యలు

(మొదటిపేజీ తరువాయి)

మంత్రి హెచ్‌డి. కుమారస్వామి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన ఢిల్లీలో నిర్వహించిన సమీక్షలో రాష్ట్ర ప్రతినిధిగా ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణలో మూతపడ్డ రెండు పరిశ్రమల పరిస్థితిపై కేంద్రమంత్రి ఆరా తీశారు. ఈ పరిశ్రమల పునరుద్ధరణ దిశగా చర్యలు చేపట్టేందుకు సమగ్ర నివేదికను సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు సీసీఐ, ఎస్ఐఐఎల్‌పై కేంద్రమంత్రి సమీక్షా సమావేశాన్ని నిర్వహించడంపై మంత్రి శ్రీధర్ బాబు హర్షం వ్యక్తం చేశారు. ఈ సమీక్షలో మూతపడ్డ రెండు పరిశ్రమలను పునరుద్ధరిస్తే యువతకు ఉపాధి అవకాశాల మెరుగుదల, ఆర్థికాభివృద్ధికి అవకాశముంటుందని కేంద్రమంత్రికి వివరించారు. వెనుకబడిన, నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలైన ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఈ పరిశ్రమల పునరుద్ధరణతో ప్రాంతీయాభివృద్ధిలో సమతుల్యత సాధ్యమై రాష్ట్రం, దేశం ప్రగతి బాటలో పయనిస్తాయని పేర్కొన్నారు. ఆర్థిక, సామాజిక పురోగతికి దన్నుగా నిలిచే ఈ పరిశ్రమలను పునరుద్ధరించాల్సిందిగా కోరుతూ సమగ్ర వివరాలతో కూడిన లేఖను మంత్రి శ్రీధర్ బాబు కేంద్రమంత్రికి అందించారు. ఈ నెలాఖరులో తెలంగాణకు వస్తానని, రాష్ట్రంలోని కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల పనితీరుతో పాటు, సంబంధిత పరిశ్రమల పునరుద్ధరణకు చర్యలు చేపట్టే దిశగా సమీక్ష నిర్వహిస్తానని కేంద్రమంత్రి కుమారస్వామి చెప్పారు. తెలంగాణ ప్రభుత్వ లక్ష్యాల మేరకు తమవంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.



జాతీయ పురస్కారం అందుకుంటున్న తెలంగాణ ఎలక్ట్రానిక్స్ విభాగం డైరెక్టర్ ఎస్‌కే శర్మ

బ్యాటరీ తయారీ పరిశ్రమకు జాతీయ పురస్కారం

పునరుత్పాదక బ్యాటరీల తయారీలో అత్యుత్తమ నాయకత్వ దిశగా నిలిచిన తెలంగాణ ప్రభుత్వానికి జాతీయ పురస్కారం లభించింది. ఇండియా ఎనర్జీ స్టోరేజ్ అలయన్స్ (ఐఈఎస్ఏ) ఆధ్వర్యంలో ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో వివిధ రంగాల్లో ప్రోత్సాహం అందిస్తున్న రాష్ట్రాల ప్రభుత్వాలకు పురస్కారాలు ప్రదానం చేశారు. బ్యాటరీ తయారీ విభాగంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఇండస్ట్రీ ఎక్సలెన్స్ అవార్డు-2025 ప్రదానం చేశారు. ఐఈఎస్ఏ గ్లోబల్ ప్రెసిడెంట్ స్టీఫెన్ ఫెర్నాన్స్ ఈ పురస్కారాన్ని తెలంగాణ ఎలక్ట్రానిక్స్ విభాగం డైరెక్టర్ ఎస్‌కే శర్మకు అందించారు. రాష్ట్రానికి జాతీయ పురస్కారం రావడంపై మంత్రి శ్రీధర్ బాబు హర్షం వ్యక్తం చేశారు.

కదం తొక్కిన కార్మిక లోకం..

» రాష్ట్రవ్యాప్తంగా కార్మిక సంఘాల ఆందోళనలు

» 4 లేబర్ కోడ్‌ల రద్దుకు డిమాండ్

» సింగరేణి వ్యాప్తంగా 100 కోట్లకుపైగా ఉత్పత్తికి నష్టం!



హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి ఇందిరాపార్క్‌కు ర్యాలీగా వస్తున్న కార్మిక సంఘాల నేతలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): రాష్ట్రవ్యాప్తంగా కార్మిక, ఉద్యోగ సంఘాలు కదం తొక్కాయి. కేంద్రం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలంటూ నిరసనలు చేపట్టాయి. మానవహారాలు, రాస్తారోకోలు, బైక్ ర్యాలీలు, సభలు, సమావేశాలతో హోరెత్తించాయి. కేంద్రానికి వ్యతిరేకంగా కార్మికులు చేసిన నినాదాలతో మండల, జిల్లా కేంద్రాలు పిక్కటిల్లాయి. నిరసనలకు పలు పార్టీలతో ప్రజా సంఘాలు మద్దతు పలికాయి. బీడీ, హమాలీ కార్మికుల నుంచి ఆర్టీసీ, సింగరేణి కార్మికుల వరకు ఈ ఆందోళనల్లో పాల్గొన్నారు. సింగరేణి వ్యాప్తంగా రూ.100 కోట్లకు పైగా ఉత్పత్తికి నష్టం వాటిల్లినట్లు సమాచారం. కేంద్రం వ్యవహరిస్తున్న కార్మిక వ్యతిరేక వైఖరికి నిరసనగా దేశవ్యాప్తంగా 10 కేంద్ర కార్మిక సంఘాలు ఒక్కరోజు సమ్మెకు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే.. ఈ నేపథ్యంలోనే బుధవారం ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ వరకు కార్మిక, ఉద్యోగ సంఘాలు సమ్మెలో పాల్గొని నిరసనలు నిర్వహించాయి. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్ర నుంచి ఆర్టీసీ క్రాస్ రోడ్స్ మీదుగా ఇందిరా పార్కు వరకు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఏఐటీయూసీ, సీఐటీయూ, సీఐటీయూ, ఐఎన్‌టీయూసీ, హెచ్‌ఎంఎస్, టీయూసీయూ, ఐఎఫ్‌టీయూ తదితర సంఘాల కార్మికులు ఇందులో పాల్గొన్నారు. దీనికి హాజరైన సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కార్మిక వర్గాలు సరైన ఆలోచన చేస్తే గడ్డె మీద ఎర్ర జెండా పార్టీలు ఉంటాయని.. అప్పుడే మేలు జరుగుతుందని అన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో కాటేదాన్ రాంచరణ్ ఆయిల్ మిల్ వద్ద బైక్ ర్యాలీని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ జెండా ఊపి ప్రారంభించారు. తెలంగాణ ఆర్టీసీ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిరసనలు చేపట్టారు.

జిల్లా కేంద్రాల్లో భారీ ర్యాలీలు..

సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, నల్లగొండ జిలా కేంద్రాల్లో భారీ ప్రదర్శనలు నిర్వహించి, కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సమ్మె కారణంగా మెదక్ జిల్లాలోని పారిశ్రామిక ప్రాంతాలైన చిన్న శంకరంపేట, చేగుంట, తూప్రాన్, మనోహరాబాద్‌లలో అనేక పరిశ్రమలు పనిచేయలేదు. మెదక్ జిల్లాలో సుమారు 220 పరిశ్రమలు సమ్మె కారణంగా మూతపడ్డాయి. రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో సీపీఐ, సీపీఎంలతో పాటు పలు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చేవెళ్లలోని హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై భారీగా ర్యాలీ నిర్వహించారు. మేడ్చల్ జిల్లా కుషాయిగూడ, నాచారం మల్లాపూర్ ప్రాంతాల్లోని పారిశ్రామిక వాడలోని కార్మికులు తమ విధులను బహిష్కరించారు. సమ్మెలో భాగంగా పెద్దపల్లి జిల్లాలో సింగరేణిలో కార్మికులెవరూ విధులకు హాజరు కాలేదు. సింగరేణిలో పనిచేసే 36 వేల మంది రెగ్యులర్ కార్మికులతో పాటు మరో 30 వేల మంది కాంట్రాక్టు కార్మికులు సైతం సమ్మెలో పాల్గొన్నారు.



స్టేడియం వద్ద అక్రమంగా నిర్మించి గోడను కూల్చివేస్తున్న టీఎస్ఐఐసీ అధికారులు

ఉప్పల్ స్టేడియానికి దారి వచ్చింది!

ఉప్పల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఉప్పల్ క్రికెట్ స్టేడియానికి దారి తిరిగొచ్చింది. మైదానం గేట్లను మూసివేస్తూ ప్రహరీ నిర్మించడంపై 'ఉప్పల్ స్టేడియానికి దారేదీ' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంతో రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు కదిలివచ్చాయి. దీనితో స్పందించిన టీఎస్ఐఐసీ అధికారులు సదరు ప్రహరీని కూల్చివేశారు. ఉప్పల్ స్టేడియం పక్కనే ఖాళీగా ఉన్న 19.34 ఎకరాల స్థలాన్ని కొనుగోలు చేసిన బిల్డ్ బ్రిక్ సంస్థ ఎలాంటి అనుమతులు లేకుండానే స్టేడియం గేట్లకు అడ్డంగా ప్రహరీ నిర్మించింది. దీనిపై కథనం రావడంతో బుధవారం ఉదయం మాజీ ఎంపీ వి.హన్మంతరావు, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, పలు బీసీ సంఘాలు, ప్రజా సంఘాల నేతలు అక్కడికి చేరుకుని ఆందోళనకు దిగారు. దీనితో టీఎస్ఐఐసీ బుధవారం ఆ ప్రహరీని కూల్చివేసింది. స్టేడియం పక్కనే ఉన్న ఈ ఖాళీ స్థలం ఇంకా టీఎస్ఐఐసీ ఆధీనంలోనే ఉందని, అనుమతి లేకుండా నిర్మించిన ప్రహరీని కూల్చామని టీఎస్ఐఐసీ ఉప్పల్ కమిషనర్ ప్రభాకర్ వెల్లడించారు.

పరిశ్రమ స్థలం.. రెసిడెన్షియల్ కోసం?

స్టేడియం పక్కనే 19.37 ఎకరాల ఖాళీ స్థలం అందుబాటులో ఉంది. పెంగ్విన్ టెక్స్‌టైల్స్‌కు చెందిన ఈ స్థలాన్ని బిల్డ్ బ్రిక్ సంస్థ రిజిస్ట్రేషన్ చేయించుకుంది. పారిశ్రామికంగా మాత్రమే వినియోగించాల్సిన ఈ స్థలాన్ని గ్రిడ్ పాలసీ కింద వాణిజ్య, నివాస అవసరాలకు వాడుకునేలా 'స్థల వినియోగ మార్పిడి కోసం 2022లో దరఖాస్తు చేసుకుంది. దీనిపై టీఎస్ఐఐసీ అప్పట్లో ప్రభుత్వానికి లేఖ రాయగా అనుమతులు వచ్చాయి. తర్వాత ఈ స్థలం అభివృద్ధికి సంబంధించి టీఎస్ఐఐసీకి, బిల్డ్ బ్రిక్ సంస్థకు మధ్య ఉత్తరప్రత్యుత్తరాలు జరిగాయి. తాజాగా స్టేడియం గేట్లను మూస్తూ ప్రహరీ నిర్మించేదాకా టీఎస్ఐఐసీ పట్టించుకోకపోవడం ఏమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

యూరియా కొరత సృష్టిస్తే డీలర్లపై కేసులు

» వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు



హైదరాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కేంద్రం కేటాయించిన ఎరువులను సకాలంలో తెప్పించేందుకు నిరంతరం అధికారులతో సంప్రదింపులు జరపాలని, జిల్లాల వారీగా ప్రణాళికలు ఏర్పాటు చేసుకొని రైతులకు సకాలంలో యూరియా అందేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. యూరియా కొరత సృష్టించినా, అధిక ధరలకు అమ్మినా, ఇతర ఉత్పత్తులను లింకు పెట్టినా కఠిన చర్యలు తీసుకోవాలనీ ఆదేశాలు జారీ చేశారు. కేంద్రం ప్రకటించిన విధంగా ఎరువుల సరఫరాలు జరుగుతాయని ఆశించిన రాష్ట్ర ప్రభుత్వం అందుకు అనుగుణంగా జిల్లాల వారీ ప్రణాళిక చేసుకుందని మంత్రి తెలిపారు. దిగుమతి యూరియాలో తెలంగాణకు కేటాయించిన మేరకు సరఫరా జరగకపోవడంతో దేశీయంగా ఉత్పత్తయ్యే యూరియాను కేటాయించాలని కోరినట్లు తెలిపారు. రాష్ట్రంలో ఉన్న రామగుండం ఎరువుల కంపెనీ నుంచి కేటాయింపులను 30 వేల టన్నుల నుంచి 60 వేల టన్నులకు పెంచాలని విజ్ఞప్తి చేసినట్లు పేర్కొన్నారు. జూలై వరకు కేటాయించిన 6.60 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రాష్ట్రానికి వచ్చేవరకు నిత్యం కేంద్ర మంత్రిత్వశాఖ ప్రతినిధులతో సమన్వయం చేసుకోవల్సిందిగా అధికారులను ఆదేశించారు. రానున్న రోజుల్లో కేంద్రం నుంచి ఎరువుల సరఫరాలు మెరుగవుతాయని ఆశిస్తున్నామని, రైతులు ఈ విషయంలో ఆందోళన చెందకుండా, వారి అవసరాల మేరకే కొనుగోలు చేయాల్సిందిగా మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేశారు.

కొత్త వారికి రోల్‌మోడల్ కావాలి

» ఏఎంవీఐల పాసింగ్ ఔట్ పరేడ్‌లో మంత్రి పొన్నం



హైదరాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఇతర రాష్ట్రాల్లోని రవాణా శాఖలో భవిష్యత్తులో కొత్తగా విధుల్లో చేరే వారికి రాష్ట్ర రవాణశాఖలో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఏఎంవీఐ)లు రోల్ మోడల్ కావాలని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర పోలీస్ శిక్షణా కేంద్రంలో బుధవారం ఏఎంవీఐల పాసింగ్ ఔట్ పరేడ్ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పొన్నం.. ఏఎంవీఐల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతనంగా వస్తున్న మార్పులకనుగుణంగా పని చేయాలని సూచించారు. 4 నెలలు జరిగిన శిక్షణలో ఆయా విభాగాల్లో ప్రతిభ కనబర్చిన వారికి మంత్రి పొన్నం ప్రభాకర్ అవార్డులు అందించారు.

వారానికి 48 గంటల పని విధానాన్ని మార్చలే

» రోజులో పనిగంటల విషయంలోనే వెసులుబాటు: వివేక్



కార్మికుడికి రోజులో 8 పనిగంటలు మాత్రమే ఉండాలన్న అంశంలో మాత్రమే వెసులుబాటు ఇచ్చామని, వారంలో 48కి మించి పనిగంటలు ఉండొద్దన్న నిబంధన మాత్రం యథాతథంగా కొనసాగుతుందని కార్మికశాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి వివరణ ఇచ్చారు. ఈ నిర్ణయం.. క్రమంగా కార్మికులకు వారానికి రెండు రోజుల సెలవు విధానం వైపునకు దారి తీస్తోందన్నారు. కార్మికుల ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకునే ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. రోజుకు 10 గంటల పని విధానంపై వస్తున్న విమర్శలపై ఈ మేరకు స్పందించారు. రోజుకు 10 గంటల పని విధానం.. మ్యానిఫ్యాక్చరింగ్ సెక్టార్‌కు (యంత్రాలపైన పనిచేసే కార్మికులకు) వర్తించబోదని స్పష్టం చేశారు.

నాగారం భూములపై
కలెక్టర్ వాస్తవాలు దాస్తున్నారు: పిటిషనర్

ఏపీ, తెలంగాణకు చెందిన పలువురు ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు అక్రమంగా కొనుగోలు చేసినట్లుగా పేర్కొంటున్న రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారం సర్వే నెంబర్లు 194, 195 భూముల వ్యవహారంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ వాస్తవాలను దాస్తున్నారని పిటిషనర్ బిర్ల మల్లేశ్ పేర్కొన్నారు. ఈమేరకు హైకోర్టు ఎదుట జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి దాఖలు చేసిన కౌంటర్‌కు సమాధానం దాఖలు చేశారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు కొనుగోలు చేసిన భూములు ప్రభుత్వ లేదా భూదాన్ భూములు కాదని.. అవి పట్టా భూములే అని రంగారెడ్డి కలెక్టర్ అఫిడవిట్‌లో పేర్కొనడం సమంజసం కాదని.. కోర్టును తప్పుదోవ పట్టించడానికి తప్పుడు స్టేట్‌మెంట్ ఇచ్చారని ఆరోపించారు. సదరు భూములు నిషేధిత జాబితాలో ఉన్నా ధరణి పోర్టల్ ప్రవేశపెట్టక ముందే పట్టాదారు పాస్ పుస్తకాలు ఇచ్చారని.. అక్రమంగా పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ అయిన భూములను ఐఏఎస్, ఐపీఎస్‌లు కొనుగోలు చేశారని పేర్కొన్నారు.

గద్దర్‌పై రాసిన రచనలకు ఆహ్వానం

బర్కత్‌పుర, జూలై 9(ఆంధ్రజ్యోతి): ప్రజా యుద్ధనౌక గద్దర్ సాహిత్య, సాంస్కృతిక కృషిని తెలియజేస్తూ వచ్చిన పాటలు, కవిత్వం, వ్యాసాలను ఆహ్వానిస్తున్నట్లు గద్దర్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి జీవీ సూర్యకిరణ్ తెలిపారు. సమాజానికి గద్దర్ చేసిన సేవలు, పోరాట చరిత్రను తెలియజేస్తూ అనేక మంది కవులు, రచయితలు, కళాకారులు ఇప్పటికే అనేక రచనలు చేశారని ఆయన పేర్కొన్నారు. గద్దర్ ఫౌండేషన్ ఈ రచనలన్నింటినీ పుస్తక రూపంలో తీసుకొచ్చి ప్రజలకు అందించాలనే లక్ష్యం పెట్టుకుందన్నారు. మీరు గద్దర్‌పై రాసిన పాటలు, కవిత్వం, వ్యాసాలు ఏవైనా ఉంటే 7396065999కు వాట్సాప్ చేయాలని సూచించారు. మరింత సమాచారం కోసం 900074418ను సంప్రదించాలన్నారు. రచనలు పంపేవారు తమ అడ్రస్, ఫోన్ నెంబర్‌తో పాటు ఒక పాస్ ఫొటోను కూడా పంపించాలని సూర్యకిరణ్ కోరారు.

ఎంబీబీఎస్ సీట్లన్నీ పదిలమే

» 34 కళాశాలల్లోని 4,090 సీట్లకు ఎన్‌ఎంసీ ఓకే

» త్వరలోనే నీట్ స్టేట్ ర్యాంకులు: వైద్య ఆరోగ్య శాఖ

హైదరాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 34 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఉన్న 4,090 ఎంబీబీఎస్ సీట్లు ఈ విద్యా సంవత్సరం కూడా యథావిధిగా కొనసాగుతాయని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ బుధవారం ప్రకటించింది. ఆయా సీట్లు ఎప్పట్లానే కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేస్తామని పేర్కొంది. ఇందుకు అవసరమైన అనుమతులను జాతీయ వైద్య కమిషన్(ఎన్‌ఎంసీ) మంజూరు చేసిందని ఓ ప్రకటనలో తెలిపింది. అధ్యాపకుల కొరత సహా రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో నెలకొన్న సమస్యలపై ఎన్‌ఎంసీ ఇటీవల షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఇందుకు స్పందించిన వైద్య, ఆరోగ్య శాఖ ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంది. 44 మంది సీనియర్ అధ్యాపకులకు పదోన్నతి కల్పించి వైద్య కళాశాలల ప్రిన్సిపాల్‌లుగా, బోధనాస్పత్రులకు సూపరింటెండెంట్లుగా నియమించింది. 278 మంది అసోసియేట్ ప్రొఫెసర్లకు.. ప్రొఫెసర్లుగా పదోన్నతి కల్పించింది. అలాగే, 231 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లకు అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతి ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటుంది. ఇక, 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. 21 ఆస్పత్రుల్లో కొత్తగా 6వేల పడకల ఏర్పాటుకు చర్యలు తీసుకుంది. ఇక, కళాశాలల పర్యవేక్షణకు మెడికల్ కాలేజీ మానిటరింగ్ కమిటీ(ఎంసీఎంసీ)లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ చర్యల పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన ఎన్‌ఎంసీ.. నాలుగు నెలల్లోగా అన్ని సమస్యలను పరిష్కరించుకోవాలని సూచిస్తూ అన్ని కళాశాలలకు అనుమతులు కొనసాగించింది. మరోవైపు, ఎంబీబీఎస్ కౌన్సెలింగ్ ప్రక్రియను ప్రారంభించేందుకు కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా త్వరలోనే నీట్ స్టేట్ ర్యాంకులను విడుదల చేయనున్నారు. ఆ తర్వాత మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ షెడ్యూల్ ప్రకారం కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభిస్తారు.

ఉద్యోగుల సంఖ్యపై సమీక్షకు ఐఏఎస్‌ల కమిటీ

(మొదటిపేజీ తరువాయి)

అవసరాలకు అనుగుణంగా క్యాడర్ స్ట్రెంథ్‌ను పెంచాలంటూ చాలాకాలం నుంచి డిమాండ్ చేస్తున్నాయి. మొదటి పీఆర్సీ లెక్కల ప్రకారం రాష్ట్రంలో 4,91,304 పోస్టులు మంజూరయ్యాయి. 2020లో మొదటి పీఆర్సీ సమర్పించిన నివేదిక ప్రకారం.. 3,00,178 పోస్టుల్లోనే రెగ్యులర్ ఉద్యోగులు పని చేస్తున్నారని వెల్లడైంది. దాంతో.. ఖాళీల సంఖ్య 1.91 లక్షలుగా తేలింది. అప్పటి నుంచి ఏటా కొందరు ఉద్యోగులు పదవీవిరమణ పొందుతుండగా.. మరి కొన్ని పోస్టులను ప్రభుత్వం భర్తీ చేస్తూ వస్తోంది. అంటే.. ఈ సంవత్సరం మే నెల 30వ తేదీ నాటికి రాష్ట్రంలో మొత్తం 3,56,135 మంది రెగ్యులర్ ఉద్యోగులున్నట్లు ప్రభుత్వం చెబుతోంది. ఇంకా 1,35,169 పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది. అయితే.. ఇప్పటికే మంజూరైన పోస్టులే సరిపోవడం లేదని, కొత్త పోస్టులను మంజూరు చేయాలని సంఘాలు అడుగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం రాష్ట్రంలోని మొత్తం ఉద్యోగుల వివరాలను సేకరించాలని నిర్ణయించింది. ప్రభుత్వ శాఖలు, కార్పొరేషన్లు, పబ్లిక్ సెక్టార్ యూనిట్లు(పీఎస్‌యూ), స్థానిక సంస్థలు, సొసైటీలు, యూనివర్సిటీల్లోని ఉద్యోగులతోపాటు.. వివిధ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది వివరాలను సేకరించి, సమీక్షించే బాధ్యతను ఐఏఎస్‌ల కమిటీకి అప్పగించింది. శాఖల వారీగా ఉద్యోగుల సంఖ్య, మంజూరైన పోస్టులు, ఉద్యోగుల విధుల్లో మార్పులను కమిటీ సమీక్షించనుంది. ఆయా శాఖల ముఖ్యకార్యదర్శులు, విభాగాధిపతులతో చర్చించి, 60 రోజుల్లో నివేదికను తయారు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

కమిటీకి అప్పగించిన విధులివే..

- ప్రభుత్వ శాఖలు, విభాగాధిపతులు, కార్పొరేషన్లు, పబ్లిక్ సెక్టార్ యూనిట్లు(పీఎస్‌యూ), స్థానిక సంస్థలు, సొసైటీలు, యూనివర్సిటీలు, ఇతర సంస్థలకు మంజూరైన రెగ్యులర్ పోస్టులు, ప్రస్తుతం పని చేస్తున్న ఉద్యోగుల సంఖ్య, వీటిలో కొనసాగించాల్సిన పోస్టులు, ఖాళీల సంఖ్య, కొత్తగా మంజూరు చేయాల్సిన పోస్టులు, మార్పులు, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఇతరత్రా అవసరాలపై సమీక్షిస్తుంది.
- కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ వంటి పోస్టులతో పాటు ప్రభుత్వ అనుమతితో తాత్కాలికంగా చేపట్టిన సిబ్బంది నియామకాలపై సమీక్షిస్తుంది.

ఫాంహౌస్‌కైనా వస్తా

(మొదటిపేజీ తరువాయి)



మాటలకు సమాధానం చెప్పడానికి తమ వద్ద కూడా మనుషులున్నారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. తలా తోక లేకుండా మాట్లాడితే తోక కత్తిరించుడం కూడా తమకు తెలుసునని హెచ్చరించారు. 'కృష్ణా జలాల్లో గత పదేళ్లలో జరిగిన అన్యాయం, తుమ్మిడిహెట్టి బ్యారేజీ మార్పు, కాళేశ్వరం బ్యారేజీల వైఫల్యంపై మంగళవారం ప్రజాభవన్‌లో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరై మాట్లాడారు. 'తెలంగాణ ప్రజల హక్కులను కాపాడటానికే కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాన్ని ఇచ్చింది. మీరేంది మాకు చెప్పేది? సహేతుకమైన విధానంతో ముందుకు రండి. ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదు. అసూయతో ఎవరైనా చిల్లర మాటలు మాట్లాడితే వాళ్ల నీతి ఏంటో ప్రజలు గుర్తిస్తారు" అని రేవంత్ అన్నారు.

సీమాంధ్ర పాలకుల కంటే వెయ్యి రెట్ల ద్రోహం

కృష్ణా జలాల విషయంలో తెలంగాణకు కేసీఆర్ చేసిన ద్రోహం.. సీమాంధ్ర పాలకుల అన్యాయం కంటే వెయ్యి రెట్లు ఎక్కువ అని ముఖ్యమంత్రి ఆరోపించారు. చేసిన తప్పులకు ఒకవేళ కొరడా దెబ్బలు కొట్టాల్సి వస్తే... కేసీఆర్‌ను వంద కొరడా దెబ్బలు కొట్టాల్సి ఉంటుందన్నారు. అలాంటిది వారే ఎదురుదాడి చేస్తున్నారని, అడ్డూ అదుపు లేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. "కృష్ణా నదిలో హక్కుల కోసం పెద్ద ఎత్తున ప్రయత్నాలు చేస్తుంటే బురద జల్లుతున్నారు. అంతర్జాతీయ జలవిధానం ప్రకారం బేసిన్ అవసరాలు తీరాకే ఇంకో బేసిన్‌కు నీటిని తరలించాల్సి ఉంటుంది. కానీ, కేసీఆర్ మాత్రం బేసిన్లు లేవు... బేషజాలు లేవు అన్నారు. ఆయనకు ఆ అధికారం ఎవరిచ్చారు? గోదావరి జలాలను కృష్ణా దాటించి.. పెన్నాకు తీసుకెళ్లండని ఏ హోదాలో చెబుతారు? వారి పక్కాన పాలెగాడి లెక్కన మారిండా? ఇది అడుగుదామంటే అసెంబ్లీకి రాడు. పిల్లలతో చిల్లర మాటలు మాట్లాడిస్తడు"అని రేవంత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గోదావరి జలాలను తుమ్మిడిహెట్టి నుంచి తరలించడానికి వీలుగా 2007-08లో ప్రాణహిత-చేవెళ్లను చేపడితే.. తెలంగాణ ఏర్పడగానే కేసీఆర్ దానిని మార్చారని అన్నారు. చేవెళ్ల పేరుంటే చేవెళ్లకు నీళ్లు ఇవ్వాల్సి ఉంటుందని కాళేశ్వరం పేరు పెట్టారని ఆరోపించారు. "ప్రాణహిత-చేవెళ్ల ద్వారా చేవెళ్ల, వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్‌కు గోదావరి జలాలు ఇచ్చేందుకు రాయలసీమకు చెందిన నాటి సీఎం రాజశేఖర్‌రెడ్డి పనులు చేపడితే... తెలంగాణ జాతిపిత అని చెప్పుకొనేందుకు ప్రయత్నించే నువ్వు ఎందుకు తొలగించావు?" అని రేవంత్ ప్రశ్నించారు.

నాడు లాజిక్కులు.. ఇప్పుడు మాటలా?

తుమ్మిడిహెట్టి నుంచి గ్రావిటీతో నీరు ఎల్లంపల్లికి వస్తుందని, పైన ఉన్న నీళ్లను పైనే వాడుకోవాలనేది కాంగ్రెస్ విధానమని సీఎం తెలిపారు. శ్రీపాద ఎల్లంపల్లికి తెచ్చిన తర్వాత ఎస్‌ఆర్‌ఎస్పీ, కొండపోచమ్మ, రంగనాయకసాగర్‌లకు నీళ్ల నింపుకొని రంగారెడ్డికి తేవాలనేది ఆనాటి ప్రణాళిక అని పేర్కొన్నారు. "16 లక్షల ఎకరాలకు ప్రాణహిత-చేవెళ్ల కింద నీళ్ల ఇవ్వాలనేది కాంగ్రెస్ విధానంగా ఉండేది. కానీ, నువ్వు రంగారెడ్డిని పూర్తిగా తొలగించినవ్. నల్లగొండకు కోతలు విధించినవ్. ఏందీ కారణం అంటే.. గోదావరి జలాలను కృష్ణా బేసిన్‌కు తరలిస్తే బేసిన్ల పంచాయతీ వస్తదని, నీటి కేటాయింపుల సమయంలో అన్యాయం జరుగుతుందని లాజిక్కు చెప్పినవ్. రాయలసీమకు నీళ్ల తరలించడానికి, వాళ్ల మెప్పు కోసం మమ్మల్నందరినీ తిడితివి. చేసిన తప్పులకు ప్రజలు శిక్షించినప్పుడు మౌనంగా ఉండకుండా మళ్లీ బజారుకెక్కి నోటికొచ్చినట్లు మాట్లాడి వితండవాదం చేస్తావా?" అని సీఎం ధ్వజమెత్తారు. ఉమ్మడి రాష్ట్రంలో కట్టిన ప్రాజెక్టులతో 54 లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చారని, ఎకరానికి నీళ్లివ్వడానికి రూ.93 వేలు ఖర్చయ్యాయని తెలిపారు. కానీ, కేసీఆర్ 15 లక్షల ఎకరాలకు నీళ్ల ఇస్తే.. ఎకరానికి నీళ్లివ్వడానికి రూ.11.50 లక్షలకు పైగా ఖర్చు పెట్టారని అన్నారు. "ఉమ్మడి రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఒక్క ప్రాజెక్టు అయినా పూర్తి చేశావా? దీనిపై చర్చకు రావాలని అని సవాలు చేశాను. రాష్ట్రంలో 90 శాతం కేంద్ర గ్రాంట్లతో 11 ఏఐబీపీ ప్రాజెక్టులున్నాయి. కేంద్రం 90 శాతం నిధులు ఇచ్చినా ఖర్చు చేయలేదు. కేంద్ర జల శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌ను కలిస్తే చెప్పారు. మళ్లీ టార్గెట్‌గా పెట్టుకొని పూర్తి చేస్తామని ఆయనకు చెప్పినం. కేంద్రం ఇచ్చే నిధులతో పూర్తయ్యే ప్రాజెక్టులపై ఫోకస్ పెడితే సారుకు ఆదాయం ఏమీరాదనే వదిలేశారు" అని రేవంత్ ఆరోపించారు.

ఆ అధికారం కేసీఆర్‌కు లేదు..

ఉమ్మడి ఏపీ బచావత్ ట్రైబ్యునల్ 811 టీఎంసీలు కృష్ణాలో కేటాయిస్తే.. 512 టీఎంసీలు ఏపీకి, 299 టీఎంసీలు తెలంగాణకు చాలునని కేసీఆర్ చెప్పారని రేవంత్ ఆరోపించారు. గోదావరిలో 3 వేల టీఎంసీలు సముద్రంలోకి వెళుతున్నాయని, గ్రేటర్ రాయలసీమ దాకా నీళ్ల తీసుకెళ్లాలంటూ నాటి ఏపీ సీఎం జగన్‌కు సహకరించారని విమర్శించారు. వారిద్దరి మధ్య అనుబంధం పెంచుకుంటే తమకేమీ అభ్యంతరం లేదని, కానీ.. తెలంగాణ రైతాంగం పాలిట మరణశాసనం రాసే అధికారం మాత్రం కేసీఆర్‌కు లేదని అన్నారు. "పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జూరాల నుంచి తీసుకోవాలని ఉమ్మడి రాష్ట్రంలో నీళ్ల తరలించాలని నిర్ణయం జరిగింది. జూరాల నుంచి పాలమూరు ప్రాజెక్టును శ్రీశైలంకు తరలించడం వల్ల నష్టం జరిగింది. తుంగభద్ర, కృష్ణానది, అలంపూర్‌కు వచ్చినప్పుడే ఒడిసి పట్టుకొని ఉంటే.. శ్రీశైలం బ్యాక్‌వాటర్‌లో ఏపీ చేపట్టిన ముచ్చుమర్రి, మల్యాల, పోతిరెడ్డిపాడుకు మనం నీళ్ల వదిలితేనే వారికి నీళ్ల దొరికేవి. మీద(జూరాలలో) ఉన్నప్పుడు పట్టుకోకుండా కింద(శ్రీశైలంలో) పట్టుకోవడం వల్ల ఆ నీటిని ఏపీ దారిదోపిడీ చేయడానికి కేసీఆర్ అవకాశం ఇచ్చారు" అని రేవంత్ ధ్వజమెత్తారు. శ్రీశైలం నుంచి నీళ్ల తరలించుకుపోవడం వల్ల శ్రీశైలం, సాగర్, పులిచింతలలోని జలవిద్యుత్ ప్రాజెక్టులు పనికిరాకుండా పోయే ప్రమాదం ఉందన్నారు. చారాణా, ఆఠాణాకు దొరికే కరెంట్ పోయే పరిస్థితి వచ్చిందన్నారు. "తొమ్మిదిన్నరేళ్లలో ఏ ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తికాలేదు. ఈ రోజు హక్కులు రాలేదు. ప్రయోజనాలు కూడా చేకూరలేదు. చివరికి సరిదిద్దాలని ప్రయత్నం చేస్తుంటే.. ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారు" అని రేవంత్ ఆక్షేపించారు. ఈ సంవత్సరంలోనే రాష్ట్రం సర్వనాశనం అయిందంటూ ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. "ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగా ఆయన ఏ రోజు అసెంబ్లీకి వస్తారో లేఖలు రాయాలని కోరాం. సూచనలు మాత్రమే చేశాం. సవాలు విసరలేదు. భవిష్యత్తు ప్రణాళికపై చర్చ చేద్దామనుకుంటుంటే సడెన్‌గా బయలుదేరాడు. ఆయన ఏం మాట్లాడుతుండో మీరందరూ చూస్తున్నరు. నేను ఆయన పేరు ప్రస్తావిస్తే నా స్థాయి తగ్గుతుంది. ఆ భాషకు ఏ విధంగా సమాధానం చెప్పాలో నాకు తెలుసు. కాకపోతే ఆ దిశగా వెళ్లరాదని అనుకుంటున్నా" అని రేవంత్ అన్నారు.

తారీకు చెబితే సభ పెడతాం

పొద్దుటి పూట క్లబ్బుల్లో, రాత్రిపూట పబ్బుల్లో చర్చ చేద్దామని కొందరు ఉబలాట పడుతున్నారని ముఖ్యమంత్రి ఎద్దేవా చేశారు. "మీ సుదీర్ఘ అనుభవాన్ని, ఆలోచనల్నీ తెలంగాణ ప్రజలకు సూచన కింద ఇస్తే స్వాగతిస్తాం. మీరు ఏ తారీకు చెప్పినా అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేస్తాం. కృష్ణా, గోదావరి జలాలపై ఉమ్మడి రాష్ట్రంలో, తొమ్మిదిన్నరేళ్ల మీ పాలనలో, గడచిన ఏడాదిన్నరలో తీసుకున్న నిర్ణయాలపై కూలంకశంగా చర్చిద్దాం. స్పీకర్ అనుమతితో నిపుణులను కూడా పిలిచి అభిప్రాయం తీసుకుందాం" అని పేర్కొన్నారు. కేసీఆర్ ఆరోగ్యంగా ఉండాలని తాను అంటుంటే.. ఆయన కుమారుడు మాత్రం తన తండ్రి ఎందుకూ పనికిరారన్నట్లుగా మాట్లాడుతున్నారని వ్యాఖ్యానించారు. "మీ కుటుంబంలో పంచాయితీ ఉంటే మీ మధ్యే తేల్చుకోవాలే గానీ ఈ వీధి బాగోతాలెందుకు?" అని ప్రశ్నించారు.

గోదావరి బోర్డులో కూర్చొని మాట్లాడుకుందాం..

గోదావరి-బనకచర్లలో వరద జలాలనే తీసుకెళుతున్నామని చంద్రబాబు చెబుతున్నారని, అదే జలాలను రంగారెడ్డి, నల్లగొండకు తీసుకెళితే వారికి అభ్యంతరం ఎందుకని సీఎం రేవంత్ ప్రశ్నించారు. నికర జలాలపై ఎంత శాతం హక్కు ఉందో.. వరద జలాలపైనా అంతే హక్కు ఉంటుందన్నారు. "కాళేశ్వరం వైఫల్యం వల్ల నీళ్ల కిందికి వస్తున్నాయి.మేం వాడుకున్న తర్వాత కింద వరద ఉందా? లేక బురద ఉందా? అనేది తేలుతుంది. గోదావరి బోర్డులో కూర్చొని మాట్లాడుకుందాం. పరపతి ఉందని, పై(కేంద్రం) నుంచి వస్తామంటే ఎట్లా?"అని ఏపీ సీఎం చంద్రబాబునుద్దేశించి అన్నారు. బనకచర్లపై పర్యావరణ మంత్రిత్వ శాఖకు ఫిర్యాదుచేస్తే.. ప్రతిపాదనల్ని తిప్పి పంపించారని తెలిపారు. తమ బాధను తాము చెబుతున్నామని, తమ వ్యూహం తమకుంటుందని చెప్పారు.



పెట్టుబడులకు తెలంగాణ స్వర్గధామం

» రాష్ట్రాభివృద్ధికి పారిశ్రామికవేత్తల సలహాలు తీసుకుంటాం: భట్టి

హైదరాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అభివృద్ధి, ఉపాధి కల్పన, సంపదసృష్టి తదితర అంశాల్లో పారిశ్రామికవేత్తల నుంచి సలహాలు, సూచనలు తీసుకుంటామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. నైపుణ్యం కలిగిన కార్మికులు, చక్కటి వాతావరణం, 24గంటల విద్యుత్ సరఫరా వంటి అనేక అంశాల వల్ల ప్రపంచం నలుమూలల నుంచి హైదరాబాద్‌కు పెట్టుబడులు వస్తున్నాయని చెప్పారు. పెట్టుబడులకు తెలంగాణ స్వర్గధామం అని పేర్కొన్నారు. సీఐఐ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో బుధవారం జరిగిన సీఎఫ్‌వో(చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్)ల సదస్సులో భట్టి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రీజినల్ రింగ్ రోడ్డు ప్రాజెక్టు వల్ల ఫార్మా, ఐటీ కంపెనీలతోపాటు హౌసింగ్, వ్యవసాయం, చేనేత సహా పలు పారిశ్రామిక క్లస్టర్ల ఏర్పాటవుతాయని తెలిపారు. లండన్‌లోని థేమ్స్ నది మాదిరిగా మూసీ నది పునరుజ్జీవ ప్రాజెక్టును చేపడుతున్నామని చెప్పారు. రాష్ట్రంలోని 100 ఐటీఐలను అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లుగా మార్చామని, త్వరలో ఫ్యూచర్ సిటీ అందుబాటులోకి రాబోతుందని తెలిపారు. పారిశ్రామికవేత్తలను ప్రభుత్వం కుటుంబసభ్యులుగా పరిగణిస్తుందని, రాష్ట్రంలో మార్పునకు శ్రీకారం చుడదామని పిలుపునిచ్చారు. పారిశ్రామికవేత్తలు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్‌ఆర్) కింద ఖర్చు చేసే నిధులను రైతులు, మహిళల ప్రగతి కోసం కూడా వెచ్చించాలని సూచించారు. రాష్ట్రంలో సమ్మిళితాభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ప్రజా ప్రభుత్వంలో పారిశ్రామిక రంగం భాగస్వామిగా ఉండాలని, ప్రజల విజయంలో పారిశ్రామికవేత్తలూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సదస్సులో సీఐఐ నిర్వాహకులు శేఖర్‌రెడ్డి, శివప్రసాద్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, నరసింహం, గౌతమ్‌రెడ్డి, షమీయుద్దీన్ పాల్గొన్నారు.

ఊళ్లు కొట్టుకుపోతే బాధ్యులెవరు?

'కాళేశ్వరం' బ్యారేజీలు ప్రమాదకరంగా ఉన్నాయని ఎన్డీఎస్‌ఏ తేల్చింది: ఉత్తమ్



ప్రజాభవన్‌లో నిర్వహించిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌లో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్

హైదరాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కన్నెపల్లి నుంచి నీళ్లను ఎందుకు ఎత్తిపోయడం లేదని బీఆర్‌ఎస్ నేతలు పదేపదే ప్రశ్నిస్తున్నారని.. ఇప్పటికే కుంగిపోయిన బ్యారేజీలు కూలిపోయి ఊళ్లు కొట్టుకుపోతే ఎవరు బాధ్యులని నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నిలదీశారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పరిస్థితి ప్రమాదకరంగా ఉందని.. వాటిలో నీళ్ల నింపవద్దని జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ (ఎన్డీఎస్‌ఏ) హెచ్చరించిందని గుర్తు చేశారు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో నీళ్ల నింపితే అవి కూలిపోయి నది వెంట ఉన్న 44 గ్రామాలతోపాటు సమ్మక్కసాగర్ బ్యారేజీ కొట్టుకుపోతుందని... భద్రాచలం ఆలయం, పట్టణం ప్రమాదంలో పడతాయని వివరించారు. ఏపీ కృష్ణా జలాల అక్రమ తరలింపు, కాళేశ్వరం బ్యారేజీల అంశంపై బుధవారం ప్రజాభవన్‌లో ఉత్తమ్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. రూ.38 వేల కోట్ల అంచనాలతో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం కమీషన్ల కక్కుర్తితో పక్కనపెట్టి రూ.లక్షన్నర కోట్ల ఖర్చయ్యే కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టిందని ఉత్తమ్ ఆరోపించారు. డిజైన్, నిర్మాణం, నిర్వహణ లోపాలతోనే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు వైఫల్యం చెందాయని ఆరోపించారు. ఈ బ్యారేజీల విషయంలో ఎన్డీఎస్‌ఏ నివేదిక ప్రకారమే ముందుకెళతామన్నారు. భారీగా వ్యయం చేసినందున ప్రాజెక్టును వినియోగించుకోవడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

కృష్ణా జలాల్లో అన్యాయం

ఉమ్మడి రాష్ట్రంతో పోలిస్తే బీఆర్‌ఎస్ పాలనలోనే శ్రీశైలం బ్యాక్‌వాటర్ నుంచి ఏపీ అక్రమ నీటి తరలింపు.. రోజుకు 47,850 క్యూసెక్కుల (4.1టీఎంసీలు) నుంచి 1,11,400 క్యూసెక్కుల (9.6 టీఎంసీలు)కు పెరిగిందని ఉత్తమ్ ఆరోపించారు. 2019 మే, 2020 జనవరి, జూన్‌లలో నాటి ఏపీ సీఎం జగన్, తెలంగాణ సీఎం కేసీఆర్ జరిపిన భేటీల ఫలితమే ఇదని పేర్కొన్నారు. 2004-14 మధ్య ఉమ్మడి ఏపీలో శ్రీశైలం నుంచి బేసిన్ వెలుపలి ప్రాంతాలకు 727 టీఎంసీల కృష్ణా జలాలు తరలించుకుపోతే.. బీఆర్‌ఎస్ పాలనలో 2014-2023 మధ్య ఏకంగా 1,200 టీఎంసీలు తరలించుకుపోయారని చెప్పారు. తాము అధికారంలోకి వచ్చాక 2024-25లో అత్యధికంగా 286 టీఎంసీల కృష్ణా జలాలను వినియోగించామని, గత పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనతో పోల్చితే ఇదే అత్యధికమని తెలిపారు. బీఆర్‌ఎస్ పాలనలో పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ సామర్థ్యం 44వేల నుంచి 92,000 క్యూసెక్కులకు, మల్యాల లిఫ్టు సామర్థ్యం 3,850 నుంచి 6,000 క్యూసెక్కులకు, ముచ్చుమర్రి లిఫ్టు సామర్థ్యం 3,850 నుంచి 6,300 క్యూసెక్కులకు పెరిగాయని చెప్పారు. 811 టీఎంసీల్లో.. తెలంగాణకు 299 టీఎంసీలు (34శాతం) సరిపోతాయని.. ఏపీకి 512 టీఎంసీలు (66శాతం) ఇవ్వాలని బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లపాటు లిఖితపూర్వకంగా సమ్మతి తెలిపిందని ఉత్తమ్ గుర్తుచేశారు. శ్రీశైలం జలాశయంలో 797 అడుగుల లోతు నుంచీ నీళ్లను తరలించుకుపోవడానికి ఏపీ చేపట్టిన రాయలసీమ పథకాన్ని అడ్డుకోకుండా కేసీఆర్ సహకారం అందించారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ తొలి విడత ప్రభుత్వంలో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేసి ఉంటే ఈ పరిస్థితి తలెత్తేది కాదన్నారు.

మసిపూసి మారేడు కాయ చేసే యత్నం: భట్టి

బీఆర్‌ఎస్ నేతలు గోదావరి, కృష్ణా జలాలపై అబద్ధాలు చెబుతూ మసిపూసి మారేడు కాయ చేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మండిపడ్డారు. పాత ప్రాజెక్టులను పూర్తి చేయకుండా బీఆర్‌ఎస్ ద్రోహం చేసిందని పేర్కొన్నారు. ఈ నష్టాన్ని పూడ్చే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. గోదావరిలో ప్రాజెక్టులన్నీ కట్టి ఉంటే బనకచర్ల వివాదం వచ్చేది కాదన్నారు. కాళేశ్వరంలో అవినీతి, కృష్ణా జలాల్లో జరిగిన అన్యాయంపై ప్రజలకు వాస్తవాలు వివరించాలని టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ ఆరోపించారు. ప్రజాప్రతినిధులంతా బుక్‌లెట్ రూపంలో ప్రజలకు చేరవేయాలని సూచించారు.

హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్ అరెస్టు

» ముగ్గురు ఆఫీసు బేరర్లు కూడా

» క్రికెట్ అసోసియేషన్‌లో అవకతవకలు

» సన్ రైజర్స్ వివాదంపై సీఐడీ చర్యలు

హైదరాబాద్, జూలై9 (ఆంధ్రజ్యోతి) హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌లో ఆర్థిక అవకతవకలు, సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్‌ఆర్‌హెచ్) వివాదానికి సంబంధించి హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్‌రావును సీఐడీ అధికారులు అరెస్టు చేశారు. ఆఫీసు బేరర్లలో హెచ్‌సీఏ కోశాధికారి శ్రీనివాసరావు, సీఈవో సునీల్, ప్రధాన కార్యదర్శి రాజేందర్ యాదవ్‌తో పాటు రాజేందర్ భార్య జి. కవితను కూడా కస్టడీలోకి తీసుకున్నారు. ఈ మేరకు సీఐడీ అదనపు డీజీ చారుసిన్హా తెలిపారు. సన్ రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీని టికెట్ల కోసం బెదిరించి, భయపెట్టిన ఘటనకు సంబంధించి విజిలెన్స్ విభాగం ఇటీవలే ఓ నివేదికను ప్రభుత్వానికి అందచేసింది. సన్ రైజర్స్‌ను కాంప్లిమెంటరీ పాస్‌ల కోసం బెదిరించారని, వీఐపీ బాక్స్‌కు తాళం వేశారంటూ జగన్మోహన్‌రావు బృందంపై ఆరోపణలొచ్చాయి. ఇవన్నీ వాస్తవమేనని విజిలెన్స్ విచారణలో వెల్లడైంది. ప్రభుత్వం నుంచి విజిలెన్స్ నివేదిక సీఐడీకి అందడంతో కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. జగన్మోహన్‌రావుతోపాటు పాటు హెచ్‌సీఏ బాధ్యులందరికి ఈ వివాదంతో సంబంధం ఉండటం, ఆర్థిక అవకతవకలు, పరికరాల కొనుగోళ్లలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలకు సంబంధించిన సాక్ష్యాధారాలను సీఐడీ అధికారులు సేకరించారని తెలుస్తోంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Medchal-Malkajgiri District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: N. Rahul Kumar. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

SAMSUNG

Galaxy Z Fold7
Galaxy AI



4.2mm
Slimmest Galaxy Z Fold yet

200MP Camera
with ProVisual Engine

Snapdragon 8 Elite
for Galaxy

Pre-order now

Buy 256GB. Get 512GB.
^Free memory upgrade worth ₹ 12000

24 months no-cost EMI*
Zero down payment

BAJAJ FINSERV | HDFC BANK | IDFC FIRST Bank | TVS CREDIT | Samsung Finance+™

samsung.com

Please dispose of e-waste and plastic waste responsibly. Customers can WhatsApp on 180057267664 for information on e-waste/plastic waste.

Image simulated, actual may vary. Actual UX/UI may vary. Color and features as per availability. Samsung account login is required for certain AI features. Samsung does not make any promises, assurances, or guarantees as to the accuracy, completeness or reliability of the output provided by AI features. Samsung promotes responsible use of Artificial Intelligence (AI) features. *T&C apply. 24 months no cost EMI only applicable on NBFC. Eligibility for EMI at the sole discretion of the financiers including those listed on Samsung Finance+ (Financier T&C applies). ^Pre-order customers of Galaxy Z Fold7 256 GB are eligible to benefits of memory upgrade from 256 GB to 512 GB worth ₹ 12000. Offer valid till 24 July 2025. Offer can be revised or withdrawn without prior notice. All third party logos/brands are trademarks/registered trademarks of the respective brand/company. Samsung disclaims any and all liabilities thereof.

Scan and experience
Galaxy AI

Or WhatsApp "Hi" to
9870 494949 to pre-order at
Samsung Experience Store

Cheil-26941/25